సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 197

సోమవారం 7-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'




మహిళా ప్రజాప్రతినిధులు అంటే అలుసా?: సుప్రీంకోర్టు

- 6లో



అమెరికాకు గౌరవం తెస్తా

పెన్సిల్వేనియా సభలో ట్రంప్.. హత్యా యత్నం జరిగిన బట్లర్‌లో పర్యటన - 6లో


NISSAN
NEW NISSAN MAGNITE FOR THE WORLD
BOLD INSIDE OUT
NEW MAGNITE
ONE CAR
ONE WORLD
#Outdo
First-in-Segment* Continuous Multi Colour Ambient Light with Memory Function
First-in-Segment* Premium MODURE Leather^ Quilted Seats with Heat Guard Tech
Standard 6 Airbags, 3 pt. Seat Belt & Seat Belt Reminder for all seats and Isofix
First-in-Segment* Plasma Cluster Ionizer with PM 2.5 filter that reduces 400 AQI to 30 in 20 min
Best-in-Segment* LED Tail Lamp with 3D Honeycomb Gradient Effect
360 degree Around View Monitor
Best-in-Segment* New Intelligent Key Fob with Remote Engine Start (60m)
1.0m
1.8m
First-in-Segment* Premium i-Key with Walk Away Lock (WAL) & Approach Unlock (AUL)
TEST DRIVE TO BOOK NOW: 7065233336 | Book New Nissan Magnite | www.nissan.in
SPECIAL FINANCE SCHEME AVAILABLE**
AUTHORIZED NISSAN DEALERS: TELANGANA: HYDERABAD: BANDLAGUDA NAGOLE: LAKSHMI NISSAN- 8291040058, ERRAGADDA: VIBRANT NISSAN- 8291087267, GACHIBOWLI: VIBRANT NISSAN- 8291087306, HIMAYAT NAGAR: LAKSHMI NISSAN- 8291049489, M G ROAD: VIBRANT NISSAN- 8291088310, MIYAPU: VIBRANT NISSAN- 8291062817, KHAMMAM: VVC NISSAN- 8291095913, WARANGAL: VVC NISSAN- 8291095913, ANDRA PRADESH: TIRUPATI: HITECH NISSAN- 8291045996, GUNTUR: EXPRESS NISSAN- 9619894889, KURNOOL: HITECH NISSAN- 8291049632, RAJAHMUNDRY: KANTIPUDI NISSAN- 9167298736 , VIJAYAWADA: EXPRESS NISSAN- 8291048457, VISHAKAPATNAM: ORANGE NISSAN- 9619894632, NELLORE: HITECH NISSAN- 9619894986.
*Terms & conditions apply. All prices ex-showroom Delhi. Features may vary from variant to variant. Colours are indicative only and may vary due to printing constraints. Accessories shown may not be part of standard fitment. **The scheme is applicable on vehicles invoiced on or before 31st Oct 2024. Please visit your nearest Nissan dealer for more information. Finance is at the sole discretion of finance partners and NRFSI. *Segment/Class refers to B-SUV models with Length <4m. ^Leather mentioned in the features refers to Synthetic leather/Leatherette. *Standard Warranty 3 years or 100k kms whichever comes first.
TBWA\34001024
NISSAN FINANCE

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 197

సోమవారం 7-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా అక్కలూ..చెల్లెళ్లు... తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



బోణీ కొట్టిన భారత్

మహిళల టి20 ప్రపంచకప్‌లో పాక్‌పై 6 వికెట్లతో భారత్ గెలుపు. -14లో



ఆడుతూ పాడుతూ...

తొలి టి20లో బంగ్లాదేశ్‌పై ఏడు వికెట్లతో భారత్ ఘనవిజయం -14లో



రూ.1,814 కోట్ల డ్రగ్స్ సీజ్

మధ్యప్రదేశ్‌లో ఓ ఫ్యాక్టరీ నుంచి రూ.1,814 కోట్ల విలువైన మెఫెడ్రిన్‌తోపాటు, ముడి సరుకును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

వివరాలు 6లో ▸



ఉచిత విద్యుత్ ఇస్తే...

దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజలకు ఉచితంగా విద్యుత్ ఇస్తే ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీకి ప్రచారం చేస్తానని కేజ్రీవాల్ అన్నారు.

వివరాలు 6లో ▸



3 రాష్ట్రాలు.. 18 మంది నేరగాళ్లు

ఈడీ, సీబీఐ అధికారులమంటూ రూ.6.9 కోట్లు కాజేసిన సైబర్ నేరగాళ్లను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు.

వివరాలు 12లో ▸



వృద్ధాప్యంలో ఆరోగ్య ధీమా!

70 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పీఎం జేఏవై కింద లభించనున్న రూ.5 లక్షల హెల్త్ కవరేజీ పథకంపై ప్రత్యేక కథనం.

వివరాలు 15లో ▸

న్యూస్‌రీల్

చుక్కలు చూపిన ఎయిర్ షో.. ఎండలకు ఐదుగురు మృతి



చెన్నైలో ఆదివారం చేపట్టిన భారీ ఎయిర్ షో వేలాది మందికి చేదు అనుభవం మిగిల్చింది. అధిక ఎండలకు తాళలేక సొమ్మసిల్లి ఐదుగురు చనిపోగా, 230 మంది ఆస్పత్రిపాలయ్యారు. తాగునీరు కూడా అందుబాటులో ఉంచలేదని ప్రజలు వాపోయారు.

- వివరాలు 6లో▶

అమెరికాలో బతుకమ్మకు అధికారిక గుర్తింపు



బతుకమ్మ పండుగలోని పరమార్థాన్ని అమెరికాలో పలు రాష్ట్రాలు గుర్తించాయి. జార్జియా, వర్జీనియా రాష్ట్రాలతోపాటు ఉత్తర కరోలినా రాష్ట్రంలోని 2 నగరాలు బతుకమ్మ పండుగను అధికారికంగా గుర్తించాయి.

- వివరాలు 12లో▶

'భూ'చక్రం తిప్పేశారు!



జూబ్లీహిల్స్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌లో అక్రమాల భూ'చక్రం' తిరిగింది. నిబంధనల ప్రకారం సీనియారిటీ ఉన్న సభ్యులకుగానీ, ప్రభుత్వానికి గానీ చెందాల్సిన భూమిని పాలకమండలిలోని ముఖ్యులు అమ్మేసి సొమ్ము చేసుకున్నారు.

- వివరాలు 12లో▶

రైల్వే విస్తరణపై ప్రత్యేక దృష్టి



తెలంగాణలో రైల్వే విస్తరణపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించి.. గత పదేళ్లలో అధిక నిధులు కేటాయించిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ వంద రోజుల్లో వివిధ రాష్ట్రాల్లో రూ.24,600 కోట్లతో 8 రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించినట్టు చెప్పారు.

- వివరాలు 12లో▶

ఇదండీ సంగతి



దబ్బుల్లేవని ప్రతీ సభలో ఇలా ఖాళీ జేబులు చూపించడం ఏం బాగోలేదాసర్!

హైడ్రా.. రిజిస్ట్రేషన్లు విత్‌డ్రా

కూల్చివేతలతో రాష్ట్రవ్యాప్తంగా తగ్గిన భూములు, ఆస్తుల కొనుగోళ్లు

ఆందోళనతో వాయిదా వేసుకుంటున్న కొనుగోలుదారులు



- ఒక్క సెప్టెంబర్ నెలలోనే 30శాతం తగ్గిన రిజిస్ట్రేషన్ ఆదాయం
- గత ఏడాది సెప్టెంబర్‌లో దాదాపు లక్ష లావాదేవీలు.. రూ.955 కోట్ల రాబడి
- ఈసారి సెప్టెంబర్‌లో లావాదేవీలు 80 వేలు, రాబడి రూ.650 కోట్లకే పరిమితం
- హైదరాబాద్, పరిసర జిల్లాల్లో మరింత ఎక్కువగా ప్రభావం
- రంగారెడ్డి జిల్లాలో తగ్గిన 5 వేల లావాదేవీలు.. మేడ్చల్‌లో 4వేలకుపైగా తగ్గుదల
- ఆర్థిక సంవత్సరం మొదట్లో పెరిగిన రిజిస్ట్రేషన్లు, ఆదాయం..
- గత 2 నెలలుగా తగ్గిపోయిన పరిస్థితి.. కొత్త రిజిస్ట్రేషన్లకు జనం వెనుకంజ

హైడ్రాతో తారుమారు



రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరిట చేస్తున్న హడావుడితో ఒక్కసారిగా పరిస్థితి తారుమారైంది. చెరువుల పరిరక్షణ కోసం ప్రభుత్వం మంచి ఉద్దేశంతోనే హైడ్రాను తీసుకొచ్చినా.. యుద్ధ ప్రాతిపదికన కూల్చివేతలు చేపట్టడంతో కొనుగోళ్లపై ప్రభావం పడింది. అటు కొనుగోలుదారుల్లో, ఇటు డెవలపర్లలో గుబులు కనిపిస్తోంది. కొనుగోలుదారులు కొంతకాలం వేచి చూసే ధోరణితో ఉండటంతో అమ్మకాలు తగ్గాయి. రియల్ ఎస్టేట్ రంగం ఇబ్బందుల్లో పడటంతో దీనిపై ఆధారపడిన ఇతర రంగాలు కూడా కుదేలవుతున్నాయి. స్థిరాస్తి వ్యాపారాన్ని గాడిన పెట్టేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– రావుల గోపాల్ యాదవ్, మోకిలా, శంకర్‌పల్లి మండలం, రంగారెడ్డి జిల్లా

సాక్షి, హైదరాబాద్: చెరువులు, నీటి వనరుల పరిరక్షణ, ఆక్రమణల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'హైడ్రా'తో.. భూములు, ఆస్తుల కొనుగోళ్లపై ప్రభావం పడింది. జిల్లాల్లోనూ హైడ్రా తరహాలో కూల్చివేతలు చేపట్టడంతో.. రాష్ట్ర వ్యాప్తంగా కూడా రిజిస్ట్రేషన్ లావాదేవీలు తగ్గాయి. సుమారు రెండు నెలలుగా ఈ పరిస్థితి కొనసాగుతోంది. ముఖ్యంగా సెప్టెంబర్ నెలకు సంబంధించిన గణాంకాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. గత ఏడాది సెప్టెంబర్‌తో పోలిస్తే.. ఈ ఏడాది సెప్టెంబర్‌లో రిజిస్ట్రేషన్ల ఆదాయం ఏకంగా 30శాతానికిపైగా తగ్గింది. 20వేలకుపైగా లావాదేవీలు తగ్గినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, పరిసర జిల్లాల్లో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది.

ఒక్క నెలలో రూ.300 కోట్లు తగ్గిపోయి..

రిజిస్ట్రేషన్ల శాఖ గణాంకాల ప్రకారం.. గత ఏడాది సెప్టెంబర్‌తో పోలిస్తే, ఈ ఏడాది సెప్టెంబర్ ఒక్క నెలలోనే రూ.300 కోట్ల ఆదాయం తగ్గింది. గత

మిగతా 2వ పేజీలో ▶

బిడ్డలకు మూసీ పేరు పెట్టుకునేలా చేస్తాం!

నదిలో మురికిని పూర్తిగా ప్రక్షాళన చేసి అద్భుతంగా మారుస్తాం: సీఎం రేవంత్

- గోదావరి, సరస్వతి, కృష్ణా.. అన్నట్టుగా మూసీ పేరునూ పిల్లలకు పెట్టుకుంటారు
- ఎవరు అడ్డొచ్చినా మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ఆగదు
- నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్లతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న సీఎం
- నాటి ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి చేతులెత్తేస్తే తాము ఉద్యోగాలిస్తున్నామని వ్యాఖ్య
- తొమ్మిదవ తేదీన టీచర్ నియామక పత్రాలు అందిస్తామని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఎవరు అడ్డొచ్చినా మూసీ రివర్ ఫ్రంట్ పథకం ఆగదని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మూసీ పరీవాహకం పరిధిలో ఉన్న పది వేల కుటుంబాలకు మురికి జీవితం కాకుండా మంచి జీవితం అందించటం కూడా ఈ ప్రాజెక్టులో భాగమని పేర్కొన్నారు. "మన ఇళ్లలో ఆడబిడ్డలకు గోదావరి, సరస్వతి, నర్మద, కృష్ణా.. ఇలా నదుల పేర్లు పెట్టుకుంటాం. మరి మూసీ కూడా నది పేరే కదా. ఆ పేరు

మిగతా 2వ పేజీలో ▶

27 రోజుల్లో 22 లక్షల మంది రైతులకు రుణమాఫీ

మూడు దఫాల్లో రూ.17,869.22 కోట్లు ఇచ్చాం

- మాట ఇచ్చిన ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేశాం
- మిగిలిన వారికి కూడా నిర్ణీత గడువులో మాఫీ చేస్తాం
- మహారాష్ట్రలో ప్రధాని వ్యాఖ్యలకు సీఎం రేవంత్ స్పందన
- మాఫీ గణాంకాలను వివరిస్తూ మోదీకి లేఖ..

2లో



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి

11న సమీకృత గురుకులాలకు శంకుస్థాపన

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట ప్రాజెక్టు
- నిర్మాణం కోసం రూ.5 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాం
- ప్రస్తుతం 19 అసెంబ్లీ నియోజకవర్గాల్లో భూమిపూజ
- ఏడాదిలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడి

2లో

కొత్త గురువులకు సరికొత్త పాఠాలు

డీఎస్సీ విజేతలకు తొలిసారి ప్రత్యేక శిక్షణ

- బుద్ధులు చెప్పాకే బోధనకు అర్హత... మానసిక ధోరణిపైనా క్లాసులు
- వేధింపుల చట్టాలను తెలియజెప్పే పాఠ్యాంశాలు.. ఎస్‌సీఈఆర్‌టీ నేతృత్వంలో సిలబస్ తయారీ



సాక్షి, హైదరాబాద్

మరికొన్ని నెలల్లో ప్రభుత్వ పాఠశాలల్లోకి కొత్త టీచర్లు రాబోతున్నారు. 11,062 మందిని డీఎస్సీ ద్వారా నియమించబోతున్నారు. వాస్తవానికి వీళ్లంతా ఉపాధ్యాయ అర్హత పరీక్ష పాసైన వాళ్లే. బోధనకు అవసరమైన బీఈడీ, డీఎడ్ వంటి కోర్సుల్లో ఉత్తీర్ణులైన వాళ్లే. అంతిమంగా డీఎస్సీ పరీక్షలోనూ ర్యాంకు కొట్టినోళ్లే. ఇన్ని ఉండీ వీళ్ళకు మళ్లీ శిక్షణ ఏంటి? అనే అనుమానం రావొచ్చు. కొత్తగా అడుగుపెట్టే టీచర్లకు సామాజిక, నైతిక విలువలపై ప్రత్యేక శిక్షణ అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ శిక్షణ ముగిసిన తర్వాతే బోధనకు అర్హత ఇవ్వాలని విద్యాశాఖకు చెప్పింది. దీంతో కొత్త టీచర్ల కోసం ప్రత్యేక శిక్షణ సిలబస్‌ను రూపొందిస్తున్నారు. ఈ బాధ్యతను రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) తీసుకుంటోంది. అవసరమైన పాఠ్యాంశాలను రూపొందిస్తోంది. టీచర్ల శిక్షణ కోసం ప్రత్యేకంగా రిసోర్స్ పర్సన్స్‌ను కూడా

మిగతా 3వ పేజీలో ▶

'రెవెన్యూ' సేవల్లో తేడా కనపడాలి



- సామాన్యులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలి..
- దేశానికే రోల్‌మోడల్‌గా కొత్త రెవెన్యూ చట్టం తెస్తున్నాం
- డిప్యూటీ కలెక్టర్లతో ముఖాముఖిలో రెవెన్యూ మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: 'ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరే. మీరు బాగా పనిచేస్తే ప్రజలకు మేలు జరగడమే కాదు.. ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. సామాన్యులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలి. గతానికి, ప్రస్తుతానికి తేడా కనపడాలి'అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రెవెన్యూ ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని 272 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లతో మంత్రి పొంగులేటి ఆదివారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా రాష్ట్ర ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ

మిగతా 5వ పేజీలో ▶

రుణమాఫీపై దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు

- మోసపూరిత వైఖరిని అంతటా ప్రచారం చేస్తున్నారు
- 50 శాతం మంది రైతులకు కూడా మాఫీ కాలేదు
- 30 రకాల షరతులు పెట్టి రైతులను అనర్హులుగా చేశారు
- రూ.2 లక్షల రుణమాఫీపై సీఎం రేవంత్‌కు హరీశ్ లేఖ

2లో





గాజా మసీదుపై బాంబుల వర్షం

మసీదుపై ఇజ్రాయెల్ దాడుల్లో 19 మంది మృతి

పాఠశాలపైనా విరుచుకుపడిన సైన్యం... నలుగురి మృతి

ఉత్తర గాజా, దక్షిణ బీరుట్‌పై దాడులు ఉధృతం

6లో

ఆదివారం గాజా స్ట్రిప్‌లో వైమానిక దాడిలో కూలిన భవనం శిథిలాల నుంచి గాయపడిన చిన్నారిని తెస్తున్న సహాయక సిబ్బంది

క్లుప్తంగా...

ఇజ్రాయెల్‌ది నీతిలేని యుద్ధం

బాలగోపాల్ స్మారక సదస్సులో సామాజికవేత్త అచిన్ వనాయక్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పాలస్తీనాపై ఇజ్రాయెల్ నీతిలేని యుద్ధాన్ని సాగిస్తోందని ప్రముఖ సామాజికవేత్త, ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ అచిన్ వనాయక్ విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మానవహక్కుల వేదిక ఆధ్వర్యంలో బాలగోపాల్ 15వ స్మారక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అచిన్ వనాయక్ మాట్లాడుతూ పాలస్తీనాపై యుద్ధంలో ఇజ్రాయెల్‌కు మన దేశం మద్దతు పలకడం అన్యాయమని విమర్శించారు. భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు ఆయుధాల ఎగుమతిని వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు. పౌర హక్కుల ఉద్యమ నేత ఉమర్ ఖలీద్ మాట్లాడుతూ పౌర హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలు వాటిని అణచివేయడం దుర్మార్గమని విమర్శించారు. మానవ హక్కుల వేదిక ఉమ్మడి రాష్ట్రాల కన్వీనర్ ఎస్.జీవన్‌కుమార్ మాట్లాడుతూ బస్తర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌ను ఖండిస్తున్నట్లు చెప్పారు. అనంతరం హక్కుల వేదిక ప్రచురించిన బీలా కోసం బతుకు కోసం, సోంపేట హరిత ఉద్యమ చరిత్ర, రిజర్వేషన్ల వర్గీకరణ, ప్రజాస్వామిక దృక్పథం పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు డాక్టర్ తిరుపతయ్య, వేమన వసంత లక్ష్మి, వై.రాజేశ్, రోహిత్ పాల్గొన్నారు.

రైతులు రాలుతున్నా చలనం లేదు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రైతుకు రక్షణ వలయంగా ఉన్న సంక్షేమ పథకాలను.. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా ఎగవేయడంతో వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పేర్కొన్నారు. వందలాది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా సర్కారులో చలనం లేదని, సీఎంకు సోయి లేదు, ప్రభుత్వానికి బాధ్యత లేదని కేటీఆర్ ఆదివారం 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. ఓవైపు సాగునీటి సంక్షోభం, మరోవైపు రుణమాఫీ ద్రోహం, ఇంకోవైపు రైతు భరోసా మోసం, కౌలు రైతులకూ అందని సాయంతో రైతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌కు రైతన్నల చేతిలో దండన తప్పదని హెచ్చరించారు.

నేడు గాంధీభవన్‌కు మంత్రి తుమ్మల




సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో సోమవారం జరగనున్న 'మంత్రితో ముఖాముఖి' కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుకానున్నారు. షెడ్యూల్ ప్రకారం బుధ, శుక్రవారాల్లో ఈ కార్యక్రమం జరగాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల సోమవారానికి వాయిదా పడింది. దీంతో నేడు ఉదయం 11 గంటలకు గాంధీభవన్‌కు రానున్న తుమ్మల ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. కాగా, ఈ మంత్రితో ముఖాముఖి కార్యక్రమానికి ఇప్పటికే మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు హాజరు కాగా, మూడోసారి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొననున్నారు.

12 జిల్లాలకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ల నియామకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 11 జిల్లాలకు గ్రంథాలయ సంస్థ చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సయ్యద్ అర్జుమంద్ అలీ (నిర్మల్), నాగుల సత్యనారాయణ గౌడ్ (సిరిసిల్ల), సత్తు మల్లయ్య (కరీంనగర్), ఎలుగంటి మధుసూదన్ రెడ్డి (రంగారెడ్డి), జి.గోవర్ధన్ (వనపర్తి), గొల్ల అంజయ్య (సంగారెడ్డి), మద్ది చంద్రకాంత్‌రెడ్డి (కామారెడ్డి), వరాల విజయ్ కుమార్ (నారాయణపేట), జి.రాజేందర్ (నాగర్ కర్నూల్), శేరి రాజేశ్ రెడ్డి (వికారాబాద్), మల్లు నరసింహారెడ్డి (మహబూబ్‌నగర్), నీలి శ్రీనివాసులు (జోగుళాంబ గద్వాల)ను ఆయా జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్లుగా నియమిస్తూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బి.వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు.

'ప్రకటనలే.. ఆచరణ లేదు'



సాక్షి, హైదరాబాద్: విద్యా వ్యవస్థను గాడిలో పెడతానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా.. ఆచరణలో మాత్రం కనిపించడం లేదని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఆదివారం గెల్లు శ్రీనివాస్ యాదవ్ విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో యాజమాన్యాలు టీసీలు, మెమోలు ఇవ్వడం లేదని వాపోయారు. దీంతో విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా కమిషన్ చైర్మన్‌గా నియమితులైన ఆకునూరి మురళి ఎందుకు బాధ్యతలు తీసుకోవడం లేదని గెల్లు శ్రీనివాస్ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్యార్థులు గంజాయి తాగుతున్నారని చెబుతున్న సీఎం ఆధారాలు బయట పెట్టాలన్నారు.

బిడ్డలకు మూసీ పేరు పెట్టుకునేలా చేస్తాం!



అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి. చిత్రంలో మంత్రులు పొన్నం, పొంగులేటి, సీతక్క, కోమటిరెడ్డి, కొండా సురేఖ

▶ మొదటి పేజీ తరువాయి

ఎందుకు పెట్టుకోవటం లేదు. మూసీ అనగానే మురికి కూపమన్న భావన రావడమే దీనికి కారణం. అందుకే ఆ మురికిని ప్రక్షాళన చేసి.. నదిని అద్భుతంగా మార్చుతాం. పిల్లలకు మూసీ అన్న పేరు పెట్టుకునేలా చేస్తాం'' అని రేవంత్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జరిగిన కార్యక్రమంలో గతంలోనే నోటిఫికేషన్లు జారీ అయిన ఉద్యోగాలకు సంబంధించి ఎంపికైన 1,635 మందికి ఉద్యోగ నియామక పత్రాలను సీఎం రేవంత్ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వివరాలు రేవంత్ మాటల్లోనే..

''గతంలో ఎన్నో ప్రాజెక్టులకు భూసేకరణ జరిపినప్పుడు లేని ఇబ్బంది మూసీ విషయంలో ఎందుకు? ఆ కుటుంబాలు జీవితాంతం మురికిలోనే ఉండాలా? వారిని బాగు చేసే బాధ్యత ప్రభుత్వంతీసుకుంటుంది. మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను అందించటంతోపాటు వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. మూసీ పరిధిలో 10వేల కుటుంబాలు ఉన్నాయని 33 బృందాలు ఆరునెలల పాటు సర్వే చేసి తేల్చాయి. బఫర్ జోన్‌లో ఉన్న వారిని ఎలా ఆదుకోవాలో ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ప్రాజెక్టును అడ్డుకోవడం కాదు.. కావాలంటే ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలి. కాళేశ్వరం కోసం లక్ష కోట్లు తగలబెట్టిన వారికి ఇది తెలియదా? ఇటీవల బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కూడా బీఆర్‌ఎస్ నేతల తరహాలోనే మూసీ ప్రాజెక్టుపై మాట్లాడుతున్నారు. ఆయన అంగీ మార్చినా బీఆర్‌ఎస్ వాసనను వదిలించుకున్నట్టు లేదు. సబర్మతి తరహాలో మూసీని అభివృద్ధి చేద్దాం. కేంద్రం నుంచి ఓ 20 వేల కోట్లు వచ్చేలా బీజేపీ ఎంపీలు చేయలేరా? పరామర్శల పేరుతో మూసీ పరీవాహక ప్రాంతాలకు వచ్చే కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లను ఓ వారంపాటు అక్కడే ఉంచితే ఆ ప్రాంత జనం కష్టాలేమిటో తెలిసి వస్తాయి.

గతంలో నోటిఫికేషన్లు ఇచ్చి చేతులెత్తేశారు..

ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చిన నాటి ప్రభుత్వ పెద్దలు.. నియామకాలను పట్టించుకోలేదు. వీటికి సంబంధించిన న్యాయపరమైన చిక్కులను పరిష్కరించటం తమ బాధ్యతగా భావించకపోవటం వల్ల ఏళ్ల తరబడి నియామకాలు పెండింగ్‌లో ఉండిపోయాయి. యువతకు ఉద్యోగాలు రావాలంటే నాటి సీఎం, మంత్రుల కుర్చీల్లో కూర్చున్న వారి ఉద్యోగాలు ఊడాలని విద్యార్థి నిరుద్యోగ జంగ్ సైరన్ కార్యక్రమంలో చెప్పాను. దాన్ని మీరు చేసి చూపించారు. మా కుటుంబ సభ్యుల కళ్లలో ఆనందం చూస్తూ.. మేం సీఎంగా, మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశాం. ప్రభుత్వం ఏర్పడ్డ 90 రోజుల్లోనే 31వేల ఉద్యోగాలు కల్పిస్తూ.. నిరుద్యోగ యువత తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూసేలా నియామక పత్రాలను అందించాం. ఇప్పుడు దసరా ముందు 1,635 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించటం ద్వారా వారి కుటుంబాలు మరింత ఆనందంగా పండుగ నిర్వహించుకునేలా చేశాం. మరో 11 వేల మందికి ఈ నెల 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో ఉపాధ్యాయ నియామక పత్రాలను అందించబోతున్నాం.

ఎవరిని ఆదర్శంగా తీసుకుంటారు?

భాక్రానంగల్ డ్యామ్ నుంచి నాగార్జునసాగర్, శ్రీశైలం వరకు దశాబ్దాలుగా నిలబడి ఉండేలా కట్టిన నాటి ఇంజినీర్లను, హైదరాబాద్ వెలుపల జంట జలాశయాలకు ప్లాన్ చేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్యలను ఆదర్శంగా తీసుకుంటారా? లేక కట్టిన కొన్నేళ్లకే కూలిపోయిన కాళేశ్వరాన్ని నిర్మించిన వారిని ఆదర్శంగా తీసుకుంటారో ఉద్యోగులు, ఇంజనీర్లు నిర్ణయించుకోవాలి. కొత్తగా విధుల్లోకి చేరుతున్న ఇంజనీర్ల చేతుల మీదుగా రీజనల్ రింగు రోడ్డు, రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ, ఫార్మాసిటీ, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూపుదిద్దుకోబోతున్నాయి. గత పదేళ్లలో అప్పటి ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాల నాణ్యత డొల్లతనాన్ని చూపిస్తాం రండి.. నాటి మంత్రులకు ఇదే నా సవాల్.

దసరా ముందు సంతోషం నింపాం: మంత్రి కోమటిరెడ్డి

మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి మహనీయ ఇంజనీర్లు పనిచేసిన ఈ నేలమీద ఇప్పుడు కొందరు ఇంజనీర్లు విచారణకు హాజరుకావాల్సిన పరిస్థితి రావటం బాధగా ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ''అధికారులు అందించిన ప్లాన్లను పక్కనపెట్టి తానే పెద్ద ఇంజనీర్ అన్నట్టుగా నాటి సీఎం కేసీఆర్ కట్టిన మూడేళ్లకే కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినేలా చేశారు. ఏళ్ల క్రితం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు మాత్రం ఇవ్వలేదు. అలా పెండింగు పెట్టిన వాటిని తమ ప్రభుత్వం పరిష్కరించి అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వటం ద్వారా దసరా ముందు వారి ఇళ్లలో సంతోషాన్ని నింపుతోంది. కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నవారు బాధ్యతగా పనిచేయాలి. నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలి. దశాబ్దాలుగా అద్భుత సేవలందిస్తున్న నాగార్జున సాగర్ ప్రాజెక్టును కొత్త ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలి. కట్టిన మూడేళ్లకే కుంగిన కాళేశ్వరం ప్రాజెక్టును కాదు'' అని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ ముఖ్య సలహాదారు కేశవరావు, కోదండరెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాల్స్ కట్టి పెద్దలకు ధారాదత్తం చేస్తారా?

సీఎం రేవంత్‌కు ఎంపీ ఈటల బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: బ్యూటిఫికేషన్ పేరిట మాల్స్ కట్టి పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తారా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నిలదీశారు. ఈ మేరకు ఆయన ఆదివారం సీఎంకు బహిరంగ లేఖ రాశారు. మూసీ ప్రక్షాళనకి మీ యాక్షన్ ప్లాన్ ఏంటి? డీపీఆర్ ఉందా? ఇళ్లు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏంటి? రూ. కోట్ల విలువ చేసే ఇల్లు తీసుకొని డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తా అంటే ఎలా? సబర్మతి నది ప్రక్షాళనకి రూ. 2 వేల కోట్లు, నమోగంగ ప్రాజెక్ట్‌కి 12 ఏళ్లలో రూ. 22 వేల కోట్లు ఖర్చు పెడితే మూసీ ప్రక్షాళనకు రూ. లక్షన్నర కోట్లు ఎందుకు ఖర్చు అవుతున్నాయి? ఈ ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పాలని ఈటల సీఎంను డిమాండ్ చేశారు. స్టేజీల మీద ప్రకటనలు చేయడం కాకుండా ముఖ్యమంత్రి అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం పెడితే తాము ఎక్కడికైనా రావడానికి సిద్ధమన్నారు. ఈ విషయాలపై స్పష్టత వచ్చే వరకు తన ప్రతిఘటన ఉంటుందని తెలిపారు.

హైడ్రా.. రిజిస్ట్రేషన్లు విత్ డ్రా

▶ మొదటి పేజీ తరువాయి

ఏడాది సెప్టెంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా 99,528 రిజిస్ట్రేషన్ లావాదేవీలు జరిగి, ప్రభుత్వానికి రూ. 955.12 కోట్ల ఆదాయం సమకూరింది. అదే ఈసారి సెప్టెంబర్‌లో 80,115 లావాదేవీలు జరిగి, రూ.650.80 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో హైడ్రా ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. రంగారెడ్డి జిల్లాలో 2023 సెప్టెంబర్‌లో 21,407 లావాదేవీలు జరిగితే.. ఈసారి సెప్టెంబర్‌లో 16,687 లావాదేవీలే జరిగాయి. సుమారు ఐదువేల లావాదేవీలు తగ్గాయి.మేడ్చల్, పటాన్‌చెరు రిజిస్ట్రేషన్ జిల్లాల్లోనూ 4 వేల చొప్పున లావాదేవీలు తగ్గడం గమనార్హం.

మొదట బాగానే ఉన్నా..

రాష్ట్రంలో గత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో 10.04 లక్షల రిజిస్ట్రేషన్ లావాదేవీలు జరిగి.. ప్రభుత్వానికి రూ.7,229.88 కోట్లు రాబడి సమకూరింది. అదే ఈ ఏడాది తొలి ఆరునెలల్లో 9.19 లక్షల లావాదేవీలతో రూ.7,291.28 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాది కంటే స్వల్పంగా రూ.61.4 కోట్ల పెరుగుదల కనిపిస్తున్నా.. అది ఆస్తుల రేట్లు పెరగడం, తొలి నాలుగు నెలల్లో రిజిస్ట్రేషన్లు గణనీయంగా జరగడం వల్ల సమకూరినదేనని రిజిస్ట్రేషన్ వర్గాలు చెప్తున్నాయి. అంటే ఆర్థిక సంవత్సరం మొదట్లో రిజిస్ట్రేషన్లు, ఆదాయం గణనీయంగా పెరిగినా.. తర్వాత ఒక్కసారిగా తగ్గిపోయిందని స్పష్టమవుతోంది.

ధరల పెంపు.. హైడ్రా దెబ్బ..

ఎల్ఆర్ఎస్ పేరుతో ఎక్కువ డబ్బులు చెల్లించాల్సి వస్తున్న కారణంగా.. చాలా మంది డీటీసీపీ లేఔట్ల వైపు చూస్తున్నారని రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక డాక్యుమెంట్ రైటర్ తెలిపారు. డీటీసీపీ ఫీజులు కూడా భారీగా పెరగడంతో చాలా మంది వెంచర్లు చేయడం లేదని.. వెంచర్లు చేసినా యుటిలిటీస్, కమ్యూనిటీ, పార్కుల పేరిట ఎక్కువగా భూమి వదలాల్సి రావడంతో రియల్ ఎస్టేట్ కంపెనీలు ధరలు పెంచేశాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం 'హైడ్రా' పేరిట కూల్చివేతలు చేపట్టడంతో.. కొనుగోలుదారుల్లో తెలియని భయం నెలకొందని వివరించారు. ప్లాట్లు అమ్ముదామంటే కొనేవాళ్లు లేరని.. చదరపు గజం ధర రూ.5 వేలకు మించి ఉన్న ప్లాట్ల విషయంలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వంటి విషయాలను పరిశీలించుకునేలోపు కొనుగోలు దారుల మనసు మారిపోతోందని చెప్పారు. ఈ క్రమంలో ప్రస్తుతానికి కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోందని వెల్లడించారు. ఇది ఇప్పటితో అయిపోలేదని, రిజిస్ట్రేషన్ లావాదేవీలు మరింత తగ్గుతాయని అంచనా వేశారు. ఇందుకు చాలా కారణాలున్నా.. 'హైడ్రా' ప్రభావం కూడా గణనీయంగా ఉందని పేర్కొన్నారు.

ఈ ఏడాది, గతేడాది సెప్టెంబర్ నెలలో రిజిస్ట్రేషన్ జిల్లాల వారీగా లావాదేవీలు, ఆదాయం (రూ.కోట్లలో)

జిల్లా	సెప్టెంబర్-23		సెప్టెంబర్-24	
	లావాదేవీలు	ఆదాయం	లావాదేవీలు	ఆదాయం
మహబూబ్‌నగర్	8,368	18.79	6,938	14.83
రంగారెడ్డి	21,407	384.92	16,687	247.67
మేడ్చల్	13,023	212.89	9,492	133.98
హైదరాబాద్	1,703	33.65	1,363	26.91
బంజారాహిల్స్	3,011	72.88	3,019	63.15
పటాన్‌చెరు	12,000	102.12	7,903	65.87
నిజామాబాద్	5,285	13.07	4,639	10.77
ఆదిలాబాద్	3,195	8.57	2,968	7.67
కరీంనగర్	7,846	25.06	6,790	19.28
వరంగల్	8,517	34.56	7,023	21.93
ఖమ్మం	3,485	14.78	3,149	12.28
నల్లగొండ	11,688	33.83	10,144	26.46
మొత్తం	99,528	955.12	80,115	650.80

27 రోజుల్లో 22 లక్షల మంది రైతులకు రుణమాఫీ

మూడు దఫాల్లో రూ.17,869.22 కోట్లు ఇచ్చాం

- మాట ఇచ్చిన ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేశాం
- మిగిలిన వారికి కూడా నిర్ణీత గడువులో మాఫీ చేస్తాం
- మహారాష్ట్రలో ప్రధాని వ్యాఖ్యలకు సీఎం రేవంత్ స్పందన
- మాఫీ గణాంకాలను వివరిస్తూ మోదీకి లేఖ.. 'ఎక్స్'లో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రైతాంగానికి రూ. 2లక్షల రుణమాఫీ ప్రక్రియను మాట ఇచ్చిన ప్రకారం పూర్తి చేశామంటూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. ఈ లేఖలో ఆ వివరాలను ప్రస్తావించారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ తెలంగాణ ఎన్నికల సమయంలో రైతులకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇంతవరకు మాఫీ చేయలేదని, ఇలాంటి మోసపూరిత వాగ్దానాలను నమ్మొద్దంటూ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఈ లేఖను ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ హామీ అంటే బంగారు హామీ అని తెలంగాణ రైతులు నమ్మారని, అలాంటి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రుణమాఫీ చేసి దేశానికి కొత్త పంథా చూపెట్టామని ఎక్స్‌లో పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ అభివృద్ధికి భవిష్యత్‌లో కేంద్రం నుంచి తగిన సహకారం అందించాలని ప్రధాని మోదీని సీఎం రేవంత్ కోరారు.

లేఖలో ఏం రాశారంటే...!

ప్రధాని మోదీకి రాసిన లేఖలో మూడు దఫాలుగా రైతు రుణమాఫీని తెలంగాణలో అమలు పరిచిన తీరును సీఎం రేవంత్ వివరించారు. ఈ ఏడాది జూలై 18న రూ.లక్ష లోపు రుణమాఫీకి సంబంధించి 11,34,412 రైతు ఖాతాల్లో రూ. 6,034.97 కోట్లు జమ చేశామని, జూలై 30న రూ.1.50 లక్షలలోపు మాఫీ కోసం 6,40,823 మంది రైతుల ఖాతాల్లో రూ.6,190.01 కోట్లు జమ చేశామని, ఆగస్టు 15వ తేదీన రూ.2లక్షల వరకు మాఫీ కోసం 4,46,832 మంది ఖాతాల్లో రూ. 5,644.24 కోట్లు జమ చేశామని వెల్లడించారు. మొత్తం కేవలం 27 రోజుల వ్యవధిలో రూ.17,869.22 కోట్లు జమ చేసినట్టు తెలిపారు. రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న రైతులు ఆ ఎక్కువ ఉన్న రుణాన్ని బ్యాంకుల్లో కడితే రూ. 2 లక్షలు ప్రభుత్వం చెల్లించేందుకు సిద్ధంగా ఉందని, ఈ ప్రక్రియను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని వివరాలు తెలంగాణ ప్రభుత్వ వెబ్ సైట్‌లో పారదర్శకత కోసం అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. రైతాంగం పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని, అప్పుల ఊబి నుంచి రైతులను విముక్తి చేయడమే లక్ష్యంగా ఈ ప్రక్రియ పూర్తి చేశామని, తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని వెల్లడించారు.

ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్

నేడు వెళ్లనున్న భట్టి.. పార్టీ పెద్దలతో ఇరువురి భేటీకి చాన్స్

మంత్రివర్గ విస్తరణ, కార్పొరేషన్ చైర్మన్ల నియామకంపై చర్చ?

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ఢిల్లీకి వెళ్లారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డీజీపీలతో సోమ వారం జరిగే సమావేశానికి హాజరయ్యేందుకు ఆదివారం సాయంత్రం ఆయన హస్తిన బయలుదేరారు. మరోవైపు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా సోమవారం ఢిల్లీ వెళ్లే అవకాశాలున్నాయి. వారిద్దరూ పార్టీ హైకమాండ్ పెద్దలను కలిసే అవకాశముందని, మంత్రివర్గ విస్తరణతోపాటు పలు కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకంపై చర్చించొచ్చని ఉందని గాంధీ భవన్ వర్గాలు తెలిపాయి. అయితే సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోనే ఉంటారని తెలుస్తోంది. అలాగే పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తిరుపతి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తమ్, మహేశ్‌గౌడ్ లేకుండానే మంత్రివర్గ విస్తరణ, ఇతర అంశాలపై హైకమాండ్‌తో చర్చలు జరుగుతాయా లేదా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. అవకాశాన్నిబట్టి సీఎం, డిప్యూటీ సీఎం కేంద్ర ప్రభుత్వ పెద్దలను కూడా కలవనున్నారు.

రుణమాఫీపై దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు

- మోసపూరిత వైఖరిని అంతటా ప్రచారం చేస్తున్నారు
- రూ.2 లక్షల రుణమాఫీపై సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు లేఖ



ఆర్టీఐ కింద ఎస్‌బీఐ నుంచి హరీశ్‌రావు తీసుకున్న రుణమాఫీ వివరాల పత్రం

సాక్షి, హైదరాబాద్: రుణమాఫీ విషయంలో తెలంగాణ రైతులతోపాటు మొత్తం దేశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుదారి పట్టిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.2 లక్షల పంట రుణాలను విజయవంతంగా మాఫీ చేసినట్టు మోసపూరిత వైఖరిని దేశవ్యాప్తంగా ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వైఖరిని ఎండగడుతూ హరీశ్‌రావు ఆదివారం బహిరంగలేఖ రాశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదారి పట్టించే విధానాలను అనుసరిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరిని దేశ ప్రజల దృష్టికి తెచ్చేందుకు లేఖ రాస్తున్నట్టు పేర్కొన్నారు.

లేఖలో ఏముందంటే....

'రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 2023 డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. హామీని నిలబెట్టుకోని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల సమయంలో రుణమాఫీ గడువును ఈ ఏడాది ఆగస్టు 15 వరకు పెంచింది. కానీ రూ.2 లక్షల రుణమాఫీ పూర్తిగా జరిగిందని సీఎం రేవంత్ చేసిన ప్రకటన పూర్తి అబద్ధమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. రూ.లక్ష లోపు రుణం 2.99 లక్షల మందికి, రూ.లక్షన్నర లోపు 1.30లక్షల మందికి, రూ.2లక్షల వరకు 65,231 మందికి మాత్రమే మాఫీ అయ్యింది. ఎస్‌బీఐ సమాచారం ప్రకారం 50 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ జరగలేదు. ఇతర బ్యాంకుల్లోనూ ఇదే పరిస్థితి.

రూ.2లక్షలకు పైబడి చెల్లించినా...

రూ.2 లక్షలకు పైగా రుణం ఉంటే రైతులు పైబడిన మొత్తాన్ని చెల్లిస్తే రూ.2 లక్షలు ప్రభుత్వం మాఫీ చేస్తుందని హామీ ఇచ్చింది. రైతులు ఈ మొత్తాన్ని చెల్లించినా రుణమాఫీ జరగలేని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. మరోవైపు చాలా మంది రైతులు సీఎం మాటను నమ్మి పంట రుణమాఫీకి అర్హత కోసం ప్రైవేట్ రుణాలు అధిక వడ్డీకి తీసుకున్నారు. అయితే రుణమాఫీకి ప్రభుత్వం 31 రకాల షరతులు పెట్టి రైతులను అనర్హులుగా చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతుబంధు ద్వారా రూ.72వేల కోట్లు ఇచ్చాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి దసరా ఇది. ఈ ఖరీఫ్ పంటకు సంబంధించిన పంట పెట్టుబడి సాయం ఇప్పటికీ ఇవ్వలేదు' అని హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం కింద ఎస్‌బీఐ ఇచ్చిన వివరాలు, రూ.2 లక్షలకు మించిన రుణాన్ని చెల్లించిన రైతుల బ్యాంకు రశీదులను లేఖకు జత చేశారు.

కాంగ్రెస్ మోసాలను అలయ్ బలయ్‌లో చర్చించండి

దసరాకు గ్రామాలకు వస్తున్న కుటుంబసభ్యులు, స్నేహితులతో అలయ్ బలయ్ తీసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాల గురించి చర్చించాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలును పక్కన పెట్టడంతోపాటు వృద్ధులకు ఆసరా పెన్షన్ కూడా పెంచలేదన్నారు. రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల అమలు నిలిచిపోయిందని, ధాన్యం బోనస్ బోగస్‌గా మారిందని చెప్పారు. ఏటా రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, నిరుద్యోగ భృతికి అతీగతీ లేదన్నారు.

11న సమీకృత గురుకులాలకు శంకుస్థాపన

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్స్ పేరిట ప్రాజెక్టు
- కుల, మతాలకు అతీతంగా సమీకృత గురుకులాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్టు'కు ఈనెల 11వ తేదీన శంకుస్థాపన చేయనున్నట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. దసరా పండుగకు ముందురోజున రాష్ట్రవ్యాప్తంగా 19 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ సమీకృత గురుకుల పాఠశా లల నిర్మాణ పనులకు భూమిపూజ జరుగుతుందని తెలిపారు. ఏడాదిలో వాటి నిర్మాణ పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తేవాల ని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఆదివారం సచివా లయంలో సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణ పనులపై మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి భట్టి మీడి యాతో మాట్లాడారు. ''సమీకృత గురుకుల విద్యాసంస్థల నిర్మాణాల కోసం 2024-25 బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు కేటాయించాం. ఇది చారిత్రాత్మక నిర్ణయం. తెలంగాణ మానవ వనరులు ప్రపంచంతో పోటీపడేలా కావాల్సిన నిధులు కేటాయించి విద్యాభివృద్ధికి చర్యలు చేపట్టాం. ఒక్కో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను 20 నుంచి 25 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలన్నీ ఒకే ప్రాంగణంలోకి వస్తాయి. ఐదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు విద్యార్థులు ఉంటారు. ప్రస్తుతం రాష్ట్రంలో చాలా గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు లేవు. 1,023 గురుకుల స్కూళ్లు ఉంటే అందులో 662 స్కూళ్లు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. పక్కా భవనం లేనప్పుడు బోధన, అభ్యసన కార్యక్రమాల అమలు ఇబ్బందికరంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే బడుగు, బలహీనవర్గాలను ఒకే గొడుగు కిందకు తెచ్చి చదువు చెప్పించే లక్ష్యంతో సమీకృత గురుకులాలను తీసుకొస్తున్నాం..'' అని భట్టి తెలిపారు.

తొలుత 19 నియోజకవర్గాల్లో..

ఇప్పటివరకు 25 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి కావాల్సిన భూమి, ఇతర అంశాలకు సంబంధించి ప్రతిపాదనలు వచ్చాయని భట్టి తెలిపారు. అందులో ఈ నెల 11న 19 చోట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్నామని..



కొడంగల్‌లో నిర్మించనున్న భవనం నమూనా

మిగతా నియోజ కవర్గాల్లో పూర్తిస్థాయి సమాచారం అధారంగా పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాన్ని స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్మించాలని నిర్ణయించామని.. విద్యార్థులకే కాకుండా బోధన, బోధనేతర సిబ్బందికి అక్కడే క్వార్టర్స్ ఉంటాయని చెప్పారు. ఈ పాఠశాలల్లో చదువుల పేరిట ఒత్తిడి సృష్టించే వాతావరణం కాకుండా క్రీడలు, వినోదం వంటివి కూడా విద్యార్థులకు అందిస్తామన్నారు.

ఒకరోజు ముందే దసరా పండుగ: మంత్రి వెంకట్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ఒకేరోజు 19 సమీకృత గురుకుల పాఠశాలల పనుల కు శంకుస్థాపన చేయడం శుభపరిణామమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురుకుల పిల్లలకు ఒకరోజు ముందే దసరా పండుగ వచ్చినట్టేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న గురుకులాల్లో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు మంచి భవిష్యత్తు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే కొందరు ప్రతిపక్ష పార్టీ నేతలు అనవసర వివాదాలు రేపుతున్నారని మండిపడ్డారు.

అన్ని నియోజకవర్గాల్లో సమీకృత గురుకులాలు: మంత్రి పొన్నం

రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమీకృత గురుకుల పాఠశాలలు నిర్మిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే రూ.1,100 కోట్లు ఖర్చు పెట్టి అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట స్కూళ్ల మరమ్మతులు పూర్తిచేశామన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో కొత్త నియామకాలు పూర్తి చేశామని.. ప్రభుత్వ స్కూళ్లలో బదిలీలు, పదోన్నతులు చేపట్టామని చెప్పారు.

11న శంకుస్థాపన చేయనున్న సమీకృత గురుకులాలు ఇవే..

కొడంగల్, మధిర, మంథని, హుస్నాబాద్, నల్లగొండ, హుజూర్‌నగర్, ములుగు, ఖమ్మం, కొల్లాపూర్, చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, అచ్చంపేట, తిరుమలగిరి, పాలేరు, వరంగల్, ఆందోల్, భూపాలపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, తుంగతుర్తి.



ఆదివారం వరంగల్ శ్రీభద్రకాళి ఆలయంలో శ్రీమహాలక్ష్మిగా అమ్మవారు..



బాసర శ్రీజ్ఞానసరస్వతి క్షేత్రంలో కూష్మాండదేవిగా అమ్మవారు..



కూష్మాండదేవిగా అలంపూర్ జోగులాంబ అమ్మవారు..

కొత్త గురువులకు సరికొత్త పాఠాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఎంపిక చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 9న టీచర్లకు నియామక ఉత్తర్వులు ఇవ్వనుండగా, ఆ తర్వాత నెల రోజులపాటు స్వల్పకాలిక శిక్షణ ఇవ్వనున్నారు.

విలువలే ముఖ్యం: పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తి కొన్నేళ్లుగా వక్రమార్గం పడుతోందన్న ఆరోపణ లున్నాయి. విలువల్లేని టీచర్లపై విమర్శలొస్తున్నాయి. అనేక చోట్ల ఉపాధ్యాయుడే కీచకుడైన ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. ప్రైవేటు స్కూళ్లలో పనిచేసే టీచర్లకు వీటిపై పెద్దగా అవగాహన ఉండదని అధికారులు భావిస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని బాలికల చట్టాలు, మహిళా చట్టాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఇటీవల కాలంలో వచ్చిన కొత్త చట్టాలను ఇందులో చేరుస్తున్నారు. అవసరమైతే మహిళా న్యాయవాదులు, మహిళా సంఘాల నేతలతో క్లాసులు చెప్పించే యోచనలో ఉన్నారు. దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపునకు కృషి చేసేలా ప్రేరణపరమైన క్లాసులు ఇప్పించనున్నారు.

టెక్నాలజీపై పట్టు: విద్యా వ్యవస్థలో సాంకేతికత వేగంగా చొచ్చుకుపోతోంది. టీచర్ కన్నా విద్యార్థే ముందుగా గూగుల్ సెర్చ్ ద్వారా సవాలక్ష అంశాలను తెరమీదకు తెస్తున్నాడు. వీటి నివృత్తిలో సాంకేతిక పరిజ్ఞానం కొత్త టీచర్లకు అవసరం. టెక్నాలజీపై పట్టున్న యువత టీచర్లుగా వస్తున్నారు. ఈ నేపథ్యంలో అత్యాధునిక ఏఐ టెక్నాలజీ ద్వారా బోధన చేయడం వంటి మెళకువలను అందించేందుకు నిపుణుల చేత శిక్షణ ఇప్పించనున్నారు. బోధనలో త్రీడీ, వర్చువల్ రియాలిటీ, ఆగుమెంటేషన్ వంటి సరికొత్త విధానాల పైనా మెళకువలు నేర్పించనున్నారు.

మార్పు దిశగా అడుగులు: కొత్త టీచర్లలో చాలా మంది కొన్నేళ్ల క్రితం బీఈడీ పూర్తి చేశారు. ఆ సమయంలో వారి బీఈడీ సిలబస్‌లో ఉన్న పాఠ్యాంశాలు వేరు. ఇప్పుడు బోధన విధానం, విద్యార్థి మానసిక ధోరణిలో అనేక మార్పులు వచ్చాయి. ముఖ్యంగా కరోనా తర్వాత ఊహించని ధోరణి కన్పిస్తోందనేది జాతీయ విద్యా సర్వే నివేదికల సారాంశం. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థి సైకాలజీ, టీచర్లకు విద్యార్థికి మధ్య సమన్వయం, సరికొత్త మెళకువలతో బోధన వంటి టెక్నిక్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

శిక్షణ మంచిదే



నేటి విద్యావిధానంలో మార్పులను అందిపుచ్చుకునేందుకు కొత్త టీచర్లకు శిక్షణ అవసరం. చట్టాలను వారికి తెలియజెప్పాలి. ఎప్పుడో బీఈడీ చేసిన వారికి ఈ తరహా పునశ్చరణ మేలు చేస్తుంది. అయితే, వేగంగా మారుతున్న సమాజంలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు తరచూ చేపట్టాల్సిన అవసరం ఉంది.

– పింగిళి శ్రీపాల్ రెడ్డి (పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు)

అంకితభావం పెరుగుతుంది



పోటీ పరీక్షల్లో విజయం సాధించి, టీచర్‌గా వచ్చే వ్యక్తికి ఉపాధ్యాయ వృత్తి ప్రాధాన్యత తెలియజేయాల్సిన అవసరం ఉంది. దీని వల్ల అంకిత భావం పెరుగుతుంది. కొత్త తరం ఉపాధ్యాయులకు సరైన మార్గనిర్దేశం ఉంటే అద్భుతాలు సృష్టిస్తారు. బోధనతో ప్రభుత్వ పాఠశాలల్లో మార్పులు తెస్తారు.

– సయ్యద్ షౌకత్ అలీ (టీఎస్‌టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు)

రూ.6,66,66,666.66 తో అమ్మవారికి అలంకరణ



స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం బ్రాహ్మణవాడి శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని మహాలక్ష్మి దేవి రూపంలో అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని రూ.6,66,66,666.66 కరెన్సీ నోట్లతో అలంకరించి పూజలు చేశారు. తమిళనాడు నుంచి వచ్చిన ప్రత్యేక నిపుణులు అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు.

నేటినుంచి ఎడ్‌సెట్ స్పెషల్ కౌన్సెలింగ్


సాక్షి, హైదరాబాద్: బీఈడీ కోర్సుల్లో ప్రవేశా నికి ఎడ్‌సెట్ ప్రత్యేక రౌండ్ కౌన్సెలింగ్ సోమ వారం నుంచి మొదలవుతుందని ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి.రమేశ్‌బాబు తెలిపారు. 7, 8 తేదీల్లో ఆప్షన్లు ఇవ్వొచ్చని, 11వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు 17వ తేదీలోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

14 నుంచి వ్యవసాయ కోర్సులకు కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం అందిస్తున్న బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, బీఎస్సీ (హానర్స్) కమ్యూనిటీ సైన్స్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ), బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ (బీవీఎస్సీ అండ్ ఏహెచ్), బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీ సైన్స్ (బీఎఫ్ఎస్సీ), బీఎస్సీ (హానర్స్) హార్టీకల్చర్ కోర్సుల లో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం మొదటి దశ కౌన్సెలింగ్ ఈ నెల 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తామని వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు తెలంగాణ ఎంసెట్ – 2024 పరీక్షలో అర్హత పొంది, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి ర్యాంకు ఆధారంగా నిర్ణీత షెడ్యూల్ రోజు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు షెడ్యూల్లో పేర్కొన్న అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్ణీత రుసుముతో రావాలని కోరారు. కౌన్సెలింగ్ రోజే ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తారు. కౌన్సెలింగ్‌లో ఎంసెట్ పరీక్షలో అభ్యర్థుల మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారు. కౌన్సెలింగ్ షెడ్యూల్, ఇతర వివరాల కోసం అభ్యర్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్ – www. pjtsau.edu.in ను సందర్శించాలని కోరారు.

'సింగరేణి' లాభాల వాటాలో టాప్‌టెన్ వీరే

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక లాభాల వాటా సాధించిన టాప్‌టెన్ ఉద్యోగుల పేర్లను ప్రకటించారు. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఈ వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఎస్ఆర్‌పీ–1కు చెందిన ఎస్‌డీఎల్ ఆపరేటర్ ఆసం శ్రీనివాస్ రూ.3.24 లక్షలు అత్యధికంగా సాధించారు. మందమర్రి కేకే–5కు చెందిన జనరల్ మజ్దూర్ కుమ్మరి జెస్సీ రాజు రూ.3.10 లక్షలు, శ్రీరాంపూర్ ఆర్కే–5కు చెందిన ఎస్‌డీఎల్ ఆపరేటర్ అటికం శ్రీనివాస్ రూ.3.01 లక్షలు, ఆర్కే న్యూటెక్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ తుమ్మనపల్లి శ్రీనివాస్ రూ.3 లక్షలు, ఎస్ఆర్‌పీ–1కు చెందిన మేడం తిరుపతి రూ.3 లక్షలు, ఆర్కే న్యూటెక్‌కు చెందిన ఫోర్‌మెన్ కర్నె వెంకటేశం రూ.2.96 లక్షలు, ఆర్కే–5కు చెందిన ఎస్‌డీఎల్ ఆపరేటర్ బండారి శ్రీనివాస్ రూ.2.92లు, ఆర్కే–7కు చెందిన కోల్‌కట్టర్ దుర్గం తిరుపతి రూ.2.91 లక్షలు, ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లిగనికి చెందిన ఓవర్‌మెన్ వి.వంశీకృష్ణ రూ.2.89 లక్షలు, శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే–6కు చెందిన సర్వేయర్ బర్ల మహేందర్ రూ.2.88 లక్షలు సాధించారు. వీరిని సింగరేణి యాజమాన్యం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ప్రత్యేకంగా అభినందించాయి. వీరికి సోమవారం సీఅండ్ఎండీ కార్యాలయంలో చెక్కులు అందజేయనున్నట్లు యూనియన్ నాయకులు వెల్లడించారు.





ఏది మంచి ఆలోచన అని నిర్ణయించే అధికారి ఎవరూ లేరు.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 7 అక్టోబర్ 2024

ప్రాణులు నేర్పే పాఠాలు

ప్రపంచమంతా పచ్చగా ఉందని, తెల్లనివన్నీ పాలని, నల్లనివన్నీ నీళ్లని అనుకుంటే పొరపాటే! రంగు రంగుల లోకంలోనే రకరకాల రాకాసి జంతు ప్రవృత్తులు ఉంటాయి. జంతుతతి నుంచి మనిషి వేరుపడి సహస్రాబ్దాలు గడచిపోయాయి. అయినా, మనుషుల్లోని జంతుప్రవృత్తి పూర్తిగా తొలగిపోలేదు. కొన్ని సందర్భాల్లో జంతువుల కంటే క్రూరంగా, దారుణంగా ప్రవర్తించే మనుషుల ఉదంతాలు వార్తలకెక్కుతుండటం మనకు తెలియనిదేమీ కాదు.

ఆకుపచ్చని పచ్చికబయళ్లలో సుతిమెత్తని పచ్చిక మాత్రమే కాదు, విషపూరితమైన పసరిక పాములు కూడా ఉంటాయి. దట్టమైన అడవుల్లో పచ్చని చెట్లూ చేమలు, రంగు రంగుల పువ్వులూ పిట్టలూ పిచుకలూ, జంతువులూ మాత్రమే కాదు, ఏమరుపాటుగా దొరికితే మనుషులను ఫలారం చేసే క్రూరమృగాలు ఉంటాయి. కసిగా కాటు వేసే కాలసర్పాలు ఉంటాయి. కీకారణ్యాల్లో పొంచి ఉండే ప్రమాదాలన్నీ జనారణ్యంలోనూ ఉంటాయి. జనారణ్యంలో అడుగడుగునా తారసపడే చాలా మంది మనుషుల్లో జంతులక్షణాలు కనిపిస్తాయి. మనుషుల్లోని మేకపోతు గాంభీర్యాలు, గోడమీది పిల్లి వాలకాలు, గుంటనక్క తెలివితేటలు అపరిచితమైనవేమీ కాదు.

మనుషుల్లోని జంతులక్షణాలను గుర్తించడం వల్లనే విష్ణుశర్మ 'పంచతంత్రం' రాశాడు. జంతు పాత్రల ద్వారా మనుషుల స్వభావాలను తేటతెల్లం చేస్తూ కథలు చెప్పాడు. 'పంచతంత్రం' కథలు చిన్నపిల్లలకు కూడా తేలికగా అర్థమవుతాయి. ఆ తర్వాత చాలాకాలానికి జార్జ్ ఆర్వెల్ 'యానిమల్ ఫామ్' రాశాడు. ఇది కూడా దాదాపు 'పంచతంత్రం'లాంటి ప్రయోగమే! 'పంచతంత్రం' నాటికి, 'యానిమల్ ఫామ్' నాటికి సమాజం చాలా మారింది. 'యానిమల్ ఫామ్'లో దోపిడీ సమాజంలో నలిగిపోతున్న మనుషుల పరిస్థితిని, శ్రమదోపిడీలో నలిగిపోయేవారి స్వేచ్ఛాభిలాషను, వారి స్వేచ్ఛకు తూట్లు పొడిచే శక్తుల కుతంత్రాలను జంతుపాత్రల ద్వారా ఆర్వెల్ చెప్పాడు.

జంతువులను పాత్రలుగా చేసుకుని కథలు చెప్పడం 'పంచతంత్రం'తోనే మొదలు కాలేదు. 'పంచతంత్రం' దాదాపుగా క్రీస్తుశకం ఐదో శతాబ్ది నాటిది. అంతకు దాదాపు వెయ్యేళ్ల ముందే– క్రీస్తుపూర్వం ఆరో శతాబ్దికి చెందిన గ్రీకు బానిస ఈసప్ ఇలాంటి కథలనే ఎన్నో చెప్పాడు. ప్రాచీన రోమన్ సాహిత్యంలోని 'ఫెడ్రస్ కథలు', గ్రీకు సాహిత్యంలోని బాబ్రియస్ కథలు ఇలాంటివే! ఫ్రెంచ్ సాహిత్యంలోని 'లా ఫోంటేన్ ఫేబుల్స్' కూడా ఇలాంటివే!'లా ఫోంటేన్ ఫేబుల్స్' రచయిత జీన్ డి లా ఫోంటేన్ ప్రాచ్య, పాశ్చాత్య దేశాల్లో ప్రచారంలో ఉన్న జంతువుల పాత్రలు ప్రధానంగా ఉన్న కథలను సేకరించి, పదిహేడో శతాబ్దిలో ఈ కథల పుస్తకాలను పన్నెండు భాగాలుగా వెలువరించాడు.

జంతువులను ప్రధాన పాత్రలుగా చేసుకున్న ఈసప్ కథలు, పంచతంత్ర కథలు అనేక ప్రపంచ భాషల్లోకి అనువాదం పొందాయి. ఇవి ఈనాటికీ తాజాగానే ఉన్నాయి. ఇప్పటి సమాజంలో సంచరిస్తున్న మనుషుల స్వభావాలు పంచతంత్ర కథల్లోనూ, ఈసప్ కథల్లోనూ కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. మనుషుల స్వభావాలను జంతువులకు ఆపాదించి చెప్పడం సమస్త భాషల సాహిత్యంలోనూ ఒక పురాతన కళాత్మక పద్ధతి. ఓపిక ఉన్న రచయితలు కథలు చెప్పారు. అనుభవం ఉన్నవాళ్లు సామెతలను సృష్టించారు. మన పురాణాల్లోనూ జంతువులు, పక్షులు పాత్రలుగా ఉన్న పిట్ట కథలు కనిపిస్తాయి. బైబిల్‌లోనూ జంతువుల గురించిన సామెతలు ఉన్నాయి. 'సోమరీ! చీమల యొద్దకు వెళ్లుము. వాటి నడతలు కనిపెట్టి జ్ఞానము తెచ్చుకొనుము. వాటికి న్యాయాధిపతి లేకున్నను, పై విచారణకర్త లేకున్నను, అధిపతి లేకున్నను అవి వేసవి కాలమందు ఆహారము సిద్ధపరచుకొనును. కోత కాలమందు ధాన్యము కూర్చుకొనును'– ఇది బైబిల్ సామెతల గ్రంథంలోనిది. చీమను చూసి కష్టపడటం నేర్చుకోవాలని సోమరులకు చేసే హెచ్చరిక ఇది.

ప్రాచీన సాహిత్యంలో జంతుపాత్రలు ఉన్న కథలు, జంతువులపై ప్రాచుర్యంలో ఉన్న సామెతలు మానవ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి. యుక్తాయుక్త విచక్షణ జ్ఞానాన్ని పెంపొందిస్తాయి. ప్రవర్తన లోపాలను ఎత్తిచూపి, సుతిమెత్తని హెచ్చరికలు చేస్తాయి. వీటిని పూర్తిగా ఆకళింపు చేసుకుంటే చాలు, మనుషులు మనుషుల్లా తయారవడం కష్టమేమీ కాదు. వీటిని పిట్ట కథల్లా కొట్టిపారేసే అతితెలివిపరులు జంతువుల కంటే హీనంగా మిగులుతారు. కానికాలం దాపురించినప్పుడు దిక్కుతోచని గడ్డు పరిస్థితుల్లో చిక్కుకుని, నానా అవస్థలు పడతారు.

మహాభారతంలోని 'కాకి హంస'ల కథ ఒక చిన్న ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఒక రాజ్యంలో ధనికుడైన వర్తకుడు ఉండేవాడు. ప్రతిరోజూ ఒక కాకి అతడి పెరటి గోడ మీద వాలేది. వర్తకుడి పిల్లలు దానికి తమ ఎంగిళ్లు పెట్టేవారు. ఎంగిళ్లు తిన్న కాకి వారికి బాగా మాలిమి అయింది. ఎంగిళ్లు తిని తెగబలిసిన కాకి ఒకనాడు ఏకంగా హంసలతో పందేనికి తెగబడి, భంగపడింది.

ఈ కథను కురుక్షేత్రంలో శల్యుడు కర్ణుడికి చెప్పాడు. కర్ణుడికి కథలోని నీతి తలకెక్కలేదు. ఫలితం ఏమైందో మనకు తెలిసిందే! కొందరు ఇప్పటికీ ఎంగిళ్లు తిని బలిసిన కాకుల్లాగే ఎగిరెగిరి పడుతుంటారు. ఇలాంటి స్వభావం ఉన్నవాళ్లు రాజకీయ రంగంలోను, సాహితీ సాంస్కృతిక రంగాల్లోను, వివిధ రకాల వృత్తి ఉద్యోగాల్లోనూ ఉంటారు. ఎవరో పెట్టే ఎంగిలి మెతుకులు తిని బలిసి, విర్రవీగినంత కాలం కాకికి తన బలహీనత ఏమిటో ఎరుక పడనట్లే, ఇలాంటి స్వభావం ఉన్నవారికి ఎప్పటికీ ఈ కథల్లోని మర్మం అవగతం కాదు. మానవ సమాజంలో బతుకుతున్నా, వారు ఎప్పటికీ సంపూర్ణ మానవులు కాలేరు.

వివేచన హక్కుపై నిషేధమా?

కామెంట్



కరణ్ థాపర్

మంచేదో చెడేదో, తప్పేదో ఒప్పేదో, నైతికతేదో అనైతికమేదో మనకు మనం నిర్ణయించుకోగల మన సామర్థ్యమే నిస్సందేహంగా మనల్ని తక్కిన జంతువులకు భిన్నంగా ఉంచుతోంది. ఇతరులను మనం ప్రమాదంలోకి నెట్టనంత వరకు మనకున్న ఈ వివేచన హక్కు అభేద్యమైనది. అదే సమయంలో, మనపై విధించిన పూర్తిస్థాయి నిషేధం ఏదైనా... అది మనల్ని మనిషిగా తక్కువ చేసేస్తుంది. ప్రభుత్వం నిజాయితీగా కనుక ధూమపాన నిర్మూలన జరగాలని కోరుకుంటూ ఉంటే సృజనాత్మకమైన, చిరస్మరణీయ ప్రచారాన్ని చేపట్టాలి. పొగతాగే వారికి నచ్చజెప్పి ఆ అలవాటును మాన్పించటానికి అవకాశాలున్నాయి. కానీ దండనలతో మార్పు తేచ్చే ప్రయత్నాలు మాత్రం విఫలం అవుతాయి. బ్రిటన్‌లో గత ప్రభుత్వం ఇలాంటి నిష్ఫల ప్రయత్నమే చేసింది.

అప్పుడు నాకు 16 ఏళ్లు ఉంటాయి. కానీ, నిన్ననే జరిగినంతగా ఆ సంగతి గుర్తుండిపోయింది. వీకెండ్ కోసం స్టోవ్ (యూఎస్‌లోని వర్మాంట్ రాష్ట్రంలో ఒక పట్టణం) నుండి వచ్చాను నేను. అందరం కలిసి టీవీ చూస్తున్నాం. కిరణ్ సిగరెట్ తాగుతూ ఉంది. 'క్యారీ ఆన్' (ప్రసిద్ధ బ్రిటిష్ కామెడీ సిరీస్)లోని ఒక చిత్రాన్ని చూస్తూ ఉన్నప్పుడు సగం వరకూ రాగానే, మధ్యలో ఒక వాణిజ్య ప్రకటన మా దృష్టిని ఆకర్షించింది.

ఇద్దరు బ్రిటిష్ పోలీసు అధికారులు రోడ్డు పక్కన ఉన్న ఒక కేఫ్‌ను దాటి నడుచుకుంటూ వెళుతుండగా, వారి చూపు ఒక అందమైన యువతిపైన పడుతుంది. ఎడమ చేతిలో పొడవాటి సిగరెట్‌తో ఉన్న ఆమె కొద్ది కొద్దిగా కాఫీని సిప్ చేస్తుంటుంది.

''ఆమెను చూడు'' అని మొదటి పోలీస్ ఆఫీసర్ గుసగుసగా అంటాడు.

''సిగరెట్ తాగుతోంది కదా?'' అని రెండో ఆఫీసర్.

''ఆమె కాళ్లు నాకు నచ్చాయి.''

''అవి, కాలుతున్న ఆమె సిగరెట్ పొడవంత ఉన్నాయి.''

''ఆ పెదవులను ముద్దు పెట్టుకోవాలనిపిస్తోంది నాకు.''

''కంపు కట్టే యాష్‌ట్రేని ముద్దు పెట్టుకున్నట్లా?''

ఆ డైలాగ్ తర్వాత ఆ ఇద్దరు పోలీస్ ఆఫీసర్లు ముందుకు సాగిపోతారు. ఆ అందమైన యువతి స్క్రీన్ వైపు చూసి నవ్వుతుంది. విడివడిన ఆమె పెదవుల మధ్య పలువరుస నికోటిన్ మరకలతో పొగచూరి, గోధుమ వర్ణంలో ఉంటుంది!

'యాక్' అని అసంకల్పితంగా అరిచేశాను నేను. నా వెన్నులో వణుకు పుట్టింది. కిరణ్ అయితే తను తాగుతూ ఉన్న సిగరెట్‌ను అప్పటికప్పుడు విసిరి పారేసింది. ఆ వీకెండ్‌లో ఆమె మళ్లీ సిగరెట్ తాగినట్లు నాకు గుర్తు లేదు.

ఆ వాణిజ్య ప్రకటనకు రూపకర్తలు ఎవరో నాకు తెలియదు. ప్రభుత్వమే చెప్పి చేయించిందో, లేదా ఏదైనా ప్రైవేటు ట్రస్టు అందుకు నిధులు సమకూర్చిందో కానీ అది మాత్రం చాలా ప్రభావవంతంగా ఉంది. మన ప్రభుత్వం నిజాయతీగా కనుక ధూమపాన నిర్మూలన జరగాలని కోరుకుంటూ ఉంటే ఆ ప్రకటనలో ఉన్నట్లే సృజనాత్మకమైన, చిరస్మరణీయ ప్రచారాన్ని చేపట్టాలి. పొగతాగే వారికి నచ్చజెప్పి ఆ అలవాటును మాన్పించటానికైతే అవకాశాలున్నాయి. కానీ దండనలతో వారిలో మార్పు తేచ్చే ప్రయత్నాలు మాత్రం



విఫలం అవుతాయి. అందుకే ధూమపానాన్ని నిషేధించాలన్న నిర్ణయాలు ఘోరమైన తప్పిదాలుగా మిగులుతున్నాయి. బ్రిటన్‌లో గత ప్రభుత్వం ఇలాంటి నిష్ఫల ప్రయత్నమే చేసింది. మన ప్రభుత్వం అలా ఎప్పటికీ చేయదనే ఆశిస్తున్నాను.

మంచేదో చెడేదో, తప్పేదో ఒప్పేదో, నైతికతేదో అనైతికమేదో మనకు మనం నిర్ణయించుకోగల మన సామర్థ్యమే నిస్సందేహంగా మనల్ని తక్కిన జంతువులకు భిన్నంగా ఉంచుతోంది. ఇతరులను మనం ప్రమాదంలోకి నెట్టనంత వరకు మనకున్న ఈ వివేచన హక్కు అభేద్యమైనది. అది మన వ్యక్తిత్వాన్ని కూడా నిర్వచిస్తుంది. అదే సమయంలో, మనపై విధించిన పూర్తిస్థాయి నిషేధం ఏదైనా... మానవతలోని అత్యవసరతల్ని నిరాకరిస్తుంది. అది మనల్ని తక్కువ చేసేస్తుంది. సరైన నిర్ణయం తీసుకుంటారన్న నమ్మకం లేని పిల్లల్ని చూసినట్లుగా మనల్ని చూస్తుంది.

నిర్ణయించుకునే హక్కు నుండి మనం అవిభాజ్యంగా ఉండటం అన్న భావనతో ఇతరులు ఏకీభవించకపోవచ్చు. కానీ ఆ ఒకే ఒక్క కారణమే ఆ హక్కును నిలబెడుతుంది. మీకు భిన్నంగా ఉండటమనే నా హక్కులోనే నా వ్యక్తిత్వం ప్రతిఫలిస్తుంది. అంతేకాదు, నాలోని ఆ భిన్నత్వం మీకు నచ్చకపోయినా మీరు గౌరవించాలనే నేను కోరుకుంటాను.

పొగ తాగే విషయం కూడా ఇంతే. పొగ తాగకుండా ఉండేందుకు వెయ్యి మంచి కారణాలు ఉంటాయి. పొగ మాన్పించేందుకు నన్ను ఒప్పించటానికి పది లక్షల సానుకూల వాదనలు ఉంటాయి. కానీ అప్పటికి కూడా నేను పొగ తాగుతున్నానంటే మీరు నా మీద నిషేధం విధించకూడదు. నా ఇష్టాన్ని అడ్డుకోకూడదు.

మీరిలా నా మంచి కోసమే చేస్తున్నారన్న మీ వాదన విచిత్రమైనది, నమ్మశక్యం కానిది. పొగ తాగటం ఆరోగ్యానికి హానికరం అన్న దానిని నేను కాదనలేదు. నేనే కాదు, నాకు తెలిసిన ధూమపాన ప్రియులు ఎవరూ కూడా కాదనలేరు. అతిగా తినటం, మితిమీరిన వ్యాయామం, కళ్లకు ఒత్తిడి కలిగించుకోవటం, విపరీతంగా కోక్‌లు తాగటం... ఇవన్నీ కూడా హానికరం కాదని ఎవరూ అనరు. అయినప్పటికీ వీటిల్లో దేనినైనా నేను ఇష్టపడితే కనుక, అప్పుడు కూడా నేను మాత్రమే సలహాలను పట్టించుకోకుండా ముందుకు వెళ్లే విషయాన్ని నిర్ణయించుకోవాలి. దాని వల్ల నేను ఇబ్బంది పడితే అలాగే కానివ్వండి. ఎందుకంటే నిర్ణయించుకునే హక్కులోనే ఆ నిర్ణయం వల్ల బాధ పడే హక్కు కూడా కలిసి ఉంటుంది.

కాబట్టి ప్రభుత్వం ఎలా ప్రవర్తించాలి? సమాధానం చాలా సరళమైనది, సూటియైనది. నిషేధం విధించటం కాకుండా ఎవరికి వారు సిగరెట్‌కు దూరమయ్యేలా ప్రభావం చూపే చర్యలు తీసుకోవాలి. సిగరెట్ ప్యాకెట్‌ల మీద అతి పెద్ద, అత్యంత భయానకమైన ఆరోగ్య హెచ్చరికలను చేయవచ్చు. పన్నులను తరచుగా పెంచుతూ ఉండొచ్చు. (దీని వల్ల ఒక దశ తర్వాత ప్రభుత్వానికి రాబడి తగ్గవచ్చు లేదా ప్రతికూల ఉత్పాదకత సంభవించవచ్చు). ధూమపానానికి వ్యతిరేకంగా విస్తృత ప్రచారాన్ని చేపట్టేందుకు నిధులను అందజేయవచ్చు. ఈ మూడింటినీ నేను సమర్థిస్తాను. అంతేతప్ప ఎప్పుడూ కూడా ధూమపాన నిషేధానికి ప్రయత్నించకూడదు. వ్యక్తులు, సమూహాలు తాము కోరుకున్నప్పుడే తమకై తాము ఆ పనికి సంకల్పించటం జరుగుతుంది. వారి కోసం ప్రభుత్వమే ఆ పని చెయ్యకూడదు.

మరింత స్పష్టంగా చెబుతాను. మంచి ప్రభుత్వాలు – పెద్దలు పిల్లల్లో పరిణతి తెచ్చే విధంగా – తమకు తాముగా నిర్ణయించుకునే అవకాశాన్ని, అవకాశంతో పాటుగా వచ్చే బాధ్యతను స్వీకరించే సమర్థతను తమ పౌరులకు అందిస్తాయి. ఆ విధంగా దేశం తన కాళ్ల మీద ఎలా నిలబడాలో నేర్చుకుంటుంది. ఇందుకు భిన్నంగా చెడు ప్రభుత్వాలు పెద్దల్ని కూడా పిల్లలుగా పరిగణిస్తూ వారికున్న నిర్ణయ అధికారాన్ని లాగేసుకుని తమ సొంత నిర్ణయాలను వారిపై అమలు చేస్తాయి. అలా దేశాలు కూలిపోవటం మొదలవుతుంది.

అన్నట్లు, నేను పొగ తాగటం మానేసి చాలాకాలమే అయ్యింది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇంత మర్యాదా?



నెదర్లాండ్స్‌లో నేను ఎదుర్కొన్న పెద్ద కల్చర్ షాక్ ఏంటంటే, మనం రోడ్డు దాటేవరకూ కార్లు నిజంగా ఆగి, ఓపిగ్గా వేచివుంటాయి. నేనొచ్చి నెల రోజులైంది, నాకు ఇంకా అది అలవాటు కాలేదు. నా మనసు ఇంకా సందేహిస్తూనే ఉంది.

– రాధికా రాయ్, న్యాయవాది

వెళ్దాం పశ్చిమానికి!



సహ్యాద్రి పర్వతాలంత ప్రాచీనమైన, అందమైన, ప్రశాంతమైన ప్రదేశం భారత్‌లో ఇంకోటి ఉండదు. దేశంలో విస్తారంగా పర్యటించిన వాడిగా, ఈ మాటను ఒక స్థాయి ఆత్మవిశ్వాసంతో చెప్పగలను. ఏ సమయంలోనైనా ఏ కారణం లేకుండా నేను వెళ్లగలిగే ప్రదేశం ఏదైనా ఉందీ అంటే అది పశ్చిమ కనుమలు (సహ్యాద్రి).

– శుభేందు, సుప్రీంకోర్టు న్యాయవాది

రక్షక రాజ్యం



ఎల్ సాల్వడార్ (మధ్య అమెరికాలోని దేశం) పూర్తి అసలైన పేరు 'ప్రొవిన్సియా దె న్యూస్ట్రో సెనోర్ జేసుక్రిస్తో ఎల్ సాల్వడార్ దెయి మూందో'. అంటే 'ప్రపంచ రక్షకుడైన మా ప్రభువు జీసస్ క్రైస్ట్ రాజ్యం' అని అర్థం. తర్వాత దాన్ని 'ఎల్ సాల్వడార్'గా కుదించారు. అంటే 'రక్షకుడు' అని!

– నాయిబ్ బుకేలే, ఎల్ సాల్వడార్ అధ్యక్షుడు

అర్థాలే వేరులే!



ఇండియాలో శుద్ధ శాకాహారం అంటే, బ్రాహ్మణీయ పురుషాధిపత్య వైఖరి. అదే ఇతర దేశాల్లో శుద్ధ శాకాహారం అంటే, ఒక ఉత్సాహభరిత ఆరోగ్య స్పృహతో కూడిన ధోరణి.

– మిస్టర్ సిన్హా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

పుట్టుకతో వృద్ధులా?



ఇది నా వ్యక్తిగత అభిప్రాయమే కావచ్చు– కానీ నేను పిల్లాడిగా ఉన్నప్పుడు ఇరవైల్లో ఉన్నవాళ్లకన్నా, ఇప్పటి ఇరవైలవాళ్లు మరింత పెద్దవాళ్లలా కనబడుతున్నారు. ఆశ్చర్యం!

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

ఎవరైనా కన్నేశారా?



జర్మనీలో 1935లో రూపొందించి వాడిన స్లోగన్ – ఎన్ ఫోక్, ఎన్ రీక్, ఎన్ ఫ్యూరర్. దానర్థం – ఒక ప్రజ, ఒక సామ్రాజ్యం, ఒక నాయకుడు.

– అతుల్ కులకర్ణి, నటుడు

అంతటా అంతే!



ఆఫ్రికాలో మాత్రమే నిరుపేదరికం మధ్యలో అత్యంత ధనికులైన రాజకీయ నాయకులు కనబడుతుంటారు.

– అడేమోలా, ప్యాన్–ఆఫ్రికనిస్ట్

ఆ హృదయ పరివర్తన ఏది?

కళింగ యుద్ధం (క్రీ.పూ. 261) అశోకుడి జీవితాన్ని మార్చివేసింది. ఆ యుద్ధం అనంతరం దండయాత్రలకు బదులు దమ్మయాత్రలు చేశాడు. తన కుమారుడు 'మహేంద్రుడు', కుమార్తె 'సంఘమిత్ర'లను సైతం బౌద్ధదమ్మ ప్రచారం కోసం శ్రీలంకకు, ఇతర దేశాలకు పంపాడు. ఆ విధంగా యుద్ధం ఒక సమ్రాట్ హృదయంలో పరివర్తన తెచ్చి శాంతి, అహింసల వ్యాప్తికి కారణమయ్యింది. ప్రపంచంలో ఇప్పుడు అత్యధికంగా ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోంది. కొన్ని చోట్ల నియంతృత్వంతో సహా అనేక ఇజాల పేరుతో పాలకులు పాలిస్తున్నారు. కానీ వీళ్లలో యుద్ధం ఏమాత్రం పరివర్తనను తీసుకురావడం లేదు. ప్రపంచ యుద్ధాలు వచ్చి మొత్తం ప్రజానీకం అతలాకుతలమైనా వీరికి కనువిప్పు కలగడం లేదు.

కొన్ని వర్గాలు (దేశాలు) తమ ఆధిపత్య భావజాలాన్ని, మత భావజాలాన్ని, సిద్ధాంత పరమైన భావజాలాన్ని ఇతర వర్గాలపై బలవంతంగా రుద్దటం మూలంగా అనేకసార్లు ఆత్మ గౌరవ పోరాటాలు తలెత్తుతున్నాయి. అవే పెద్ద యుద్ధాలుగా పరిణమిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా, రష్యా వంటి అభివృద్ధి చెందిన దేశాలు ఇటువంటి యుద్ధాలకు కారణమవుతున్నాయని చెప్పాలి. అఫ్గానిస్తాన్ ప్రజల జీవితాన్ని కుక్కలు చింపిన విస్తరి చేసిన వ్యవహారంలో ఈ రెండు దేశాలూ కీలకమైనవే. సోవియట్ రష్యా పతనం తర్వాత అమెరికా పూర్తి ఆధిపత్యం చలాయించింది. చివరికి మతఛాందస మూకలకు అఫ్గాన్ ప్రజల బతుకులను వదిలి వెళ్లిపోయింది అమెరికా.



అంతకు ముందు ఇరాక్‌లో అమెరికా చేసిన దురాగతం తక్కువదేమీ కాదు. ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ తన మాట వినడంలేదని కక్షకట్టింది అమెరికా. ఆయన్ని అంతమొందించడానికి... 'ఇరాక్ జీవ రసాయన ఆయుధాలను తయారు చేస్తున్నద'నే ఆరోపణ మోపింది. ఆ నెపంతో ఇరాక్‌పై యుద్ధం ప్రకటించి ఇరాక్‌ను సర్వనాశనం చేసి సద్దాంను పట్టుకుని ఉరితీయించింది.

రష్యా– ఉక్రెయిన్ యుద్ధం గత రెండు సంవత్సరాలుగా జరుగుతూనే ఉంది. రెండు దేశాల మధ్య ఆస్తి నష్టం, ప్రాణ నష్టం అపారంగా చోటుచేసుకుంది. అదేవిధంగా గత సంవత్సరం అక్టోబర్ 7న ప్రారంభమైన హమాస్ – ఇజ్రాయెల్ యుద్ధం క్రమంగా తన పరిధిని పెంచుకుంటోంది. తాజాగా ఇజ్రాయెల్ తన యుద్ధాన్ని లెబనాన్ దేశానికి విస్తరించింది. గత సంవత్సర కాలంగా జరుగుతున్న యుద్ధంలో వేలాది మంది చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు మరణించారు. వారు ఎవరు కూడా ఇజ్రాయిల్‌పై బాంబులో, క్షిపణులో ప్రయోగించిన వారు కాదు.

ఇప్పటివరకు జరిగిన యుద్ధాల్లో ఏ కొన్నో తప్ప మిగతావన్నీ అగ్రదేశాల ఆయుధ వ్యాపారంలో పావులుగా ఉపయోగపడ్డవే అనడం అతిశయోక్తి కాదు. ఒకపక్క ఆయుధాలు విక్రయిస్తూ... మరో పక్క ప్రపంచ శాంతి అంటూ నీతి వాక్యాలు వల్లె వేస్తున్న అగ్రదేశాల వలలో అనివార్యంగా చిక్కుకుంటున్నాయి వర్ధమాన దేశాలు. అందుకే ప్రపంచంలో నిరంతరం ఏదో ఒక మూల యుద్ధం జరుగుతూనే ఉంది. అంటే యుద్ధం ఇంకా మిగిలే వుంది!

– డాక్టర్ మహ్మద్ హసన్, రాజనీతి విశ్లేషకులు

(నేటితో హమాస్ – ఇజ్రాయెల్ యుద్ధానికి ఏడాది పూర్తి.)

అందరికీ ఆవాసం ఎప్పటికో?

సందర్భం



వేద కుమార్ మణికొండ

అందరికీ ఆహారం, దుస్తులు, ఆవాసం... ఈ నినాదం ఇప్పటిది కాదు. మనిషి పుట్టిన నాటి నుంచీ ఈ మూడు సమస్యలే కీలకంగా ఉంటున్నాయి. నేటికీ అన్ని దేశాలనూ పట్టి పీడిస్తున్నాయి. నిజానికి ఆహారం, దుస్తుల కన్నా కూడా ఆవాసమే ప్రధాన సమస్యగా మారుతోంది. మరీ ముఖ్యంగా నగరాల్లో ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొనే ఐక్యరాజ్య సమితి ప్రతీ సంవత్సరం అక్టోబర్ మొదటి సోమవారాన్ని ప్రపంచ నివాస దినోత్సవంగా గుర్తించింది. ఈ ఏడాది 'ఎంగేజింగ్ యూత్ టు క్రియేట్ ఎ బెటర్ అర్బన్ ఫ్యూచర్' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. తగినంత షెల్టర్ ఉండటం అనేది మనిషికి కనీస హక్కు. ఈ కనీస హక్కును గుర్తించకుంటే నగరాలు నరక కూపాలవుతాయి. నేడు నగరాలు ఎదుర్కొంటున్న మరెన్నో సమస్యలు కూడా ఈ సమస్యతోనే ముడిపడినవే. హైదరాబాద్ నగరాన్నే ఉదాహరణగా తీసుకుంటే 'హైడ్రా' రూపకల్పనకు ప్రాణం పోసింది ఈ సమస్యే.

హైదరాబాద్ నగరం ఇప్పుడు ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. చెరువులు, కుంటలు, కాలువలు, నదీ తీరం ఆక్రమణలకు గురయ్యాయి. దాంతో నగరం వరదలతో సహా మరెన్నో సమస్యల్లో చిక్కుకుపోయింది. అలా అని ఆక్రమణలను తొలగిస్తే ఇతర రకాల సమస్యలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మరింత సుస్థిరదాయకమైన పట్టణ పరిసరత్వం కోసం హైదరాబాద్ యువతకు భాగస్వామ్యం కల్పించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

హైదరాబాద్‌లో యువ జనాభా అధికంగా ఉంది. జనాభాలో అధిక శాతం 30 ఏళ్ల లోపు ఉన్నవారే. ఈ యువత అంతా టెక్ శావీ మాత్రమే కాదు, సామాజిక అంశాలపై ఆసక్తి కలవారు కూడా ఎంతో మంది ఉన్నారు. ఇలాంటి యువత వినూత్న పరిష్కారాలను అందించే శక్తి సామర్థ్యాలను కలిగి ఉంది. పట్టణ సుస్థిరదాయకత విధానాల పట్ల వీరికి అంకిత భావం కూడా ఉంది. సుస్థిరదాయకతను ముందుకు తీసుకెళ్లడంలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తాయి. సమగ్ర పర్యావరణ అధ్యయనాలను కూడా కరిక్యులమ్‌లో భాగం చేయాల్సిన సందర్భం వచ్చింది. సుస్థిరదాయక విధానాల పట్ల విద్యార్థులు మొగ్గు చూపేలా చేసేందుకు వర్క్ షాప్స్ నిర్వహించాలి. భవిష్యత్‌లో సుస్థిరదాయక విధానాలను పాటించేందుకు అవసరమైన అవగాహనను వారికి కల్పించాల్సి ఉంటుంది.



నగరాలను కాపాడేందుకు చేస్తున్న ఏ ప్రయత్నమైనా ఇంటి నుంచే మొదలుకావాలి. నీరు పల్లమెరుగు అని సామెత. అలాంటి పల్లాలు ఎక్కడ ఉన్నాయో తెలిసేది స్థానికులకే. అందుకే నీళ్ల ప్రవహించే మార్గాలను కాపాడుకునే బాధ్యతను కూడా స్థానికులే స్వీకరించాలి. ఒకటి, రెండు అక్రమ నిర్మాణాలే కదా అని ఊరకుంటే... స్థానికంగా మరెంతో మంది ఇక్కట్ల పాలు కావాల్సి వస్తుంది. అదే సమయంలో నిజమైన బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు కూడా ముందుకు రావాలి.

నేటి సాంకేతికతలు సుస్థిరదాయకతకు తోడ్పడుతున్నాయి. గూగుల్ చిత్రాల లాంటి వాటిని పరిశీలించడం ద్వారా అక్రమ నిర్మాణాలను అడ్డుకోవచ్చు. ఒక్కసారిగా ఈ నిర్మాణాల తొలగింపు సాధ్యం కాకపోవచ్చు. పునరావాస కార్యక్రమాలు చేపడుతూ, తొలగింపు కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంటుంది. హైడ్రా కావచ్చు, లేదంటే, మూసీ సంబంధిత ప్రాజెక్టులు కావచ్చు... ఏదైనా కూడా రాజకీయాలకు అతీతంగా కొనసాగాలి. వివిధ రంగాల నిపుణులు, పార్టీలతో కలసి సమావేశాలు నిర్వహించి అనుసరించాల్సిన విధానాలపై ఏకాభిప్రాయానికి రావాలి. తరువాతి కాలంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా సుస్థిరదాయక విధానాలను కొనసాగించాలి. నిర్వాసితుల సమస్య తీవ్రమైనదే. కాకపోతే... కఠిన చర్యలు తీసుకోకుంటే వరదలు, ముంపు కారణంగా మరెంతో మంది నిర్వాసితులుగా మారే ప్రమాదం ఉందనే అంశాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి.

తెలంగాణకు మాత్రమే కాకుండా, యావత్ దేశ ఆర్థిక వృద్ధి చోదకశక్తుల్లో ఒకటిగా మారే సామర్థ్యం హైదరాబాద్‌కు ఉంది. ఆ దిశలో పరుగులు తీయాలంటే ఆవాసాల కల్పన అంశం కూడా కీలకమే. జంట నగరాల స్థానంలో ట్రై-సిటీ వచ్చింది. తాజాగా ఫోర్త్-సిటీ కూడా రాబోతోంది. శరవేగంగా కొనసాగుతున్న పట్టణీకరణ మరెన్నో సమస్యలను తెస్తోంది. ఇళ్ల కొరత వేధిస్తోంది. అది మురికివాడలకు దారి తీస్తోంది.

ఒక అంచనా ప్రకారం హైదరాబాద్ జనాభాలో 30% మురికివాడల్లో నివసిస్తోంది. ట్రాఫిక్ చిక్కులు నానాటికీ అధికమైపోతున్నాయి. కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంటోంది. ఈ తరహా సమస్యలకు పరిష్కారం అందుబాటు ధరల్లో ఇళ్ల నిర్మాణం.

మహానగరంలో తనకంటూ ఓ చిన్న గూడు ఉండాలని కోరుకునే కుటుంబాలు అధికమైపోతున్నాయి. వాటి కలలను నెరవేర్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలి. తగినంత స్థోమత లేని వారి కోసం ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలి. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఈ దిశలో ఓ ఆశాకిరణంలా కనిపించాయి. వీటికి ప్రజల్లో కూడా ఆదరణ బాగానే ఉంటోంది. ప్రస్తుతానికి ఇవి పేదలకు ఉచితంగా లభిస్తున్నాయి. అయితే అదే సమ యంలో అల్పాదాయ, దిగువ మధ్యతరగతి ప్రజల అవసరాలను తీర్చేందుకు కూడా ప్రభుత్వం ముందుకు రావాలి. వారి కోసం ప్రత్యేక ఇళ్ల సదుపాయాలను నిర్మించడం లేదా ప్లాట్లను విక్రయించడం చేయాలి. తమ పేరు మీద ఇప్పటికే రాష్ట్రంలో మరెక్కడా ఒక్క ఇల్లు కూడా లేని కుటుంబాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి.

అందరికీ ఆవాసాలు కల్పించే సందర్భంగా సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. అది లేకుండా ఆవాసాలు ఏర్పాటు చేస్తే... కొత్తగా మరెన్నో సమస్యలు వస్తాయి. ఇళ్లు నిర్మించే ప్రక్రియలో డెవలపర్లకు భాగస్వామ్యం కల్పించాలి. వారికి పన్ను మినహాయింపులు, సబ్సిడీలు ఇవ్వాలి. ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యాన్ని అధికం చేయాలి. మాడ్యులర్, ప్రి-ఫ్యాబ్రికేటెడ్ హౌసింగ్‌లో వచ్చిన మార్పులను అందిపుచ్చుకుంటూ నిర్మాణ వ్యయాలు తగ్గేలా చూడాలి. తక్కువ సమయంలోనే ఎక్కువ మందికి ఆవాసాలు కల్పించేందుకు ఇది వీలు కల్పిస్తుంది.

అదే సమయంలో నిర్మాణాలన్నీ పర్యావరణ స్నేహపూర్వకంగా ఉండేలా జాగ్రత్త వహించాలి. సౌర శక్తి వినియోగాన్ని, వాన నీటి సంరక్షణను, సమర్థమైన వ్యర్థాల నిర్వహణను కూడా ఈ కార్యక్రమంలో మిళితం చేయాలి. ఫైనాన్స్ సదు పాయాలను మెరుగుపర్చాలి. అల్పాదాయ వర్గాల వారికి ప్రభుత్వ బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీ రుణాలు అందించాలి. ఎలాంటి విధానాలను అనుసరించినా సరైన పరిశీలన, నియంత్రణ, ఫీడ్ బ్యాక్ ఉండేలా చూసుకోవాలి. అవసరాలకు అనుగుణంగా మార్పు చేర్పులతో ముందుకెళ్తుండాలి.

వ్యాసకర్త అర్బన్ – రీజినల్ ప్లానర్, హైదరాబాద్ | 98480 44713

(నేడు ప్రపంచ నివాస దినోత్సవం)

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.చవితి ఉ.5.56 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** అనూరాధ రా.11.42 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** తె.5.36 నుండి 7.16 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.13 నుండి 1.01 వరకు, తదుపరి ప.2.36 నుండి 3.24 వరకు, **అమృతఘడియలు:** ప.12.28 నుండి 2.11 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.54, **సూర్యాస్తమయం:** 5.43.

'ఫసల్ బీమా'లో కొత్త పద్ధతి!

ప్రీమియం కంటే పరిహారం ఎక్కువైతే కంపెనీకి అదనపు చెల్లింపు

ఒకవేళ పరిహారం కంటే ప్రీమియం సొమ్ము ఎక్కువైతే సర్కారుకు కంపెనీ చెల్లింపు

కసరత్తు చేస్తున్న తెలంగాణ వ్యవసాయశాఖ

మధ్యప్రదేశ్‌లో అమలవుతున్న పథకంపై అధికారుల అధ్యయనం

→ ఓ ఉన్నతాధికారి లెక్క ప్రకారం ఉదాహరణకు ప్రభుత్వం రైతుల తరఫున బీమా కంపెనీకి కోటి రూపాయల ప్రీమియం చెల్లించిందనుకుందాం. ఒక సీజన్‌లో పంటల నష్టం వల్ల రైతులకు బీమా కంపెనీ రూ. 1.20 కోట్లు చెల్లిస్తే...కంపెనీకి రూ. 20 లక్షల నష్టం వచ్చినట్టు లెక్క. అప్పుడు ప్రభుత్వం రూ. 40 లక్షలు చెల్లించి... ఆ కంపెనీకి రూ. 20 లక్షలు లాభం జరిగేలా చూస్తుంది.

→ అలా కాకుండా అదే కోటి ప్రీమియం ప్రకారం చూసుకుంటే... పంట నష్టం జరిగి రైతులకు కంపెనీ రూ. 60 లక్షలు చెల్లిస్తే... అప్పుడు ప్రభుత్వానికి రూ.40 లక్షలు నష్టం జరిగినట్టు లేదా అదనంగా కంపెనీకి 40 శాతం ఎక్కువ ప్రీమియం సొమ్ము చెల్లించినట్టు లెక్క. అప్పుడు ప్రభుత్వానికి అంతగా నష్టం జరగకుండా కంపెనీ రూ.20 లక్షలు ఇచ్చి కొంత వెసులుబాటు ఇస్తుంది. అయితే దీనిపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని అధికారులు అంటున్నారు.

సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకానికి సంబంధించి కొత్త పద్ధతిని అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ప్రీమియం సొమ్ము కంటే పరిహారపు సొమ్ము రైతులకు ఎక్కువగా చెల్లించే పరిస్థితి నెలకొంటే, బీమా కంపెనీకి నష్టం రాకుండా నిర్ణీత మొత్తంలో ప్రభుత్వం చెల్లించాలని యోచిస్తోంది. పరిహారపు సొమ్ము కంటే ప్రీమియం ఎక్కువెక్కువగా ఉంటే ముందనుకున్న లెక్క ప్రకారం నిర్ణీత మొత్తం ప్రభుత్వానికి కంపెనీ చెల్లించేలా, అటు వ్యవసాయ బీమా కంపెనీకి, ఇటు ప్రభుత్వానికి ఏ మాత్రం నష్టం జరగకుండా ఈ పథకాన్ని తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. ఇప్పటివరకు అనేక సందర్భాల్లో ప్రీమియం ఎక్కువ చెల్లించగా, క్లెయిమ్స్ మాత్రం చాలా తక్కువగా ఉండేవి. ఇలా కంపెనీలు తెలంగాణ నుంచి రూ. వందల కోట్ల లాభాలు పొందాయి. దీంతో గత ప్రభుత్వం ఈ పథకం నుంచి బయటకొచ్చిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో కొత్త పద్ధతి ప్రకారం అటు రైతులకు, ఇటు ప్రభుత్వానికి, మరోవైపు కంపెనీలకు కూడా నష్టం జరగకుండా ఉంటుందని వ్యవసాయశాఖ వర్గాలు అంటున్నాయి.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బీమా పథకం అమలు

పంటల బీమా పథకంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఇప్పటికే ఈ పద్ధతిలో పంటల బీమాను అమలు చేస్తున్న మధ్యప్రదేశ్‌ను అనుసరించాలని యోచిస్తోంది. ఈ మేరకు ఆ రాష్ట్రంలో ఇటీవల వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి పర్యటించి.. అక్కడ అమలవుతున్న పంటల బీమాను అధ్యయనం చేశారు. బీమా అమలు చేస్తున్న కంపెనీలతోనూ చర్చించారు. ఏఐ పరిజ్ఞానంతో పంట నష్టాన్ని అత్యంత సక్రమంగా అంచనా వేయొచ్చని అంటున్నారు. ప్రస్తుతం మాన్యువల్ పద్ధతిలో నష్టాన్ని అంచనా వేస్తుండగా, పారదర్శకంగా ఉండటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒకవైపు మాన్యువల్‌గానూ... మరోవైపు ఏఐ ద్వారానూ పంటల నష్టాన్ని అంచనా వేయాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఆ ప్రకారం నష్టాన్ని అంచనా వేస్తే, నష్టపోయిన పంటలకు బీమా కంపెనీలు పరిహారం ఇస్తాయని వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి.



సింగిల్ రైతుకూ పరిహారం ఇచ్చేలా...!

జీవిత బీమాలో వ్యక్తులకు ఏదైనా ప్రమాదం జరిగితే పరిహారం ఎలా వస్తుందో...పంట నష్టం జరిగిన సింగిల్ రైతుకు కూడా పరిహారం ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. అంటే రైతు యూనిట్‌గా రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని అమలు చేస్తారు. గతంలో అమలు చేసినప్పుడు గ్రామం లేదా మండలం యూనిట్‌గా వివిధ రకాలుగా పంటలను బట్టి పథకం ఉండేది. అంతేగాక సంబంధిత యూనిట్‌లో ఉన్న వ్యవసాయ పంటల్లో 33 శాతం దెబ్బతింటేనే బీమా పథకం వచ్చేది. అంటే వందెకరాలుంటే... 33 ఎకరాలు దెబ్బతింటేనే పథకం కింద రైతులకు పరిహారం అమలు చేసేవారు. కానీ ఇప్పుడు ఒక ఎకరా, అరెకరా ఉన్న ఒక్క రైతుకు కూడా పరిహారం అందుతుంది. అయితే ఈ వెసులుబాటును అమలుచేయాలంటే బీమా కంపెనీలు ఎక్కువ ప్రీమియం వసూలు చేస్తాయని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. కాగా, రాష్ట్రంలో దాదాపు 70 లక్షల మంది రైతులు ఉన్నారు. గతంలో పంటల బీమా పథకాలు అమల్లో ఉన్నప్పుడు సుమారు 8 లక్షల నుంచి 10 లక్షల మంది పంటల బీమా చేయించేవారు. ఇప్పుడు బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయించింది. దీనివల్ల బీమా పరిధిలోకి వచ్చే రైతుల సంఖ్య 50 లక్షలు ఉంటుందని వ్యవసాయశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రీమియం కూడా రూ. 2,500 కోట్ల మేరకు చెల్లించాల్సి వస్తుందని చెబుతున్నారు.

సీసీఎస్‌ను ఆశ్రయించిన ఏడో నిజాం మనవరాలు

కోర్టు ద్వారా ఫిర్యాదు చేసిన ఫాతిమా ఫౌజియా

తన పేరిట నకిలీ జీపీఏతో ముగ్గురు వ్యక్తులు వారసత్వ సర్టిఫికెట్ పొందారని ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: నిజాం ఆస్తులకు సంబంధించిన ఓ వివాదం హైదరాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్)కు చేరింది. తన పేరిట ముగ్గురు వ్యక్తులు నకిలీ జీపీఏ సృష్టించి కోర్టు ద్వారా వారసత్వ సర్టిఫికెట్ పొందారని ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్ మనవరాలు ఫాతిమా ఫౌజియా సీసీఎస్‌లో క్రిమినల్ ఫిర్యాదు చేశారు. ఏడో నిజాం రెండో కుమారుడైన వాలాషాన్ ప్రిన్సెస్ మౌజ్జమ్ ఝా బహదూర్ కుమార్తె ఆమె. తొలుత నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే వాళ్లు కేసు నమోదు చేయకపోవడంతో హైదరాబాద్‌లోని అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు చేశారు. స్పందించిన న్యాయస్థానం.. కేసు నమోదు చేయాలని సీసీఎస్‌ను ఆదేశించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

వారసత్వ సర్టిఫికెట్‌ను రద్దు చేయాలి..: 'బషీర్‌బాగ్‌కు చెందిన మిలాద్ అలీ ఖాన్, నాంపల్లికి చెందిన సాజిద్ అలీఖాన్, బంజారాహిల్స్‌కు చెందిన మీర్ మిర్జా అలీఖాన్ ఉమ్మడిగా ఏడో నిజాంకు సంబంధించిన ఆస్తులకు వారసులమని.. నా పేరిట నకిలీ జీపీఏతో 2016లో కోర్టును ఆశ్రయించారు. కోర్టు ద్వారా వారసత్వ సర్టిఫికెట్ పొందారు. అనంతరం నా ఆస్తిలోనూ వాటా ఉందంటూ కోర్టులో పిటిషన్ వేశారు. అలాగే తమిళనాడులోని నీలగిరి, ఊటీల్లో ఉన్న దాదాపు రూ. 121 కోట్ల విలువైన ఏడో నిజాం ఎస్టేట్స్‌లో వాటా పంచాలని కోర్టుకెక్కారు. నా తండ్రి, సోదరుడి నుంచి నాకు సంక్రమించిన 36 శాతం ఆస్తుల వాటాను తక్కువగా చూపించడంతోపాటు పూర్తిగా ఎస్టేట్‌ను కాజేసేందుకు కుట్ర చేస్తున్నారు'అని ఫాతిమా కోర్టులో వేసిన ప్రైవేటు ఫిర్యాదులో ఆరోపించారు. నిందితులు పొందిన వారసత్వ సర్టిఫికెట్ బోగస్ అని, దాన్ని రద్దు చేయాలని కోరారు.

పిడుగుపాటుకు యువతీ యువకుడు మృతి

- విద్యుత్ సౌకర్యం లేక టార్చ్‌లైట్ వెలుతురులో పోస్టుమార్టం.. హనుమకొండ జిల్లాలో ఘటన



టార్చ్ లైట్ వెలుతురులో పోస్టుమార్టం చేస్తున్న వైద్యులు

ఐనవోలు/వర్ధన్నపేట: వ్యవసాయ భూముల్లో పనులు చేస్తుండగా పిడుగుపడి యువతీ యువకుడు మృతి చెందారు. కాగా, విద్యుత్ సౌకర్యం లేక టార్చ్‌లైట్ వెలుతురులోనే శవపరీక్ష చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన దౌతుబాజి శ్రీనివాస్, దౌతుబాజి విజయ, రాధాబాయి, ఇందిర, కోమల, శ్రావణి, రాజు ఆదివారం పొలాల్లో పనులు చేస్తున్నారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఉరుములు మెరుపులతో భారీ వర్షం ప్రారంభమైంది. దీంతో అందరూ సమీపంలోని రేకుల షెడ్డులోకి వెళ్లారు. అదే సమయంలో పిడుగు పడింది. పిడుగు ధాటికి షెడ్డులో ఉన్న ఏడుగురూ కింద పడిపోయారు. తేరుకుని లేచి చూడగా ఇందిర కుమార్తె శ్రావణి (17), కూకట్ల కోమల కుమారుడు రాజు (24) మృతిచెంది ఉన్నారు. ఈ ఘటనలో కోమలతోపాటు మిగతా నలుగురు అస్వస్థతకు గురయ్యారు. జఫర్‌గఢ్ ఎస్సై రాంచరణ్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టార్చ్‌లైట్ వెలుతురులో శవపరీక్ష

ఇదిలా ఉండగా శ్రావణి, రాజు మృతదేహాలకు వర్ధన్నపేట శ్మశానవాటికలోని పోస్టుమార్టం గదిలో విద్యుత్ సౌకర్యం లేక టార్చ్‌లైట్ వెలుతురులోనే శవపరీక్ష చేశారు. వెంకటాపురం గ్రామం జఫర్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండడంతో వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాలను తీసుకురాగా శ్మశానవాటికలోని పోస్టుమార్టం గదికి తరలించారు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో వైద్యులు అక్కడికి చేరేసరికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో టార్చ్‌లైట్ల సహాయంతో రెండు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. అక్కడ కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడంతో మృతుల కుటుంబ సభ్యులు ఇబ్బంది పడ్డారు. అక్కడ విద్యుత్ మీటరు లేకపోవడంతో విద్యుత్ సరఫరాను నిలిపి వేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు చెబుతుంటే.. పోస్టుమార్టం గది నిర్మించి ఇచ్చాం, మిగతా విషయాలకు ఆస్పత్రి వారిదే బాధ్యత అని మున్సిపల్ శాఖ చేతులు దులిపేసుకున్నట్టు సమాచారం.

9న సీఎం చేతుల మీదుగా ఉపాధ్యాయ నియామక పత్రాలు

సీఎస్ శాంతికుమారి వెల్లడి



హైదరాబాద్: ఈనెల 9 తేదీన హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు సీఎం ఎ.రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. 9వ తేదీన సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో ఆదివారం సీఎస్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, దాదాపు పదివేలకు పైగా ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈ నియామక పత్రాలను జారీచేస్తున్నట్టు తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు సంబంధించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను సంబంధిత జిల్లా కలెక్టర్లు పూర్తి చేశారని, సోమవారం సాయంత్రంలోగా తుది జాబితాను పాఠశాల విద్యా కమిషనర్ సంబంధిత జిల్లా కలెక్టర్లకు అందజేస్తారని తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులందరూ తొమ్మిదవ తేదీన మధ్యాహ్నం రెండు గంటలలోపే ఎల్.బి.స్టేడియానికి చేరేలా తగు ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. వారిని హైదరాబాద్‌కు చేరవేయడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి బస్సులో ఒక పోలీస్ కానిస్టేబుల్, సమన్వయ అధికారిని నియమించాలని సూచించారు.

అబార్షన్ చేస్తుండగా గర్భిణి మృతి

వైద్యురాలి నిర్లక్ష్యమేనని కుటుంబసభ్యుల ఆరోపణ

తాండూరు టౌన్: అబార్షన్ చేస్తుండగా ఓ గర్భిణి మృతి చెందగా.. దానికి వైద్యురాలి నిర్లక్ష్యమే కారణమంటూ మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలివి. కోస్గి మండలం కొత్తపల్లికి చెందిన రమేశ్‌తో తాండూరు పట్టణం ఇందిరానగర్‌కు చెందిన అక్షిత(20)కు ఏడు నెలల క్రితం వివాహమైంది. ఆమె ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. ఇటీవల హైదరాబాద్‌లో వైద్య పరీక్షలు చేయించుకోగా శిశువు ఎదుగుదలలో లోపం ఉన్నట్లు తేలింది. దీంతో వైద్యులు అబార్షన్ చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో ఆమె తాండూరు నర్సింగ్ హోంలో డాక్టర్ హుస్నామహ్మద్‌ను సంప్రదించగా.. శిశువుకు సమస్య వాస్తవమేనని చెప్పి చికిత్స ప్రారంభించారు. చికిత్స ప్రారంభించిన కొన్ని గంటల వ్యవధిలోనే గర్భిణి మృతి చెందింది. దీంతో వైద్యురాలి నిర్లక్ష్యంతో మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. న్యాయం జరిగే వరకు శవాన్ని తరలించేది లేదంటూ ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకున్నారు. తన వైద్యంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని, అబార్షన్ మాత్ర ఇచ్చి చికిత్స ప్రారంభించానని డాక్టర్ హుస్నామహ్మద్ తెలిపారు. అయితే హఠాత్తుగా ఆమెకు ఫిట్స్ వచ్చి, బీపీ తగ్గిపోయి, గుండెపోటు వచ్చి మృతి చెందిందని స్పష్టం చేశారు.

'రెవెన్యూ' సేవల్లో తేడా కనపడాలి

▶ మొదటి పేజీ తరువాయి

సమస్యల నుంచి విముక్తి కలిగించేలా దేశానికే రోల్‌మోడల్‌గా ఉండే కొత్త రెవెన్యూ చట్టాన్ని త్వరలో తీసుకొస్తామని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకొనేలా రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తామన్నారు. వ్యవస్థలో ఒకరిద్దరి తప్పుల కారణంగా అందరికీ చెడ్డపేరు వస్తోందని, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తగా పనిచేయాలని, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు వేసే ప్రతి అడుగు రెవెన్యూ వ్యవస్థకు వన్నె తెచ్చేలా ఉండాలన్నారు. రెవెన్యూ సేవల్లో అంతరాయాన్ని నివారించేలా నల్లగొండ జిల్లా తిరుమలగిరి, రంగారెడ్డి జిల్లా యాచారం మండలాల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టామని.. ఈ క్రమంలో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకొని కొత్త ఆర్‌వోఆర్ చట్టాన్ని రూపొందించే ప్రక్రియ తుదిదశకు చేరుకుందని వివరించారు. కొత్త చట్టం వచ్చేలోగానే ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామన్నారు.

3 నెలలకోసారి లీగల్ సమావేశాలు..

ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ యంత్రాంగం రాజీపడవద్దని మంత్రి పొంగులేటి సూచించారు. భూముల పరిరక్షణ కోసం మూడు నెలలకోసారి రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో లీగల్ టీంలతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. భవిష్యత్తులో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. రెవెన్యూ మంత్రిగా ఎవరున్నా భూముల రికార్డులను టాంపరింగ్ చేసేందుకు వీల్లేకుండా రెవెన్యూ రికార్డుల డిజిటైజేషన్ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేపడతామని తెలిపారు. రెవెన్యూ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోయినా పట్టించుకోని గత ప్రభుత్వం.. అప్పు చేసి మరీ ఉన్న సచివాలయాన్ని కూలగొట్టి కొత్తది కట్టిందని విమర్శించారు. కొన్ని జిల్లాల్లో కలెక్టరేట్‌లు ఉన్నా కొత్తవి నిర్మించిందని.. తానైతే అలాంటి పనులు చేయబోనని పొంగులేటి స్పష్టం చేశారు.

అందరికీ శిక్షణ తప్పనిసరి..

రెవెన్యూ శాఖలో ఉద్యోగంలో చేరిన వారితోపాటు సర్వీసులో ఉన్న వారికి కూడా శిక్షణ తప్పనిసరి చేస్తామని.. ఇందుకోసం రెవెన్యూ అకాడమీని ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. రెవెన్యూ ఉద్యోగుల జాబ్ చార్ట్ నిర్ధారణకు కమిటీని ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల్లోని ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి జాబ్ చార్ట్ రూపొందిస్తామన్నారు.

ఆర్థికేతర అంశాలకు తక్షణమే పరిష్కారం

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల్లో ఆర్థికేతర అంశాలను తక్షణమే పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. 33 జిల్లాల్లో సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను ఏర్పాటు చేస్తామని, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల కేడర్ స్ట్రెంగ్త్ పెంచుతామని, 17 మంది రెవెన్యూ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు పంపడంపై దసరాలోపే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, తెలంగాణ స్టేట్ సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కె. చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి భాస్కరరావు, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వి. లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ, ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. గౌతమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

క్లుప్తంగా...

రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభం

జాజుల శ్రీనివాస్ గౌడ్



కాచిగూడ (హైదరాబాద్): బీసీ కులగణనను చేపట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, బీసీలను మోసం చేయాలని చూస్తున్న ఈ ప్రభుత్వానికి సోమవారం నుంచి కౌంట్‌డౌన్ ప్రారంభిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ కౌంట్‌డౌన్‌ను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి బీసీ కార్యాలయంలో చేపడతామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ 9 నెలలు గడుస్తున్నా బీసీ కులగణన ప్రక్రియ ప్రారంభం కాలేదని విమర్శించారు. బీసీలను మభ్య పెట్టడానికే ప్రభుత్వం కులగణనపై ప్రకటనలు చేస్తోందని, ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలోనే ప్రక్రియ ప్రారంభమవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారని, మంత్రులు, ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు ఇచ్చిన హామీలకు కూడా విలువ లేకుండా పోయిందని చెప్పారు. కులగణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని జాజుల హెచ్చరించారు.

'కిమ్స్' కృష్ణయ్యపై క్రిమినల్ కేసు రీ రిజిస్టర్

- నిందితురాలిగా మొదటి భార్య సుజాత
- అదనంగా మరో మూడు సెక్షన్లు జోడింపు



కృష్ణయ్య సుజాత

సాక్షి, హైదరాబాద్: టీడీపీ కీలక నేత, నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు క్రిమినల్ కేసును రీ రిజిస్టర్ చేశారు. ఈయన కిమ్స్ హాస్పిటల్స్‌తోపాటు బీఎస్‌సీపీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థలకు చైర్మన్‌గా ఉన్నారు. రెండో భార్యకు పుట్టిన సంతానం మొదటి భార్యకే జన్మించినట్టు చూపించడానికి నకిలీ పత్రాలు సృష్టించారని, వీటి ఆధారంగా జీహెచ్‌ఎంసీ నుంచి ధ్రువీకరణలు పొందటంతోపాటు పాస్‌పోర్టులు కూడా తీసుకున్నారనేది ప్రధాన ఆరోపణ. ఆయన రెండో భార్య బొల్లి నేని కృష్ణవేణి ఫిర్యాదుతో సైబరాబాద్ కమిషనరేట్‌లోని రాయదుర్గం ఠాణాలో నమోదైన ఈ కేసు సీసీఎస్‌కు బదిలీ అయ్యింది. దీంతో వారు కేసును రీ రిజిస్టర్ చేసి, సేకరించిన కీలక ఆధారాలను బట్టి అదనపు సెక్షన్లు జోడించారు. రాయదుర్గం ఠాణాలో ఫిర్యాదు చేసినప్పుడు ఐపీసీలోని 417, 420, 506 రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదైంది. అందులో కృష్ణయ్యతోపాటు హేమ, ప్రసాద్ మాత్రమే నిందితులుగా ఉన్నారు. ఈ కేసు ఫైల్ అందుకున్న సీసీఎస్ పోలీసులు ఆ నాలుగు సెక్షన్లతోపాటు 467, 468, 471 సెక్షన్లనూ అదనంగా చేర్చారు. నేర నిరూపణకు అవసరమైన ప్రాథమిక ఆధారాలు సేకరించిన నేపథ్యంలో కృష్ణయ్య మొదటి భార్య సుజాతను నిందితురాలిగా చేర్చి దర్యాప్తు ముమ్మరం చేశారు.

బస్సు నడుపుతుండగా గుండెపోటు..

ఆర్టీసీ డ్రైవర్ హఠాన్మరణం



రమేశ్‌సింగ్ మృతదేహం

సైదాపూర్: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం దుద్దెనపల్లికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఠాగూర్ రమేశ్‌సింగ్ (46) విధుల్లో ఉండగానే గుండెపోటు రావడంతో మృతి చెందాడు. బంధువులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఠాగూర్ రమేశ్‌సింగ్ ఇటీవల పరకాల డిపో నుంచి హుజూరాబాద్ డిపోకు బదిలీ అయ్యాడు. విధి నిర్వహణలో భాగంగా హుజూరాబాద్ నుంచి హైదరాబాద్ బస్సు నడుపుతున్నాడు. ప్రజ్ఞాపూర్ చేరేసరికి ఛాతీలో నొప్పిగా ఉందని ప్రయాణికులు, కండక్టర్‌కు చెప్పి బస్సును ఆపాడు. ప్రయాణికులు 108కి ఫోన్‌చేసి గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రమేశ్‌సింగ్ మృతికి వయోభారం, పనిఒత్తిడి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు. రమేశ్‌సింగ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆర్టీసీ కార్మిక సంఘం నాయకుడు మాడెపు రమేశ్ డిమాండ్ చేశారు.

లోబీపీతో ఆర్టీసీ కండక్టర్ మృతి

చిగురుమామిడి: ఆర్టీసీ కరీంనగర్-2 డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన ర్యాకం లింగమూర్తి (55) విధుల్లోనే మృతిచెందారు. శనివారం నైట్‌హాల్ట్ డ్యూటీ వేసిన అధికారులు ఆదివారం ఉదయం కూడా డ్యూటీ వేయడంతో ఒక్కసారిగా లోబీపీకి గురయ్యారు. దీంతో ఆయనను డిపో సిబ్బంది కరీంనగర్‌లోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా వైద్యం అందించేలోపే మృతిచెందారు. లింగమూర్తికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గంగనీళ్ల జాతరకు తరలివచ్చిన భక్తులు



పోచమ్మకు ప్రణమిల్లి..



అడెల్లి పోచమ్మ ఆభరణాలను శుద్ధిచేసి తీసుకొస్తున్న భక్తులు

సారంగాపూర్: నిర్మల్ జిల్లా ప్రజల ఇలవేల్పు అడెల్లి మహా పోచమ్మతల్లి గంగనీళ్ల జాతర ఆదివారం ముగిసింది. జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు గోదావరిలో శుద్ధి చేసి తీసుకొచ్చిన అమ్మవారి నగలను దర్శించుకుని పూజలు చేశారు. ఆభరణాలను ఆలయానికి చేర్చడంతో జాతర ముగిసింది.

పార్లమెంటులో నమాజ్ చేస్తే వక్ఫ్ భూమి అవుతుందా?

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ



నిజామాబాద్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

ఖలీల్‌వాడి (నిజామాబాద్): పార్లమెంటులో నమాజ్ చేస్తే వక్ఫ్‌భూమి కిందికి వస్తుందా? అని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖిల్లారోడ్డులో ఆదివారం రాత్రి ఎంఐఎం ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డును రద్దు చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డు ఏ భూమినైనా తనదంటే ఇచ్చేయాలని కేంద్రం బద్నాం చేస్తోందని దుయ్యబట్టారు. వక్ఫ్ బోర్డు ఎవరి భూములనూ గుంజుకోదని దేశ ప్రజలు గుర్తించాలని కోరారు. వక్ఫ్ బోర్డు కోసం వేసిన కమిటీలో ముస్లింలకు ఎందుకు చోటు కల్పించలేదో చెప్పాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఈ భూములపై కలెక్టర్ల అధికారాలను తొలగించడానికే కేంద్రం కమిటీ ఏర్పాటు చేసిందని ఆరోపించారు. తాను బతికున్నా లేకున్నా పార్లమెంటులో ముస్లింల ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు.


'గోపా'ను జిల్లాల్లో బలోపేతం చేయాలి

రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి పొన్నం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్. చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

ఖైరతాబాద్(హైదరాబాద్): గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా)ను జిల్లాల్లో కూడా బలోపేతం చేసి గౌడ పేద విద్యార్థులు, గౌడ యువజనులు, గీత కార్మికుల అభ్యున్నతికి పాటుపడేందుకు కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ సభ ఆదివారం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని నీరాకేఫ్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పొన్నం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున గోపాకు ఏ సహకారమైనా అందజేస్తామని తెలిపారు. ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం మట్లాడుతూ గోపా అనేది రాష్ట్రంలోనే ఒకే ఒక సంఘంగా 50 సంవత్సరాల క్రితం ఏర్పడిందన్నారు. టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ్‌లు రాజకీయంగా, ఆర్థికాభివృద్ధి పరంగా, ఉన్నతవిద్య అభ్యసించే విధంగా, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు పొందేందుకు గోపా నాయకత్వం కృషి చేయాలన్నారు. గోపా అధ్యక్షుడు డాక్టర్ బండి సాయన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి జీవీ.శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి మొగిలి రఘునాథ్‌గౌడ్‌లతోపాటు 50 మంది ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్, జి.రాజేశంగౌడ్, డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్, మాజీ ఎంపీలు మధుయాష్కీ, బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్సీలు రాజలింగం, గంగాధర్, లక్ష్మీనారాయణ, గంగాధర్, మాజీ ఎమ్మెల్యేలు కె.సత్యనారాయణ, కూన శ్రీశైలం, బిక్షమయ్య, నందీశ్వర్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి, శారద, అనిత రాజేందర్, మోతె చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల 'ఆత్మీయ' బంధం

జూలపల్లి(పెద్దపల్లి): నిత్యం విధి నిర్వహణలో తలమునకలయ్యే పోలీసు ఉద్యోగులు ఒకచోట కలుసుకున్నారు. ఇందుకు పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్‌లోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం వేదికైంది. జూలపల్లి, ఎలిగేడు రెండు మండలాలకు చెందిన 112 మంది.. పోలీసు శాఖలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరిలో ఏడుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలు, మిగతావారు హెడ్‌కానిస్టేబుళ్లు, పోలీసు కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిలో 58మంది ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకుని కష్టసుఖాలు పంచుకుని ఆనందంగా గడిపారు.


ఐఏఎఫ్ 92వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం చెన్నైలో జరిగిన వైమానిక విన్యాసాలు

చుక్కలు చూపిన ఎయిర్ షో

ఎండల తీవ్రతకు ఐదుగురు మృతి ● వారిలో ఒక తెలుగు వ్యక్తి!

సాక్షి, చెన్నై: చెన్నైలో ఆదివారం జరిగిన భారీ ఎయిర్ షో చేదు అనుభవం మిగిల్చింది. ఎండలకు తాళలేక సొమ్మసిల్లి ఐదుగురు చనిపోగా, 230 మంది ఆస్పత్రి పాలయ్యారు. మృతుల్లో ఒకరు తెలుగు వ్యక్తి అని సమాచారం. షో ఉదయం 11 నుంచి కాగా జనం 8 గంటలకే మెరీనా బీచ్ చుట్టుపక్కల ప్రాంతాలకు తరలివచ్చారు. ఎండ తీవ్రతకు చాలామంది షో ప్రారంభం కాకమునుపే సొమ్మసిల్లి పడిపోయారు. తాగునీరు కూడా అందుబాటులో ఉంచలేదని వాపోయారు. భారత వైమానిక దళం 92వ వార్షికోత్సవం సందర్భంగా 21 ఏళ్ల తర్వాత చెన్నైలో జరిగిన ఈ కార్యక్రమంలో 72 రకాల విమానాలు, హెలికాప్టర్లు ప్రదర్శనలు చేశాయి. వీటిని చూసేందుకు ఏకంగా 16 లక్షల మంది తరలివచ్చారు. ప్రదర్శన అనంతరం అంతా ఒక్కసారిగా ఇళ్లకు మరలడంతో గందరగోళం నెలకొంది. ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. మండుతున్న ఎండ, రద్దీతో ముందుకు సాగేందుకు మార్గం లేకపోవడంతో ఒంట్లో ఓపికలేక చాలామంది రోడ్డు పక్కనే కూర్చుండిపోయారు. బీచ్‌కు సమీపంలోని వారు కొందరికి మంచినీరు సరఫరా చేయడంతో పరిస్థితి కొంత తేలికపడింది. అయితే, జనం మెట్రో రైళ్లను ఆశ్రయించడంతో మెట్రో స్టేషన్లు కూడా కిక్కిరిసిపోయాయి. లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడం లక్ష్యంగా పెట్టుకున్న అధికార యంత్రాంగానికి తగు ప్రణాళిక లేదని, కనీస వసతులు సైతం ఏర్పాట్లు చేయలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.


మెరీనా బీచ్ రోడ్డులో కిక్కిరిసిన జన సందోహం

కార్డినల్‌గా కేరళ బిషప్

జార్జి జాకబ్ సహా 21 మంది ఎంపిక

తిరువనంతపురం: కేరళకు చెందిన 51 ఏళ్ల మత ప్రబోధకుడు మాన్సిగ్నర్ జార్జ్ జాకబ్ కోవక్కడ్‌ను కార్డినల్‌గా ప్రకటిస్తూ పోప్ ఫ్రాన్సిస్ నిర్ణయం తీసుకున్నారు. మొత్తం 21 మందిని కార్డినల్స్‌గా పోప్ ప్రకటించినట్టు వాటికన్ సిటీ ఆదివారం వెల్లడించింది. రోమ్‌లో క్రిస్మస్ సీజన్ మొదలయ్యే డిసెంబర్ 8న వీరంతా కార్డినల్స్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. జాకబ్ నాలుగేళ్లుగా పోప్ అంతర్జాతీయ పర్యటనల కార్యక్రమాలను చూసుకుంటున్నారు. చంగనచెర్రీ సైరో–మలబార్ ఆర్కిడయాసిస్‌కు చెందిన జాకబ్ వాటికన్‌లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. పలు దేశాల్లో వాటికన్ 'దౌత్య' కార్యాలయాల్లో పనిచేశారు. 1973లో తిరువనంతపురంలో జన్మించిన జాకబ్ 2004 జూలై 24న చర్చి ఫాదర్ అయ్యారు.



కొత్తవారిలో 99 ఏళ్ల బిషప్ సైతం..

కొత్తగా కార్డినల్స్‌గా ఎన్నికైన 21 మందిలో అత్యంత వృద్ధుడు, 99 ఏళ్ల ఏంజిలో అసెర్బీ సైతం ఉన్నారు. ఈయన గతంలో వాటికన్ దౌత్యవేత్తగా పనిచేశారు. గతంలో ఈయనను కొలంబియాలో వామపక్ష గెరిల్లా దళాలు ఆరు వారాలపాటు బంధించాయి. 21 మంది కొత్త కార్డినల్స్‌లో అత్యంత తక్కువ వయసు వ్యక్తిగా 44 ఏళ్ల బిషప్ మైకోలా బైచోక్ ఉన్నారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఉక్రెయిన్ గ్రీకు కేథలిక్ చర్చిలో ఈయన సేవలందిస్తున్నారు. నిబంధనల ప్రకారం 120 మంది మాత్రమే కార్డినల్స్ కాగలరు. కానీ పోప్‌ఫ్రాన్సిస్ ఎక్కువ మందిని ఎంపికచేశారు. దీంతో కొత్తవారితో కలుపుకుని సంఖ్య 142కు పెరిగింది.

గాజా మసీదుపై బాంబుల వర్షం

ఇజ్రాయెల్ దాడుల్లో 19 మంది మృతి

- పాఠశాలపైనా విరుచుకుపడిన సైన్యం.. నలుగురి మృతి
- ఉత్తర గాజా, దక్షిణ బీరుట్‌పై దాడులు ఉధృతం

డెయిర్ అల్–బలాహ్: పశ్చిమాసియాలో ఇరాన్ ప్రాయోజిత మిలిటెంట్ సంస్థల నిర్మూలనే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం దాడులు ఉధృతం చేస్తోంది. సెంట్రల్ గాజాలోని డెయిర్ అల్–బలాహ్ పట్టణంలో పాలస్తీనా పౌరులు ఆశ్రయం పొందుతున్న అల్–అక్సా అమరవీరుల మసీదుపై ఆదివారం ఉదయం బాంబుల వర్షం కురిపించింది. దాంతో కనీసం 19 మంది మరణించారని పాలస్తీనా అధికారులు వెల్లడించారు. డెయిర్ అల్–బలాహ్ సమీపంలో శరణార్థులు తలదాచుకుంటున్న పాఠశాల భవనంపై దాడుల్లో నలుగురు మృతిచెందారు. మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకొని మసీదు, పాఠశాలపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది.

జబాలియా దిగ్బంధం

ఉత్తర గాజాలోని జబాలియా టౌన్‌ను ఇజ్రాయెల్ సైన్యం చుట్టుముట్టింది. ఖాళీ చేసి వెళ్లిపోవాలని స్థానికులను హెచ్చరించింది. జబాలియాపై వైమానిక, భూతల దాడులకు సన్నాహాలు చేస్తోంది. పెద్ద సంఖ్యలో ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు జబాలియా వైపు కదులున్న ఫొటోలు, వీడియోలు బయటకు వచ్చాయి. జబాలియాలో అతి పెద్ద శరణార్థుల శిబిరం ఉంది. ఇక్కడ హమాస్ మిలిటెంట్ల స్థావరాలను నేలమట్టం చేయడానికి ఇజ్రాయెల్ భారీ ఆపరేషన్ ప్రారంభించబోతున్నట్లు సమాచారం. 'యుద్ధంలో మరో దశలోకి ప్రవేశించాం' అంటూ కరపత్రాలను జబాలియాలో జారవిడిచారు. ఉత్తర గాజాలో ఆదివారం భారీగా దాడులు జరిగినట్టు స్థానిక అధికారులు చెప్పారు. చాలా భవనాలు ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు. ప్రాణ నష్టం వివరాలు తెలియరాలేదు. జబాలియాలో తమ ఇంటిపై వైమానిక దాడి జరిగిందని, తన తల్లిదండ్రులతోపాటు మొత్తం 12 మంది కుటుంబ సభ్యులు మరణించారని ఇమాద్ అలారాబిద్ అనేది వ్యక్తి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇజ్రాయెల్ దాడుల్లో హసన్ హమద్, అనస్ అల్–షరీఫ్ అనే జర్నలిస్టులు మృతిచెందారు. ఉత్తర గాజాలో 3 లక్షల మంది పాలస్తీనా పౌరులు ఉన్నారు. వారందరినీ దక్షిణ గాజాకు వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది.


ఇజ్రాయెల్ దాడితో లెబనాన్‌లోని దహియెలో కమ్ముకున్న పొగ, మంటలు

బీరుట్‌లో ఆరుగురి మృతి

ఇజ్రాయెల్ ప్రతిదాడులతో లెబనాన్ రాజధాని బీరుట్ దద్దరిల్లిపోతోంది. నగర దక్షిణ శివారు ప్రాంతమైన దాహియేపై సైన్యం విరుచుకుపడుతోంది. హెజ్‌బొల్లా స్థావరాలే లక్ష్యంగా శనివారం రాత్రి నుంచి వైమానిక దాడులు సాగిస్తోంది. 30కిపైగా క్షిపణి దాడులు జరిగాయని, భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపించాయని లెబనాన్ జాతీయ వార్తా సంస్థ వెల్లడించింది. సెప్టెంబర్ 23 తర్వాత ఇవే అతిపెద్ద దాడులని పేర్కొంది. గ్యాస్ స్టేషన్, ఔషధాల గోదాముతోపాటు ఒక ఆయుధాగారంపై ఇజ్రాయెల్ సైన్యం క్షిపణులు ప్రయోగించిందని వెల్లడించింది. ఈ దాడుల్లో కనీసం ఆరుగురు మృతిచెందారని, మరో 12 మంది గాయపడ్డారని ప్రకటించింది. హెజ్‌బొల్లా కూడా వెనక్కు తగ్గకుండా ఉత్తర ఇజ్రాయెల్‌లో సైనిక శిబిరాలపై దాడులకు దిగింది. లెబనాన్ నుంచి దూసుకొచ్చిన 30 రాకెట్లను మధ్యలోనే కూల్చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్‌లో గత రెండు వారాల్లో 1,400 మంది మృతిచెందారు. 10 లక్షల మందికిపైగా నిరాశ్రయులయ్యారు. 3.75 లక్షల మంది లెబనీయులు సిరియా చేరుకున్నారు. శనివారం ఇజ్రాయెల్ దాడుల్లో 23 మంది మరణించారని, 93 మంది గాయపడ్డారని లెబనాన్ ప్రకటించింది.

ఏడు వైపులా శత్రువులతో పోరాడుతున్నాం

- మాకు ఆయుధాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటు: నెతన్యాహు
- ఫ్రాన్స్, పశ్చిమ దేశాలపై ఆగ్రహం

జెరూసలేం: ఇజ్రాయెల్‌కు ఆయుధ సరఫరాను నిలిపివేస్తూ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తీసుకున్న నిర్ణయంపై ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మండిపడ్డారు. ''మాక్రాన్ నిర్ణయాన్ని ఖండిస్తున్నాం. ఇరాన్ అండదండలు అందిస్తున్న అరాచకశక్తులపై ఇజ్రాయెల్ పోరాడుతోంది. ఇందుకు నాగరిక దేశాలన్నీ మద్దతు ఇవ్వాలి. కానీ ఫ్రాన్స్, ఇతర పశ్చిమ దేశాలు మాకు ఆయుధాలివ్వొద్దని నిర్ణయం తీసుకుంటున్నాయి. ఇది నిజంగా సిగ్గుచేటు'' అంటూ ఆదివారం దుయ్యబట్టారు. ''మేం ఏడు దిక్కులా శత్రువులతో పోరాడుతున్నాం. గాజాలో హమాస్‌పై, లెబనాన్‌లో హెజ్‌బొల్లాపై, యెమెన్‌లో హౌతీలపై, ఇరాక్, సిరియాల్లో షియా మిలిటెంట్లపై పోరాడుతున్నాం. ఇరాన్ ప్రభుత్వం మిలిటెంట్లకు ఆయుధ సరఫరా ఆపడం లేదు. మిలిటెంట్ శక్తులు కలిసికట్టుగా పనిచేస్తున్నాయి. వాటిని వ్యతిరేకిస్తున్న పశ్చిమ దేశాలు ఇజ్రాయెల్‌కు ఆయుధాలివ్వడం మాత్రం నిలిపివేస్తున్నాయి'' అని ఆక్షేపించారు. ఎవరి సహకారమున్నా, లేకపోయినా యుద్ధంలో గెలుస్తామని ధీమా వ్యక్తంచేశారు.




ట్రంప్ ప్రసంగిస్తుండగా సభా వేదికపై చిందేస్తున్న ఎలాన్ మస్క్

అమెరికాకు గౌరవం తెస్తా

- పెన్సిల్వేనియా సభలో ట్రంప్
- హత్యాయత్నం జరిగిన బట్లర్‌లో సభకు పోటెత్తిన అభిమానులు

పెన్సిల్వేనియా: అవినీతి లేని వ్యవస్థను, అమెరికా విదేశాంగ విధానానికి తిరిగి 'గౌరవం' తీసుకొస్తానని రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అన్నారు. నేరాలకు మూలమైన ఓపెన్ బోర్డర్‌ను మూసేస్తామని హామీ ఇచ్చారు. జూలై 13న తనపై హత్యాయత్నం జరిగిన మళ్లీ పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో శనివారం ఆయన బహిరంగ సభలో పాల్గొన్నారు. వేలాదిగా గుమిగూడిన అభిమానుల కరతాళ ధ్వనుల మధ్య మాట్లాడారు. రాజకీయ ప్రత్యర్థులు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, చంపడానికి కూడా ప్రయత్నించారని ట్రంప్ ఆరోపించారు. జూలై 13న తనపై హత్యాయత్నం జరిగిన ఉదంతాన్ని గుర్తు చేసుకున్నారు. ''ఓ 15 సెకన్ల పాటు కాలం ఆగిపోయింది. ఓ దుర్మార్గుడు చెడు చేద్దామని ప్రయత్నించాడు. కానీ విజయం సాధించలేకపోయాడు'' అని వ్యాఖ్యానించారు. కాల్పుల్లో ట్రంప్ చెవికి గాయమవడం, ఒక వలంటీర్ ఫైర్ చీఫ్ మరణించడం తెలిసిందే.

చిందేసిన మస్క్

టెక్ దిగ్గజం ఎలన్ మస్క్ ట్రంప్ ఎన్నికల ర్యాలీలో తొలిసారి కనిపించారు. ఆయనను ట్రంప్ పొగడ్తలతో ముంచెత్తుతూ వేదికపైకి ఆహ్వానించారు. ట్రంప్ మాట్లాడుతుండగా మస్క్ చిందేసి సభికులను అలరించారు. ట్రంప్‌కు ఓటేయడం కంటే తనకు ఏదీ ముఖ్యం కాదని చెప్పారు. ట్రంప్ ఓడిపోతే 2024 ఎన్నికలే అమెరికన్లకు చివరివి అవుతాయని హెచ్చరించారు.

ఉచిత విద్యుతిస్తే బీజేపీకి ప్రచారం చేస్తా

ప్రధాని నరేంద్ర మోదీకి కేజ్రీవాల్ సవాల్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీకి ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ సవాల్ విసిరారు. దేశంలోని 22 బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజలకు ఉచితంగా విద్యుత్ ఇస్తే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ప్రచారం చేస్తానన్నారు. పదేళ్లలో ఒక్క మంచి పని కూడా చేయని మోదీ రిటైర్మెంట్‌కు ముందు కనీసం ఈ ఒక్క మంచి పనైనా చేయాలని సూచించారు. ఆదివారం ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియంలో జరిగిన ఆప్ బహిరంగ సభలో బీజేపీపై కేజ్రీవాల్ విరుచుకుపడ్డారు. ''వచ్చే ఏడాది సెప్టెంబర్ 17కు మోదీకి 75ఏళ్లు వస్తాయి. రిటైరవుతారు. ప్రధానిగా ఆయనకు మరో ఏడాది సమయమే ఉంది. ఈలోగా ఢిల్లీ ప్రభుత్వం మాదిరిగా బీజేపీ పాలిత రాష్ట్రాలన్నింట్లోనూ విద్యుత్తు ఉచితంగా ఇవ్వండి. బడులు, ఆసుపత్రులు బాగు చేయండి. ఫిబ్రవరిలో ఢిల్లీ ఎన్నికల్లోపు ఆ పని చేసి చూపిస్తే ఢిల్లీ ఎన్నికల్లో మోదీకి ప్రచారం చేస్తా'' అన్నారు. ''డబుల్ ఇంజిన్ ప్రభుత్వమంటే 'డబుల్ దోపిడీ, నిరుద్యోగం, అధిక ధరలు'. హరియాణాలో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ దిగిపోనుంది. జార్ఖండ్, మహారాష్ట్రల్లోనూ ఆ పార్టీ ప్రభుత్వాలు పోతాయి'' అన్నారు. తన జేబులో ఆరు స్వీట్లున్న ప్యాకెట్ ఉందని కేజ్రీవాల్ అన్నారు. ''ఉచిత విద్యుత్, నీరు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వృద్ధులకు తీర్థయాత్ర, ఆరోగ్య వసతులు, విద్య... ఇవే ఆ ఆరు స్వీట్లు'' అని చెప్పారు. ఢిల్లీలో పొరపాటున బీజేపీకి ఓటేస్తే ఆ ఆరు స్వీట్లు ప్రజలకు అందకుండా పోతాయన్నారు.



బీజేపీ మత ఉద్రిక్తతలను పెంచుతోంది: రాహుల్

న్యూఢిల్లీ: గోవాలో బీజేపీ మతపరమైన ఉద్రిక్తతలను పెంచుతోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ ఆరోపించారు. ప్రజల మధ్య విభేదాలను సృష్టించాలన్న బీజేపీ అజెండాను తాము అడ్డుకుంటామని 'ఎక్స్'లో స్పష్టం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ మాజీ నేత ఒకరు ముస్లింలను ఆర్థికంగా బాయ్‌కాట్ చేయాలంటూ సంఘ్ విభాగాలను, క్రైస్తవులను పురిగొల్పుతున్నారని విమర్శించారు. ప్రజల మధ్య సామరస్య వాతావరణం బీజేపీ చర్యలతో దెబ్బతింటోందన్నారు. ప్రజలంతా బీజేపీ కుయుక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.



ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్... మరో 7 మృతదేహాల గుర్తింపు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మృతి చెందగా ఇప్పటి వరకు 23 మందిని గుర్తించారు. శనివారం 16 మందిని, ఆదివారం మరో ఏడుగురిని గుర్తించారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 31 మందిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు ముఖ్య నేతలు ఉన్నారని ప్రచారం సాగినా ప్రస్తుతం గుర్తించిన 23 మందిలో ఎవరూ లేరని తేలింది. వీరంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని భావిస్తున్నారు. ఆదివారం గుర్తించిన మావోయిస్టుల్లో పీఎల్‌జీఏ ఆరో కంపెనీ కమాండర్ నందు మాండవి, డివిజనల్ కమిటీ మెంబర్ మహేశ్, పీపీసీఎంలు మోహన్ మాండవి, దూగే, జగన్ కొర్రం, అనీల్, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు నీతి బాడీగార్డ్ జనీలా అలియాస్ బుద్రి ఉన్నారని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజు తెలిపారు.

హిందూ సమాజానికి ఐక్యతతోనే భద్రత: భాగవత్

కోటా: కుల, మత, ప్రాంతీయ విభేదాలను విడనాడి హిందూ సమాజం ఐక్యంగా ఉంటేనే భద్రత సాధ్యమని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఉద్బోధించారు. అందరినీ తమ వారిగా భావిస్తూ అందరినీ ఆలింగనం చేసుకోవడం, సామరస్యంగా జీవించడం హిందువుల ప్రాథమిక లక్షణమన్నారు. రాజస్తాన్‌లో బరన్‌లో శనివారం భగవత్ మాట్లాడారు. సమాజమంటే వ్యక్తులు, కుటుంబాలే కాదు, ఆధ్యాత్మిక సాఫల్యాన్ని పొందగలిగే సమగ్ర దృక్పథమన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్య నేతలు రమేశ్ అగర్వాల్, జగదీశ్ సింగ్ రాణా, రమేశ్ చంద్ మెహతా, వైద్య రాధేశ్యాం గర్గ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




వీడియో కాల్స్‌తో ఎవరూ అరెస్ట్ చేయరు

సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ అడ్వైజరీ

న్యూఢిల్లీ: దేశంలో డిజిటల్ అరెస్ట్ కేసులు పెరుగుతున్న వేళ ఇండియన్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) శనివారం కీలకమైన అడ్వైజరీ జారీ చేసింది. సీబీఐ, ఈడీ, పోలీసు, ఎక్సైజ్, కస్టమ్స్ అధికారులతోపాటు, జడ్జీలు వీడియో కాల్స్ చేస్తూ ప్రజలను అరెస్ట్ చేయలేరని స్పష్టం చేసింది. ఇలాంటివన్నీ స్కాంలని పేర్కొంది. ఇంటర్నెట్ ద్వారా ఇలా మోసాలకు పాల్పడేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. వాట్సాప్, స్కైప్ వంటి సోషల్ మీడియా లోగోలను మోసగాళ్లు వాడుకుంటున్నారని తెలిపింది. బాధితులు వెంటనే హెల్ప్‌లైన్ నంబర్–1930లో, www.cybercrime.gov.in.లో ఫిర్యాదు చేయాలని సూచించింది. డిజిటల్ అరెస్ట్ నేరాలు ఇటీవల పెరుగుతుండటం తెలిసిందే.

మోదీ వైఫల్యాలను కప్పిపుచ్చలేరు: ఖర్గే

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ పాలనతో దేశం ఆర్థికంగా దెబ్బతిందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. పదేపదే అవే ప్రసంగాలు చేస్తూ ప్రధాని మోదీ ఘోర వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేరని ఆదివారం ఖర్గే 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'ఉత్పత్తి రంగం దెబ్బతింది. మేకిన్ ఇండియా నినాదం విఫలమైంది. అధిక ధరలతో జనం అవస్థలు పడుతున్నారు'అని తెలిపారు. ఉత్పత్తి రంగంలో శ్రామికుల సంఖ్య 2017–18లో కాంగ్రెస్–యూపీఏ హయాంలో 15.85 శాతంగా ఉండగా, 2023–24 నాటికి అది 11.4 శాతానికి క్షీణించిందని వివరించారు.



భారత్‌లో మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు

న్యూఢిల్లీ: భారత్‌లో నాలుగు రోజుల పర్యటనకు గాను మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు ఆదివారం న్యూఢిల్లీ చేరుకున్నారు. పర్యటనలో భాగంగా ఆయన ముంబై, బెంగళూరుల్లో వ్యాపారవేత్తలతో జరిగే సమావేశాల్లో పాల్గొంటారు. సోమవారం ఆయన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీలతో సమావేశమవుతారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంలో భాగంగా పలు ఒప్పందాలపై సంతకాలు జరిగే అవకాశముంది. చైనా అనుకూలుడిగా పేరున్న ముయిజ్జు హయాంలో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. భారత్‌తో దెబ్బతిన్న సంబంధాలను తిరిగి గాడిన పెట్టేందుకు ముయిజ్జు ప్రయత్నిస్తున్నారు.

రూ.1,814 కోట్ల డ్రగ్స్ సీజ్

అహ్మదాబాద్/న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో భారీగా మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. ఓ ఫ్యాక్టరీ నుంచి రూ.1,814 కోట్ల విలువైన 907 కిలోల మెఫెడ్రిన్‌తోపాటు, ముడి సరుకును, యంత్ర పరికరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్), ఢిల్లీ నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ)సంయుక్తంగా జరిపిన దాడిలో బగ్రోడా పారిశ్రామిక ఎస్టేట్‌పై శనివారం దాడి జరిపినట్లు అధికారులు తెలిపారు. గుజరాత్ ఏటీఎస్ యూనిట్ సారథ్యంలో ఇంతభారీగా డ్రగ్స్ పట్టుబడిన ఘటన ఇదే. ఫ్యాక్టరీలో రోజుకు 25 కిలోల మెఫెడ్రిన్ తయారవుతోందని చెప్పారు. ఈ సందర్భంగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒకరు 2017లో మహారాష్ట్రలోని అంబోలిలో మెఫెడ్రిన్ పట్టుబడిన కేసులో ఐదేళ్ల జైలు శిక్ష అనుభవించాడని అధికారులు వివరించారు.


అమృత్‌సర్‌లో రూ.10 కోట్ల కొకైన్ లభ్యం

అమృత్‌సర్‌లో రూ.10 కోట్ల విలువైన కొకైన్‌ను స్వాధీనం పోలీసులు చేసుకున్నారు. ఇటీవల ఢిల్లీలో రూ.5,620 కోట్ల విలువైన 560 కిలోల కొకైన్, 40 కిలోల మారిజువానాను సీజ్ చేయడం తెలిసిందే. ఆ కేసు దర్యాప్తు క్రమంలోనే తాజాగా కొకైన్ పట్టుబడింది. ఈ సందర్భంగా ఒక వ్యక్తితోపాటు అతడి టయోటా కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు విదేశాలకు పరారయ్యేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడని అధికారులు తెలిపారు.


డ్రగ్స్ తయారీ యంత్రాన్ని చూస్తున్న సిబ్బంది

మహిళా ప్రజాప్రతినిధులంటే అలుసా?

- వారిని ఇష్టారాజ్యంగా పదవి నుంచి తొలగించడం తగదు
- ఎన్నికల్లో కష్టపడి గెలిచిన మహిళలను కించపరచొద్దు
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన ప్రజాప్రతినిధిని పదవి నుంచి తొలగించడాన్ని సాధారణ విషయంగా తీసుకోవద్దని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధిగా గెలిచిన మహిళలను ఇష్టారాజ్యంగా పదవుల నుంచి తొలగించడం సరైంది కాదని పేర్కొంది. మహారాష్ట్రలో ఓ గ్రామ మహిళా సర్పంచిని పదవి నుంచి తప్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వును న్యాయస్థానం కొట్టివేసింది. మహిళలు గ్రామ సర్పంచి కావడాన్ని చాలామంది తట్టుకోలేకపోతున్నారని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. దేశమంతటా ఇలాంటి పరిస్థితి ఉందని పేర్కొంది. నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం మహిళల్లో ఉండదన్న అభిప్రాయం ప్రజల్లో ఉందని వెల్లడించింది. నిజానికి మహిళల్లో చక్కటి పరిపాలనా సామర్థ్యాలు ఉంటాయని, వారిని తక్కువ అంచనా వేయొద్దని సూచించింది. మనీశ్ రవీంద్రపన్ పాటిల్ అనే మహిళ మహారాష్ట్రలో జలగావ్ జిల్లా విచ్ఖేడ్ గ్రామ సర్పంచిగా ఎన్నికయ్యారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన భవనంలో ఆమె తన అత్తతో కలిసి నివసిస్తున్నారని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఒక ప్రజాప్రతినిధి కబ్జా చేసిన స్థలంలో కట్టిన ఇంట్లో నివసించడం చట్టవిరుద్ధమని ఆమెపై అనర్హత వేటు వేయాలని కోరారు. ఈ ఆరోపణలను మనీశ్ రవీంద్రపన్ పాటిల్ ఖండించారు. తాను భర్త, పిల్లలతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నానని స్పష్టంచేశారు. కలెక్టర్ సరైన విచారణ చేయకుండా తెలుసుకోకుండా పాటిల్‌ను సర్పంచి పదవి నుంచి తొలగించారు. దీన్ని ఆమె బాంబే హైకోర్టులో సవాలు చేశారు. హైకోర్టు కూడా కలెక్టర్ నిర్ణయాన్ని సమర్థించడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. బాంబే హైకోర్టు ఉత్తర్వును తోసిపుచ్చింది. పాటిల్ సర్పంచిగా విధులు నిర్వర్తించవచ్చంటూ తీర్పు వెలువరించింది. దేశంలో లింగ సమానత్వం కోసం, మహిళా సాధికారత కోసం ఒకవైపు కృషి కొనసాగుతుండగా, మరోవైపు వారిని నిరుత్సాహపర్చే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని ఆవేదన వెలిబుచ్చింది. ప్రజల ఆలోచనా ధోరణిలో మార్పు రావాలని, మహిళలను ప్రోత్సహించాలని స్పష్టం చేసింది. వారిని కింపచర్చడం, అలుసుగా తీసుకోవడం తగదని హితవు పలికింది. పేర్కొంది.

చివరి తోడేలు హతం

కొట్టి చంపిన గ్రామస్తులు

- 3 నెలల భయాందోళనలకు తెర!
- పది మందిని పొట్టన పెట్టుకున్న తోడేళ్లు

బహ్రాయిచ్: ఉత్తరప్రదేశ్‌లోని బహ్రాయిచ్ జిల్లాలోని మహ్సీ తహసీల్‌లో నెలల తరబడి భయాందోళనలు సృష్టించిన తోడేళ్ల కథ ముగిసింది. గ్రామస్తులపై, పశువులపై దాడి చేసిన తోడేళ్లలో.. ఆఖరి తోడేలును కూడా చంపేశారు. 24 రోజులుగా అటవీశాఖ అధికారులకు దొరక్కుండా ముప్పుతిప్పలు పెడుతున్న తోడేలును తామచ్‌పూర్ గ్రామస్తులు ఎట్టకేలకు పట్టుకున్నారు. శనివారం రాత్రి మేకను తినేందుకు ప్రయత్నించగా స్థానికులు దాన్ని కొట్టిచంపారు. ఆ తోడేలు తల్లి పక్కనే నిద్రిస్తున్న ఓ చిన్నారిపై దాడి చేయబోయిందని, తల్లి అరుపులతో పారిపోయి మేకపై దాడి చేసిందని వారన్నారు. జిల్లాలో గత మూడు నెలల్లో పది మంది తోడేళ్ల దాడులకు బలయ్యారు. 50 మందికి పైగా గాయపడ్డారు. వీటిని పట్టుకోవడానికి 'ఆపరేషన్ భేడియా' నిర్వహించారు.

ఇద్దరు చిన్నారులను పొట్టన పెట్టుకున్న చిరుతలు

లఖీంపూర్‌ఖేరి: లఖీంపూర్ ఖేరిలో అడవి జంతువుల దాడిలో ఇద్దరు చిన్నారులు చనిపోయారు. గంగాబెహార్‌లో 12 ఏళ్ల సాజెబ్ శనివారం చెరకు తోటకు వెళ్తుండగా చిరుత దాడి చేసి ఎత్తుకుపోయింది. కుర్హైహా గ్రామానికి చెందిన ఓ మూడేళ్ల చిన్నారిని కూడా చిరుత ఎత్తుకెళ్లింది.



'దసరా' దొంగలున్నారు జాగ్రత్త!
దసరా సెలవుల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే నగరవాసులు తస్మాత్ జాగ్రత్త. శివారు ప్రాంతాల్లో ఇదే అదనుగా దొంగలు రెచ్చిపోయే ప్రమాదం పొంచి ఉంది.
-8లో



టెకీ.. ట్రెండీ..
సాఫ్ట్‌వేర్, ఐటీ ఉద్యోగుల్లో ట్రెండ్ మారింది. హ్యాండ్సమ్‌గా, పాజిటివ్ లుక్స్ ఉంటే చాలు. నగరంలోని దాదాపు అన్ని మల్టీ నేషనల్ కంపెనీలూ ఈ సంస్కృతిని ప్రోత్సహిస్తున్నాయి - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0/23.0
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



రన్‌ను ప్రారంభిస్తున్న జెన్నిఫర్ లార్సన్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, డాక్టర్ బ్రాత్ ఎస్ ఫిషర్ తదితరులు



రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

రన్ ఫర్ లైఫ్

గచ్చిబౌలి: కేన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే కట్టడి చేయవచ్చని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో క్వాంబియంట్ గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్–2024 విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆరోగ్యమే సంపద అని, తాను నిత్యం 10 కిలోమీటర్లు రన్నింగ్ చేస్తానన్నారు. కేన్సర్ మహమ్మారిపై ప్రజలను మరింత అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోనే ఇది అతిపెద్ద కేన్సర్ అవగాహన రన్‌గా ఆయన అభివర్ణించారు. రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్, గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చిన్నబాబు, రన్‌లో ఫరీదాబాద్‌కు చెందిన భారత తొలి బ్లేడ్ రన్నర్ కిరణ్ తనూజతో పాటు 3 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయసు వారు పాల్గొన్నారు.

- విద్యుత్ వినియోగం పైపైకి
- రోజుకు సగటున 70 ఎంయూలు నమోదు
- సాయంత్రం వర్షం.. తెల్లవారుజామున ఉక్కపోత
- నగరంలో విభిన్న వాతావరణం

గిర్రున మీటర్



గ్రేటర్‌లో అక్టోబర్ నెలలో విద్యుత్ డిమాండ్ (మెగావాట్లలో)..

తేదీ	2023	2024	పెరుగుదల
01	2,647	3,417	29.09%
02	2,734	3,118	14.05%
03	3,148	3,398	7.94%
04	3,116	3,279	5.23%
05	3,135	3,188	4.55%

విద్యుత్ వినియోగం ఇలా.. (మిలియన్ యూనిట్లలో)

తేదీ	2023	2024	పెరుగుదల
01	56.02	70.90	26.65%
02	56.20	65.02	15.69%
03	63.20	70.02	10.79%
04	64.42	69.27	7.53%

సాక్షి, సిటీబ్యూరో: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు గ్రేటర్ వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయం ఎండకు ఉక్కపోత తోడవుతోంది. సాయంత్రం అనూహ్యంగా మేఘావృతం అవుతోంది. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఒకే రోజు భిన్నమైన వాతావరణం నెలకొంటోంది. అయితే.. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే.. ఈసారి పగటి ఉష్ణోగ్రతలు కూడా తక్కువే. ఉక్కపోతకు దోమలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఫలితంగా వర్షాకాలంలోనూ రోజంతా ఏసీలు, ఫ్యాన్లు ఆన్‌లో ఉంచాల్సి వస్తోంది. విద్యుత్ మీటర్లు గిరగిరా తిరుగుతూ నెలవారీ బిల్లు పెరుగుదలకు కారణమవుతున్నాయి. ప్రస్తుతం గ్రేటర్‌లో 62 లక్షల కనెక్షన్లు ఉండగా, వీటిలో 51 లక్షల గృహ, 7 లక్షలకుపైగా వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. మిగిలిన వాటిలో పారిశ్రామిక, ఇతర కనెక్షన్లు ఉన్నాయి. గత ఏడాది అక్టోబర్ మొదటి వారంతో పోలిస్తే.. ప్రస్తుతం రోజూ ఏదో ఒక ప్రాంతంలో వర్షం కురుస్తూనే ఉంది. వీధుల్లో వరదలు పోటెత్తుతూనే ఉన్నాయి. ఉక్కపోతకు తోడు దోమల మోత ఎక్కువైంది. సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో నమోదు కావాల్సిన విద్యుత్ వినియోగం.. వర్షాకాలంలో నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సెప్టెంబర్ 20న ఏకంగా 72.19 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదు కావడం గమనార్హం. ఏకధాటి వర్షాలకు తోడు విద్యుత్ వినియోగం భారీగా నమోదవుతుండటంతో ఫీడర్లపై ఒత్తిడి పెరిగి తరచూ ట్రిప్పవుతూ.. సరఫరాలో అంతరాయాలకు కారణమవుతోంది.

- సర్కిల్ ఆఫీసులు, మీ సేవ కేంద్రాల చుట్టూ పేదల చక్కర్లు
- సివిల్ సప్లయ్ అధికారులకు సైతం స్పష్టత కరువు

కొత్త రేషన్ కార్డులకు మోక్షమెప్పుడో?

లాగిన్ పునః ప్రారంభానికి లభించని గ్రీన్ సిగ్నల్

సాక్షి, సిటీబ్యూరో: ఈసారి కూడా కొత్త రేషన్ కార్డులకు మోక్షం లభించే పరిస్థితి కనిపించడం లేదు. అక్టోబర్ 2 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించిన సర్కారు.. నాలుగు రోజులు దాటినా ఆన్‌లైన్ లాగిన్ పునఃప్రారంభానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు రెండు రోజుల క్రితం ఫ్యామిలీ కార్డు కోసం పైలట్ ప్రాజెక్టుగా అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక కాలనీ చొప్పున సర్వేకు శ్రీకారం చుట్టడంతో ఇప్పట్లో కొత్త రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణ లేనట్లుగానే తెలుస్తోంది. గత ప్రభుత్వం కూడా కొత్త రేషన్ కార్డుపై ఆశలు కల్పించి.. చివరికి మొండిచేయి చూపించింది. గత నాలుగేళ్లుగా అసలు దరఖాస్తులు చేసుకునే పౌరసరఫరా శాఖ వెబ్‌సైట్ ఆన్‌లైన్ లాగిన్ కూడా నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన పది మాసాల నుంచి ప్రజలను ఆశల పల్లకిలో విహరింపజేస్తోంది. తాజాగా పరిస్థితి చివరి దశకు వచ్చినట్లు పేదలు భావించినా.. తిరిగి అదే పరిస్థితి పునరావృతమవుతోంది. నిరుపేదలు మాత్రం



సర్కిల్ ఆఫీసులు, మీ సేవ కేంద్రాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. సివిల్ సప్లయ్ అధికారులకు సైతం స్పష్టత కరువైంది.

ఎదురుచూపులే..

గ్రేటర్ పరిధిలో ఏళ్ల తరబడి కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. మొత్తమ్మీద సుమారు పది లక్షలపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు లేనట్లు తెలుస్తోంది. ఉపాధి కోసం వలస వచ్చిన కుటుంబాలు పెద్దఎత్తున ఇక్కడే స్థిరపడిపోయారు. దాదాపు కోటిన్నర జనాభా కలిగిన మహా నగరంలో సుమారు 40 లక్షల కుటుంబాలు ఉండగా అందులో దారిద్ర్య రేఖకు దిగువన కుటుంబాలు 27.21 లక్షలు వరకు ఉన్నట్లు అంచనా. అందులో 17.21 లక్ష కుటుంబాలు మాత్రమే తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్నాయి. మిగతా కుటుంబాలు రేషన్ కార్డులు లేక సంక్షేమ పథకాలు వర్తించక ఆందోళన చెందుతున్నారు.

పదేళ్లలో 1.21 లక్షలు మాత్రమే..

మహా నగర పరిధిలో గత పదేళ్లలో కొత్తగా మంజూరైన కార్డులు 1.21 లక్షలు మాత్రమే. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తెల్లరేషన్ కార్డులను ఆహార భద్రత కార్డులుగా మార్పు చేయడంతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఇబ్బడిముబ్బడిగా ప్రభుత్వం మంజూరు చేసింది. కొంత కాలానికి అనర్హుల పేరిట కొన్ని కార్డులను ఏరివేసి కార్డుల సంఖ్యను 15,99,639 కుదించారు. దీంతో తిరిగి కొత్త కార్డుల కోసం సుమారు 3.40 లక్షల కుటుంబాలు దరఖాస్తులు చేసుకోగా.. మూడున్నరేళ్ల క్రితం 360 డిగ్రీల స్థాయిలో వడబోసి దరఖాస్తులను మొక్కుబడిగా ఆమోదించి కొత్త కార్డులు మంజూరు చేసి చేతులు దులుపుకొంది.

డాటా ఎంట్రీ కాని దరఖాస్తులు

ఇప్పటికే సుమారు 5.73 లక్షల కుటుంబాలు కొత్త కార్డుల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాయి. అవి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు కావడంతో కనీసం డాటా ఎంట్రీ కూడా కానట్లు తెలుస్తోంది. పౌరసరఫరాల శాఖ ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఆ శాఖ పరిగణనలోకి తీసుకోనట్లు సమాచారం.



'డబుల్'కు నిఘా!

మూసీ నిర్వాసితులకు కేటాయించనున్న రెండు పడకగదుల ఇళ్లు

- వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న గృహాలకు గట్టి భద్రత
- విలువైన సామగ్రి మాయం కాకుండా కావలాకు చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తున్న ప్రభుత్వం.. వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న రెండు పడకగదుల గృహాల్లో ఎవరూ చొరబడకుండా చూడటంతో పాటు వాటిలోని విలువైన సామగ్రిని దొంగలు ఎత్తుకు వెళ్లకుండా ఉండేందుకు సెక్యూరిటీ గార్డుల నియామకానికి సిద్ధమైంది.

సెక్యూరిటీ గార్డుల నియామకాలకు టెండర్ల ఆహ్వానం..

- నగర శివార్లలోని మంఖాల్–1, మంఖాల్–2, జవహర్‌నగర్–3, అబ్దుల్లాపూర్, అహ్మద్‌గూడ, హట్టిగూడ, తట్టిఅన్నారం, తూంకుంట, మురహరిపల్లి, మాన్సాన్‌పల్లి–1, మాన్సాన్‌పల్లి–2 డబుల్‌బెడ్రూం హౌసింగ్ కాలనీల్లో సెక్యూరిటీ గార్డుల నియామకాల కోసం ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీల నుంచి టెండర్లను ఆహ్వానించింది. మూడు నెలల వ్యవధి కోసం సెక్యూరిటీ గార్డులు కావాలని కోరింది. ఆలోగా వాటిల్లో లబ్ధిదారులు చేరగలరని భావిస్తున్నారు. ఒక్కో గార్డుకు నెలకు దాదాపు రూ.15 వేలు చెల్లించనున్నారు.
- జీహెచ్ఎంసీ ఇప్పటికే నిర్మించిన ఇళ్లలో దాదాపు 4,500 ఖాళీగా ఉన్నాయి. వాటిని మూసీ నిర్వాసితులకు కేటాయిస్తున్నారు. ఇవికాక ఇంకొన్ని కాలనీల్లోని ఇళ్లలో సదుపాయాల్లేక ఇళ్లు పొందిన లబ్ధిదారులు వాటిలో చేరలేదు. ఇలా ఖాళీగా ఉన్న చాలా ప్రాంతాల్లోని ఇళ్లలో విలువైన కరెంట్ వైర్లు, శానిటరీ సామగ్రి వంటివి దొంగల పాలయ్యాయి. వినియోగంలో లేక నీటి సంపులు, బోర్ల జనరేటర్లు వంటివి పాడయ్యాయి.
- వాటిని తిరిగి ఏర్పాటు చేసేందుకు దాదాపు రూ. 30 కోట్ల వరకు ఖర్చుచేశారు. మూసీ నిర్వాసితులకు కేటాయించే ఇళ్లు సదుపాయాల్లేకుండా ఉంటే తీవ్ర విమర్శలు వెలువెత్తే పరిస్థితులు ఉండటంతో ఖాళీగా ఉన్న ఇళ్లలోని సామగ్రి దొంగల పాలు కాకుండా ఉండేందుకు, లబ్ధిదారులు కాకుండా ఇతరులు ఇళ్లలో మకాం వేయకుండా అడ్డుకునేందుకు సెక్యూరిటీ గార్డులను నియమించేందుకు అధికారులు టెండర్లు పిలిచారు. ఆయా కాలనీల్లో 200 మందికి పైగా సెక్యూరిటీ గార్డులను నియమించనున్నట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.



రవీంద్రభారతిలో..

సంబరంగా బతుకమ్మ

నగరంలో ఆదివారం వేర్వేరుగా జరిగిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మహిళా జర్నలిస్టులతో కలిసి ఆమె బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అలాగే.. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవీంద్రభారతిలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో మంత్రి సీతక్క సందడి చేశారు.

– పంజగుట్ట/గన్‌ఫౌండ్రీ



ప్రెస్‌క్లబ్‌లో..

బల్కంపేట ఎల్లమ్మ సన్నిధిలో కేంద్ర మంత్రి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బల్కంపేట ఎల్లమ్మను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం అమీర్‌పేట జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సినీ నటుడు గోపీచంద్ బల్కంపేట అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల్లో బీజేపీ సీనియర్ నేత బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, ఆలయ ఈఓ కృష్ణ, ఛైర్మన్ సాయిబాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

– అమీర్‌పేట




- నగర కొత్వాల్ ఆసక్తికర ట్వీట్లు
- ఎక్స్ వేదికగా వైరల్‌గా మారిన చర్చ
- నిజాం కాలేజీ జిందాబాద్ అంటూ ఎంపీ అసద్ వ్యాఖ్య

ఆనందమే జీవన మకరందం!





సాక్షి, సిటీబ్యూరో: బతుకమ్మ వేడుకలు, దాండియాలకు సంబంధించి 'ఎక్స్' వేదికగా ఆసక్తికర చర్చ జరిగింది. ఓ నెటిజనుడు అడిగిన ప్రశ్నకు కొత్వాల్ సీవీ ఆనంద్ తనదైన శైలిలో స్పందించారు. దీనికి తన వ్యాఖ్యను జోడించిన ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంభాషణను మరింత రక్తికట్టించారు. వందలాది స్పందనలతో ఈ ట్వీట్ ఆదివారం వైరల్‌గా మారింది. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ శనివారం పాతబస్తీలోని పేట్లబుర్జులో ఉన్న సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లారు. అక్కడ పోలీసు విభాగం ఏర్పాటు చేసిన బతుకమ్మ, దాండియా వేడుకల్లో సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ ఫొటోలు, వీడియోలను కొత్వాల్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. దీనిపై స్పందించిన ఓ నెటిజనుడు 1999 నాటి 'ప్రేమికుల రోజు' చిత్రంలోని 'దాండియా ఆటలు ఆడ' పాటలోని ఓ భాగాన్ని జోడించారు. దీంతో పాటు 'నిజం చెప్పండి... మీ స్కూల్, కాలేజీ రోజుల్లో దాండియా, బతుకమ్మతో ముడిపడిన ప్రేమకథలు ఉన్నాయా? అప్పట్లో మీరు కవితలు కూడా రాసి ఉంటారని భావిస్తున్నా' అంటూ వ్యాఖ్యానించారు. దీన్ని సానుకూలం దృక్పథంతో స్వీకరించిన ఆనంద్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. 'ఎన్నో ప్రేమ కథలు.. అయితే బతుకమ్మ, దాండియాలతో సంబంధం లేదు. మీరు కాసేపు మనసారా నవ్వుకునేలా నా పోస్టు ఉన్నందుకు సంతోషం' అంటూ ఆంగ్లంలో వ్యాఖ్యానించారు. దీంతో పాటు 'ఔర్ క్యా రహాహై జిందగీ మే! జరా హసీన్ మజాక్ హోజాయే హర్ దిన్' (జీవితంలో ఇంకా ఏం మిగిలింది.. ప్రతిరోజూ అందంగా, ఆనందంగా నవ్వుకోవడం తప్ప) అనే వ్యాఖ్యను ఆయన జోడించారు. దీనిపై పలువురు నెటిజనులు పోస్టులు, ట్యాగ్‌లు చేస్తుండగా... హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ రంగంలోకి వచ్చారు. సీవీ ఆనంద్‌ను ఉద్దేశిస్తూ 'నిజాం కాలేజీ జిందాబాద్' అంటూ పోస్టు చేశారు. కొత్వాల్ ఆనంద్, ఎంపీ అసదుద్దీన్ ఇద్దరూ క్లాస్‌మేట్స్ కావడమే కాదు.. నిజాం కాలేజీ పూర్వ విద్యార్థులు కావడం ఇక్కడ గమనార్హం.



నార్త్‌కు నిరాశేనా!



గతంలో మేడ్చల్ దాకా మెట్రోకు ప్రణాళికలు	ప్రస్తుతం రెండో దశలో 116.2 కి.మీ.లకే పరిమితం

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రెండో దశ ప్రాజెక్టు నార్త్ హైదరాబాద్‌ను తీవ్ర నిరాశకు గురిచేసింది. సికింద్రాబాద్, ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ మీదుగా ఔటర్‌రింగ్ రోడ్డు వరకు మెట్రో విస్తరణకు గత ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించింది. కానీ.. ఇటీవల హైదరాబాద్ మెట్రోరైల్ ప్రకటించిన రెండో దశ డీపీఆర్‌లో ఉత్తరం వైపు మెట్రో ప్రస్తావన లేకపోవడం పట్ల తాజాగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు మేడ్చల్ మెట్రో సాధన సమితి ప్రతినిధులు ఇటీవల హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో నగరానికి నలువైపులా మెట్రో సేవలను విస్తరించేలా 278 కిలోమీటర్ల మేర ప్రణాళికలను రూపొందించగా.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు 6 కారిడార్‌లలో 116.2 కిలోమీటర్లకే పరిమితం చేసింది. ఎయిర్‌పోర్టుతో పాటు కొత్తగా ప్రతిపాదించిన ఫోర్త్‌సిటీకి సైతం మెట్రో విస్తరించనున్నట్లు పేర్కొంది. గతంలోనే ప్రణాళికలను సిద్ధం చేసినప్పటికీ రెండో దశలో నార్త్‌సిటీ ప్రస్తావన లేకపోవడం గమనార్హం.

డబుల్ డెక్కర్ మెట్రో ఎక్కడ?

జంట నగరాలతో పాటు ఉత్తర తెలంగాణలోని అయిదు జిల్లాల ప్రజలు, వాహనదారుల ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించింది. ఇదే మార్గంలో మెట్రో రైల్ నిర్మాణం చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమధ్య ప్రకటించినా ఇప్పటి వరకు ఈ దిశగా ఎలాంటి పురోగతి లేదు. ప్రస్తుతం ఈ రూట్‌లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఎలాంటి నిధులను కేటాయించలేదు. భూసేకరణ దశకే ఈ ప్రాజెక్టు పరిమితమైంది. ప్యారడైజ్ జంక్షన్ నుంచి తాడ్‌బండ్, బోయినపల్లి జంక్షన్ల మీదుగా డెయిరీఫాం రోడ్డు వరకు ఆరు వరుసల్లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఇది పూర్తయిన తర్వాత ఈ ఎలివేటెడ్ కారిడార్‌పై మెట్రో నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదన ఉంది. ప్రస్తుతం ఈ రూట్‌లో ప్రతిరోజూ లక్షలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. నగరవాసులు సిటీ బస్సులపై ఆధారపడి ప్రయాణం చేయాల్సివస్తోంది. పలుచోట్ల రహదారులు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారు రూ.1,580 కోట్ల అంచనాలలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించి, అదే రూట్‌లో డబుల్ డెక్కర్ మెట్రో కారిడార్‌ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదించారు. కానీ ఎలాంటి పురోగతి లేకుండాపోయింది.

మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆవిర్భావం..

- నార్త్ సిటీకి మెట్రో నిర్మాణం చేపట్టాలనే డిమాండ్‌తో ఆవిర్భవించిన మేడ్చల్ మెట్రోసాధన సమితి ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ నేతృత్వంలో మేడ్చల్ సాధన సమితి ఆవిర్భవించింది. గత ప్రభుత్వం ప్రతిపాదించిన విధంగా జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి తూంకుంట వరకు 17 కిలోమీటర్ల మార్గంలో డబుల్ ఎలివేటెడ్ ఫ్లై ఓవర్, మెట్రో రైల్ నిర్మాణం చేపట్టాలని, , ప్యారడైజ్ నుంచి కండక్లకోయ వరకు 12 కి.మీ మార్గంలో, ఓఆర్ఆర్ మేడ్చల్ ఇంటర్‌ఛేంజ్‌కు రాకపోకలు సాగించేలా మెట్రో సదుపాయం కల్పించాలని ఈ సంఘం డిమాండ్ చేస్తోంది.
- అలాగే గతంలో ప్రతిపాదించినట్లుగా ఉప్పల్ క్రాస్‌రోడ్ నుంచి ఘట్‌కేసర్ ఓఆర్ఆర్– బీబీ నగర్ వరకు 25 కిలోమీటర్లు, తార్నాకా ఎక్స్ రోడ్– ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్ వరకు 8 కిలోమీటర్ల మేర మెట్రో చేపట్టాలనే డిమాండ్లు ఊపందుకుంటున్నాయి. మరోవైపు ప్రతిరోజూ లక్షలాది మంది రాకపోకలు సాగించే సూరారం, కుత్బుల్లాపూర్ ప్రాంతాలకు మెట్రో విస్తరణ చేపట్టాలని, ఎల్‌బీనగర్–మియాపూర్ రూట్‌లోని భరత్‌నగర్ నుంచి మూసాపేట్ మీదుగా సూరారం, కుత్బుల్లాపూర్ వరకు మెట్రో విస్తరించాలని ఆ ప్రాంతాల్లోని వివిధ కాలనీల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

నవ్యనాటక సమితి కృషి అభినందనీయం



నృత్య గురువులను సత్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

నాంపల్లి: భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే శాస్త్రీయ సంగీత, నృత్య రీతుల్లో జాతీయ స్థాయిలో 1961 నుంచి పోటీలు నిర్వహిస్తూ యువ కళాకారులను ప్రోత్సహిస్తున్న నవ్య నాటక సమితి కృషి అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. ఆదివారం మాసబ్‌ట్యాంక్ నఫీజ్ రెసిడెన్సీ గాయత్రీ సదనంలో నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 49వ జాతీయ స్థాయి సంగీత, నృత్య పోటీల అభినందన సభ జరిగింది. పోటీల నిర్వాహణలో ముఖ్య భూమిక పోషించిన నృత్య గురువులు నిష్టల సుధామాల, డాక్టర్ ఇందిరా హేమలను ఆయన సత్కరించారు. దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన యువ కళాకారులను ఒకే వేదికపైకి చేర్చడం ద్వారా జాతీయ సమైక్యతకు, సమగ్రతకు తోడ్పడటం అభినందనీయమన్నారు. యువ కళాకారులు దేశ సాంస్కృతిక రాయబారులన్నారు. 49వ రాష్ట్ర ఖజానా, గణాంకాల శాఖ ఉప సంచాలకురాలు డాక్టర్ వసుంధర మాట్లాడుతూ.. సంగీత నృత్య పోటీల్లో పాల్గొనే ఔత్సాహిక కళాకారులే కాక గురువులు కూడా అనేక విషయాలు నేర్చుకునే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నృత్య గురువులు మధుమతి కులకర్ణి, వి.వాణీ రమణ, ఆచార్య ఏలేశ్వరపు చలపతి శాస్త్రి, నవ్య నాటక సమితి అధ్యక్షులు వేమరాజు విజయ్ కుమార్ పాల్గొన్నారు.


మాకూ ఓ అసోసియేషన్ కావాలి?

- ప్రస్తుత తరుణంలో అనివార్యమైన అవసరం
- నిర్ణయించిన డీఎస్పీ, అదనపు, 'నాన్' ఎస్పీలు
- డీజీపీని కలిసి వినతిపత్రం ఇచ్చిన ఓ బృందం
- విముఖంగా ఉండటంతో ప్రత్యామ్నాయాలపై దృష్టి

సాక్షి, సిటీబ్యూరో: సాధారణంగా పోలీసు విభాగంలో పై అధికారుల వల్ల కింది స్థాయి ఉద్యోగులు ఇబ్బంది పడుతూ ఉంటారు. కొన్నిసార్లు చేయని తప్పుకూ బలవుతారు. అయితే అసోసియేషన్ ఏర్పాటు విషయంలో మాత్రం 'పై వారు', 'కింది వారు' బాగానే ఉన్నా...'మధ్యలోని వారికే' ఇబ్బంది ఎదురైంది. దీని ఏర్పాటుకు అనుమతించడం పట్ల రాష్ట్ర డీజీపీ విముఖంగా ఉండటంతో మూడు స్థాయిలకు చెందిన అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఎన్నో విభాగాలు ఉన్నా.. కత్తి మీద సాము లాంటి ఉద్యోగం పోలీసులదే. హాట్ టాపిక్స్‌గా మారిన 'మూసీ ప్రాజెక్ట్', హైడ్రాలతో పాటు ఏ విభాగం ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నా ఫ్రంట్‌లైన్‌లో ఉండాల్సింది మాత్రం పోలీసులే. ఈ కారణంగానే అనేక సార్లు అకారణంగా సిబ్బంది, అధికారులు మాటపడాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో ప్రతిపక్షాల రాజకీయ దాడులు తప్పట్లేదు. ఆయా సందర్భాల్లో ఎదురుదాడి చేయడంతో పాటు తమ వాణి వినిపించడానికి, ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి వినతులు సమర్పించడానికి తమకూ ఓ అసోసియేషన్ కావాలని డీఎస్పీ, అదనపు ఎస్పీ, నాన్-క్యాడర్ ఎస్పీ స్థాయి అధికారులు భావించారు. పోలీసు విభాగంలో హోంగార్డు నుంచి డీజీపీ వరకు వివిధ ర్యాంకులకు చెందిన వాళ్లు ఉంటారు. హోంగార్డులకు ఓ అసోసియేషన్ ఉండగా..కానిస్టేబుల్ నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల వరకు ప్రాతినిధ్యం వహించడానికి పోలీసు అధికారుల సంఘమే ఉంది. ఎస్పీ నుంచి డీజీపీ వరకు సభ్యులుగా ఉండే ఐపీఎస్ ఆఫీసర్స్ అసోసియేషనూ కొన్నేళ్లుగా పనిచేస్తోంది. పోలీసు అధికారుల సంఘమైతే ప్రభుత్వ ఉత్తర్వులో ఏర్పడిన విభాగం కాగా..ఇటీవలే దాని బైలాస్‌ను కూడా మారుస్తూ సర్కారు మరో ఉత్తర్వు జారీ చేసింది. అకారణంగా పోలీసులు టార్గెట్‌గా మారిన ప్రతి సందర్భంలోనూ ఈ అసోసియేషన్లు స్పందిస్తూ వచ్చాయి. ఇబ్బందిపడుతున్న వారికి బాసటగా నిలవడంతో పాటు వాస్తవాలను ఎత్తిచూపుతూ, ప్రజలకు అర్థమయ్యేలా పత్రికా ప్రకటనల విడుదల, విలేకరుల సమావేశాలు నిర్వహణ చేస్తున్నాయి. అయితే డీఎస్పీ, అదనపు ఎస్పీ, నాన్-క్యాడర్ ఎస్పీ హోదాల్లో పని చేసే అధికారులకు మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి అసోసియేషన్ లేదు. తాజా పరిణామాల నేపథ్యంలో తమకూ ఓ అసోసియేషన్ ఉండాలని ఈ మూడు ర్యాంకుల అధికారులు భావించారు. వీరితో కూడిన ఓ బృందం సవివరంగా వినతిపత్రాన్ని తయారు చేసి రెండు రోజుల క్రితం రాష్ట్ర డీజీపీని కలిసింది. తాము అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించడంతో పాటు జీవో జారీకి అవసరమైన సిఫార్సులు ప్రభుత్వానికి చేయాలని సూచించింది. అయితే ఆయన నుంచి విముఖత వ్యక్తం కావడంతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. ప్రస్తుతం హోమ్ శాఖ సైతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధీనంలోనే ఉంది. ఈ నేపథ్యంలోనే త్వరలోనే ఆయన్ను కలిసి తమ సమస్య, డిమాండ్‌ను విన్నవించాలని భావిస్తున్నారు. తమకూ అసోసియేషన్ ఆవశ్యకతను గుర్తించి ప్రభుత్వమైనా సానుకూలంగా స్పందించాలని ఆయా అధికారులు ఆకాంక్షిస్తున్నారు.

'దసరా' దొంగలున్నారు జాగ్రత్త!

- శివార్లలో చోరీల హల్‌చల్
- పండగల వేళ అధికంగా దొంగతనాలు
- అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసుల సూచన



సాక్షి, సిటీబ్యూరో: దసరా సెలవులు వచ్చేశాయి. క్రమంగా నగరవాసులు సొంతూర్లకు పయనమవుతున్నారు. ఇదే చోరులకు సరైన సమయం. నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాలలో చోరీలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గతేడాది దసరా పండుగ నేపథ్యంలో గ్రేటర్‌లో అధికంగా ఇళ్లలో చోరీ కేసులు నమోదయ్యాయి. దీంతో ఈసారి పోలీసులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే శివారు ప్రాంతాల్లో రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ల పోలీసులు నైట్ పెట్రోలింగ్ పెంచారు. గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, వ్యక్తిగత గృహాలపై నిరంతరం నిఘా పెట్టారు. జైలు నుంచి విడుదలైన పాత నేరస్తులు, నేపాలీ పని మనుషుల కదలికలను ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు.

పండగ సమయాల్లో అధికంగా చోరీలు..

మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలు, స్థానికంగా ఇతర జిల్లాల్లో ఉండే చోరులు పండుగ సమయాలను అనువుగా భావిస్తుంటారు. రైళ్లు, బస్సుల్లో నగరానికి చేరుకొని, శివారు ప్రాంతాల్లో తలదాచుకుంటారు. రాత్రి సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతుంటారు. దీంతో సాధారణ రోజులతో పోలిస్తే పండగ వేళ చోరీలు అధికంగా నమోదవుతున్నాయి. ఎక్కువగా శివారు ప్రాంతాల్లోని పోలీసు స్టేషన్ల పరిధిలో దొంగతనాలు జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆయా స్టేషన్ల పరిధిలో సైకిల్, నైట్ పెట్రోలింగ్‌లతో గల్లీగల్లీలో నిఘా పెట్టాలని, నిరంతరం సీసీటీవీ కెమెరాలతో పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు.

సైబరాబాద్ పోలీసుల సూచనలివీ..

- బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోండి లేదంటే మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోండి.
- సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్‌ను ఏర్పాటు చేసుకోవడం మంచిది. అలాగే ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ తాళం ఏర్పాటు చేసుకోవడం శ్రేయస్కరం.
- మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేయండి. నమ్మకమైన వాచ్‌మెన్‌లను మాత్రమే సెక్యూరిటీ గార్డుగా నియమించుకోవాలి.
- మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్, పాల ప్యాకెట్లు వంటివి జమ కానివ్వకుండా చూడాలి. వాటిని గమనించి ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకొని దొంగలు చోరీలకు పాల్పడుతుంటారు.
- ఇంటి లోపల మరియు బయట కొన్ని లైట్లు వేసివుంటే మంచిది.
- సోషల్ మీడియాలో మీరు బయటికి వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడం మంచిది కాదు.

హత్య చేసి 8 నెలలకు చిక్కాడు!

- ఈ ఏడాది జనవరి 31న వృద్ధురాలి హత్య
- సొత్తు కోసం చంపేసిన ఇద్దరు బిహారీలు
- గాలించి పట్టుకున్న నగర టాస్క్‌ఫోర్స్

సాక్షి, సిటీబ్యూరో: బీహార్‌లోని మధుబిన జిల్లాలో ఉన్న సుజోల్ గ్రామం...నేపాల్ సరిహద్దుకు కేవలం 35 కిమీ దూరంలో ఉన్న ఈ ఊరు నేరగాళ్లకు కేరాఫ్ అడ్రస్. దేశ వ్యాప్తంగా వివిధ నగరాలకు వలస వెళ్లే ఈ గ్రామస్తులు పని వారుగా చేరతారు. నమ్మకంగా ఉంటూ గొంతు కోసి ఉడాయిస్తారు. ఇదే పంథాలో దోమలగూడ పరిధిలో వృద్ధురాలిని చంపి, సొత్తు, సొమ్ము దోచుకుపోయిన ఇరువురు సుజోల్ వాసులు ఎనిమిది నెలలు అజ్ఞాతంలో ఉన్నారు. వీరి కోసం ముమ్మరంగా గాలించిన మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు కీలక నిందితుడిని శనివారం అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపారు. సుజోల్‌కు చెందిన మహేష్‌కుమార్ ముఖియా 2023 డిసెంబర్ నగరానికి వలసవచ్చాడు. తన సోదరి వద్ద ఉంటూ..స్నేహితుడి ద్వారా దోమలగూడకు చెందిన సువర్య పవన్ గుప్త ఇంట్లో కేర్ టేకర్‌గా చేరాడు. గుప్త తల్లి స్నేహలత దేవి (62) వయసు రీత్యా అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆమెకు సపర్యలు చేస్తూ నమ్మకం సంపాదించుకున్నాడు. గుప్తతో పాటు ఆయన కుటుంబీకులు ప్రతి రోజూ తమ వ్యాపార కార్యకలాపాల కోసం ఉదయం వెళ్లి రాత్రికి తిరిగి వస్తుంటారు. ఆ సమయంలో స్నేహలత మాత్రమే ఇంట్లో ఉంటుంది. ఈ విషయం తెలిసిన మహేష్ ఆమెను బంధించి, ఇంట్లో ఉన్న సొమ్ము, సొత్తు కాజేయాలని పథకం వేశాడు. దీనికి సహకరించడానికి తన స్వగ్రామానికే చెందిన మనోజ్ ముఖ్యాను పిలిపించుకున్నాడు. ఈ ఏడాది జనవరి 27న వచ్చిన ఇతగాడు మహేష్ వద్దే ఉన్నాడు. వృద్ధురాలిని బంధించడానికి, నోటికి వేయడానికి అవసరమైన తాళ్లు, టేపు తదితరాలతో పాటు ఓ బ్యాగ్‌ను ఖరీదు చేశాడు. జనవరి 31న ఎప్పటిలానే పనికి వచ్చిన మహేష్...కుటుంబీకులు అంతా బయటకు వెళ్లిన తర్వాత మనోజ్‌ను రప్పించాడు. ఆ సమయంలో హాలులోని సోఫాను ఆనుకుని కూర్చున్న స్నేహలతపై ఇరువురూ దాడి చేశారు. ఆమె నోట్లో వస్త్రాలు కుక్కడంతో పాటు ప్లాస్టర్ వేశారు. కాళ్లు, చేతులు కుర్చీకి కట్టి అల్మారాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువులు తీసుకుని ఉడాయించారు. ఈ సొత్తును పంచుకున్న నిందితులు ఎవరిదారిని వాళ్లు నగరం వదిలి పరారయ్యారు. మహేష్ కుమార్ సిటీ నుంచి ఢిల్లీ వెళ్లి అట్నుంచి గోవా చేరుకున్నాడు. దాదాపు మూడు నెలల తర్వాత తన గ్రామానికి వెళ్లి మళ్లీ ఢిల్లీకి వచ్చాడు. స్నేహలత హత్యపై దోమలగూడ ఠాణాలో కేసు నమోదైంది. ఈ నిందితుల కోసం మధ్య మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామకృష్ణ నేతృత్వంలో ఎస్సై సీహెచ్ నవీన్‌కుమార్ నేతృత్వంలోని బృందం రంగంలోకి దిగింది. ఎనిమిది నెలల నుంచి మహేష్, మనోజ్‌ల కదలికలపై నిఘా ఉంచింది. ఎట్టకేలకు మహేష్ నగరానికి వచ్చాడని, మరో ఇంట్లో పనిలో చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాడని తెలుసుకుని పట్టుకుంది. పరారీలో ఉన్న మజోన్ కోసం గాలింపు కొనసాగిస్తోంది. మధుబని జిల్లాకు చెందిన అనేక మంది ఇలానే దేశ వ్యాప్తంగా నేరాలు చేస్తున్నారని, తమ 'పని' పూర్తయిన తర్వాత నేపాల్ పారిపోతున్నారని అధికారులు చెప్తున్నారు. ఎవరినైనా పనిలో చేర్చుకునే ముందు పూర్వాపరాలు పరిశీలించాలని కోరుతున్నారు.



మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

ప్రయాణికులతో కిటకిట..



ఉప్పల్‌లో..

బస్సులు, రైళ్లలో పెరుగుతున్న రద్దీ

సాక్షి, సిటీబ్యూరో: దసరా రద్దీ మొదలైంది. పిల్లలకు సెలవులు ప్రకటించడంతో నగరవాసులు సొంత ఊళ్లకు తరలి వెళ్తున్నారు. దీంతో రెండు రోజులుగా బస్సులు, రైళ్లలో రద్దీ పెరిగింది. ఆదివారం కూడా బస్సులు కిక్కిరిసి బయలుదేరాయి. అన్ని రెగ్యులర్ రైళ్లలోనూ రద్దీ పెరిగింది. పండుగల సందర్భంగా పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. డిమాండ్ మేరకు రైళ్లు లేకపోవడం ప్రధానమార్గాల్లో రాకపోకలు సాగించే రైళ్లలో వెయిటింగ్‌లిస్ట్ వందల్లోకి చేరింది. మరోవైపు ప్రస్తుత దసరా రద్దీని దృష్టిలో ఉంచుకొని 6 వేల ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. సాధారణ రోజుల్లో నడిచే సుమారు 3500 బస్సులకు ఇవి అదనం. అన్ని ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సదుపాయం కొనసాగనుంది. మహాత్మాగాంధీబస్‌స్టేషన్‌తో పాటు, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్, ఎల్‌బీనగర్, సాగర్‌రింగ్‌రోడ్డు, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. రెండు రోజులుగా రెగ్యులర్ బస్సుల్లోనే జనం తరలి వెళ్తున్నారు. రద్దీ మేరకు బస్సులను అదనంగా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి 13 వరకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. ప్రస్తుతం వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, కర్నూలు, విజయవాడ వైపు ప్రయాణాలు పెరిగినట్లు పేర్కొన్నారు. ప్రయాణికుల డిమాండ్, రద్దీ ఎక్కువగా ఉండే కూకట్‌పల్లి, మియాపూర్, ఏఎస్‌రావునగర్, సైనిక్‌పురి, ఈసీఐఎల్, తదితర ప్రాంతాల నుంచి కూడా నేరుగా బస్సులను నడిపేందుకు చర్యలు చేపట్టారు. మరోవైపు ఉప్పల్, ఎల్‌బీనగర్, తదితర చోట్ల ప్రయాణికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జనరల్ బోగీలకు డిమాండ్...

ఇక ఇప్పటికే అన్ని రైళ్లలో స్లీపర్, ఏసీ బోగీల్లో బెర్తులు బుక్ అయ్యాయి. ప్రస్తుత దసరాకే కాదు. సంక్రాంతి వరకు కూడా బెర్తులు అందుబాటులో లేవు, దీంతో దసరా రద్దీ దృష్ట్యా ప్రయాణికులు సాధారణ బోగీలపైన ఆధారపడవలసిన పరిస్థితి నెలకొంది. 18 నుంచి 24 బోగీలు ఉన్న రైళ్లలో కేవలం 2 లేదా 3 జనరల్ బోగీలే ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



ఎంజీబీఎస్‌లో..





ఎల్బీనగర్‌లో..



ఉప్పల్‌లో..

మద్యం మత్తులో బస్సుకు ఎదురెళ్లి..

జీడిమెట్ల: మద్యం మత్తులో ఓ వ్యక్తి కావాలని బస్సుకు గుద్దుకుని మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్ తెల్పిన వివరాల ప్రకారం.. ఆదివారం ఓ వ్యక్తి (25-30) పూటుగా మద్యం సేవించి రోడ్డుపై వస్తున్న వాహనాలకు అడ్డుగా వెళ్తున్నాడు. ఇది గమనించిన మహ్మద్ అబ్బాస్ అనే వ్యక్తి అతన్ని రోడ్డు పక్కకు తీసుకువచ్చి అక్కడ కూర్చోబెట్టాడు. సదరు గుర్తు తెలియని వ్యక్తి తిరిగి మద్యం మత్తులో రోడ్డుకు అడ్డంగా పరుగెత్తాడు. అదే సమయంలో కాచిగూడ డిపోకు చెందిన బస్సు (ఏపీ11 జెడ్2703) బాలానగర్ నుండి గండిమైసమ్మ వైపు వెళ్తుంది. సదరు వ్యక్తి వేగంగా వెళ్లి బస్సు ఎడమవైపుకు తాకి కిందపడి బస్సు కిందకు దొర్లాడు. దీంతో చాతికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అబ్బాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పై ఫోటోలోని వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే జీడిమెట్ల పీఎస్ పరిధిలో సంప్రదించాలని పోలీసులు కోరారు. కాగా ఈ సంఘటనలో తన తప్పేమీ లేదని ఆర్టీసీ డ్రైవర్ పేర్కొన్నాడు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



గాయపడిన అక్షిత

శంషాబాద్ రూరల్: వీధి కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఘాంసిమియాగూడలో ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. గ్రామంలో నీరటి రాజు కూతురు అక్షిత(4) ఇంటి ముందు ఆడుకుంటుండగా..వీధి కుక్కలు దాడి చేశాయి. చిన్నారి మొఖంపై కుక్కకాటుతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తీర్థయాత్రల పేరిట మోసం.. పోలీసులకు ఫిర్యాదు



భరత్‌కుమార్ శర్మ (ఫైల్)

ఉప్పల్: తీర్థ యాత్రలకు పంపిస్తామని రూ.లక్షల్లో దండుకుని ఓ ట్రావెల్స్ ఓనర్ బిచాణా ఎత్తి వేయడంతో వందలాది మంది బాధితులు లబోదిబో మంటూ ఉప్పల్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు వలపన్ని నిందితున్ని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పల్ హైకోర్టు కాలనీలో నివాసం ఉండే భరత్‌కుమార్ శర్మ (45) గాయత్రీ టూర్స్ అండ్ ట్రావెల్స్ నడుపుతున్నాడు. పలు ప్యాకేజీల పేరుతో తీర్థయాత్రలకు తీసుకెళ్తామని భక్తి చానల్స్ ద్వారా ప్రచారం చేసేవాడు. మానస సరోవరం లాంటి అరుదైన ప్రదేశాలకు తీసుకెళ్తానని చెప్పుకొచ్చాడు. దీనికి ఆకర్షితులైన పలువురు విశ్రాంత ఉద్యోగులు, వ్యాపారులు ఒక్కొక్కరు దాదాపుగా రూ.2 నుంచి 3 లక్షల వరకు చెల్లించారు. ఇలా వందలాది మంది వద్ద డబ్బులు తీసుకుని రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నాడు. దీంతో విసుగు చెందిన బాధితులు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు భరత్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నట్లు ఉప్పల్ ఎస్ఐ మధు తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన వినోద్ కుమార్

కాచిగూడ: రైలు ఢీకొని యువకుడు మృతిచెదిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం.చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్, కాటేదాన్ ప్రాంతానికి చెందిన వినోద్ కుమార్ (30) బుద్వేల్ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రోరైల్ రూట్‌లో మార్పులు చేయండి



కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుక్కుగూడ: మహానగరంలో చేపడుతున్న హైదరాబాద్ మెట్రోరైల్ రెండో విడతకి సంబంధించిన కారిడార్ 04, 09లో మార్పులు చేయాలని ఆదివారం మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ నాయకులు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నగరంలోని ఆయన నివాసంలో కలిసిన వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ.. రెండో విడతలో మెట్రో రైలు నాగోల్‌లో ప్రారంభమై ఎల్బీనగర్, మంద మల్లమ్మ, చాంద్రాయణగుట్ట, ఆరంఘర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు (36 కి.మీ), శంషాబాద్ నుంచి ఫోర్త్‌సిటీ వరకు (40 కి.మీ).. మొత్తం 76 కిలోమీటర్ల రూట్‌ను నిర్వాహకులు ప్రకటించారని తెలిపారు. అలా కాకుండా ఎల్బీనగర్, మంద మల్లమ్మ, బాలాపూర్ చౌరస్తా, ఆర్‌సీఐ, మహేశ్వరం గేటు నుంచి ఫోర్త్‌సిటీ వరకు కేవలం 41 కిలోమీటర్లలో లైన్ పూర్తి చేయొచ్చని అన్నారు. దీని ద్వారా ప్రభుత్వానికి వ్యయం తప్పడంతోపాటు మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రోరైల్ ఎండీని సైతం కలుస్తామని వెల్లడించారు. వినతిపత్రం అందజేసిన వారిలో తుక్కుగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగేల హేమలత, మాజీ చైర్మన్ కె.మధుమోహన్, పార్టీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, మీర్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రహమత్‌నగర్‌: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని రెడ్‌క్రాస్‌ సొసైటీ ప్రతినిధి మహ్మద్‌ షబ్బీర్‌ కోరారు. రెడ్‌క్రాస్‌ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్‌ఎఫ్‌నగర్‌ ఫేజ్‌-1 బస్తీ మసీదు వద్ద శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజవంతమైంది. రెడ్‌క్రాస్‌ సొసైటీ ప్రతినిధి మహ్మద్‌ షబ్బీర్‌ నేతృత్వంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పలు ఆసుపత్రులకు చెందిన వైద్య సిబ్బంది వివిధ రకాలైన వైద్య చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా మహ్మద్‌ షబ్బీర్‌ మాట్లాడుతూ రెడ్‌క్రాస్‌ సొసైటీ బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిరుపేదలు నివాసముండే హెచ్‌ఎఫ్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరికొన్ని ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నామన్నారు. వైద్యాధికారిణి డా. నిహారిక, డా. భాను, డా.తిరుమల్‌, వైద్య సిబ్బంది విజయేందర్‌, ఆర్గనైజర్‌ అబూబకర్‌, యండి సలీం, మసీదు కమిటీ అధ్యక్షుడు జేసుదరజ్‌ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడితో రెట్టింపు లాభాలు ఇస్తానని మోసం

బంజారాహిల్స్‌: వ్యాపారంలో పెట్టుబడులు పెడితే రెట్టింపు లాభాలు ఇస్తానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై జూబ్లీహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. సికింద్రాబాద్‌ పద్మారావునగర్‌కు చెందిన ఓ మహిళ (56)కు తన కూతురు స్నేహితుడు కార్తీక్‌రెడ్డి పరిచయం అయ్యాడు. ఆమె ఫోన్‌ నెంబర్‌ తీసుకుని గత ఏడాది అక్టోబర్‌ నుంచి తరచూ ఫోన్‌లో మాట్లాడసాగాడు. ఈ క్రమంలో డీఎస్‌ఆర్‌ గ్రూపు యజమాని తన మేనమామ అని, తనకు చాలా వ్యాపారాలు ఉన్నాయని చెప్పాడు. తాను చెప్పినట్లు వ్యాపారంలో డబ్బులు పెడితే రెట్టింపు ఇస్తానని చెప్పాడు. దీంతో అతడి మాటలు నమ్మిన సదరు మహిళ సుమారు కేజీ బంగారాన్ని ఇచ్చింది. ఆ తరువాత ఆమె ఇచ్చిన బంగారాన్ని ఇవ్వకపోగా, ఆమె ఫోన్లకు స్పందించడం మానేశాడు. దీంతో తాను మోసపోయానని తెలుసుకుని పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అక్కడి పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేసి జూబ్లీహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. జూబ్లీహిల్స్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

వెంగళరావునగర్‌: సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురు నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్‌ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... ఏపీలోని చిలకలూరిపేట ప్రాంతానికి చెందిన కోటేశ్వరమ్మ మధురానగర్‌కాలనీ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తుంది. ఆమెకు తన స్నేహితుడు శివకృష్ణ ద్వారా గచ్చిబౌలిలో ఉంటున్న వెంకటేష్‌ పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో తనకు ఉద్యోగం కావాలని ఆమె కోరింది. వెంకటేష్‌ సాఫ్ట్‌వేర్‌లో జాబ్స్‌ ఉన్నాయని, దానికోసం రూ.2లక్షల వరకు ఖర్చవుతుందని, ముందుగా రూ.30 వేలు చెల్లించాలని చెప్పాడు. ఆమె దానికి అంగీకరించి రూ.50 వేలు అతనికి ఆన్‌లైన్‌లో పంపింది. అంతేగాకుండా తనకు తెలిసిన మరో 20 మంది యువతుల నుంచి రూ.2.80 లక్షల వరకు అతనికి ఇప్పించింది. ఉద్యోగాలు ఇప్పించకుండా రూ.3.30 లక్షల వరకు వారి వద్ద వసూలు చేశాడు. బాధితులు ఆ సాఫ్ట్‌వేర్‌ కంపెనీలపై ఆరా తీయగా మోసపూరితమని తేలింది. దీంతో తమను మోసం చేసిన వెంకటేష్‌పై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర ప్రదర్శన

శ్రీనగర్‌కాలనీ: అమీర్‌పేట కమ్మ సంఘంలో మినిస్ట్రీ ఆఫ్‌ టెక్స్‌టైల్స్‌ గవర్నమెంట్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో స్పెషల్‌ ఈవెంట్‌ ఎక్స్‌పో పేరిట ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శన మహిళలను అమితంగా ఆకట్టుకుంటుంది. ప్రదర్శనలోని రంగురంగుల చీరలు మగువల మనసు దోచుకుంటున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన నిష్ణాతులైన చేనేతకారుల సిల్క్‌, కాటన్‌ వస్త్రాలు ఎక్స్‌పోలో ఉన్నాయని, ఈనెల 15వ తేదీ వరకూ ఈ చేనేత ప్రదర్శన వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని మినిస్ట్రీ ఆఫ్‌ టెక్స్‌టైల్స్‌ వీవర్స్‌ సర్వీస్‌ సెంటర్‌ హెడ్‌ ఆఫ్‌ ఆఫీస్‌ డాక్టర్‌ అరుణ్‌కుమార్‌ తెలిపారు.

శుభాకాంక్షలు

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణా రాష్ట్ర ఎంపీల ఫోరం కన్వీనర్‌గా ఎంపికైన ఎంపీ డాక్టర్‌ మల్లురవిని వారం కన్స్యూమర్‌ రైట్స్‌ ప్రొటెక్షన్‌ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్‌ పీవీ రవిశేఖర్‌రెడ్డి ఆదివారం ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ముందుకు కదల్లేక.. వెనక్కు వెళ్లలేక..!

ట్రాఫిక్‌ దిగ్బంధంలో పెద్దమ్మ గుడి పరిసరాలు

- భక్తులు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- ఉత్సవాలకు ముందే కరువైన సమన్వయ సమావేశాలు
- నగర సీపీ చొరవ చూపితేనే పరిస్థితిలో మార్పు



జూబ్లీహిల్స్‌ రోడ్డునెంబర్‌-36 పెద్దమ్మ గుడి రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్‌..

బంజారాహిల్స్‌: ఆలయ అధికారులు, పోలీసు శాఖ సమన్వలోపం కారణంగా పెద్దమ్మతల్లి ఆలయ పరిసరాలు ప్రతీ ఆదివారం ట్రాఫిక్‌ జాంతో ప్రయాణికులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారంలో ఒకరోజు ఈ దారిగుండా వెళ్లాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవం జరిగినా.. మహంకాళి అమ్మవారి బోనాల జాతర సమయంలో ట్రాఫిక్‌, లాఅండ్‌ ఆర్డర్‌ పోలీసులు, ఆలయాల యాజమాన్యాలు, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయ సమావేశాలను ఏర్పాటు చేసుకుని భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ రూపొందించుకుంటారు. అయితే జూబ్లీహిల్స్‌ పెద్దమ్మ దేవాలయానికి వచ్చే సరికి వేలాదిగా భక్తులు వస్తున్నారని తెలిసినా పోలీసులు, ఆలయ ఈఓ, జీహెచ్‌ఎంసీ ఏనాడూ సమీక్ష సమావేశాలు నిర్వహించిన పాపానపోలేదు. ఫలితంగా పెద్దమ్మ గుడిలో మంగళ, శుక్ర, ఆదివారాలతో పాటు శాకాంబరి ఉత్సవాలు, రథోత్సవాలు, దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వచ్చాయంటేనే భక్తుల పాట్లు.. వాహనదారుల ఇక్కట్లు అంతా ఇంతా కాదు. ఆదివారం నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పెద్దమ్మ తల్లిని దర్శించుకునేందుకు నగరం నలుమూలల నుంచి తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు క్యూలు కట్టారు. ఉదయం 8 గంటలకు పెద్దమ్మ గుడి ప్రాంగణం



తో పాటు పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులు, ట్రాఫిక్‌ దిగ్బంధంలో చిక్కుకుపోయాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు రోడ్డు నెంబర్‌-36తో పాటు రోడ్డునెంబర్‌-45, రోడ్డు నెంబర్‌-10, అటు మాదాపూర్‌ వైపు, ఇటు బంజారాహిల్స్‌ కేబీఆర్‌ పార్కు వైపు ట్రాఫిక్‌ పూర్తిగా స్తంభించిపోయింది. నవరాత్రి మహోత్సవాలకు ముందు జూబ్లీహిల్స్‌ ట్రాఫిక్‌ పోలీసులతో, జూబ్లీహిల్స్‌ లాఅండ్‌ ఆర్డర్‌ పోలీసులతో పెద్దమ్మ గుడి అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించి ఉంటే ఇంత గందరగోళం తలెత్తేది కాదని భక్తులు, వాహనదారులు వాపోతున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల దాకా ఇదే పరిస్థితి నెలకొనడంతో ఆర్టీసీ ప్రయాణికులు, ఇతర వాహనదారులు ప్రత్యక్ష నరకాన్ని చవిచూశారు. సరిపోయేంతమంది పోలీసులు లేక అటు లా అండ్‌ ఆర్డర్‌ పోలీసులు, ఇటు ట్రాఫిక్‌ పోలీసులు చేసేదేమీ లేక చేతులెత్తేశారు. దీని ప్రభావం ఇటు వాహనదారులపై, అటు భక్తులపై తీవ్రంగా చూపింది. నగర పోలీసు కమిషనర్‌ సీవీ ఆనంద్‌ ఈ విషయంలో ప్రత్యేక దృష్టిపెట్టి గుడి నిర్వాహకులతో ప్రతి పర్వదినం సందర్భంలోనూ పోలీసులతో సమన్వయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆదివారం వచ్చిందంటే ఇక్కడి రహదారులన్నీ నరకప్రాయంగా మారుతున్నాయి. ముందుకు, వెనుకకు కదల్లేని స్థితిలో వాహనదారులు నరకం చూస్తున్నారు. ముఖ్యమంత్రి ఇంటి పక్కనే ఈ పరిస్థితి నెలకొంటున్నా అటు ఆలయ యాజమాన్యం ఇటు పోలీసులు పట్టించుకోకపోవడంతో పరిస్థితిని పూర్తిగా దిగజారుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఆ పిటిషన్ల డిస్మిస్‌ వెనుక ప్రధాని హస్తం

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్‌

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌పైన రివ్యూ పిటిషన్లను సుప్రీంకోర్టు చీఫ్‌ జస్టిస్‌ బెంచ్‌ డిస్మిస్‌ చేయడం వెనుక ప్రధాని నరేంద్రమోదీ, మాజీ చీఫ్‌ జస్టిస్‌ ఎన్‌.వీ.రమణల హస్తం ఉందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్‌ ఆరోపించారు. ఆదివారం నారాయణగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనువాద పాలకుల విధానాన్ని సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా ప్రకటించారన్నారు. రాజ్యాంగ వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పులు ఇవ్వడం జాతీయ జ్యుడిషియల్‌ స్వతంత్ర వ్యవస్థ కూడా కలుషితం అయిందని అర్థమవుతుందన్నారు. ఈ తీర్పుతో మెజారిటీ దళిత సమాజం ఆందోళన చెందవద్దన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, రేవంత్‌ రెడ్డి, చంద్రబాబు, ప్రభుత్వాలపై ప్రజా ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. డిసెంబర్‌ రెండో వారంలో దళితుల తిరుగుబాటు పేరుతో వర్గీకరణ వద్దు, రాజ్యాధికారం కావాలి అనే నినాదంతో భారీ బహిరంగ సభ నిర్వహించడం ద్వారా సత్తా చాటాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్‌ విఎల్‌ రాజు, జెఎస్‌ రావు, సిహెచ్‌ రోజా లీలా, చిప్పరి సుబ్బారావు, ఎ.అశోక్‌, తీగల శేఖర్‌, పబ్బతి శ్రీకృష్ణ, పి.సుచంద్ర, పెండ్యాల సునీల్‌ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్‌ ప్రివెంటివ్‌ స్పైన్‌, స్పోర్ట్స్‌ హెల్త్‌ సెంటర్‌ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభ కార్యక్రమంలో పుల్లెల గోపీచంద్‌

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ రోడ్డునెంబర్‌-92లో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్‌ ప్రివెంటివ్‌ స్పైన్‌, స్పోర్ట్స్‌ హెల్త్‌ సెంటర్‌ను బ్యాడ్మింటన్‌ చాంపియన్‌, బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ఇండియా చీఫ్‌ నేషనల్‌ కోచ్‌ పుల్లెల గోపీచంద్‌ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ష్యూర్‌ హెల్తీ స్పైన్‌ అనేది కేవలం క్లినిక్‌ మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవన శైలి వైపు నడిచే కేంద్రంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్‌ ప్రీమియర్‌ లీగ్‌ గవర్నింగ్‌ కౌన్సిల్‌ సభ్యుడు చాముండేశ్వరనాథ్‌, హైసీ జనరల్‌ సెక్రటరీ రామకృష్ణ లింగిరెడ్డి, ఫిన్‌ల్యాండ్‌లోని నార్డిక్‌ హెల్త్‌ శిక్షణ, విద్యా విభాగాధిపతి జోహన్నా పెంటి, ఎన్‌ష్యూర్‌ హెల్తీ స్పైన్‌ చైర్మన్‌ డాక్టర్‌ కాసు ప్రసాద్‌ రెడ్డి, ఎన్‌ష్యూర్‌ హెల్తీ స్పైన్‌ సహ వ్యవస్థాపకుడు డాక్టర్‌ సుకుమార్‌ సురా, సీఈఓ నరేష్‌కుమార్‌ పగిడిమర్రి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

వెంగళరావునగర్‌: నియోజకవర్గంలోని మహిళలకు నిరంతరం అండగా ఉంటూ తన సేవలను అందిస్తానని వాసవీక్లబ్‌ ఇంటర్నేషనల్‌ జూబ్లీహిల్స్‌ గ్రేటర్‌ అధ్యక్షురాలు సిద్ధి స్వాతి అన్నారు. క్లబ్‌ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ మెంబర్లు ఆదివారం యూసుఫ్‌గూడ డివిజన్‌ బీ-బ్లాక్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక మహిళలు, వార్డు కమిటీ మెంబర్‌ కైసర్‌ జహాన్‌ వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం సిద్ధి స్వాతి మాట్లాడుతూ వాసవీక్లబ్‌ గత కొన్నేళ్ళుగా మహిళలకు ఎంతో చేయూతనిస్తూ ముందుకు వెళుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్‌ కార్యదర్శి కె.సంతోషకుమారి, కోశాధికారి మాచర్ల శ్రీదేవి, ఉపాధ్యక్షురాలు రామిశెట్టి వినీత, జాయింట్‌ సెక్రటరీ ఉప్పల వాణి, జాయింట్‌ ట్రెజరర్‌ రాధిక, డైరెక్టర్‌ సౌమ్య, జాయింట్‌ డైరెక్టర్‌ గీత, అడ్వైజర్‌ అంజనారావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మగుడిలో జేబుదొంగల చేతివాటం

బంజారాహిల్స్‌: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మతల్లి గుడికి ఆదివారం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సుమారుగా 40 వేల మంది భక్తులు తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు అమ్మవారిని దర్శించుకున్నట్లు అంచనా. ఇదే సమయంలో జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. ప్రతి ఆదివారం లాగానే ఈసారి కూడా పెద్ద సంఖ్యలో జేబు దొంగలు పరిసరాల్లో తిరుగుతూ సెల్‌ఫోన్లతో పాటు నగదు తస్కరించారు. ఎస్‌ఆర్‌నగర్‌కు చెందిన తేజస్విని, పావని అనే ఇద్దరు అక్కా చెల్లెళ్ళు అమ్మవారి దర్శనానికి వచ్చి క్యూలో ముందుకు సాగుతుండగానే వారిద్దరి సెల్‌ఫోన్లు తస్కరించారు. లింగంపల్లికి చెందిన సువర్చల, మాదాపూర్‌కు చెందిన మాధవి సైతం తమ ఫోన్లు పోగొట్టుకున్నారు. వీరంతా జూబ్లీహిల్స్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక్కరోజే పెద్ద ఎత్తున సెల్‌ఫోన్లుచోరీకి గురయ్యాయి.

గాండ్ల తెలికుల సంఘ భూమిని అభివృద్ధి చేస్తాం

అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కన్వీనర్‌ పాలూరి రామకృష్ణయ్య

ఖైరతాబాద్‌: కోకాపేటలో 2018లో అఖిల గాండ్ల తెలికుల సంఘానికి కేటాయించిన భూమిని అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కన్వీనర్‌ పాలూరి రామకృష్ణయ్య తెలిపారు. ఆదివారం లక్డీకాపూల్‌లో గాండ్ల తెలికుల దేవ తెలికుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాలూరి రామకృష్ణయ్య మాట్లాడుతూ అఖిల గాండ్లకు కేటాయించిన భూమిని అభివృద్ధి చేయాలని, అలాగే ఆ స్థలంలో ఇంటర్మీడియట్‌ వరకు కాలేజీ, కో ఆపరేటివ్‌ బ్యాంకును, ఆఫీసు పరంగా అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని గాండ్ల కుల సంఘాలన్నింటిలోంచి ఒక్కో సంఘం తరఫున ముగ్గురు ప్రతినిధులను గాండ్ల తెలికుల దేవ తెలికుల సంక్షేమ సంఘంలో సభ్యులుగా చేర్చుకొని ముందుకు వెళ్లాలని కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రామకృష్ణయ్య ఆధ్వర్యంలోని అఖిల గాండ్ల తెలికుల సంఘం, రామచంద్రయ్య ఆధ్వర్యంలోని అఖిల గాండ్ల తెలికుల సంఘం సభ్యులను ప్రస్తుతం విచారణలో ఉన్న కోర్టు కేసు కారణంగా వారిని ఈ సంఘంలో సభ్యులుగా తీసుకోవడం లేదనే నిర్ణయాన్ని ఈ సందర్భంగా తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ గాండ్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు జూపల్లి నరేష్‌, గాండ్ల తెలికుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, ఇందల్వాయి కిషన్‌, తెలంగాణ సజ్జన గాండ్ల సంఘం బాబూరావు, సందీప్‌ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి కల్పవృక్ష, హంస వాహన సేవ

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌ కాలనీ వేంకటేశ్వరస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని ఉదయం కల్పవృక్ష వాహన సేవ, సాయంత్రం హంస వాహన సేవలో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. క్షీరసాగర మథనం నుంచి ఉద్భవించిన కల్పం వృక్షం నీడన ఉన్నవారికి ఆకలి దప్పులు ఉండవని, పూర్వజన్మ స్మరణ కలుగుతుందని పురాణాలు చెబుతున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. భక్తుల మనోవాంఛలను తీర్చేదిగా కల్ప వృక్షానికి పేరు వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసశర్మ, అర్చకులు శశి కుమారాచార్యులు, శేషాచార్యులు పాల్గొన్నారు. వాహన సేవల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



స్వామివారిని కల్పవృక్ష వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

ఫ్లెక్సీ ప్రింటర్స్‌ సమస్యల పరిష్కారానికి కృషి

పంజగుట్ట: రాష్ట్రంలోని ఫ్లెక్సీ ప్రింటర్స్‌ యజమానులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ఫ్లెక్సీ ప్రింటర్స్‌, ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ నూతన అధ్యక్షుడు ఎన్‌. నరేష్‌ కుమార్‌ తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్‌ నూతన కార్యవర్గాన్ని మాజీ అధ్యక్షులు అన్సారీ ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని యూనిట్లల్లో ఉన్న ఫ్లెక్సీ ప్రింటర్స్‌ నిర్వాహకులు, ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం అధ్యక్షులు ఎన్‌. నరేష్‌, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌ కోట్ల, ఉపాధ్యక్షులు ఎ.శ్రీనివాస్‌, కోశాధికారి ఎమ్‌.డి.ఖదీర్‌, సహాయ కార్యదర్శి వాసు, ఎగ్జిక్యూటివ్‌ సభ్యులు ఎమ్‌.డీ అలీవుద్దీన్‌, కొండా రాజు, బండ రాజ తదితరులను నియమించారు.

తెలంగాణ సంప్రదాయాలపై అవగాహన ఉండాలి

కాచిగూడ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులు, యువత అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని చైతన్య హబ్‌ జూనియర్‌ కాలేజ్‌ చైర్మన్‌ వి.వి.హనుమంతరావు అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని కళాశాలలో బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలు ధరించి రంగు రంగుల తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడి, పాడి అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్‌ హనుమంతరావు మహిళా అధ్యాపకులను, విద్యార్థినీలను అభినందించి బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

కనీవినీ ఎరుగని రీతిలో బీజేపీ సభ్యత్వ నమోదు

- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్‌: కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీజేపీ సభ్యత్వాలను నమోదు చేసుకుంటున్నారని ఖైరతాబాద్‌ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బీజేపీ మెగా మెంబర్‌షిప్‌ డ్రైవ్‌లో భాగంగా జూబ్లీహిల్స్‌ డివిజన్‌ బూత్‌ నెంబర్‌ 138లో ఆ పార్టీ నాయకులు ఆదివారం ఇంటింటికి తిరిగి సభ్యత్వాలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రామచంద్రారెడ్డి బీజేపీ సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే కాలంలో తెలంగాణలో బీజేపీ అధికారం కైవసం చేసుకునే దిశగా పార్టీ బలోపేతం అవుతుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రజా కర్షక పాలనతోనే నేడు స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వ నమోదుకు ముందుకు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముద్దంగుల శ్రీనివాస్‌, భోజిరెడ్డి, శ్రీనివాస్‌చారి, శీతల అనిల్‌, రాజు, రమేష్‌ పాల్గొన్నారు.



శ్రీనగర్‌ కాలనలో...



బంజారాహిల్స్‌లో...



ఫిలింనగర్‌ మాగంటి కాలనీలో...



ఫిలింనగర్‌ దైవసన్నిధానంలో...



సీతారామస్వామి దేవాలయంలో..

మనసు నిండుగా.. పూల పండుగా

వేడుకల్లో నగర మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి



బతుకమ్మ ఎత్తుకున్న మేయర్‌ విజయలక్ష్మి

రహమత్‌నగర్‌ : క్వారీ మైదానంలో శనివారం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు మిన్నంటాయి. స్థానిక కార్పొరేటర్‌ సీఎన్‌ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు ప్రముఖులు బతుకమ్మను ఎత్తుకుని మహిళలను ఉత్తేజ పరిచారు. వేడుకల్లో నగర మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి బతుకమ్మ ఎత్తుకుని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతిలో భాగమన్నారు. క్వారీ మైదానంలో ఇంత పెద్ద ఎత్తున సంబరాలు జరగడం, ఇందులో తాను పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్పొరేటర్‌ సీఎన్‌ రెడ్డి మాట్లాడుతూ క్వారీ మైదానం అభివృద్ధికి జీహెచ్‌ఎంసీ నిధులు కేటాయించాలని కోరారు. ఈ వేడుకల్లో ముస్లిం మహిళలు సైతం పాల్గొనడం విశేషం. టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, మాజీ ఎంపీ మహ్మద్‌ అజహరుద్దీన్‌, రాష్ట్ర ఎంబీసీ చైర్మన్‌ జయపాల్‌, మాజీ డిప్యూటీ మేయర్‌, బోరబండ కార్పొరేటర్‌ బాబా ఫసియుద్దీన్‌, కాంగ్రెస్‌ నాయకుడు నవీన్‌యాదవ్‌, టీహోప్‌ సంస్థ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డితో పాటు వివిధ డివిజన్లలకు చెందిన కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మహిళలకు సీఎన్‌ రెడ్డి బతుకమ్మ కానుకలు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌ఆర్‌ నగర్‌ డివిజన్‌ ఏసీపీ వెంకటరమణ, బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్‌లు తమ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం

- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు
- కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు



శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో జూబ్లీహిల్స్‌ పెద్దమ్మతల్లి...

బంజారాహిల్స్‌: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాల్లో నాల్గో రోజైన ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించగా వివిధ రూపాల్లో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. శ్రీనగర్‌కాలని శ్రీ భ్రమరాంబికా దేవి అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో నిర్వహించిన చండీ హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఫిలింనగర్‌ మాగంటి కాలనీలోని శ్రీ విజయకనక దుర్గా దేవి అమ్మవారు అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఇక్కడ భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని కనకదుర్గా దేవి అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా, ఫిలింనగర్‌ రాజరాజేశ్వరి దేవి అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా, దైవసన్నిధానం అమ్మవారు రాజశ్యామలాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రుల సందర్భంగా ఆయా ఆలయాల్లో నిర్వహించిన సామూహిక కుంకుమార్చన పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గాయత్రీ దేవిగా పెద్దమ్మతల్లి

జూబ్లీహిల్స్‌ పెద్దమ్మతల్లి ఆదివారం శ్రీ గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పంచముఖాలతో దర్శనమిచ్చే గాయత్రీ దేవిని దర్శించుకుంటే సకల మంత్ర సిద్ధిఫలం పొందుతారని ఆలయ అర్చకులు తెలిపారు. గాయత్రి మంత్రంతో సంప్రోక్షణ చేసిన తర్వాతే ఆయా దేవతలకు అన్నాదులు, ప్రసాదాలు నివేదన చేస్తారని గాయత్రి అమ్మవారిని దర్శించుకోవడం వల్ల ఆరోగ్యం, సకల మంత్రసిద్ధి, తేజస్సు, జ్ఞానం పొందుతారని అన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో విచ్చేశారు.



దుర్గామాత పూజల్లో ఇండియన్‌ ప్రజా కాంగ్రెస్‌ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వాసుదేవరావు



రహమత్‌నగర్‌లో బాబా ఫసియుద్దీన్‌

విజయభారతికి భట్టి, కోమటిరెడ్డి నివాళి



సనత్‌నగర్: ఇటీవల కన్నుమూసిన ప్రముఖ రచయిత్రి, పౌర హక్కుల నేత బొజ్జా తారకం సతీమణి, సీనియర్ ఐఏఎస్ అధికారి రాహుల్‌బొజ్జా మాతృమూర్తి విజయభారతి సంస్మరణ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరై నివాళులర్పించారు. సమాజహితం కోసం విజయభారతి చేసిన సేవలను వారు కొనియాడారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగులో డాక్టరేట్ పొందిన మొట్టమొదటి దళిత మహిళ విజయభారతి అన్నారు. ఆమె తండ్రి బోయి భీమన్న అద్భుతమైన రచనలు చేశారని, ఆయన వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని విజయభారతి కూడా ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్య వికాసానికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు.

ఉప్పల్ భగాయత్‌లో కనీస సౌకర్యాలు కల్పించండి



ఉప్పల్ భగాయత్‌లో ఆందోళన చేస్తున్న వెల్ఫేర్ ప్రతినిధులు

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లో కనీస సదుపాయాలు కల్పించాలని పలువురు రైతులు అన్నారు. ఈ మేరకు ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ స్థానికులు ఆందోళన చేపట్టారు. రైతుల వద్ద భూములు లాక్కున్న అధికారులు కనీస వసతులు కల్పించకుండా తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నా కనీసం చెత్త, చెదారాన్ని కూడా తొలగించని పరిస్థితిలో జీహెచ్ఎంసీ సిబ్బంది ఉన్నారన్నారు. కనీస వసతులపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇలాగే కొనసాగితే జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కన్వీనర్ మేకల మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, రాజేశం, సంగమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



పోటీలను ప్రారంభిస్తున్న అటవీ దళాల అధిపతి రాకేష్‌మోహన్

సుభాష్‌నగర్: క్రీడాస్ఫూర్తితో పోటీ పడి గెలుపు ఓటములను సమానంగా అంగీకరించాలని పీసీసీఎఫ్, అటవీ దళాల అధిపతి రాకేష్‌మోహన్ దోబ్రియల్ అన్నారు. 7వ తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఆదివారం దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో ఘనంగా ప్రారంభమయ్యాయి. బాసర, భద్రాద్రి, చార్మినార్, కాళేశ్వరం, యాదాద్రి- భువనగిరి, రాజన్న- సిరిసిల్ల, జోగులాంబ- గద్వాల్ సర్కిళ్లకు చెందిన 600 మంది ఫారెస్ట్ అధికారులు ఈ పోటీల్లో పాల్గొనున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన రాకేష్‌మోహన్ దోబ్రియల్ క్రీడాకారుల గౌరవవందనం స్వీకరించి అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖలో ఉద్యోగం సవాళ్లతో కూడుకున్నదని, మానసికంగా, శారీరకంగా ధృడత్వాన్ని పెంపొందించుకోవడానికి క్రీడలు దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు ఎలుసింగ్ మేరు, సువర్ణ, శ్రీరామలింగం, రమేష్, అటవీ అకాడమీ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

భారత బ్యాడ్మింటన్ జట్టుకు సన్మానం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించడంపై పలువురు ప్రముఖులు సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం ఎల్బీ స్టేడియంలో ఇటీవల సింగపూర్‌లో జరిగిన 10వ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రజత పతకం సాధించిన భారత జట్టు సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ ముప్పాల వేణు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో దేశ ఖ్యాతిని మరింత పెంచేలా క్రీడాకారులు రాణించాలన్నారు. కార్యక్రమంలో భారతజట్టు కెప్టెన్ విద్యాధర్, క్రీడాకారులు లక్ష్మీనారాయణ, ముప్పాల వేణుగోపాల్, జితేందర్ రెడ్డి, డాక్టర్ రవికిరణ్, జ్ఞాన ప్రసాద్ రెడ్డి, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ నుంచి జైనూరు బాధితురాలు డిశ్చార్జి

గాంధీఆస్పత్రి:కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా, జైనూరు ఘటనలో గాయపడి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు మంత్రి సీతక్క సమక్షంలో ఆదివారం ఆస్పత్రిని డిశ్చార్జి అయ్యింది. ఓ ఆటోడ్రైవర్ గత నెల 1న ఆదివాసి మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడి ఆమెను తీవ్రంగా గాయపర్చిన సంగతి విదితమే. మెరుగైన వైద్య చికిత్స కోసం బాధితురాలిని గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా, ప్లాస్టిక్ సర్జరీ హెచ్ఓడీ సుబోధ్ కుమార్‌తో పాటు పలు విభాగాలకు చెందిన నిష్ణాతులైన వైద్యులు తీవ్రంగా శ్రమించి బాధితురాలికి వైద్య చికిత్సలు అందించగా ఆమె పూర్తిగా కోలుకుంది. మంత్రి సీతక్క పలుమార్లు గాంధీఆస్పత్రిని సందర్శించి బాధితురాలికి అండగా నిలిచి, అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీసి పలు సలహాలు, సూచనలు అందించారు. పలు వైద్యపరీక్షల అనంతరం పూర్తిస్థాయిలో స్వస్థత చేకూరినట్లు నిర్ధారణ కావడంతో మంత్రి సీతక్క సమక్షంలో ఆదివారం బాధితురాలిని ఆస్పత్రిని డిశ్చార్జీ చేశారు. మంత్రి సీతక్క ఆమెకు కొంత నగదు, చీరలు, ఇతర నిత్యావసర వస్తువులు అందించడమేగాక ఆమె స్వస్థలానికి వెళ్లేందుకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేశారు. తనకు పునర్జన్మ ప్రసాదించిన మంత్రి సీతక్క, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, డిప్యూటీ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, ఆర్ఎంఓ-1 శేషాద్రి, ప్లాస్టిక్ సర్జరీ హెచ్ఓడీ ప్రొఫెసర్ సుబోధ్‌కుమార్, వైద్యసేవలు అందించిన వైద్యులు, సిబ్బందికి బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది.

శ్రీనివాస్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

చిక్కడపల్లి: సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండే ఉత్తమ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని శృతిలయ ఆర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, నవరస గాయని ఆమని అన్నారు. ఆదివారం రాత్రి చిక్కడపల్లిలోని ఏర్పాటు చేసిన శృతిలయ ఆదర్శ సినారె పురస్కారం-2024 ఉపాధ్యాయుడు కె.శ్రీనివాస్‌కు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత, శ్రీనివాస్ మాట్లాడుతూ తన సేవా కార్యక్రమాలు, ఉత్తమ బోధనను గుర్తించి అవార్డు ఇవ్వడం తనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. నా పుట్టినరోజు నాడే అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి సుదర్శన్, ఉపాధ్యక్షులు నవీన్ ఠాకూర్ సభ్యులు పాల్గొన్నారు.

ఒక్కొక్కరిది ఒక్కో తీరు..

నగరంలో విభిన్నంగా దసరా వేడుకలు

- భిన్న సంస్కృతులు, విభిన్న ఆచార వ్యవహారాలు...
- నవ ధాన్యాలతో కన్నడీగుల నవరాత్రి పూజలు.
- ఐదు రోజులే నిర్వహించనున్న బెంగాలీలు.
- ఉపవాసంతో అగర్వాల్ కుటుంబికుల పూజలు



బాలికలకు భోజన తాంబూలాలు, బహుమతులు అందజేస్తున్న అగర్వాల్ కుటుంబం

చార్మినార్: భిన్న సంస్కృతులు, విభిన్న ఆచార వ్యవహారాలకు నగరం అద్దం పడుతుంది. రాష్ట్రాలు, ప్రాంతాలు వేరైనా..ఉత్సవాలను మాత్రం కలిసి కట్టుగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. నగరంలో స్థిరపడిన వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలను తమ తమ ఆచార వ్యవహారాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నారు. నగరంలో స్థిరపడిన అగర్వాల్ కుటుంబీకులు, మరాఠీలు, కన్నడిగులు, బెంగాలీలు తమ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు అనుగుణంగా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రారంభమైన ఉత్సవాల్లో ఉత్తర భారతీయులు పూజల్లో నిమగ్నమయ్యారు.

నవధాన్యాలతో కన్నడిగుల పూజలు

దసరా ఉత్సవాలను కన్నడిగులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. నగరంలోని జియాగూడ, అత్తాపూర్, సికింద్రాబాద్, గుల్జార్‌హౌజ్, మామాజుమ్లాఫాటక్, చార్‌కమాన్, కోకర్‌వాడీ, చెలాపురా, ఘాన్సీబజార్, జూలా, కూకట్‌పల్లి, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల కన్నడీగులు దసరా వేడుకల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. దుర్గామాత చిత్రపటం వద్ద కొద్దిగా నల్లరేగడి మట్టిని ఏర్పాటు చేసి అందులో నవధాన్యాల విత్తనాలను వేశారు. ఇవి మొలకెత్తడంతో తొమ్మిది రోజుల పాటు వాటికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నవధాన్యాలు ఎంత ఎత్తుకు పెరిగితే అమ్మవారి కరుణా కటాక్షాలు కూడా అంతే ఎక్కువగా ఉంటాయని వారి విశ్వాసం.

కన్నడిగుల అష్టమి కడాయి...

దుర్గాష్టమి సందర్భంగా గోధుమ పిండితో అమ్మవారి ఆభరాలను తయారు చేస్తారు. వీటిని కడాయిలో వేసి వేయిస్తారు. అమ్మవారి పుస్తె, మట్టెలు, జడా...రకరకాల అమ్మవారి ఆభరణాలను పిండితో తయారు చేసి పూజ గదిలో అమ్మవారి విగ్రహం చుట్టూ వేలాడదీస్తారు. పండుగ సందర్భంగా ఇంటికి వచ్చే బంధు మిత్రులకు వీటిని అందజేసి దసరా శుభాకాంక్షలు చెబుతారు.

పాలపిట్టను చూడడంతో ఉత్సవాల ముగింపు...

తొమ్మిది రోజుల ఉపవాసం ఉండి విజయదశమి సందర్భంగా ఇక్కడి భక్తులలాగే జమ్మి చెట్టు పూజతో పాటు చెరుకుగడ ఇంటికి తీసుకొచ్చి బంగారం ఇస్తూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని దసరా శుభాకాంక్షలు చెబుతారు. పాలపిట్టను చూడటంతో కన్నడిగుల దసరా ఉత్సవాలు ముగుస్తాయి. పండుగ రోజు కొందరు నగరంలో కన్నడిగులు నివసించే ప్రాంతాల్లో తిరుగుతూ పాలపిట్టలను చూపిస్తారు.

ఐదు రోజుల పాటు బెంగాలీల ఉత్సవాలు.

నగరంలో స్థిరపడ్డ పశ్చిమబెంగాల్‌కు చెందిన బెంగాలీలు దసరా ఉత్సవాలను ఐదు రోజుల పాటు నిర్వహిస్తారు. బెంగాలీలకు దసరా పెద్ద పండుగ. దుర్గామాతను ప్రతిష్ఠించిన నాటి నుంచి నాలుగు రోజుల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించి విజయ దశమి రోజు నిమజ్జనం చేస్తారు. మొదటి రెండు రోజుల పూజ కార్యక్రమాలను ఫలపుష్పాలతో నిర్వహిస్తారు. నిజానికి కలకత్తాలో దుర్గామాత వద్ద మేకలను బలిస్తామని... ఇక్కడ మాత్రం తొమ్మిది రకాల వేర్వేరు ఫలాలను దుర్గామాత వద్ద బలిస్తామని నిర్వాహకులు తెలిపారు. పూజల సందర్భంగా రెండు రోజుల వరకు కేవలం శాఖహారం మాత్రమే తీసుకుంటారు. మిగిలిన మరో రెండు రోజులు మాంసాహారాన్ని భుజిస్తారు. దుర్గామాత విగ్రహాల నిమజ్జనంతో బెంగాలీల దసరా వేడుకలు ముగుస్తాయి.

9రోజుల పాటు ఉపవాసాలు

ఉత్తర భారతీయులైన అగర్వాల్ కుటుంబీకులు దసరా ఉత్సవాలను రోజంతా ఉపవాసంతో తొమ్మిది రోజుల పాటు కనుల పండువగా నిర్వహిస్తారు. తమ వంటిల్లు, పూజ గదుల్లోని గోడకు పటాలను వేసి దుర్గామాత పూజను నిర్వహిస్తారు. తాము గోడకు వేసిన పటం వద్ద గోధుమలు, జొన్న విత్తనాలను మట్టితో ఉన్న ఒక కుండలో వేస్తారు. మొలకెత్తిన విత్తనాల ఆకులను విజయదశమి రోజు తలపాగలో, చెవులపై ధరించి పాదాభివందనం చేస్తారు. తెల్లవస్త్రంలో బియ్యంతో నవగ్రహాలు చేసి కుంకుమ, పసుపు, పూలు, కర్పూరం, పాన్,సుపారి, లవంగా, ఇలాచి, గంగా జలంతో తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహిస్తారు. దుర్గాష్టమి రోజు ప్రత్యేకంగా పిండి వంటలు చేస్తారు. విజయ దశమి నాడు 2-8 ఏళ్ల వయస్సున్న తొమ్మిది మంది బాలికలను ఇంటికి ఆహ్వానించి వారికి భోజన తంబూలాలతో పాటు ప్రత్యేకంగా దక్షిణ (బహుమతి)ను సమర్పించడం ఆనవాయితీ. దసరా పండుగ సందర్భంగా అగర్వాల్ కుటుంబీకుల దాండియా నృత్యాలు ఆకట్టుకుంటాయి. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని 'పూజా థాలీ' పోటీలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.



మొలకెత్తిన విత్తనాలతో దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం





గుజరాతీల దాండియా నృత్యాలు





నగరంలో నేడు

- మాదాపూర్‌లోని శిల్పారామంలో శారీస్ ఆఫ్ ఇండియా, దసరా ఉత్సవాలు, బతుకమ్మ సంబరాలు సందడిగా జరుగుతున్నాయి. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ వేడుకలు కొనసాగనున్నాయి.
- కళా సిల్క్ ఆధ్వర్యంలో అల్వాల్‌లోని దసరా, దీపావళిని పర్వదినాలను పురస్కరించుకుని శ్రీసాయి గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- అయోధ్యలో నిర్వహించ తలపెట్టిన శ్రీ మహా నారాయణ దివ్య రుద్ర సహిత సత సహస్ర చండీ విశ్వ శాంతి మహా యాగంపై ఉదయం 10 గంటలకు సోమాజీగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో సమావేశం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

భౌగోళిక వైవిధ్యాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న వేదకుమార్

సాక్షి, సిటీబ్యూరో: భౌగోళిక వైవిధ్యాన్ని, వారసత్వ సంపదను పరిరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పాలసీని రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉందని దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ ఎం.వేదకుమార్ అన్నారు. ప్రకృతి ప్రసాదించిన సంపదను సంరక్షించి భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. ప్రపంచ భౌగోళిక వారసత్వ దినోత్సవం సందర్భంగా ఆదివారం గచ్చిబౌలి సమీపంలోని ఫక్రుద్దీన్ గుట్ట (ఖాజాగూడ గుట్ట) వద్ద 'భౌగోళిక వైవిధ్యంపై మాట్లాడుదాం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు, భౌగోళికరంగానికి చెందిన నిపుణులు పాల్గొని ప్రసంగించారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డ్ డైరెక్టర్ కమతం మహేందర్‌రెడ్డి, కొత్త తెలంగాణ చరిత్ర బృందం ప్రతినిధి రామోజు హరగోపాల్, జీఎస్ఐ రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ చక్కిలం వేణుగోపాల్‌రావు, సేవ్‌రాక్స్ సంస్థ ప్రతినిధి సకీనా, సోమ రామ్మూర్తి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

భారతీయ ప్రమాణాలకు ప్రపంచ స్థాయి గుర్తింపు

ఎంపీ ఈటల రాజేందర్



రన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్..

ఖైరతాబాద్ :ప్రపంచ దేశాలు భారత దేశ ప్రమాణాలపై ఆధారపడే రోజులు వచ్చాయని, విశ్వ వేదికపై భారతీయ ప్రమాణాలు ప్రత్యేక స్థానం పొందుతున్నాయని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ క్వాలిటీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందన్నారు. చర్లపల్లి రైల్వే టర్మినల్, వందే భారత్ ఎక్స్‌ప్రెస్, దేశ వ్యాప్తంగా నిర్మిస్తున్న రహదారుల్లో ఫలితం కనిపిస్తుందన్నారు. నాణ్యత పాటించే దేశాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంటుందని, గతంలో అడుగున ఉన్న భారత్ ఇప్పుడు అగ్రస్థానానికి ఎగబాకిందన్నారు. నాసిరకం వస్తువులను మన దేశానికి ఎగుమతి చేసే దేశాలపై సైతం ఉక్కుపాదం మోపి కల్తీని కట్టడి చేయడంలో కేంద్ర సర్కారు సఫలమౌతోందన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నిర్వహిస్తున్న ఈ నాణ్యతా పరుగు ప్రతి పౌరుడిలో స్ఫూర్తి నింపుతుందని, నాణ్యమైన వస్తువులు కొనేలా చైతన్యం పెంచేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రపంచ ప్రమాణాల దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న స్టేక్ హోల్డర్ సదస్సులు భారతీయ ప్రమాణాలను ప్రజల్లోకి విస్తృతంగా చేరుతున్నాయన్నారు. ఐఎస్ఐ మార్కు వినియోగదారులకు భరోసాగా నిలుస్తోందని, ప్రతి ఒక్కరూ బీఐఎస్ స్టాండర్డ్స్ మార్క్స్ ఉన్న వస్తువులను మాత్రమే కొనాలని కోరారు. ఐమాక్స్ నుంచి జలవిహార్ వరకు నిర్వహించిన రన్‌లో బీఐఎస్ జాయింట్ డైరెక్టర్లు సుజాత, తన్నీరు రాకేశ్, సెక్షన్ ఆఫీసర్ వనజ మూర్తి, ఎస్పీఓ అభిసాయి తదితర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



బంజారాహిల్స్: దసరా నవరాత్రుల సందర్భంగా జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు నగర వ్యాప్తంగా వేలాదిగా భక్తులు పెద్దమ్మగుడికి తరలి వచ్చారు. దీంతో ఆలయంతో పాటు ఆలయ పరిసరాలన్నీ జనసందోహంతో కిటకిటలాడాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు ఏర్పాటు చేసిన క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి.



చత్తీస్‌ఘడ్ మారణకాండ దారుణం

ముషీరాబాద్: చత్తీస్‌ఘడ్ రాష్ట్రం, దంతెవాడ, తులతులి అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ పేరుతో 31 మంది సీపీఐ మావోయిస్టులను ప్రభుత్వం హతమార్చడం దారుణమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ నేతలు అన్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం మాట్లాడుతూ ఘటన జరిగిన 24 గంటలు గడుస్తున్నా పోలీసులు మృతుల ఫొటోలు, వివరాలను ప్రకటించకపోవడం చట్ట విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కాగర్‌లో భాగంగా పక్కా సమాచారంతో ఈ చర్యకు పాల్పడినట్లు స్పష్టమవుతుందన్నారు. ఇప్పటికే 180 మందిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హత్య చేశాయన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 11 ఏళ్ల పాలనలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందన్నారు. ఛత్తీస్‌ఘడ్ అడవుల్లోని విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలో భాగమే ఈ ఎన్‌కౌంటర్‌గా పేర్కొన్నారు. వరుస ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మారణకాండను దేశ సహజ సంపదను కాపాడే నిజమైన దేశభక్తులు, ప్రజలు ప్రజాస్వామ్యవాదులు అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని కోరారు.

బీసీసీఐ సభ్యత్వం ఇప్పించాలి



కాచిగూడ: తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘానికి బీసీసీఐలో సభ్యత్వం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సంఘం అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి ఆదివారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ గ్రామీణ క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా సహకారం అందిస్తామని, బీసీసీఐ సభ్యత్వం లభించే విధంగా మద్దతు ఇస్తానని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

ఘనంగా ముకర్రమ్ జా స్కూల్ వ్యవస్థాపక దినోత్సవం



లక్డీకాపూల్ : 8వ నిజాం నవాబ్ మీర్ బర్కత్ అలీ ఖాన్ ముకర్రమ్ జా బహదూర్ జయంతి, ముకర్రం జా స్కూల్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పురానీ హవేలీలోని ముకర్రమ్ జా స్కూల్ క్యాంపస్‌లో జరిగిన వేడుకల్లో ముకర్రమ్ జా సతీమణి ప్రిన్సెస్ అస్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముకర్రమ్ జా ట్రస్ట్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్ ప్రచురించిన 'ది నిజామ్స్ సికందర్ జా నాసిరుద్దౌలా అఫ్జలుద్దౌలా' సుల్తాన్ గాలిబ్ బిన్ అవద్ అల్ ఖాయితీ ఆంగ్ల పుస్తకాన్ని ఆవిష్కరించారు. టర్కియే కౌన్సిల్ జనరల్ ఓర్ హాన్ యల్మాన్ ఓకాన్ ముఖ్య అతిథిగా హాజరైన కార్యక్రమంలో హానరరీ కౌన్సిల్ జర్మనీ అమితా దేశాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 8వ నిజాం ముకర్రమ్ జాకు నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. ముకర్రమ్ జా ధాతృత్వాన్ని, ఆయన విద్యారంగానికి చేసిన సేవలను కొనియాడారు. 8 ప్యాలెస్‌లతో కూడిన మసరత్ మహల్‌ను పేద, మధ్యతరగతి పిల్లల విద్యాభ్యున్నతి కోసం కేటాయించడం ఆయన ధాతృత్వానికి నిదర్శనమన్నారు. పురానీ హవేలీలోని ముకర్రమ్ జా స్కూల్ దేశంలోనే బడ్జెట్ స్కూళ్లలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థులకు చదువులతోపాటు నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని స్కూలు ప్రిన్సిపాల్ తెలిపారు. ట్రస్టీ నవాబ్ అబుల్ ఫైజ్ ఖాన్ మాట్లాడుతూ.. విద్యార్థులు మొబైల్ ఫోన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నవాబ్ ఫైజ్ బిన్ జంగ్, ప్రిన్సిపాల్ రేఖా వాదే, అకడమిక్ అడ్వయిజర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేడెట్లు నిర్వహించిన ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది.



ముగిసిన కళా మహోత్సవ్

రసూల్‌పురా: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఎనిమిది రోజులుగా ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన కళా మహోత్సవ్ ఆదివారం ముగిసింది. లక్షకు పైగా సందర్శకులు ఈ కళా మహోత్సవ్‌ను సందర్శించారు. ఆదివారం తెలుగు రాష్ట్రాల బ్రిటిష్ డిప్యూటి హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, తెలంగాణ ఆంధ్ర సబ్ ఏరియా మేజర్ జనరల్ రాకేష్ మనోచా, లెఫ్టినెంట్ కల్నల్ పికే శర్మ, నమితా సింగ్, పదాతి దళ విభాగం జీఓసి సుదీప్తా. ఝా, రంగా రెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి పట్టాభి రామారావు, టాసా కల్నల్ జూబిన్ పాల్ పలువురు అధికారులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు చివరి రోజు నాగాలాండ్‌కు చెంది సయష్టి గాయక బృందం. మిజోరం సౌండ్ ప్రదర్శన చేశారు. రాష్ట్రపతి నిలయం పరిపాలనాధికారి రజని ప్రియా, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డాక్టర్ ప్రశన్న గొగోయ్. రోషన్ రెహమాన్, సుభర్షిష హజారికా, షరీక్ హుస్సేనియన్ కళామహోత్సవ్ కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు.



సాక్షి
11
హైదరాబాద్, సోమవారం, 7, అక్టోబర్, 2024

సిటీ ప్లస్





టెకీ.. ట్రెండీ..

సొంత స్టైల్‌తో అదరగొడుతున్న ఐటీ ప్రొఫెషనల్స్

ఒకప్పుడు ఫార్మల్స్, ఇన్ షర్ట్, క్లీన్ షేవ్ టెకీల స్టైల్

డ్రెస్సింగ్, హెయిర్ స్టైల్, బియర్డ్‌తో డిఫరెంట్ గెటప్స్

నిబంధనలు సడలించిన ఎమ్ఎన్‌సీ సంస్థలు

పని ఒత్తిడి పోగొట్టడానికే అంటున్న నిపుణులు

ఫార్మల్ నుంచి క్యాజువల్ వైపు



సాఫ్ట్‌వేర్, ఐటీ, టెకీ జాబ్‌లంటేనే అదో కొత్త ప్రపంచం. అధునాతన జీవనశైలి, విభిన్న వ్యక్తులు, విభిన్న సంస్కృతుల సమ్మేళనం. అయితే ఈ రంగం లోకి అడుగు పెడుతున్నప్పటి నుంచే.., అంటే ఇంటర్వ్యూలకు హాజరవుతున్నప్పటి నుంచే భాష, ఆహార్యం, స్కిల్స్, డ్రెస్సింగ్ స్టైల్, బ్యూటీ మెయింటెనెన్స్.. ఇలా అనేక అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. జాబ్ చేయగలిగే నైపుణ్యాలు ఉన్నా, లేకపోయినా మొదటి వారిని ఇంప్రెస్ చేయాల్సిందే. ఇందులో భాగంగానే గతంలో ఫార్మల్ షూలు–దుస్తుల్లో, మోడ్రన్‌గా, టెకీ ప్రొఫెషనల్ స్టైల్‌లో ఆఫీసులకు వెళ్లేవారు. అయితే ప్రస్తుతం ఈ కల్చర్‌లో చాలా మార్పులొచ్చాయి. కాస్త జుట్టు పెరిగి ఎబ్బెట్టుగా కనబడినా ప్రొఫెషనలిజం లేదని రిజెక్ట్ చేసిన సందర్భాల నుంచి ఏకంగా ఒక అబ్బాయి సైతం ట్రెండీ పోనీ స్టైల్ జుట్టుతో ఆఫీస్‌కు వస్తున్నారు.



వారంలో ఒకరోజు...

అప్పట్లో వారంలో ఒక రోజు మాత్రమే క్యాజువల్ డ్రెస్‌కు అనుమతి ఉండేది. కానీ చాలా కంపెనీలు ప్రతి రోజూ క్యాజువల్‌కు అనుమతి ఇస్తున్నారు. కానీ ఆఫీస్‌కు ఎలా వచ్చినా సరే.. స్టైలిష్‌గా, ట్రెండీగా, నీట్‌గా ఉండాలి. టీ షర్ట్స్ వేసుకున్నా సరే కానీ, ఫంకీగా ఉండకుండా ప్రొఫెషనల్ మ్యానరిజమ్ ఉండేలా చూసుకోవాలి. జుట్టు పెంచుకున్నా సరే.. స్టైల్‌గా కట్ చేసుకుని, జెల్స్‌వంటివి వినియోగిస్తూ చూడటానికి వావ్ అనిపించేలా ఉండాలి.

ఇప్పటికీ ఫార్మల్స్ పాటిస్తూ..

కొన్ని కంపెనీలు ఇప్పటికీ ఫార్మల్ రూల్స్‌ను పాటిస్తున్నాయి. కానీ సాఫ్ట్‌వేర్ రంగంలోని ఒత్తిడి, నైట్ షిఫ్ట్స్, సిస్టమ్ ముందే గంటల తరబడి కూర్చుని పనిచేయడం తదితర కారణాలతో.. ఇన్‌ఫార్మల్‌కు అనుమతిస్తే ఉద్యోగుల్లోని పని తీరులో ఎన్నో మంచి ఫలితాలు వచ్చాయని ఓ ప్రముఖ ఎమ్ఎన్‌సీ సంస్థ వ్యవస్థాపకులు తెలిపారు. అంతేకాదు., ఆఫీస్‌లో బాస్, చిన్న ఉద్యోగి అని తేడా లేకుండా అందరూ అందరినీ పేరు పెట్టి మాత్రమే పిలుచుకుంటారనే విషయం విధితమే. ఇలా ఎన్నో వినూత్న మార్పులకు సాఫ్ట్‌వేర్, ఐటీ ఇండస్ట్రీ వేదికగా మారింది.

గ్యాడ్జెట్లూ.. స్టైల్‌లో భాగమే..

ఈ ట్రెండీ ప్రొఫెషనలిజమ్‌లో భాగంగా దుస్తులు, వ్యక్తిత్వమే కాదు అధునాతన గ్యాడ్జెట్స్ సైతం కీలక పాత్ర పోషిస్తున్నాయి. యాపిల్ పాడ్స్, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ సెన్సార్ డివైజ్‌లు ఇలా విభిన్న రకాల గ్యాడ్జెట్‌లు ఐటీ ట్రెండ్‌లో చేరాయి. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా స్మార్ట్ వర్క్‌ను అలవర్చుకున్నట్టుగానే, జీవన శైలి, పాశ్చాత్య సంస్కృతిలో భాగంగా వినూత్న మార్పులను ఆస్వాదిస్తున్నారు. హైహీల్స్, టాటూలు, స్టైలిష్ కళ్లద్దాలు, అందాన్ని పెంచే ఐ లాషస్, లెన్స్‌లు తదితర ఫ్యాషన్లను సాధారాణ జీవితంలో సమ్మిళితం చేశారు. ఈ ట్రెండ్ విదేశాల్లో ఆవిష్కృతమై, గ్లోబల్ వేదికగా ఆదరణ పెంచుకుని నగరం వేదికగానూ నిత్య జీవిత ఉద్యోగంలో భాగం అవుతోంది.





ఒకప్పుడు ఓ వ్యక్తిని చూస్తే అతను సాఫ్ట్‌వేర్ ఉద్యోగా? కాదా! అని ఇట్టే గుర్తించేవారు. ఫార్మల్ డ్రెస్‌లు, క్లీన్ షేవ్, నీట్‌గా హెయిర్ కట్ చేసుకుని, హ్యాండ్సమ్ లుక్‌తో ఉండేవారు. ఇలా రెడీ అయ్యేవారికి అప్పట్లో ప్రత్యేక గుర్తింపు కూడా ఉండేది. సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్ అంటే అదో ప్రత్యేక గౌరవం, గుర్తింపు, పొగడ్తలు వగైరా... అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ ప్రొఫెషనల్ లుక్‌లో కూడా వినూత్న మార్పులొచ్చాయి. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, ఐటీ ఉద్యోగుల్లో ఈ ట్రెండ్ పోయి, ప్రస్తుత అధునాతన ట్రెండ్స్ ఫాలో అవ్వడమే జాబ్ కల్చర్‌గా మారింది. నచ్చిన డ్రెస్‌లు వేసుకోవచ్చు, నచ్చినట్టు రెడీ అవ్వొచ్చు. కానీ చూడటానికి హ్యాండ్సమ్‌గా, పాజిటివ్ లుక్స్ ఉంటే చాలు. నగరంలోని దాదాపు అన్ని మల్టీ నేషనల్ కంపెనీలూ ఈ సంస్కృతిని ప్రోత్సహిస్తున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో



ధోల్ ధోల్ దాండియా..

పోలీస్ హాకీ స్టేడియం వేదికగా ఆసియాలోనే అతిపెద్ద దాండియా నైట్స్

ఉత్సాహంగా పాల్గొన్న నగర యువత



సాక్షి, సిటీబ్యూరో: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కంట్రీక్లబ్ నవ రాత్రి ఉత్సవ్ – 2024 పేరిట బేగంపేటలోని పోలీస్ హాకీ స్టేడియం వేదికగా నిర్వహిస్తున్న ఆసియాలోనే అతిపెద్ద దాండియా నైట్స్ జోష్ ఫుల్‌గా సాగుతోంది. ఈ వేడుకల్లో సంప్రదాయ గర్బా డాన్స్‌లతో పాటు ఉత్సాహాన్ని నింపే లైవ్ డీజే, ధోల్, లైవ్ మ్యూజిక్, లైవ్ సింగింగ్ పెర్ఫార్మెన్స్ అందరినీ హుషారెక్కించాయి. ఇందులో భాగంగా ఆదివారం కంట్రీక్లబ్ సీయండీ రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ.. విభిన్న సంస్కృతులకు వేదికైన నగరంలో సంప్రదాయ దాండియా రిథమ్‌లతో నగరవాసులను అలరించడం సంతోషంగా ఉందని అన్నారు. మహారాష్ట్ర ప్రసిద్ధ మ్యూజికల్ లైవ్ బ్యాండ్ రాజా బీట్స్, ప్రముఖ గుజరాతీ గాయకుడు భవిన్ హస్ముక్ రాజా పాటలు, నగర టాప్ 12 డీజేల సంప్రదాయ, మ్యూజిక్‌తో ఈ వేడుకలు అంబరాన్నంటాయని రెలెవెంట్ యండీ సందీప్ కుమార్ పేర్కొన్నారు.

సికారా, ఫ్లాంట్ కస్టమైజ్డ్ సెలూన్



సాక్షి, సిటీబ్యూరో: గతంలో దేశంలో అందుబాటులో లేని కస్టమైజ్డ్, మెడికల్–గ్రేడ్ ఫేషియల్స్ వంటి సేవలను అందించే అధునాతన సెలూన్స్ నగరంలో ప్రారంభమవుతున్నాయి. ఇందులో భాగంగా నగరంలోని బంజారాహిల్స్ వేదికగా అధునాతన డెర్మటాలజీ, సౌందర్యం, వెల్‌నెస్ చికిత్సలను అందించే ఫెమినా ఫ్లాంట్ స్టూడియో సెలూన్, సికారా క్లినిక్‌లు సంయుక్తంగా ప్రారంభించాయి. ఆదివారం ప్రారంభమైన ఫ్లాగ్‌షిప్ స్టోర్‌లో పలువురు సోషలైట్‌లు సందడి చేశారు. సికారా క్లినిక్స్ వ్యవస్థాపకులు, ఫెమినా ఫ్లాంట్ సౌత్ ఇండియా మాస్టర్ ఫ్రాంచైజర్ శిరీష ఆలపాటి మాట్లాడారు. ఒక ఎన్ఆర్ఐగా భారత్‌లో ముఖ్యంగా హైదరాబాద్ వేదికగా నూతన ప్రాజెక్టుతో ముందుకు వచ్చామని తెలిపారు. ఫెమినా ఫ్లాంట్ అన్ని సెలూన్ సేవలనూ అందిస్తుంది, సికారా క్లినిక్స్ డెర్మటాలజీ, సౌందర్య సేవలను అందిస్తోంది. ఏ నగరంలో లేని కస్టమైజ్డ్, మెడికల్–గ్రేడ్ ఫేషియల్స్ నగరంలోకి తీసుకొచ్చాం. ఇక్కడ ఇప్పటికే 8 ఫ్రాంచైజీలను ఇచ్చాం. ఇలా ప్రతి రాష్ట్ర రాజధానిలో ఫ్లాగ్‌షిప్ స్టోర్‌లతో దేశవ్యాప్తంగా 300 స్టోర్లను ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవంలో సికారా క్లినిక్స్ సహవ్యవస్థాపకులు రాఘవేందర్ రెడ్డి కల్లెం, ఎస్కే ఈవెంట్స్ వ్యవస్థాపకురాలు సుచితా జోషి, కాటలిస్ట్ ఫౌండర్ డాక్టర్ ఉష, ఆర్ట్ క్యూరేటర్ అమన్ ప్రీత్ కౌర్ పాల్గొన్నారు.

వావ్.. పావ్..



స్ట్రీట్ ఫుడ్ పావ్‌బాజీకి పెరుగుతున్న డిమాండ్.

స్విగ్గీ గ్రీన్‌డాట్ వెజ్ అవార్డ్స్‌లో బొంబాయివాలా చాట్‌కు గోల్డ్‌కప్..

నగరంలో రోజుకు 50 వేల పైచిలుకు ఆన్‌లైన్ ఆర్డర్లు..!

ముంబయిలో 'బాజీవాలా' అని పిలవబడే వీధి వ్యాపారులు తాము అమ్మగా మిగిలిన కూరగాయలు, బఠానీల మిశ్రమానికి జీలకర్ర, కొత్తిమీర, గరం మసాలా, పసుపు, మిరపకాయలు లాంటి సుగంధ ద్రవ్యాలను జోడించి, వెన్నతో చేసిన బ్రెడ్ రోల్స్‌తో వడ్డించేవారు. అలా బాజీవాలాలు తయారుచేసిన ఫుడ్.. పావ్ బాజీగా ఖ్యాతికెక్కింది. కాలక్రమేణా ప్రజల అభిరుచులకు అనుగుణంగా రెసిపీలను అందిస్తూ వస్తున్నారు.



ముంబై తర్వాత హైదరాబాదే..

1970–1980 మధ్య కాలంలో పావ్‌బాజీకి విపరీతమైన ప్రాచుర్యం లభించింది. ఈ క్రమంలో హైదరాబాద్‌కూ విస్తరించిన పావ్‌బాజీ కల్చర్ ఇప్పుడు ముంబయి తర్వాత స్థానాన్ని హైదరాబాద్ భర్తీ చేసేసిందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

శ్రామికవర్గం చిరుతిండిగా..

మొదట్లో శ్రామిక వర్గానికి చిరుతిండిగా ఉండేది. ఇప్పుడు అన్ని వర్గాలకూ ఇష్టమైన ఫుడ్‌గా మారింది. స్ట్రీట్ ఫుడ్‌గా ఉన్న ఈ వంటకం.. బడా రెస్టారెంట్‌లలో కూడా లభిస్తోంది. జైన్ పావ్ బాజీని ఉల్లిపాయలు, వెల్లుల్లి లేకుండా అందిస్తారు. ముంబయి స్టైల్ పావ్ బాజీ అయితే టమాటోలు జోడించి వైవిధ్య భరితంగా అందిస్తుంటారు. కూరగాయల మిశ్రమంతో తయారుచేయడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలని నిపుణులు చెబుతున్నారు.

కొత్త రెసిపీల్లో..

పావ్‌బాజీతో సరిసమానంగా వడా పావ్, చీజ్ గ్రిల్డ్ వడాపావ్, దహీబేల్, షెజ్‌వాన్, చీజ్‌గ్రిల్ వడాపావ్, మసాలా చీజ్ పావ్ బాజీ వంటివి పాతవే అయినా ఆహారప్రియుల అభిరుచికి అనుగుణంగా రెసిపీల్లో కొత్తదనాన్ని జోడిస్తున్నారు. ఇక బాస్కెట్ చాట్ ఆర్డరిస్తే చాలు.. బాస్కెట్‌తో పాటే ఆరగించేయవచ్చు.

స్ట్రీట్‌ఫుడ్‌కు ఎవర్‌గ్రీన్..



కొన్ని దశాబ్దాలుగా మేము చాట్ తయారీ రంగంలో ఉన్నాం. స్విగ్గి సంస్థ నిర్వహించిన ఓటింగ్‌లో బెస్ట్ ఇన్ పావ్ బాజీలో గోల్డ్‌కప్ దక్కడం ఆనందంగా ఉంది. కస్టమర్ల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మినరల్ వాటర్‌తోనే ఉత్పత్తులను అందిస్తున్నాం.

– సరాఫ్ సంతోష్, బొంబాయివాలా చాట్ నిర్వాహకుడు



నగరంలో స్ట్రీట్ ఫుడ్‌కు ఆదరణ అంతా ఇంతా కాదు. ఏ వీధిలోకి వెళ్లినా గల్లీ ఆహారం ఆహా.. అనిపిస్తోంది. ముంబయి వారసత్వాన్ని ఏనాడో పుణికిపుచ్చుకున్న భాగ్యనగరం స్ట్రీట్‌ఫుడ్‌కు అడ్డాగా మారింది. వీటిలో పావ్‌బాజీ..క్రేజ్ వేరనే చెప్పాలి. 1850 దశకంలో టెక్స్‌టైల్ హబ్‌గా ఉన్న ముంబైలో మిల్లు కార్మికుల కోసం పుట్టుకొచ్చిన 'పావ్ బాజీ' సంస్కృతి దేశమంతా విస్తరించింది. ఒకప్పుడు కార్మికులకు శక్తిని అందించేందుకు తయారుచేసిన ఈ ఫుడ్ పేద, ధనిక అనే తేడా లేకుండా ఇష్టమైన ఆహారంగా మారింది. - సనత్‌నగర్

టేస్ట్ అదుర్స్..

నేను ఐటీ జాబ్ కోసం హైదరాబాద్ వచ్చాను.. ఓ రోజు ఇక్కడి చాట్ బాగుంటుందని ఫ్రెండ్ చెప్పడంతో బొంబాయివాలా చాట్ రుచి చూశాను. టేస్ట్ అదుర్స్ అనిపించింది. అప్పటి నుంచి వీకెండ్స్‌లో ఇక్కడి బావ్ బాజీ తినడానికి వస్తుంటా.

– రమణి, ఐటీ ఉద్యోగి

రోజుకు 50 వేల ఆన్‌లైన్ ఆర్డర్లు..

ఆన్‌లైన్ ఆర్డర్‌లలో పావ్ బాజీ నగరవాసుల మెనూగా మారింది. రోజుకు 50 వేల పైచిలుకు ఆర్డర్లు ఒక ఆన్‌లైన్ ద్వారానే సాగుతుందంటే అతిశయోక్తి కాదు. స్విగ్గీ, జొమాటో, వాట్సప్ బిజినెస్.. ఇలా ఆన్‌లైన్ డెలివరీ వేదికలపై పావ్‌బాజీ ప్రధానంగా నిలుస్తోంది. ఇటీవల స్విగ్గీ సంస్థ దేశవ్యాప్తంగా 16 రకాల వంటకాలకు సంబంధించి ది బెస్ట్ అవార్డులను ప్రకటించింది. ఇందులో హైదరాబాద్ నగరానికి సంబంధించి స్విగ్గీ గ్రీన్ డాట్ వెజ్ అవార్డ్స్‌లో బెస్ట్ ఇన్ పావ్‌బాజీగా బొంబైవాలా చాట్ మొదటిస్థానంలోనూ, మహారాజా చాట్ అండ్ ఫుడ్స్, ఢిల్లీవాలా చాట్‌లు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.



అనన్యం.. నృత్యరూపకం

కొండాపూర్‌లోని కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలోని శ్రీ సీతారామ ఆంజేయస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో నగరానికి చెందిన పదహారేళ్ల అనన్య సూరపనేని తన కూచిపూడి శాస్త్రీయ నృత్యంతో ఆకట్టుకుంది. ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అనన్య గజవదనా బెడువే, సరస్వతి స్తుతి, కామాక్షి స్తుతి, రామాయణ శబ్దం, హంసానంది తిల్లాన వంటి అంశాలు ప్రదర్శించి ప్రేక్షకులను అలరించింది. – సాక్షి, సిటీబ్యూరో



'కొలువు'దీరిన అష్టాదశ శక్తి పీఠం థీమ్

అపురూపం.. ఆధ్యాత్మికం

బంజారాహిల్స్: దసరా నవరాత్రి ఉత్సవాలు వచ్చాయంటే బొమ్మల కొలువుతో పెద్దలు, పిల్లలు సరదా పడుతూ బొమ్మలు పేరుస్తూ సందడి చేస్తుంటారు. కొంత మంది యేటా ఒక్కో థీమ్‌తో నవరాత్రి బొమ్మల కొలువు నిర్వహిస్తుంటారు. ఎల్లమ్మతల్లి గుడి పూజారి కర్ర ఆత్రేయ శర్మ సతీమణి అర్చన, కూతురు అర్చిన్య బాల ఇద్దరూ కలిసి పదిహేనేళ్లుగా బొమ్మల కొలువు చేస్తున్నారు. ఈసారి కూడా అష్టాదశ శక్తిపీఠం థీమ్‌తో బొమ్మల కొలువు అటు ఆధ్యాత్మికతను, ఇటు ఆనందాన్ని పంచుతోంది.

యేటా కొత్త బొమ్మతో..

యేటా కొత్తగా ఒకటి, రెండు బొమ్మలను కొలువులో చేరుస్తుంటామని ఈ సందర్భంగా అర్చన తెలిపారు. బొమ్మల కొలువులో మొదటి పీఠంలో సప్త శృంగీమాత (నాసిక్), వినాయకుడి(మధురై మీనాక్షి), మూడో పీఠంలో రేణుకా ఎల్లమ్మ, సరస్వతి, లక్ష్మీ దేవి, నాల్గో పీఠంలో రాజరాజేశ్వరి దేవి, సప్తమాత్రికలు, అష్టలక్ష్ములు, నాగదేవత, వారాహి అమ్మవారు, సప్త రుషులు, రాఘవేంద్ర స్వామి, అన్నపూర్ణాదేవి ఇలా ఒక్కో పీఠంలో ఒక్కో అమ్మవారి చరిత్రతో పాటు పూర్తి వివరాలను కళ్లకు కట్టారు. అంతే కాకుండా శ్రీకృష్ణుడి జననం నుంచి కంసుడి వధ వరకూ వివిధ అంశాలను తీసుకొని ఏర్పాటు చేసిన ఈ బొమ్మల కొలువు కనువిందు చేస్తోంది.





‘ఫిట్‌లెస్’ బ్యాండ్స్!

అలంకారంగానే ఫిట్‌నెస్ బ్యాండ్స్, వాచీలు
సమయం, తేదీ చూసుకునేందుకే వినియోగిస్తున్న 59% మంది
తిరిగిన అడుగులు లెక్కించేందుకే 66 శాతం మంది పరిమితం
గిఫ్ట్ ఐటంగా ఇచ్చినందున తీసుకున్నట్టు 13% మంది వెల్లడి
ఫిట్‌నెస్ వాచీలు, బ్యాండ్స్ వినియోగంపై లోకల్ సర్కిల్స్ సర్వేలో ఆసక్తికర అంశాలు



సాక్షి, హైదరాబాద్: కారణాలేవైనా జీవన శైలిలో ఎంతో మార్పు వచ్చింది. ఉరుకుల పరుగుల జీవితాల్లో తీవ్ర ఒత్తిడి పెరిగింది. ఇంత హడావుడిలో మన ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ వహించడం ఒకింత కష్టం. అందుకే అంతా ఇందుకోసం సాంకేతికతను వాడుతున్నారు. ఏ రోజు ఎంత దూరం నడిచారు...పల్స్‌రేట్ ఎంత ఉంటోంది..నిర్దిష్ట సమయంలో ఎన్ని కిలోమీటర్లు నడిచారు..సైక్లింగ్, స్విమ్మింగ్ యాక్టివిటీ ఎలా ఉంది..ఇలా ప్రతిదీ రికార్డు చేసి, మనల్ని అప్రమత్తం చేసేందుకు మార్కెట్‌లో ఎన్నో రకాల ఫిట్‌నెస్ బ్యాండ్స్ / వాచీలు అందుబాటులో ఉన్నాయి. చాలా మంది వీటిని ధరించడం సర్వసాధారణంగా కనిపిస్తోంది. ఒక్కో కుటుంబంలో ఐదుకు మించి కూడా ఈ ఫిట్‌నెస్ బ్యాండ్లు, వాచీలు ఉంటున్నాయి. అయితే ఫిట్‌నెస్ బ్యాండ్లను కొనుగోలు చేసినప్పుడు ఉన్నంత ఆసక్తి వాటిని వాడటంలో ఉండటం లేదు. కొన్ని తర్వాత చాలామంది వాటిని పూర్తి స్థాయిలో వినియోగించడం లేదు. కేవలం సమయం, తేదీ చూసుకునేందుకు, ఫోన్‌కాల్స్ మాట్లాడేందుకు, మెసేజీలు చూసుకునేందుకు వాడుతున్న వారే ఎక్కువ ఉంటున్నారని ‘లోకల్ సర్కిల్స్’ సంస్థ సర్వేలో వెల్లడైంది. ఇటీవల దేశవ్యాప్తంగా 278 జిల్లాల్లో 33,000 మంది నుంచి సేకరించిన అభిప్రాయాలతో సర్వే నివేదికను రూపొందించారు.



పలు అంశాలపై వచ్చిన అభిప్రాయాలు ఇలా..

1 ఫిట్‌నెస్ వాచీ / బ్యాండ్‌లు కొన్నా.. వాడకపోవడానికి కారణాలు..

కారణం	శాతం
ప్రతిరోజూ చార్జింగ్ పెట్టాలి	13%
ప్రతి రోజూ వ్యాయామం చేయడం లేదు	17%
నాకు గిఫ్ట్‌గా ఇచ్చారు కాబట్టి తీసుకున్నా..	13%
రోజూ వ్యాయామం చేస్తా.. కానీ ట్రాక్ చేయాల్సిన పనిలేదు	35%
ఇతర కారణాలు	18%
చెప్పలేం	4%

2 ఫిట్‌నెస్ వాచీ / బ్యాండ్‌లు ఎందుకు వినియోగిస్తున్నారు..

ఉపయోగం	శాతం
తేదీ, సమయం చూసేందుకు	59%
రోజువారీ ఎన్ని అడుగులు నడిచామో ట్రాక్ చేసేందుకు	66%
వారంలో నడక దూరాలను గమనించేందుకు	41%
పల్స్ రేట్ చూసుకునేందుకు	34%
ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్, ఈమెయిల్స్ చూసేందుకు	27%
సైక్లింగ్, స్విమ్మింగ్ యాక్టివిటీ చూసేందుకు	7%
ఫోన్‌కాల్స్ ఆన్సర్ చేయడానికి	14%

3 గత మూడేళ్లలో మీ కుటుంబంలో ఎంత మంది ఫిట్‌నెస్ వాచీ / బ్యాండ్‌లు కొనుగోలు చేశారు..?

సమాధానం	శాతం
ఐదు అంతకంటే ఎక్కువ మంది	8%
ముగ్గురు నుంచి నలుగురు	21%
ఎవరూ కొనలేదు	50%
చెప్పలేం	21%

అమెరికాలో బతుకమ్మకు అధికారిక గుర్తింపు

అధికారికంగా గుర్తించిన జార్జియా, వర్జీనియా రాష్ట్రాలు, ఉత్తర కరోలినా రాష్ట్రంలోని రెండు నగరాలు



జార్జియా గవర్నర్ ఇచ్చిన గుర్తింపు పత్రం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంస్కృతిక వైభవం బతుకమ్మ ఖ్యాతి ఖండాంతరాలను దాటింది. బతుకమ్మ సంబుర ప్రాశస్త్యాన్ని, పండగలోని పరమార్థాన్ని అమెరికాలో పలు రాష్ట్రాలు గుర్తించాయి. జార్జియా, వర్జీనియా రాష్ట్రాలతోపాటు ఉత్తర కరోలినా రాష్ట్రంలోని చార్లెట్, రాలేహ్ నగరాలు బతుకమ్మ పండుగను అధికారికంగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేశాయి. ఈ మేరకు ఆయా రాష్ట్రాల గవర్నర్లు ఈ వారాన్ని బతుకమ్మ పండుగ, తెలంగాణ హెరిటేజ్ వీక్‌గా ప్రకటించారు. బతుకమ్మ ఎంతో ప్రత్యేకమైన, ప్రాముఖ్యతగల పండుగల్లో ఒకటని.. ఈ ఉత్సవాన్ని 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలే కాకుండా అమెరికాలో స్థిరపడ్డ 12 లక్షల మంది ఎన్నారైలు కూడా ఎంతో ఘనంగా జరుపుకుంటున్నారని జార్జియా, వర్జీనియా రాష్ట్రాల గవర్నర్లతోపాటు ఉత్తర కరోలినాలోని చార్లెట్, రాలేహ్ మేయర్లు అభివర్ణించారు. దీంతో వారికి గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. అలాగే తెలంగాణ ఆడపడుచులకు అభినందనలు తెలియజేశారు. కొంతకాలంగా తెలంగాణ బతుకమ్మకు ఖండాంతరాల్లో గుర్తింపు తెచ్చేందుకు గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్, ఇతర సంఘాలు, ప్రవాస తెలంగాణవాసులు చేస్తున్న కృషికి ఈ గుర్తింపుతో ఫలితం దక్కినట్టయింది. గతంలోనూ అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు బతుకమ్మను గుర్తించాయి.

విద్యా విధానం యథావిధిగా కొనసాగించాలి

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం



మాట్లాడుతున్న ఆకునూరి మురళి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ‘టెన్ ప్లస్ టూ ప్లస్ త్రీ’ విద్యా విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అమలు చేస్తున్న ఉచిత విద్యకు ఏటా రూ. 5 కోట్లు నిధులివ్వాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ విద్యార్థులకు విస్తరించాలని, కొత్త కాలేజీలకు సిబ్బందిని కేటాయించాలని కోరింది. సంఘం మూడో కౌన్సిల్ సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి సమావేశాలను ప్రారంభించారు.

నూతన కార్యవర్గం

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘ కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ పి.మధుసూదన్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా ఇ.శ్రీనివాసరెడ్డి, జనరల్ సెక్రటరీగా బలరాం జాదవ్, జాయింట్ సెక్రటరీగా ఎం.విజయశేఖర్, కోశాధికారిగా ఎ.శివప్రసాద్, మహిళా కార్యదర్శిగా ఎస్.పద్మావతి, ఉపాధ్యక్షులుగా సింగం శ్రీనివాస్, జి.సత్యపాల్‌రెడ్డి, జి.వేణుగోపాల్, శ్రీధర్, నరేశ్, అశోక్, రాష్ట్ర కార్యదర్శులుగా ప్రమీల, ప్రసాద్, హరిప్రసాద్, ఫహీముద్దీన్, మాధవ్, శ్రీదేవి ఎన్నికయ్యారు.

‘తిరుమల పవిత్రతను కాపాడాలనే ఏపీ సీఎం సూచించారు’

తిరుమల: తిరుమల పవిత్రతను కాపాడాలని మాత్రమే సీఎం చంద్రబాబు సూచించారని టీటీడీ స్పష్టం చేసింది. తన రెండు రోజుల పర్యటన సందర్భంగా శనివారం తిరుమలకు వెళ్లిన సీఎం చంద్రబాబు పలువురు ఉన్నతాధికారులు, విభాగాధిపతులతో, భక్తుల సౌకర్యం కొరకు టీటీడీ ఇటీవల చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలపై మాత్రమే సమీక్షించారని తెలిపింది. తిరుమల గిరులలో గోవింద నామస్మరణ తప్ప మరేమీ ఉండకూడదని, వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, తిరుమల పవిత్రతను ప్రతి ఒక్కరు కాపాడాలని మాత్రమే ఆయన సూచించారని పేర్కొంది. సిట్ గురించి ఎక్కడా ప్రస్తావించలేదని టీటీడీ ఓ ప్రకటనలో తెలియజేసింది.

‘భూ’చక్రం తిప్పేశారు!

ప్లాటు పొందిన వ్యక్తి పేరిట 36 ఏళ్ల తర్వాత రిజిస్ట్రేషన్

- కొన్ని గంటల్లోనే మరో వ్యక్తి పేరిట భూమి మార్పు
- సీనియారిటీ మేరకు సభ్యులకు దక్కాల్సిన భూమి వేరేవారి చేతుల్లోకి..
- జూబ్లీహిల్స్ కో–ఆపరేటివ్ సొసైటీలో మరో గోల్‌మాల్
- పాలకమండలి కనుసన్నల్లో అక్రమాల పర్వం!

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌లో అక్రమాల భూ‘చక్రం’ తిరిగింది. నిబంధనల ప్రకారం సీనియారిటీ ఉన్న సభ్యులకుగానీ, ప్రభుత్వానికి గానీ చెందాల్సిన భూమిని పాలకమండలిలోని ముఖ్యులు పక్కా ప్లాన్‌తో అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. సొసైటీలోని ముఖ్యులతోపాటు అధికార యంత్రాంగం కూడా ఈ తతంగంలో భాగస్వామ్యం కావడం గమనార్హం. ప్రభుత్వం ఈ సొసైటీకి కేటాయించిన భూమి నుంచి 304/జీ/111 ప్లాట్‌ను 1988లో సభ్యత్వం నంబర్ 4153గా ఉన్న ఐఏఎస్ నటరాజన్‌కు కేటాయించారు. నటరాజన్ మరణించిన కొన్నేళ్లకు ఆయన కుమారుడు శంకర్ నారాయణన్ పేరుపై సభ్యత్వ బదిలీ జరిగింది. కానీ ఆయన ఇప్పటివరకు ప్రభుత్వ విలువను చెల్లించి ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. ఇలాంటప్పుడు సదరు ప్లాట్‌ను సీనియారిటీ మేరకు తర్వాతి లబ్ధిదారులకు బదిలీ చేసి రిజిస్ట్రేషన్ చేయాలి. కానీ అలా చేయలేదు. 36 ఏళ్లు గడిచాయి. ఇప్పటి పాలకమండలి సభ్యులు ‘భూ’ చక్రం తిప్పారు. అతి ఖరీదైన ఈ ప్లాట్‌ను తొలుత శంకర్ నారాయణన్ పేరిట, ఆ వెంటనే సర్దార్ దల్జీత్ సింగ్ అనే మరో వ్యక్తి పేరిట ఒక్కరోజులోనే గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ చేశారు. ఇది పూర్తిగా సొసైటీ నిబంధనలకు విరుద్ధం.

ప్లాట్ ఓనర్ కాకుండానే..


సొసైటీ పాలకవర్గం చకచకా స్థలాన్ని శంకర్ నారాయణన్ పేరు మీదకు, తర్వాత గంటల వ్యవధిలోనే దల్జీత్ సింగ్‌కు బదిలీ చేయడం గమనార్హం. శంకర్ నారాయణన్‌కు రిజిస్ట్రేషన్ చేయాలంటే ప్రభుత్వ విలువను సొసైటీకి చెల్లించాల్సిన నేపథ్యంలో.. ఆ మొత్తాన్ని దల్జీత్ సింగ్ బదిలీ చేశారు. జూన్ 28న నారాయణన్ చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ కోసం రూ.25,89,735.. 29న రూ.60,80,550 చెల్లించారు. విచిత్రమేంటంటే అప్పటికి ఆయన ప్లాట్ ఓనర్ కానే కాదు. అలాగే సొసైటీకి చెల్లించాల్సిన రూ.3,40,67,600ను జూలై 1న బదిలీ చేశారు. డాక్యుమెంట్ నంబర్ 4244/2024తో 529 గజాల భూమి శంకర్ నారాయణన్ పేరు మీదకు మారింది. తర్వాత గంటల వ్యవధిలోనే ఆ భూమిని దల్జీత్ సింగ్ పేరిట మార్చే పని మొదలుపెట్టారు.

ఇళ్లు నిర్మించకుండా అమ్మకం చెల్లదు

సొసైటీలో భూమి పొందిన లబ్ధిదారులెవరైనా 18 నెలల్లో ఇల్లు నిర్మించకుంటే.. దాన్ని రద్దు చేసే అధికారం సొసైటీకి ఉంటుంది. అసలు ఇల్లు నిర్మించకుండా అమ్మడం చెల్లదనేది సొసైటీ నిబంధన కూడా. రిజిస్ట్రేషన్ పత్రాల్లోనూ ఈ విషయాన్ని పేర్కొంటారు. ఇవేమీ పట్టించుకోకుండా దల్జీత్ పేరు మీదకు రిజిస్ట్రేషన్ (డాక్యుమెంట్ నంబర్ 4257/2024) మారిపోయింది. సాధారణంగా ఎవరైనా రిజిస్ట్రార్ కార్యాలయంలో భూమి రిజిస్ట్రేషన్ చేశాక డాక్యుమెంట్లు రావడానికి వారం రోజుల సమయం పడుతుంది. కానీ ఇక్కడ రిజిస్ట్రేషన్ అయిన వెంటనే చేతికిచ్చారంటే.. అక్రమంలో అధికారుల పాత్ర ఏమిటో తెలిసిపోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నారాయణన్ పేరు మీది డాక్యుమెంట్ రాకుండానే సబ్ రిజిస్ట్రార్ దల్జీత్ పేరిట రిజిస్ట్రేషన్‌కు ఏర్పాట్లు చేయడం గమనార్హం. రిజిస్ట్రేషన్ సమయంలో రూ.8 కోట్లు చెల్లిస్తున్నట్లు పేర్కొన్న దల్జీత్.. రూ.4,25,42,665ను డీడీ రూపంలో నారాయణన్‌కు బదిలీ చేసినట్టు చూపారు. సొసైటీలోని భూమి నారాయణన్ పేరు మీదకు జూలై 1న రిజిస్ట్రేషన్ కాగా.. అదే రోజున దల్జీత్ పేరు మీదకు మారడం గమనార్హం.

నిబంధనలను పక్కకు నెట్టి..

హౌసింగ్ సొసైటీ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం స్థలం మంజూరు చేస్తుంది. కేటాయించిన స్థలంలో గృహ నిర్మాణం చేపట్టాలి. లేదంటే తిరిగి సొసైటీకి స్థలాన్ని అప్పగించాలి. అంటే శంకర్ నారాయణన్ పేరిట స్థలం మారినా.. అందులో ఎలాంటి నిర్మాణం చేపట్టకుండానే దల్జీత్‌కు విక్రయించడం సొసైటీ నిబంధనలకు విరుద్ధం. అంతేకాదు.. స్థలం బదిలీకి ఒకట్రెండు సంవత్సరాలు వేచిచూడాలి, లేదా సొసైటీలోని తర్వాతి లబ్ధిదారులకు కేటాయించాలని చట్టం చెబుతోంది. దీన్ని సొసైటీ పాలకమండలి పూర్తిగా ఉల్లంఘించింది. రిజిస్ట్రేషన్లు చేసిన సబ్ రిజిస్ట్రార్ కూడా ఈ అంశాన్ని పట్టించుకోకపోవడంతో అధికారులకూ ఈ అక్రమాల్లో భాగస్వామ్యం ఉందనే ఆరోపణలు వస్తున్నాయి.



Stamp duty paid by M.N. Shankaranarayanan from the Advance given by Sardar Daljeet Singh on 28.06.2024


జూన్ 28న శంకర్ నారాయణన్ పేరిట సబ్ రిజిస్ట్రార్‌కు చెల్లించిన స్టాంపుడ్యూటీ చలానా

కోట్ల రూపాయల అక్రమం!

దల్జీత్‌సింగ్ తన పేరుమీదకు మారిన స్థలంలో నిర్మాణం ప్రారంభించేందుకు జూన్ 18న జీహెచ్‌ఎంసీకి మార్టిగేజ్ చేశారు. సొసైటీ నుంచి నారాయణన్ పేరిట జరిగిన రిజిస్ట్రేషన్‌లో 529 గజాల ప్లాట్‌కు గజానికి రూ.64,400 చొప్పున మొత్తం రూ.3,40,67,600గా లెక్కగట్టారు. రూ.25,89,720 స్టాంప్ డ్యూటీగా చెల్లించారు. ఇదే ప్లాట్‌ను దల్జీత్ పేరిట మార్చిన రిజిస్ట్రేషన్‌లో మార్కెట్ విలువ చదరపు గజానికి రూ.1,54,228 చొప్పున లెక్కించారు. స్టాంపు డ్యూటీగా రూ.60,80,550 చెల్లించారు. అంటే మొత్తం ప్లాట్ ధర రూ.8 కోట్లుగా చూపారు. (జూన్ 8న ఆర్టీజీఎస్ ద్వారా రూ.25,89,735.. జూన్ 29న ఆర్టీజీఎస్ ద్వారా రూ.3,40,67,600.. జూలై 1న డీడీ రూపంలో రూ.4,25,42,665.. టీడీఎస్‌కు రూ.8 లక్షలు చెల్లించినట్టు చూపారు). నిజానికి జూబ్లీహిల్స్‌లో బహిరంగ మార్కెట్ విలువ చదరపు గజానికి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఉంది. అంటే ఈ భూమి విలువ రూ.16 కోట్లకుపైనే! అందులో రూ.8 కోట్లు లెక్కకు వచ్చిందని, మిగతా సొమ్ము సంగతి తేల్చాలనే డిమాండ్ వస్తోంది. ఈ వ్యవహారంపై పలువురు ‘ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)’ను ఆశ్రయించే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలిసింది.

టుడేస్ గ్రాఫిక్

పొదుపు.. పెట్టుబడి



భారతీయులు క్రమంగా పొదుపు బాట నుంచి పెట్టుబడి మార్గం వైపు అడుగులేస్తున్నట్లు స్కూల్ ఆఫ్ ఇన్‌ట్రిన్సిక్ కాంపౌండింగ్ (ఎస్‌ఓఐసీ) అనే సంస్థ చేపట్టిన తాజా అధ్యయనం వెల్లడించింది. గత పదేళ్లలో.. అంటే 2014తో పోలిస్తే 2024లో దేశంలోని కుటుంబాల ‘ఆర్థిక’ ఆస్తుల విభజనలో చోటుచేసుకున్న మార్పు దీన్ని తెలియజేస్తోందని పేర్కొంది.

పొలంలో పులిలాంటి పిల్లి కూన



వికారాబాద్ జిల్లా చెల్లాపూర్‌లో రైతుకు లభ్యం
నెహ్రూ జూపార్కుకు తరలించిన అధికారులు

కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిధిలోని చెల్లాపూర్‌లో రామకృష్ణ అనే యువ రైతుకు పొలంలో పులి పిల్లల ఆకారంలో అప్పుడే పుట్టిన రెండు కూనలు కనిపించాయి. వాటిని పరిశీలించగా అప్పటికే ఒకటి మృతిచెందగా మరొకటి అత్యంత బలహీనంగా ఉంది. దీంతో మానవతాదృక్పథంతో ఆ కూనను ఇంటికి తీసుకువచ్చాడు. దాని చేతులు పులి పంజా ఆకారంలో ఉండటంతో స్థానికులు ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. గ్రామానికి వచ్చిన అధికారి మోమిన్.. ఆ కూనను హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్క్‌కు తరలించగా అరుదైన జాతికి చెందిన అడవి పిల్లిగా దాన్ని గుర్తించారు. అంతరించిపోతున్న పిల్లి జాతిలో ఒక రకమైన వన్యప్రాణి అని.. ఇది చిరుత ఆకారంలోనే ఉంటుందన్నారు. ఈ అడవిపిల్లిని సంరక్షించిన రామకృష్ణను అధికారులు అభినందించారు.

నిరుపేద మెడిసిన్ విద్యార్థికి దాతల ఆర్థికసాయం

- శ్రీహర్షిత బ్యాంకు ఖాతాకు రూ. 1.10 లక్షలు బదిలీ
- దాతలకు కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థిని



శ్రీహర్షితకు ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

సాక్షి ఎఫెక్ట్

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు దిద్దిపూడి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని పానెం శ్రీహర్షిత ఇటీవల ప్రకటించిన మెడిసిన్ ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించింది. ఆమె దీనస్థితిని గమనించి ‘సాక్షి’ ఈ నెల 3వ తేదీన ‘చదువుల తల్లిని కనికరించని లక్ష్మీదేవి’ అంటూ కథనాన్ని ప్రచురించింది. దీంతో దాతలు విరివిగా స్పందించారు. ఇప్పటివరకు రూ. 1,10,000 ఆర్థిక సాయాన్ని శ్రీహర్షిత బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. ఆదివారం ఖమ్మంకు చెందిన సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఎ.నర్సింహారావు, సభ్యులు నాగరాజు, సైదులు, సతీశ్‌లు రూ. 12 వేల ఆర్థిక సాయంతో పాటు రూ.30 వేలు విలువ చేసే వైద్యవిద్యకు సంబంధించిన పుస్తకాలను అందజేశారు. అంతేకాకుండా కొణిజర్ల, బోనకల్ హెల్త్ సూపర్‌వైజర్లు వి.భాస్కర్‌రావు, ఎం.దానయ్యలు రూ. 10 వేలు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. విజయవాడకు చెందిన మరో వైద్యుడు నాలుగేళ్ల హాస్టల్ ఖర్చులు తానే భరిస్తానని హామీ ఇచ్చినట్లు శ్రీహర్షిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీహర్షిత ‘సాక్షి’తో మాట్లాడుతూ తన ఆర్థిక పరిస్థితిని గమనించి ముందుకు వచ్చిన దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.

దామగుండం అడవిని రక్షించుకుందాం



అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క



దామగుండంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు. బతుకమ్మతో విమలక్క

పూడూరు: నౌకాదళ రాడార్ ప్రాజెక్టు నుంచి దామగుండం అడవిని రక్షించుకుందామని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా దామగుండం ఆలయ ప్రాంగణంలో బహుజన బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ.. పర్యావరణాన్ని దెబ్బతీసే రాడార్ స్టేషన్ ఏర్పాటును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలన్నారు. మూసీ, ఈసీ, కాగ్నా నదులకు జన్మస్థానమైన ఈ ప్రాంతాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దామగుండం, రాకంచర్ల ప్రాంతాల్లో ఉన్న ఎర్రమట్టిని ఇతర ప్రాంతాలకు తరలించకుండా చూడటంతో పాటు, వేటగాళ్ల బారినుంచి దామగుండం క్షేత్రాన్ని రక్షించుకుందామని పేర్కొన్నారు. 111 జీవోను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అనుమతులు: కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లు అధికారంలో ఉన్నా నేవీ రాడార్ కేంద్ర ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ కేంద్రం ఏర్పాటుకు అనుమతులు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి ప్రాజెక్టు ఏర్పాటును విరమించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దామగుండం అటవీ పరిరక్షణపై పాటల సీడీని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు సురేందర్, పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైల్వే విస్తరణపై కేంద్రం ప్రత్యేక దృష్టి

- సికింద్రాబాద్–వాస్కోడిగామా ట్రైన్‌తో పర్యాటకులకు ఎంతో ఊరట
- తెలుగు రాష్ట్రాలతోపాటు, కర్ణాటక ప్రజలకు ప్రయోజనం
- జెండా ఊపి రైలును ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



జెండా ఊపి గోవా ట్రైన్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో రైల్వే విస్తరణపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించి.. గత పదేళ్లలో అధిక నిధులు కేటాయించిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్–వాస్కోడిగామా ట్రైన్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, దక్షిణమధ్య రైల్వే జనరల్‌మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వేమేనేజర్ భరతేశ్‌కుమార్ జైన్ తదితరులతో కలిసి కొత్త రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వంద రోజుల్లో వివిధ రాష్ట్రాల్లో 900 కిలోమీటర్ల మేర రైల్ నెట్ వర్క్‌ను విస్తరించే విధంగా రూ. 24,600 కోట్లతో కొత్తగా 8 రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించినట్టు చెప్పారు. ఇందులో భాగంగా భద్రాచలం–మల్కన్‌గిరి మధ్య 173 కిలోమీటర్లు రైల్వేలైన్‌కు రూ. 4,109 కోట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు. గత పదేళ్లలో తెలంగాణలో 346 కిలోమీటర్ల కొత్త లైన్లు, 383 కిలోమీటర్ల వరకు డబ్లింగ్ పూర్తయిందన్నారు. రికార్డు స్థాయిలో 1,828 ట్రాక్ కిలోమీటర్లు విద్యుదీకరించినట్టు చెప్పారు. జహీరాబాద్‌లో రూ. 2,361 కోట్లతో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. హైదరాబాద్–నాగ్‌పూర్ మధ్య రూ.6,661 కోట్లతో ప్రతిపాదించిన జాతీయ రహదారుల అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. హైదరాబాద్ నుంచి గోవాకు ప్రత్యేక రైలు నడపాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉందని, ప్రజల ఆకాంక్ష మేరకు వారానికి 2 రోజుల పాటు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును అందుబాటులోకి తేవడం సంతోషంగా ఉందన్నారు. దీనివల్ల పర్యాటకులు, తెలంగాణ, ఏపీతోపాటు కర్ణాటక ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

త్వరలో చర్లపల్లి టర్మినల్ ప్రారంభం

హైదరాబాద్‌లో నాలుగో టర్మినల్‌గా అభివృద్ధి చేసిన చర్లపల్లి రైల్వేస్టేషన్ పనులు తుదిదశకు చేరాయని, త్వరలోనే ఈ టర్మినల్‌ను ప్రారంభిస్తామని కిషన్‌రెడ్డి చెప్పారు. రూ.700 కోట్లతో చేపట్టిన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. 2025 నాటికి ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. నాంపల్లి, కాచిగూడ టర్మినల్ స్టేషన్లను కూడా పునరభివృద్ధి చేస్తామన్నారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా కొత్త రైలును ఏర్పాటు చేయడం పట్ల అభినందనలు తెలిపారు.

3 రాష్ట్రాలు.. 18 మంది నేరగాళ్లు

- మూడు రాష్ట్రాల్లో సైబర్ క్రైమ్ పోలీసుల దాడులు
- వీరిపై హైదరాబాద్‌లో 10, దేశవ్యాప్తంగా 319 కేసులు
- నగరవాసుల నుంచే రూ.6.9 కోట్లు స్వాహా



నిందితులు


సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్, ఫోన్ కాల్స్ ద్వారా ఎర వేసి.. ఈడీ, సీబీఐ అధికారులమంటూ వివిధ రకాల పేర్లతో నగరవాసుల నుంచి రూ.6.9 కోట్లు కాజేసిన సైబర్ నేరగాళ్లను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా మూడు రాష్ట్రాల్లో మెరుపు దాడులు చేసిన ఆరు బృందాలు 18 మందిని పట్టుకున్నాయి. వీరిపై హైదరాబాద్‌లో 10 కేసులు ఉండగా.. దేశవ్యాప్తంగా 319 కేసులు నమోదైనట్లు పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదివారం వెల్లడించారు. సోషల్‌మీడియా గ్రూపుల ద్వారా ఎర వేసి, పెట్టుబడుల పేరుతో డబ్బులు స్వాహా చేసే ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్‌తో పాటు డిజిటల్ స్కామ్స్ ఇటీవల పెరిగిపోయాయి. కొరియర్‌లో డ్రగ్స్ పార్సిల్స్, మనీ లాండరింగ్ అంటూ ఫోన్లు చేస్తున్న సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ ద్వారానే డిజిటల్ అరెస్టు చేస్తున్నారు. ఆపై వారి నుంచి అందినకాడికి దండుకునే డిజిటల్ స్కామ్స్ సైతం తరచూ వెలుగు చూస్తున్నాయి. వీటితో పాటు వీడియో కాల్స్‌తో వలపు వల వేసి నిండా ముంచే సెక్స్టార్షన్స్ గ్యాంగ్స్.., బ్యాంకు అధికారులు, క్రెడిట్ కార్డు కంపెనీల పేరుతో ఓటీపీలు సంగ్రహించే ముఠాలు, ఇన్సూరెన్స్ రెన్యూవల్, బోనస్ పేరుతో కొల్లగొట్టే నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఈ ఐదు రకాలైన నేరాలపై సిటీలో అనేక కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో రూ.6.9 కోట్లతో ముడిపడి ఉన్న పది కీలక కేసులను ఎంచుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు నేరగాళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. డీసీపీ దార కవిత, ఏసీపీలు ఆర్‌జీ శివమారుతి, చాంద్‌బాషా నేతృత్వంలో స్పెషల్ టీమ్స్ రంగంలోకి దిగాయి. ఇన్‌స్పెక్టర్లు మట్టం రాజు, పి.ప్రమోద్‌కుమార్, ఎం.సీతారాములు, కె.ప్రసాద్‌రావు, ఎస్.నరేశ్‌లు తమ బృందాలతో కలసి మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్తాన్‌లలో వరుస దాడులు చేశాయి. ఈ సందర్భంగా కీలకమైన సైబర్ నేరగాళ్లతో పాటు వారికి బ్యాంకు ఖాతాలు అందించడంతోపాటు, దళారులుగా వ్యవహరిస్తున్న 18 మందిని పట్టుకున్నారు. వీరి నుంచి రూ.5 లక్షల నగదుతో పాటు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరికి సంబంధించి వివిధ బ్యాంకుల ఖాతాల్లో ఉన్న రూ.1.61 కోట్లను ఫ్రీజ్ చేశారు. నిందితులను అక్కడి న్యాయస్థానాల్లో హాజరుపరిచి పీటీ వారెంట్‌పై హైదరాబాద్‌కు తీసుకువచ్చి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరికొందరు నిందితుల కోసం సైబర్ క్రైమ్ పోలీసులు గాలిస్తున్నారు.

శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దుర్గమ్మ పది విశేష అలంకారాలలో భక్తులకు దర్శనమిస్తున్నారు.

నవరాత్రి అలంకరణలో నవనవోన్మేషంగా...



3వ తేదీ గురువారం - శ్రీబాలా త్రిపుర సుందరీదేవి
దసరా ఉత్సవాలలో తొలిరోజున దుర్గమ్మ శ్రీబాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. బాలాదేవి ఎంతో మహిమాన్వితమైనది. దసరా ఉత్సవాలలో భక్తులకు పూర్ణఫలం అందించే అలంకారం శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి.



4వ తేదీ శుక్రవారం - శ్రీగాయత్రిదేవి
రెండోరోజున దుర్గమ్మ శ్రీ గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గాయత్రి అమ్మవారిని దర్శించడం వల్ల ఆరోగ్యం లభిస్తుంది. వేద మాత గా గాయత్రిదేవిని దర్శించుకోవడం వలన సకల మంత్రసిద్ధి, తేజస్సు, జ్ఞానం పొందుతారు.



5వ తేదీ శనివారం - శ్రీఅన్నపూర్ణాదేవి
దసరా ఉత్సవాలలో మూడోరోజున దుర్గమ్మను శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. నిత్యాన్నదానేశ్వరి అలంకారంలో శ్రీ దుర్గమ్మను దర్శించడం వల్ల అన్నాదులకు లోపం లేకుండా, ఇతరులకు అన్నదానం చేసే భాగ్యాన్ని పొందగలుగుతారు.



6వ తేదీ ఆదివారం
శ్రీలలితా త్రిపుర సుందరీదేవి
దసరా ఉత్సవాలలో నాల్గో రోజున దుర్గమ్మను శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులు దర్శించుకున్నారు. శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా దర్శమిచ్చే సమయంలో పరమేశ్వరుడు మహాకామేశ్వరుడిగా, అమ్మవారు త్రిపుర సుందరీదేవిగా భక్తుల పూజలందుకుంటారు.



7వ తేదీ సోమవారం - శ్రీ మహాచండీదేవి
ఐదవ రోజున దుర్గమ్మ శ్రీమహాచండీదేవిగా భక్తులకు దర్శనమిస్తారు. శ్రీ మహాచండీ అమ్మవారి అనుగ్రహం వలన విద్య, కీర్తి, సంపదలు లభించి, శత్రువులు మిత్రులుగా మారి కోరికలు అన్ని సత్వరమే తీరుతాయి.



8వ తేదీ మంగళవారం - శ్రీమహాలక్ష్మీదేవి
ఆరో రోజున దుర్గమ్మ శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిస్తారు. లోక స్థితికారిణిగా, అమృత స్వరూపిణిగా భక్తులను అనుగ్రహిస్తుంది. శ్రీమహాలక్ష్మీదేవిని దర్శించుకోవడం వల్ల ఐశ్వర్య ప్రాప్తి కలుగుతుంది.



9వ తేదీ బుధవారం - శ్రీసరస్వతిదేవి
ఏడవరోజయిన మూల నక్షత్రం రోజున సరస్వతి అవతారంలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిస్తారు. సరస్వతీదేవిని సేవించడం వల్ల సర్వ విద్యలయందు విజయం పొందుతారు.



10వ తేదీ గురువారం - శ్రీదుర్గాదేవి
8వ రోజున దుర్గమ్మ శ్రీ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిస్తారు. లోక కంటకుడైన దుర్గమాసురుడు అనే రాక్షసుడిని సంహరించి దుర్గతులను పోగొట్టి దుర్గగా వెలుగొందినది. శరన్నవరాత్రులలో దుర్గాదేవిని అర్చించటం సద్గతులను ప్రసాదిస్తుంది.



11వ తేదీ శుక్రవారం -
శ్రీమహిషాసుర మర్దనిదేవి
దసరా ఉత్సవాలలో 9వ రోజున దుర్గమ్మ శ్రీమహిషాసురమర్దనిదేవిగా భక్తులకు దర్శనమిస్తారు. అష్టభుజాలతో అవతరించి సింహవాహినియై, దుష్టుడైన మహిషాసురుని సంహరించి శ్రీదుర్గాదేవి దేవతల, ఋషుల, మానవుల కష్టాలను తొలగించింది. మహిషాసురమర్దనిదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించడం వల్ల అరిష్వర్గాలు నశించి, సాత్విక బావం ఉదయిస్తుంది. సర్వ దోషాలు పంటాపంచలు అవుతాయి. ధైర్య, స్థైర్య, విజయాలు చేకూరుతాయి.



12వ తేదీ శనివారం - శ్రీరాజరాజేశ్వరిదేవి
దసరా ఉత్సవాలలో 10వ రోజున దుర్గమ్మ శ్రీ రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిస్తారు. చెరుకు గడను వామహస్తంతో ధరించి, దక్షిణ హస్తంతో అభయాన్ని ప్రసాదిస్తూ, శ్రీషోడశాక్షరీ మహా మంత్ర స్వరూపిణి గా, శ్రీచక్రరాజ దేవతగా వెలుగొందే శ్రీరాజరాజేశ్వరి దేవిని దర్శించి అర్చించడం వల్ల సర్వ శుభాలు కలుగుతాయి.

– సుభాని, సాక్షి, ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)

శ్రీనివాసుని వైభోగం చూద్దాం రారండి

శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 04, శుక్రవారం వైభవంగా ఆరంభమయ్యాయి. ఇవి 12వ తేదీ, శనివారం వరకు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వైశిష్ట్యం ఇలా...



బంగారు తిరుచ్చి ఉత్సవం
అక్టోబర్ 4, శుక్రవారం ఉదయం శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు.

సాయంత్రం ధ్వజారోహణం... సాయంత్రం 5.45కు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

7 - సోమవారం ఉదయం: కల్పవృక్ష వాహనం
నాలుగోరోజు ఉదయం స్వామి ఉభయ దేవేరులతో కలిసి కల్ప వృక్ష వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి దర్శనమిస్తారు. కల్పవృక్ష వాహన దర్శనం వరాలను అనుగ్రహిస్తుంది.

రాత్రి: సర్వభూపాల వాహనం... సర్వభూపాల అంటే విశ్వానికే రాజు అని అర్థం. అంటే శ్రీవారు సకల దిక్పాలకులకు రాజాధిరాజని భావం. దిక్పాలకులందరూ స్వామివారిని హృదయంలో ఉంచుకుని సేవిస్తారు. తద్వారా వారి పాలనలో ప్రజలు ధన్యులవుతారు అనే సందేశాన్నిస్తున్నారు.



8 - మంగళవారం ఉదయం మోహినీ అవతారం ... ఐదోరోజు ఉదయం మోహినీరూపంలో దర్శనమిస్తారు. పక్కనే స్వామి దంతపుపల్లకిపై వెన్న ముద్ద కృష్ణుడై మరో రూపంలో అభయమిస్తాడు. తనకు భక్తులైనవారు మాయను సులభం గా దాటగలరని స్వామి ప్రకటిస్తున్నాడు.

సాయంత్రం గరుడ వాహనం ... ఐదో రోజు రాత్రి గరుడవాహనంలో ఊరేగుతూ భక్తులందరికీ తన దివ్యమంగళ రూపదర్శనమిస్తారు. గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయి.

9 - బుధవారం ఉదయ: హనుమంత వాహనం
ఆరోరోజు ఉదయం శేషాచలాధీశుడు రాముని అవతారంలో హనుమంతునిపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తాడు. ఈ ఇరువురినీ చూస్తే వేదాల తత్త్వం ఒనగూరుతుంది.

సాయంత్రం 4 గంటలకు స్వర్ణరథం...
ఆరోరోజు సాయంత్రం స్వామి స్వర్ణరథాన్ని అధిరోహించి అనుగ్రహిస్తాడు. స్వర్ణోత్సవ సేవలో కల్యాణకట్ట సేవాపరులు బంగారు గొడుగును అలంకరించడం సంప్రదాయం.

రాత్రి 7 గంటలకు గజవాహనం... ఆరోరోజు రాత్రి వేంకటాద్రీశుడు గజవాహనంపై భక్తులకు అభయమిస్తాడు. భక్తులు శ్రీనివాసుని హృదయంలో పెట్టుకుని శరణాగతి చెందాలని తెలుస్తోంది.

10 - గురువారం ఉదయం సూర్యప్రభ వాహనం
ఏడోరోజున ఉదయం సూర్యప్రభ వాహనంపై తిరుమాడవీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారు. సూర్యప్రభ వాహనంపైన దర్శనం వల్ల ఆరోగ్యం, విద్య, ఐశ్వర్యం, సంతానం సిద్ధిస్తాయి.

రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనం... ఏడో రోజు రాత్రి స్వామి చంద్రప్రభ వాహనం పై విహరిస్తారు. ఆధ్యాత్మిక, ఆదిభౌతిక, ఆది దైవికమనే మూడు తాపాలను ఇది నివారిస్తుంది.


11 - శుక్రవారం ఉదయం: శ్రీవారి రథోత్సవం
ఎనిమిదో రోజు ఉదయం ఉభయదేవేరులతో కూడిన స్వామి రథోత్సవం జరుగుతుంది.

రాత్రి 7 గంటలకు అశ్వవాహనం.. ఎనిమిదో రోజు రాత్రి శ్రీమలయప్పస్వామివారు అశ్వవాహనంపై విహరించి భక్తులను అనుగ్రహిస్తాడు. స్వామి అశ్వవాహనారూఢుడై కల్కి అవతారంలో తన స్వరూపాన్ని ప్రకటిస్తూ భక్తులను కలిదోషాలకు దూరంగా ఉండాలని ప్రబోధిస్తున్నాడు.

12 - శనివారం ఉదయం 6 గంటలకు చక్రస్నానం
శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరిదైన తొమ్మిదో రోజు ఉదయం చక్రస్నానం జరుగుతుంది. ముందుగా ఉభయ దేవేరులతో కలిసి శ్రీవారి సరసన ఉన్న చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చందనంతో అర్చకులు అభిషేకం చేస్తారు. ఈ అభిషేక కైంకర్యాన్ని అందుకుని చక్రత్తాళ్వార్ ప్రసన్నుడవుతాడు. చక్రస్నానం సమయంలో పుష్కరిణిలో స్నానం చేసిన వారు యజ్ఞఫలాన్ని పొందుతారని ప్రతీతి..

రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణం... శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరిదైన తొమ్మిదో రోజు రాత్రి బంగారు తిరుచ్చి ఉత్సవం తరువాత ధ్వజావరోహణం శాస్త్రోక్తంగా జరుగుతుంది. ధ్వజావరోహణ ఘట్టంతో తొమ్మిది రోజుల పాటు జరిగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

– లక్ష్మీకాంత్ ఆలిదేనా, సాక్షి, తిరుమల



హైదరాబాద్‌కు చెందిన ఆడియో ఇంజనీర్, సోషల్ యాక్టివిస్ట్ **డాక్టర్ సాజిదా ఖాన్** తెలుగు చిత్ర పరిశ్రమపై చెప్పుకోదగ్గ ప్రభావాన్ని చూపారు. దాదాపు రెండు దశాబ్దాల అనుభవం కల ఆమె భారతదేశంలో మొదటి మహిళా ఆడియో ఇంజనీర్, సంగీత సాంకేతిక నిపుణురాలు. డా.సాజిదా ఖాన్ ఆడియో రంగ నైపుణ్యం గురించి ఆమె మాటల్లో నేటి **సాక్షి @ శక్తి** లో మీ ముందుకు తీసుకు వస్తున్నాం. వీక్షించండి **సాక్షి డిజిటల్ యూట్యూబ్‌లో** ఈ లింక్ ద్వారా.


https://youtu.be/9RTAFJVi4KQ


సినిమా


ఎన్టీఆర్ ● హృతిక్ రోషన్

డ్యాన్స్ టైమ్

ఎన్టీఆర్ డ్యాన్స్ అదరగొడతారు. హృతిక్ రోషన్ డ్యాన్స్ ఇరగదీస్తారు. మరి... ఈ ఇద్దరూ కలిసి ఓ పాటకు డ్యాన్స్ చేస్తే థియేటర్స్ దద్దరిల్లేలా ఆడియన్స్ విజిల్స్ వేస్తారు. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ హీరోలుగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో 'వార్ 2' అనే స్పై యాక్షన్ మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో కియారా అద్వానీ ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా 'వార్ 2'లో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో ఓ పాట ఉంటుందని ఎప్పట్నుంచో వార్తలు వస్తున్నాయి. ఈ పాట చిత్రీకరణకు సమయం ఆసన్నమైంది. టైమ్ టు డ్యాన్స్ అంటూ... ఈ నెల మూడో వారంలో ఎన్టీఆర్, హృతిక్ కాంబినేషన్‌లో ఈ పాటను ముంబైలో చిత్రీకరించనున్నారట. నృత్యదర్శకురాలు వైభవీ మర్చంట్ ఈ సాంగ్‌కు స్టెప్స్ సమకూర్చనున్నారని భోగట్టా. ఈ మాస్ మసాలా సాంగ్ కోసం సెట్స్ తయారు చేయిస్తున్నారట. ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్న 'వార్ 2' వచ్చే ఏడాది ఆగస్టు 15న రిలీజ్ కానుంది.


● రజనీకాంత్


● మణిరత్నం

మూడు దశాబ్దాల తర్వాత..?

హీరో రజనీకాంత్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందిన 'దళపతి' (1991) బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే (మమ్ముట్టి, అరవింద్ స్వామి ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు). ఆ చిత్రం తర్వాత రజనీకాంత్–మణిరత్నం మరో సినిమా చేయలేదు. అయితే ఇప్పుడు 33 ఏళ్ల తర్వాత రజనీకాంత్‌తో సినిమా చేయాలని మణిరత్నం ఓ కథ రెడీ చేశారని, మణిరత్నంతో సినిమా చేసేందుకు రజనీ కూడా ఆసక్తి చూపిస్తున్నారని టాక్. రజనీకాంత్ బర్త్ డే (డిసెంబరు 12) సందర్భంగా ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన వచ్చే చాన్స్ ఉందని కోలీవుడ్ భోగట్టా. మరి మూడు దశాబ్దాల తర్వాత రజనీకాంత్ – మణిరత్నం కాంబినేషన్‌లో సినిమా సెట్ అవుతుందా? వేచి చూడాల్సిందే.


● సూర్య

కర్ణ ఆగడు

''ఇక 'కర్ణ' లేనట్లే... ఆగిపోయింది'' అంటూ ప్రచారంలో ఉన్న వార్తలకు బ్రేక్ పడేలా ఫ్లాష్ న్యూస్ ఇచ్చారు దర్శకుడు రాకేశ్ ఓంప్రకాశ్ మెహ్రా. సూర్య టైటిల్ రోల్‌లో రాకేశ్ ఓంప్రకాశ్ 'కర్ణ' అనే సినిమాని తెరకెక్కించనున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దాదాపు ఏడాదిన్నర క్రితమే ఈ సినిమా గురించిన వార్త వచ్చింది. ఆ తర్వాత అప్‌డేట్ లేకపోవడంతో 'కర్ణ' ఆగిపోయిందనే వార్త తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో ''కర్ణ ఆగడు. ఈ చిత్రానికి సంబంధించిన పనులు జరుగుతున్నాయి'' అని తాజాగా పేర్కొన్నారు ఓంప్రకాశ్. మహాభారతం నేపథ్యంలో రూపొందనున్న 'కర్ణ'లో కర్ణుడిగా సూర్య నటించనున్నారు. కర్ణుడి భార్య పాత్రకు జాన్వీ కపూర్‌ని తీసుకోవాలనుకుంటున్నారట. సంగీతదర్శకత్వానికి ఏఆర్ రెహమాన్‌ని సంప్రదించారని సమాచారం. ఈ చిత్రాన్ని హిందీ, తమిళంలో చిత్రీకరించి, తెలుగు, మలయాళం, కన్నడ భాషల్లో అనువదించి, విడుదల చేయాలనుకుంటున్నారట. ఈ విషయాల గురించి త్వరలో అధికారిక ప్రకటన రానుంది. ఇక రెండు భాగాలుగా రూపొందనున్న ఈ చిత్రానికి రచయిత ఆనంద్ నీలకంఠన్ స్క్రిప్ట్ వర్క్ చేస్తున్నారు. హిందీలో సూర్యకి ఇదే తొలి చిత్రం అవుతుంది.


● అశోక్, మానస

మహేశ్‌గారు టీజర్ బాగుందన్నారు - అశోక్ గల్లా

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేశ్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా హీరోగా నటించిన తాజా చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. ఈ చిత్రంతో మానసా వారణాసి కథానాయికగా పరిచయం అవుతున్నారు. అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మించారు. ఈ సినిమాను నవంబరు 14న రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అశోక్ గల్లా మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో కృష్ణ పాత్రలో కనిపిస్తాను. అమ్మ చెబితే ఏదైనా చేసే కుర్రాడు కృష్ణ. మహేశ్‌బాబుగారు ఈ సినిమా టీజర్ చూసి, బాగుందన్నారు. ఈ చిత్రంలో చావు, జాతకం అంశాలు ఉన్నాయి'' అన్నారు. ''మంచి సంకల్పంతో చేసే ఏ పనైనా నెరవేరుతుందన్నదే ఈ సినిమా కథాంశం. మైథాలజీ, సూపర్ నేచురల్ అంశాలు కూడా ఉన్నాయి. ప్రశాంత్ వర్మగారు ఇచ్చిన కథ సోల్ చెడిపోకుండా ఈ సినిమా చేశాను'' అని తెలిపారు అర్జున్. ''నవంబరు 14న 'కంగువ, మట్కా' సినిమాలు కూడా రిలీజ్ అవుతున్నాయి. కానీ మా సినిమాపై మాకు నమ్మకం ఉంది. 20 కోట్ల రూపాయల బడ్జెట్‌తో తీసిన ఈ చిత్రం చిన్న సినిమా కాదు'' అని సోమినేని బాలకృష్ణ అన్నారు. ''ఈ మూవీలో ఏ కష్టాన్నైనా ఎదుర్కొని పోరాడే సత్యభామ పాత్ర చేశాను '' అన్నారు మానసా వారణాసి.



బేబీ జాన్‌లో అతిథిగా...

'బేబీ జాన్'కు అతిథి అయ్యారు సల్మాన్ ఖాన్. వరుణ్ ధావన్ హీరోగా తమిళ దర్శకుడు కాలీస్ దర్శకత్వం వహిస్తున్న హిందీ చిత్రం 'బేబీ జాన్'. హిందీలో కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ తొలి చిత్రంలో నటి వామికా గబ్బి మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ సినిమా డిసెంబరు 25న విడుదల కానుంది. కాగా 'బేబీ జాన్'లో సల్మాన్ ఖాన్ అతిథి పాత్రలో నటిస్తున్నారని, ప్రస్తుతం సల్మాన్–వరుణ్ ధావన్ కాంబినేషన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని బాలీవుడ్ సమాచారం. అంతేకాదు... సల్మాన్ ఖాన్–వరుణ్ ధావన్‌లపై వచ్చే యాక్షన్ సీన్స్‌ని మాత్రం ఈ చిత్రం నిర్మాతల్లో ఒకరైన దర్శకుడు అట్లీ తీస్తున్నారట. ఇక తమిళంలో విజయ్ హీరోగా అట్లీ దర్శకత్వం వహించిన హిట్ మూవీ 'తేరీ'కి హిందీ రీమేక్‌గా 'బేబీ జాన్' రూపొందుతోందనే టాక్ వినిపిస్తోంది. మరోవైపు సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్న 'సికందర్' చిత్రం వచ్చే ఏడాది ఈద్ సందర్భంగా విడుదల కానుంది.


● సల్మాన్ ఖాన్


● రుక్మిణి, నిఖిల్

అప్పుడో ఇప్పుడో ఎప్పుడో...

'స్వామి రా రా (2013), కేశవ (2017)' చిత్రాల తర్వాత హీరో నిఖిల్ సిద్ధార్థ్–దర్శకుడు సుధీర్ వర్మ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో...'. కన్నడ హీరోయిన్ రుక్మిణీ వసంత్ ఈ సినిమాతో తెలుగు పరిశ్రమకు పరిచయమవుతున్నారు. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించారు. ఆదివారం సుధీర్ వర్మ బర్త్ డే సందర్భంగా ఫస్ట్ లుక్ రిలీజ్ చేసి, దీపావళికి ఈ సినిమాని రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. హీరోయిన్ దివ్యాంశా కౌశిక్, హర్ష చెముడు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: కార్తీక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: సన్నీ ఎంఆర్.

యాక్షన్ సినిమా చేయాలని ఉంది - కావ్యా థాపర్

''ఓ నటిగా నాకు యాక్షన్, సైకో కిల్లర్, డీ గ్లామరస్.. ఇలా విభిన్న తరహా పాత్రలు చేయాలని ఉంది. అయితే నాకు ఎక్కువగా గ్లామరస్ రోల్స్ వస్తున్నాయి. 'విశ్వం'లో నాకు మంచి క్యారెక్టర్ దక్కింది'' అని అన్నారు హీరోయిన్ కావ్యా థాపర్. గోపీచంద్, కావ్యా థాపర్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'విశ్వం'. శ్రీను వైట్ల దర్శకత్వంలో వేణు దోనేపూడి, టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో కావ్యా థాపర్ చెప్పిన విశేషాలు.

● ఈ సినిమాలో నేను కాస్ట్యూమ్ డిజైనర్ రోల్ చేశాను. మోడ్రన్‌గా ఉండే అమ్మాయి. కానీ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. నా క్యారెక్టర్‌లో కాస్త గ్రే షేడ్ కనిపిస్తుంది... ఫన్ కూడా ఉంటుంది. ఈ చిత్రంలో సీనియర్ నరేశ్, పవిత్రగార్లు నా తల్లిదండ్రులు. శ్రీను వైట్లగారు మంచి నటన రాబట్టుకున్నారు. మంచి విజన్ ఉన్న దర్శకుడు. ఈ చిత్రంలోని ట్రైన్ ఎపిసోడ్‌లో నా క్యారెక్టర్‌లో కూడా ఫన్ ఉంటుంది. ఈ సినిమాలో పదిహేను మంది హాస్యనటులు నటించారు. ఆడియన్స్ ఫుల్లుగా ఎంజాయ్ చేస్తారు. కథలో ఎమోషన్, యాక్షన్ కూడా ఉన్నాయి. ● 'విశ్వం' సినిమాను మల్టిపుల్ లొకేషన్స్‌లో చిత్రీకరించాం. మైనస్ 15 డిగ్రీల వాతావరణంలో సినిమా టీమ్ అందరూ పాల్గొన్నాం. విదేశాల్లోనూ షూటింగ్ చేయడం అంటే చిన్న విషయం కాదు. నేను నటించిన 'ఈగిల్'కి కూడా విశ్వప్రసాద్‌గారే నిర్మాత. ఓ రకంగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీని హోమ్ బ్యానర్‌గా భావిస్తుంటాను. ఇక నాకు తెలుగు భాష అర్థం అవుతుంది. ఓ టీచర్‌ను నియమించుకుని తెలుగు నేర్చుకుంటున్నాను. త్వరలో తెలుగులో మాట్లాడతాను. మూడు కొత్త సినిమాలకు సైన్ చేశాను. ఆ వివరాలను త్వరలోనే వెల్లడిస్తాను.



కిల్లర్

బుల్లితెరపై సీరియల్స్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న జ్యోతీ పూర్వాజ్ నటిస్తున్న తాజా చిత్రం 'కిల్లర్'. 'శుక్ర, మాటరాని మౌనమిది, ఏ మాస్టర్ పీస్' వంటి చిత్రాలతో దర్శకుడిగా ప్రతిభ నిరూపించుకున్న పూర్వాజ్ 'కిల్లర్'ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ చిత్రంలో దర్శకుడు పూర్వాజ్ కూడా ఓ కీలక పాత్ర చేస్తున్నారు. ''త్వరలో 'కిల్లర్'కి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియజేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. పూర్వాజ్, ప్రజయ్ కామత్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఆషీర్ ల్యూక్, సుమన్ జీవరత్నం, కెమెరా: జగదీశ్ బొమ్మిశెట్టి.



నితీశ్ కుమార్ రెడ్డి, మయాంక్ యాదవ్ అరంగేట్రం

బంగ్లాదేశ్‌తో తొలి టి20 మ్యాచ్ ద్వారా ఇద్దరు భారత ఆటగాళ్లు అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టారు. ఢిల్లీకి చెందిన మయాంక్ యాదవ్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నితీశ్ కుమార్ రెడ్డి భారత్ తరఫున టి20లు ఆడిన 116వ, 117వ ఆటగాళ్లుగా నిలిచారు. మ్యాచ్‌కు ముందు భారత మాజీ వికెట్ కీపర్ పార్థివ్ పటేల్ చేతుల మీదుగా నితీశ్... టీమిండియా మాజీ స్పిన్నర్ మురళీ కార్తీక్ చేతుల మీదుగా మయాంక్ క్యాప్‌లు అందుకున్నారు. వైజాగ్‌కు చెందిన 21 ఏళ్ల నితీశ్ రెడ్డికి ఎట్టకేలకు టీమిండియా తరఫున ఆడే అవకాశం వచ్చింది. ఐపీఎల్‌లో ఆకట్టుకోవడంతో జింబాబ్వే పర్యటనకు ఎంపికైనా... చివరి నిమిషంలో అనారోగ్యం కారణంగా నితీశ్ ఆ టూర్‌కు దూరమయ్యాడు. ఈ మ్యాచ్‌కు ముందు నితీశ్ 20 టి20ల్లో 128.24 స్ట్రయిక్‌రేట్‌తో 395 పరుగులు చేయడంతో పాటు 3 వికెట్లు పడగొట్టాడు. 22 ఏళ్ల మయాంక్ కూడా లక్నో సూపర్ జెయింట్స్ జట్టు తరఫున ఐపీఎల్-2024 సీజన్‌లో తన ఎక్స్‌ప్రెస్ బౌలింగ్‌తో చెలరేగాడు. నిలకడగా 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బౌలింగ్ చేస్తూ వచ్చిన అతను పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో ఒకసారి 155.8 కిలోమీటర్ల వేగంతో బంతిని విసిరి సంచలనం సృష్టించాడు. 14 టి20ల్లో అతను 14.31 సగటుతో 19 వికెట్లు తీశాడు.

భారత్ బోణీ

- 6 వికెట్లతో పాకిస్తాన్‌పై విజయం
- హడలెత్తించిన అరుంధతి రెడ్డి
- రాణించిన షఫాలీ, హర్మన్
- 9న శ్రీలంకతో తదుపరి పోరు
- మహిళల టి20 ప్రపంచకప్

భారత మహిళల జట్టు గెలిచింది. ప్రపంచ కప్‌లో బోణీ అయితే కొట్టింది... కానీ బౌలర్లు కట్టుదిట్టంగా ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేస్తే... రన్‌రేట్‌ను మెరుగు పర్చుకునేందుకు ధనాధన్‌గా ఛేదించాల్సిన లక్ష్యం పట్ల మన బ్యాటర్లు నిర్లక్ష్యం వహించారు. హైదరాబాదీ సీమర్ అరుంధతి రెడ్డి (3/19) అదరగొడితే... పాక్ నిర్దేశించిన 106 పరుగుల లక్ష్యాన్ని భారత్ 7 బంతులు మిగిలి ఉండగా ఛేదించింది. గ్రూప్ ‘ఎ’లో ప్రస్తుతం భారత్, పాకిస్తాన్ 2 పాయింట్లతో సమంగా ఉన్నాయి. అయితే మెరుగైన రన్‌రేట్ కారణంగా పాకిస్తాన్ (0.555) మూడో స్థానంలో ఉండగా... భారత్ (–1.217) నాలుగో స్థానంలో నిలిచింది. ఈనెల 9న జరిగే తమ మూడో లీగ్ మ్యాచ్‌లో ఆసియా చాంపియన్ శ్రీలంకతో భారత్ ఆడుతుంది. సెమీఫైనల్ రేసులో ఉండాలంటే ఈ మ్యాచ్‌లోనూ భారత జట్టు తప్పనిసరిగా గెలవాల్సి ఉంటుంది.



అరుంధతి రెడ్డి

దుబాయ్: మహిళల టి20 ప్రపంచకప్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను ఓడించి పాయింట్ల ఖాతా తెరిచింది. గ్రూప్ ‘ఎ’లో భాగంగా ఆదివారం జరిగిన ఈ పోరులో భారత పేస్ బౌలర్ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అరుంధతి రెడ్డి (3/19), స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ (2/12) సహా రేణుక సింగ్ (1/23), దీప్తి శర్మ (1/24), ఆశ శోభన (1/24) ఇలా బౌలింగ్‌కు దిగిన ప్రతి ఒక్కరు సమష్టిగా వికెట్లను పడగొట్టారు. దీంతో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేపట్టిన పాకిస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 105 పరుగులు చేసింది. నిదా దర్ (34 బంతుల్లో 28; 1 ఫోర్) చేసిన పరుగులే ఇన్నింగ్స్ టాప్ స్కోర్! అనంతరం సులువైన లక్ష్యాన్ని ఛేదించేందుకు హర్మన్‌ప్రీత్ బృందం ఆఖరి దాకా పోరాడాల్సి వచ్చింది. ఇది భారత జట్టు రన్‌రేట్‌పై తీవ్ర ప్రభావం చూపింది. చివరకు టీమిండియా 18.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 108 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ షఫాలీ వర్మ (35 బంతుల్లో 32; 3 ఫోర్లు), హర్మన్‌ప్రీత్ (24 బంతుల్లో 29 రిటైర్డ్‌హర్ట్; 1 ఫోర్) రాణించారు.

ఆరంభంలోనే తడబాటు

టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన పాక్‌కు కష్టాలు స్వాగతం పలికాయి. టాపార్డర్‌ను రేణుక, దీప్తి శర్మ, శ్రేయాంక దెబ్బతీస్తే అరుంధతి నిప్పులు చెరిగే బౌలింగ్‌తో మిడిలార్డర్ బ్యాటర్లు ఒమైమా (3), నిదా దర్, ఆలియా రియాజ్ (4)లను అవుట్ చేయడంతో పాక్ 100 పరుగులు చేయడం కూడా కష్టమనిపించింది. నష్రా సంధు ఆఖరి రెండు బంతుల్లో 2, 4 పరుగులు రాబట్టడంతో చివరకు పాక్ 105 పరుగులు చేయగలిగింది. తర్వాత భారత్ ముందున్న లక్ష్యం చిన్నదే అయినా బ్యాటర్లు చకచకా ఛేదించే సాహసం చేయలేకపోయారు. స్మృతి మంధాన (7) ఆరంభంలోనే అవుటయ్యాక



షఫాలీ

షఫాలీ, జెమీమా రోడ్రిగ్స్ (28 బంతుల్లో 23), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ దూకుడు ప్రదర్శించలేదు. దీంతో 15, 16 ఓవర్లలో ముగించాల్సిన లక్ష్యం 19వ ఓవర్ ఐదో బంతిదాకా సాగింది. ఒక్క సిక్స్ కూడా నమోదుకాని ఈ మ్యాచ్‌లో పాక్ బ్యాటర్లు 8 ఫోర్లు, భారత బ్యాటర్లు 5 ఫోర్లు కొట్టారు. ఈ మ్యాచ్‌ను చూసేందుకు దుబాయ్‌లోని భారత్, పాక్ అభిమానులు ఊహించని స్థాయిలో పోటెత్తడంతో మైదానం నిండిపోయింది.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: మునీబా (స్టంప్డ్) రిచా (బి) శ్రేయాంక 17; గుల్ ఫిరోజా (బి) రేణుక 0; సిద్రా అమిన్ (బి) దీప్తి శర్మ 8; ఒమైమా (సి) షఫాలీ (బి) అరుంధతి 3; నిదా దర్ (బి) అరుంధతి 28; ఆలియా (ఎల్బీడబ్ల్యూ) (బి) అరుంధతి 4; ఫాతిమా (సి) రిచా (బి) ఆశ శోభన 13; తుబా హసన్ (సి) షఫాలీ (బి) శ్రేయాంక 0; సైదా (నాటౌట్) 14; నష్రా సంధు (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 105. వికెట్ల పతనం:** 1-1, 2-25, 3-33, 4-41, 5-52, 6-70, 7-71, 8-99. **బౌలింగ్:** రేణుక 4-0-23-1, దీప్తి 4-0-24-1, అరుంధతి 4-0-19-3, శ్రేయాంక 4-1-12-2, ఆశ శోభన 4-0-24-1.

భారత్ ఇన్నింగ్స్: షఫాలీ (సి) ఆలియా (బి) ఒమైమా 32; స్మృతి (సి) తుబా (బి) సాదియా 7; జెమీమా (సి) మునీబా (బి) ఫాతిమా 23; హర్మన్‌ప్రీత్ (రిటైర్డ్‌హర్ట్) 29; రిచా (సి) మునీబా (బి) ఫాతిమా 0; దీప్తి శర్మ (నాటౌట్) 7; సజన (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (18.5 ఓవర్లలో 4 వికెట్లకు) 108. వికెట్ల పతనం:** 1-18, 2-61, 3-80, 4-80. **బౌలింగ్:** ఫాతిమా 4-0-23-2, సాదియా 4-0-23-1, నిదా దర్ 1.5-0-10-0, ఒమైమా 3-0-17-1, నష్రా సంధు 4-0-21-0, తుబా హసన్ 2-0-14-0.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఆడుతూ పాడుతూ...

తొలి టి20లో భారత్ అలవోక విజయం

- 7 వికెట్లతో బంగ్లాదేశ్ చిత్తు
- రాణించిన అర్ష్‌దీప్, వరుణ్
- బుధవారం న్యూఢిల్లీలో రెండో టి20

భారత యువ జట్టు సత్తా ముందు బంగ్లాదేశ్ తేలిపోయింది. ముందుగా అర్ష్‌దీప్ పేస్‌ను, వరుణ్ స్పిన్‌ను ఎదుర్కోలేక బంగ్లాదేశ్ బ్యాటర్లు చేతులెత్తేయగా ... ఆపై స్వల్ప లక్ష్యాన్ని భారత బృందం సునాయాసంగా ఛేదించింది. పాండ్యా, సూర్య, సంజూ సామ్సన్ సులువుగా పరుగులు రాబట్టడంతో మరో 49 బంతులు మిగిలి ఉండగా ఘనవిజయం భారత్ సొంతమైంది.

గ్వాలియర్: బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌లో ఘన విజయం సాధించిన భారత్ అంతే జోరుగా టి20 సిరీస్‌ను కూడా మొదలు పెట్టింది. టెస్టులతో పోలిస్తే టి20ల్లో టీమిండియా బృందం మొత్తం మారినా... ఫలితంలో మాత్రం తేడా రాలేదు. ఆదివారం జరిగిన తొలి టి20లో భారత్ 7 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. ముందుగా బంగ్లాదేశ్ 19.5 ఓవర్లలో 127 పరుగులకే ఆలౌటైంది. మిరాజ్ (32 బంతుల్లో 35 నాటౌట్; 3 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా, నజ్ముల్ హుస్సేన్ (25 బంతుల్లో 27; 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అర్ష్‌దీప్, వరుణ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం టీమిండియా లక్ష్య ఛేదనకు 71 బంతులే సరిపోయాయి. భారత్ 11.5 ఓవర్లలో 3 వికెట్లకు 132 పరుగులు చేసి గెలిచింది. హార్దిక్ పాండ్యా (16 బంతుల్లో 39 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), సూర్యకుమార్ (14 బంతుల్లో 29; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), సంజు సామ్సన్ (19 బంతుల్లో 29; 6 ఫోర్లు) కీలక పరుగులు సాధించారు. భారత్‌కు 1-0తో ఆధిక్యం లభించగా, రెండో మ్యాచ్ బుధవారం న్యూఢిల్లీలో జరుగుతుంది.

పేలవ బ్యాటింగ్...

అర్ష్‌దీప్ వేసిన తొలి ఓవర్ మూడో బంతికే లిటన్ దాస్ (4) వెనుదిరగ్గా, అతని తర్వాతి ఓవర్లో పర్వేజ్ (8) అవుటయ్యాడు. వరుణ్ తొలి ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 15 పరుగులు రాబట్టిన బంగ్లా 5 ఓవర్లు ముగిసేసరికి 39 పరుగులు చేసింది. ఆ తర్వాత ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో జట్టుకు ఒక్క పరుగూ రాలేదు. ఈ ఓవర్‌తో అంతర్జాతీయ కెరీర్ మొదలు పెట్టిన మయాంక్ చక్కటి బంతులతో తౌహీద్ (12)ను కట్టడి చేసి తన మొదటి ఓవర్‌ను ‘మెయిడిన్’గా ముగించడం విశేషం. గతంలో అగార్కర్, అర్ష్‌దీప్ మాత్రమే తమ అరంగేట్ర మ్యాచ్‌ను మెయిడిన్ ఓవర్‌తో మొదలు పెట్టారు. తర్వాతి ఓవర్లో తౌహీద్‌ను వరుణ్ అవుట్ చేయగా... మహ్మదుల్లా (1)ను వెనక్కి పంపి మయాంక్ తొలి వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. కెప్టెన్ నజ్ముల్ తడబడుతూనే ఆడగా... జాకీర్ (8) కూడా విఫలం కావడంతో సగం ఓవర్లు ముగిసేసరికి బంగ్లా 64/5 వద్ద నిలిచింది. తర్వాతి 59 బంతుల్లో జట్టు మరో 63 పరుగులు రాబట్టింది. ఇందులో మిరాజ్ ఒక్కడే 29 బంతులు ఆడి 29 పరుగులు సాధించగా... మిగిలిన వారు ప్రభావం చూపలేదు.



అర్ష్‌దీప్



పాండ్యా

ధనాధన్...

షరీఫుల్ వేసిన తొలి ఓవర్లో రెండు ఫోర్లతో సామ్సన్ ఛేదన మొదలు పెట్టగా... తస్కీన్ వేసిన తర్వాతి ఓవర్లో అభిషేక్ శర్మ (16) ఒక సిక్స్, 2 ఫోర్లతో జోరు చూపించాడు. అయితే దురదృష్టవశాత్తూ అదే ఓవర్లో అనవసరపు సింగిల్‌కు ప్రయత్నించి అభిషేక్ రనౌటయ్యాడు. అనంతరం వచ్చీ రాగానే ధనాధన్ బ్యాటింగ్ చూపించిన సూర్య ఆరు బంతుల వ్యవధిలో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు బాదాడు. ఆ తర్వాత ఇలాగే ధాటిగా ఆడబోయి సూర్య, సామ్సన్ తక్కువ వ్యవధిలో వెనుదిరిగారు. అయితే 73 బంతుల్లో 48 పరుగులు చేయాల్సిన ఈ స్థితిలో భారత్‌కు ఎలాంటి ఇబ్బందీ రాలేదు. నితీశ్ కుమార్ రెడ్డి (15 బంతుల్లో 16 నాటౌట్; 1 సిక్స్) అండగా నిలవగా... పాండ్యా ఒక్కడే 39 పరుగులు బాదడం విశేషం. తస్కీన్ వేసిన 12వ ఓవర్లో వరుసగా మూడు బంతులను 4, 4, 6గా మలచి పాండ్యా మ్యాచ్ ముగించాడు.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: పర్వేజ్ (బి) అర్ష్‌దీప్ 8; లిటన్ దాస్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 4; నజ్ముల్ (సి అండ్ బి) సుందర్ 27; తౌహీద్ (సి) పాండ్యా (బి) వరుణ్ 12; మహ్మదుల్లా (సి) సుందర్ (బి) మయాంక్ 1; జాకీర్ (బి) వరుణ్ 8; మిరాజ్ (నాటౌట్) 35; రిషాద్ (సి) పాండ్యా (బి) వరుణ్ 11; తస్కీన్ (రనౌట్) 12; షరీఫుల్ (బి) పాండ్యా 0; ముస్తఫిజుర్ (బి) అర్ష్‌దీప్ 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 127. వికెట్ల పతనం:** 1-5, 2-14, 3-40, 4-43, 5-57, 6-75, 7-93, 8-116, 9-117, 10-127. **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 3.5-0-14-3, హార్దిక్ పాండ్యా 4-0-26-1, వరుణ్ చక్రవర్తి 4-0-31-3, మయాంక్ యాదవ్ 4-1-21-1, నితీశ్ రెడ్డి 2-0-17-0, వాషింగ్టన్ సుందర్ 2-0-12-1.

భారత్ ఇన్నింగ్స్: సామ్సన్ (సి) రిషాద్ (బి) మిరాజ్ 29; అభిషేక్ శర్మ (రనౌట్) 16; సూర్యకుమార్ (సి) జాకీర్ (బి) ముస్తఫిజుర్ 29; నితీశ్ రెడ్డి (నాటౌట్) 16; పాండ్యా (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (11.5 ఓవర్లలో 3 వికెట్లకు) 132. వికెట్ల పతనం:** 1-25, 2-65, 3-80. **బౌలింగ్:** షరీఫుల్ 2-0-17-0, తస్కీన్ 2.5-0-44-0, ముస్తఫిజుర్ 3-0-36-1, రిషాద్ 3-0-26-0, మిరాజ్ 1-0-7-1.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏలూరు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాలు

ఏలూరు జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **పోస్టుల వివరాలు:** ప్రొటెక్షన్ ఆఫీసర్ నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్(మహిళ/పురుష అభ్యర్థి)-01, సోషల్ వర్కర్(మహిళా అభ్యర్థి)-01, డాక్టర్(పార్ట్‌టైమ్ మహిళా అభ్యర్థి)-01, ఆయా-01, ఎడ్యుకేటర్-01, ఆర్ట్, క్రాఫ్ట్-మ్యూజిక్ టీచర్(పార్ట్ టైం)-02, పి.టి కమ్ యోగా టీచర్ (పార్ట్‌టైమ్ మహిళా అభ్యర్థి)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఏడో తరగతి, పదో తరగతి, డిగ్రీ, పీజీ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 08.10.2024. » **వెబ్‌సైట్:** eluru.ap.gov.in/

ఐఎంయూ, విశాఖపట్నంలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలోని ఇండియన్ మారిటైమ్ యూనివర్శిటీ (ఐఎంయూ).. ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **పోస్టుల వివరాలు:** ఫ్యాకల్టీ-04, సీనియర్ టెక్నీషియన్-01, డిప్యూటీ రిజిస్ట్రార్-01, రీసెర్చ్ అసిస్టెంట్-01.
» **విభాగాలు:** ఓషియన్, డ్రెడ్జింగ్, మెరైన్, నావల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్ బిల్డింగ్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ఫ్యాకల్టీ పోస్టులకు 65 ఏళ్లు, డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులకు 64 ఏళ్లు, మిగతా పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
» **దరఖాస్తులకు చివరితేది:** 15.10.2024. » **వెబ్‌సైట్:** www.imu.edu.in/

శ్రీ సత్యసాయి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో 14 ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీ సత్యసాయి జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయం ఒప్పంద/ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ధర్మవరం, హిందూపురంలోని బాలసదనంలో అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 14.
» **ఖాళీల వివరాలు:** స్టోర్ కీపర్/అకౌంటెంట్-02, కుక్-01, హెల్పర్-కమ్ నైట్ వాచ్‌మెన్-01, హౌస్ కీపర్-02, ఎడ్యుకేటర్-02, ఆర్ట్ క్రాఫ్ట్ కమ్ మ్యూజిక్ టీచర్-04, పీఈటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఏడో తరగతి, పదో తరగతి, డిగ్రీ, బీఈడీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయం, పుట్టపర్తి, శ్రీ సత్యసాయి జిల్లా చిరునామాకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 08.10.2024.
» **వెబ్‌సైట్:** https://srisathyasai.ap.gov.in/

ఐఐటీల్లో ప్రవేశానికి మార్గాలెన్నో!

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ.. సంక్షిప్తంగా ఐఐటీలు! ఇంజనీరింగ్, టెక్నాలజీ విద్యలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న విద్యాసంస్థలు. ఐఐటీల్లో కోర్సు పూర్తిచేసుకుంటే కార్పొరేట్ కంపెనీల్లో కోరుకున్న కొలువు, ఉజ్వల కెరీర్ ఖాయమవుతుందనే నమ్మకం!! అందుకే ఏటా ఐఐటీల్లో చేరాలని కోరుకునే వారి సంఖ్య లక్షల్లోనే ఉంటోంది. ఇందుకోసం ఇంటర్‌లో చేరినప్పటి నుంచే అడ్వాన్స్‌డ్‌కు సన్నద్ధమవుతుంటారు. వాస్తవానికి ఐఐటీల్లో చేరేందుకు జేఈఈ అడ్వాన్స్‌డ్‌తోపాటు మరెన్నో మార్గాలున్నాయి. ఆయా ఎంట్రెన్స్‌లకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో... యూజీ, పీజీ స్థాయి కోర్సుల్లో ఐఐటీల్లో అడ్మిషన్ కల్పించే ప్రవేశ పరీక్షల వివరాలు..



ఐఐటీ ఎంట్రన్స్‌లు

» అడ్వాన్స్‌డ్‌తోపాటు పలు ప్రవేశ పరీక్షలు
» బీటెక్ ప్రవేశం చేజారినా పీజీలో చేరే మార్గాలు
» ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఎంట్రన్స్‌ల నిర్వహణ
» అవగాహనతో ఐఐటీ కల సాకారం

ఐదు ఎంట్రెన్స్‌లు

ప్రస్తుతం ఐఐటీల్లో ప్రవేశానికి అయిదు ఎంట్రన్స్ టెస్ట్‌లు ప్రధాన మార్గాలుగా నిలుస్తున్నాయి. అవి.. జేఈఈ-అడ్వాన్స్‌డ్, యూసీడ్, సీడ్, గేట్, ఐఐటీ-జామ్. వీటిలో జేఈఈ-అడ్వాన్స్‌డ్‌తో బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. అదేవిధంగా యూసీడ్ ఆధారంగా బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో అడ్మిషన్ పొందొచ్చు. ఇక గేట్, ఐఐటీ జామ్, సీడ్‌లో ప్రతిభ చూపితే ఆయా విభాగాల్లో పీజీ స్థాయి కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది.

జేఈఈ-అడ్వాన్స్‌డ్

- జేఈఈ-అడ్వాన్స్‌డ్.. ఇంటర్మీడియెట్ అర్హతతో ఐఐటీ క్యాంపస్‌ల్లో బీటెక్, బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రన్స్. జేఈఈ-మెయిన్‌లో ప్రతిభ ఆధారంగా టాప్ 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు అనుమతిస్తారు. అడ్వాన్స్‌డ్ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి.
- పేపర్-1లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై 51 ప్రశ్నలు-180 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పేపర్-2ను కూడా 51 ప్రశ్నలతో 180 మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లో ప్రతి సబ్జెక్ట్ నుంచి 17 ప్రశ్నలు చొప్పున మొత్తం 51 ప్రశ్నలు ఉంటాయి.
- ప్రతి ఏటా ఏప్రిల్ చివరి వారంలో జేఈఈ- అడ్వాన్స్‌డ్ నోటిఫికేషన్ విడుదలవుతుంది. మే రెండో వారం లేదా మూడో వారంలో జాతీయ స్థాయిలో ఎంట్రన్స్ ఉంటుంది. ఇందులో ర్యాంకుతోపాటు బోర్డ్ పరీక్షలలో టాప్-20 పర్సంటైల్‌లో నిలిచిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తారు.

డిజైన్ కోర్సులకు యూసీడ్

- ఐఐటీల్లో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి ప్రతి ఏటా యూసీడ్ (అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్) పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఈ ఎంట్రన్స్ లో ర్యాంకు ఆధారంగా ఐఐటీ బాంబే, ఢిల్లీ, గువహటి, హైదరాబాద్, రూర్కీ, ఐఐఐటీడీఎం-జబల్ పూర్‌లో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది.
- **అర్హత:** ఇంటర్మీడియెట్ 2024లో మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులైన వారు లేదా 2025లో ఇంటర్ ఫైనల్ పరీక్షలు రాసే విద్యార్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
- **పరీక్ష విధానం:** యూసీడ్‌ను రెండు విభాగాలుగా 300 మార్కులకు నిర్వహిస్తారు. పార్ట్-ఎకు 200 మార్కులు, పార్ట్-బికు 100 మార్కులు కేటాయిస్తారు.
- పార్ట్-బిలో స్కెచింగ్ 50 మార్కులకు, డిజైన్ అప్టిట్యూడ్ 50 మార్కులకు ఉంటాయి.

యూసీడ్ 2025 ముఖ్య తేదీలు:

- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** 01.10.2024
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 31.10.2024
- **పరీక్ష తేదీ:** 2025, జనవరి 19.
- **వెబ్‌సైట్:** https://www.uceed.iitb.ac.in/2025/important-dates.html

ఐఐటీల్లో ఎం.డిజైన్ వయా సీడ్

- ఐఐటీల్లో మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్ (సీడ్). ఈ ఎంట్రన్స్‌లో స్కోర్ ఆధారంగా ఐఐటీ-బాంబే, ఢిల్లీ, గువహటి, హైదరాబాద్, జోధ్‌పూర్, కాన్పూర్, రూర్కీ, ఐఐఐటీడీఎం-జబల్‌పూర్, ఐఐఐటీడీఎం-కాంచీపురం, ఐఐఎస్సీ-బెంగళూరుల్లో ఎం.డిజైన్ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. అదే విధంగా డిజైన్ విభాగంలో పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పిస్తారు.
- **అర్హతలు:** సీడ్‌కు బ్యాచిలర్ డిగ్రీ, పీజీ డిగ్రీ ఉత్తీర్ణులను అర్హులుగా పేర్కొంటారు. అదే విధంగా పదో తరగతి తర్వాత 10+5 విధానంలో గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ కోర్సులు పూర్తి చేసుకున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పరీక్ష విధానం:** సీడ్‌ను రెండు పార్ట్‌లు (పార్ట్-ఎ, పార్ట్-బి)గా నిర్వహిస్తారు. పార్ట్ ఏ.. 150 మార్కులకు, పార్ట్ బీ.. 100 మార్కులకు ఉంటుంది.
- పార్ట్-బిలో డిజైన్, డ్రాయింగ్, రైటింగ్ స్కిల్స్‌కు సంబంధించి అయిదు ప్రశ్నలు అడుగుతారు. స్కెచింగ్, క్రియేటివిటీ, ఫార్మ్ సెన్సిటివిటీ, విజువల్ సెన్సిటివిటీ, ప్రాబ్లమ్ ఐడెంటిఫికేషన్‌ల నుంచి ఒక్కో ప్రశ్న చొప్పున అడుగుతారు.

సీడ్ 2025 ముఖ్య తేదీలు:

- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** 01.10.2024
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 31.10.2024
- **పరీక్ష తేదీ:** 2025, జనవరి 19.
- **వెబ్‌సైట్:** https://www.uceed.iitb.ac.in/2025/important-dates.html

గేట్

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్. సంక్షిప్తంగా గేట్. ఐఐటీల్లో.. ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్+పీహెచ్‌డీ వంటి ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష ఇది. ఇంజనీరింగ్ మొదలు హ్యుమానిటీస్ వరకు మొత్తం 30 పేపర్లలో గేట్‌ను నిర్వహిస్తారు. అభ్యర్థులు బీటెక్‌లో తమ బ్రాంచ్‌కు సరితూగే రెండు పేపర్లలో గేట్‌కు హాజరుకావచ్చు. అదే విధంగా హ్యుమానిటీస్ విభాగంలోనూ రెండు పేపర్లకు హాజరయ్యే అవకాశముంది.

- **అర్హత:** ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఆర్కిటెక్చర్/సైన్స్/ కామర్స్/ఆర్ట్స్/హుమానిటీస్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. కోర్సు మూడో ఏడాది లేదా ఫైనల్ విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు.
- గేట్ పరీక్షలో మొత్తం 65 ప్రశ్నలు-100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఇందులో రెండు సెక్షన్‌లు ఉంటాయి. జనరల్ అప్టిట్యూడ్ విభాగం 15 మార్కులకు ఉంటుంది. రెండో సెక్షన్ అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టుపై 85 మార్కులకు జరుగుతుంది.

ఐఐటీ-జామ్

- ఐఐటీ క్యాంపస్‌ల్లో అడుగుపెట్టేందుకు మరో మార్గం.. జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ (ఐఐటీ-జామ్). ఇందులో స్కోర్ ఆధారంగా ఐఐటీల్లో ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ+పీహెచ్‌డీ వంటి కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ముఖ్యంగా మ్యాథమెటిక్స్, సైన్సెస్ విభాగాల్లో ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ+పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ పరీక్ష నిర్వహిస్తారు.
- **అర్హతలు:** జామ్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి. డిగ్రీలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత లేదా 5.5 సీజీపీఏ ఉండాలి. జామ్ నిర్వహించే సంవత్సరంలో ఫైనల్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పరీక్ష విధానం:** మొత్తం ఏడు పేపర్లలో(బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, జియాలజీ, మ్యాథమెటిక్స్, మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్) పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు గరిష్టంగా రెండు పేపర్లలో పరీక్షకు హాజరవ్వొచ్చు. జామ్ పరీక్ష మొత్తం సెక్షన్-ఎ, బి, సిలుగా మూడు విభాగాల్లో జరుగుతుంది. -మొత్తం మూడు గంటల వ్యవధిలో వంద మార్కులకు 60 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం:

- 2025 ప్రవేశాలకు సంబంధించి జామ్-2025 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. అభ్యర్థులు 2024, అక్టోబర్ 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- జామ్‌ను దేశ వ్యాప్తంగా 2025, ఫిబ్రవరి 2న నిర్వహించనున్నారు.
- వివరాలకు వెబ్‌సైట్: https://jam2025.iitd.ac.in/about.php

ముఖ్య సమాచారం:

- 2025-26 ప్రవేశాలకు సంబంధించి గేట్-2025 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది.
- **ఆలస్య రుసుముతో ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, అక్టోబర్ 7.
- గేట్ పరీక్షను 2025 ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో నిర్వహిస్తారు.
- **వెబ్‌సైట్:** https://gate2025.iitr.ac.in/

పీహెచ్‌డీ ప్రవేశాలు

ఐఐటీలు పీహెచ్‌డీలోనూ ప్రవేశాలు కల్పిస్తున్నాయి. గేట్ స్కోర్‌తోపాటు సొంతగా పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. సంబంధిత విభాగంలో పీజీ పూర్తి చేసిన వారికి దరఖాస్తుకు అవకాశం కల్పిస్తాయి. ఎంపిక ప్రక్రియలో భాగంగా రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. రాత పరీక్ష స్కోర్‌కు 60 నుంచి 70 శాతం వెయిటేజీ; పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 నుంచి 40 శాతం వెయిటేజీ కల్పిస్తారు. దీనికి అనుగుణంగా ఫైనల్ మెరిట్ లిస్ట్ రూపొందించి పీహెచ్‌డీ అవకాశం కల్పిస్తారు.

సాక్షి **ప్రాఫిట్ ప్లస్**
సోమవారం
7-10-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం నాటికి ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
809	236
81,688	25,015

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	18,138	△	219
డోజోన్స్	42,353	△	341
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,281	▽	2
డాక్స్	19,121	△	106
షాంఘై	3,337	△	249
నికాయ్	38,636	△	84

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.55	84.57
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	109.05	111.66
€	యూరో	ఒకటి	91.50	93.89
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.76	58.05
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.56	58.52
S$	సింగపూర్ డాలర్	ఒకటి	62.40	67.08
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.97	23.75
¥	చైనా యువాన్	ఒకటి	11.09	12.91

వృద్ధాప్యంలో ఆరోగ్య ధీమా!

- 70 ఏళ్లు నిండిన అందరికీ ఉచితంగా బీమా
- పీఎం జన ఆరోగ్య యోజన పథకం
- ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేదు
- రూ. 5 లక్షల హెల్త్ కవరేజీ...
- ఇదొక్కటి చాలు అనుకోకూడదు
- ప్రత్యామ్నాయ ప్రణాళిక కూడా అవసరమే



ఒక్కసారి ఆస్పత్రి పాలైతే.. కొన్నేళ్ల పాటు కూడబెట్టుకున్నదంతా కరిగిపోయే పరిస్థితి. ఖరీదైన వైద్యం కారణంగా అప్పుల పాలైన కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. కరోనా అప్పుడు ఇదే చూశాం. ఈ పరిస్థితి రాకూడదంటే ముందస్తుగా బీమా రక్షణ కల్పించుకోవడమే మార్గం. కానీ, వృద్ధాప్యంలో ఆరోగ్య బీమా ప్రీమియం పెద్ద మొత్తంలో ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో 70 ఏళ్లు నిండిన వృద్ధులు అందరికీ ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన' (ఏబీ-పీఎంజేఏవై) కింద ఉచితంగా ఆరోగ్య బీమా అందిస్తున్నట్టు కేంద్రం తీపి కబురు చెప్పింది. ఇప్పటి వరకు ఈ పథకం కింద పేదలు, తక్కువ ఆదాయ వర్గాలకే ఉచిత ప్రయోజనం అందుతోంది. ఇకపై ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పీఎం జేఏవై కింద రూ.5 లక్షల హెల్త్ కవరేజీ లభించనుంది. అతి త్వరలోనే అమల్లోకి రానున్న ఈ పథకం గురించి అవగాహన కల్పించే కథనమే ఇది.

-సాక్షి, బిజినెస్‌డెస్క్



పీఎంజేఏవై పథకం కింద రూ.5,00,000 సమగ్రమైన కవరేజీ లభిస్తుంది. ఆస్పత్రిలో చేరడానికి మూడు రోజుల ముందు వరకు అయ్యే వైద్య పరమైన ఖర్చుల (డాక్టర్ ఫీజులు, డయాగ్నోస్టిక్స్ పరీక్షలు)కు సైతం కవరేజీ ఉంటుంది. చికిత్సా సమయంలో ఔషధాలు, కన్జ్యూమబుల్స్ కూడా ఉచితమే. చికిత్సలో భాగంగా వేసే స్టెంట్‌లు, పేస్‌మేకర్ల వంటి వాటికీ కవరేజీ లభిస్తుంది. ఐసీయూ, జనరల్ వార్డ్‌లో ఉండి తీసుకునే చికిత్సలకు పరిహారం అందుతుంది. రోగికి చికిత్సా సమయంలో ఉచితంగానే ఆహారం అందిస్తారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత కూడా 15 రోజుల పాటు చికిత్సకు సంబంధించిన వ్యయాలకు చెల్లింపులు లభిస్తాయి. ప్రభుత్వ ఆస్పత్రులు, ఎంపిక చేసిన ప్రైవేటు ఆస్పత్రుల్లో కవరేజీ లభిస్తుంది. ఈ పథకంలో చేరిన మొదటి రోజు నుంచే అన్ని రకాల (ఎంపిక చేసిన) చికిత్సలకు ఉచితంగా కవరేజీ అమల్లోకి వస్తుంది. అంటే ముందు నుంచి ఉన్న ఆరోగ్య సమస్యలకు సైతం ఈ పథకం కింద చికిత్స తీసుకోవచ్చు. వెయిటింగ్ పీరియడ్, కూలింగ్ ఆఫ్ పీరియడ్ అనే షరతుల్లేవు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న ఆయుష్మాన్ భారత్ హెల్త్ స్కీమ్ కింద ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో 1,350 మెడికల్ ప్యాకేజీలకు కవరేజీ లభిస్తోంది. 70 ఏళ్లు నిండిన వృద్ధులకు సంబంధించి పథకంలో భాగంగా ఏఏ చికిత్సలకు కవరేజీ లభిస్తుందన్నది ప్రభుత్వ నోటిఫికేషన్‌తోనే స్పష్టత వస్తుంది.

అర్హత?

70 ఏళ్లు నిండి, ఆధార్ కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకం కింద రూ.5 లక్షల హెల్త్ కవరేజీకి అర్హులే. పీఎంజేఏవై కింద ఇప్పటికే రూ.5 లక్షల కవరేజీ కలిగిన కుటుంబాల విషయానికొస్తే.. ఆయా కుటుంబాల్లోని 70 ఏళ్లు నిండిన వారు అదనంగా రూ.5 లక్షల హెల్త్ టాపప్ (కవరేజీ)ను పొందేందుకు అర్హులు. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్‌ఎస్), ఎక్స్ సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ (ఈసీహెచ్‌ఎస్), ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్) కింద కవరేజీ ఉన్న వారు ఎప్పటి మాదిరే అందులో కొనసాగొచ్చు. లేదా వాటి నుంచి పీఎంజేఏవైకు మారొచ్చు. ప్రైవేటు హెల్త్ ఇన్సూరెన్స్ కలిగి ఉన్నవారు, ఈఎస్ఐ కింద కవరేజీ కలిగిన వారు, వీటితోపాటు అదనంగా పీఎంజేఏవై కవరేజీకి సైతం అర్హులే.



దరఖాస్తు ఎలా..?

పీఎంజేఏవై డాట్ జీవోవీ డాట్ ఇన్ పోర్టల్ లేదా ఆయుష్మాన్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, 70 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు. అతి త్వరలోనే ఇది ఆరంభం కానుంది. తొలుత ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించి, అనంతరం దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావాలన్నది కేంద్ర ప్రభుత్వం ప్రణాళికగా ఉంది. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఏబీహెచ్‌ఏ/ఆభా) కలిగి ఉంటే, ఈ బీమా ఉచితమని అనుకోవద్దు. ఆభా అన్నది డిజిటల్ రూపంలో హెల్త్ రికార్డులు భద్రపరుచుకునేందుకు ఉపయోగపడే ఖాతా. తమ హెల్త్ రిపోర్ట్‌లను ఈ ఖాతాలోకి ఉచితంగా అప్‌లోడ్ చేసుకుని, వైద్యుల వద్దకు వెళ్లినప్పుడు వాటిని డిజిటల్ రూపంలోపంచుకోవచ్చు. అవసరమైన సందర్భాల్లో డిజిటల్ హెల్త్ రికార్డులను పొందొచ్చు. ఆభాతో సంబంధం లేకుండా పీఎంజేఏవై కింద రూ.5 లక్షల కవరేజీకి విడిగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 70 ఏళ్లు నిండిన వారు, పీఎంజేఏవై కింద ఇప్పటికే హెల్త్ కవరేజీ పొందుతున్న 70 ఏళ్లు నిండిన వృద్ధులు విడిగా దరఖాస్తు చేసుకోవాల్సిందే.

అందరికీ అనుకూలమేనా?

70 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఆరోగ్య బీమా సరిపోకపోవచ్చు. ఆస్పత్రి బిల్లులు రూ.5 లక్షలకే పరిమితం కావాలని లేదు. విడిగా తమ ఆరోగ్య చరిత్ర ఆధారంగా, వాటికి కవరేజీతో కూడిన హెల్త్ ఇన్సూరెన్స్ కలిగి ఉండడం అవసరం. ముఖ్యంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ స్కీమ్ పరిధిలోని ప్యాకేజీ వివరాలు సమగ్రంగా తెలుసుకోవాలి. అప్పుడు అందులో లేని చికిత్సలకు కవరేజీనిచ్చే ప్లాన్‌ను విడిగా తీసుకోవచ్చు. వృద్ధులు ఆయుష్మాన్ భారత్ కవరేజీని అదనపు రక్షణగానే చూడాలన్నది నిపుణుల సూచన. అంటే విడిగా మరో హెల్త్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి. అప్పుడు సమగ్రమైన రక్షణతో నిశ్చింతగా ఉండొచ్చన్నది నిపుణుల సూచన. ఆయుష్మాన్ భారత్ 70 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఉచితం కనుక.. పథకం కింద చికిత్సలకు ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో రద్దీ ఎక్కువగా ఉండొచ్చు. మన దేశంలో ఆస్పత్రి పడకల సగటు చాలా తక్కువ. కనుక తమవంతు చికిత్స కోసం వేచి చూడాల్సి రావచ్చు. ఇది నచ్చని వారు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకునేందుకు విడిగా హెల్త్ ప్లాన్ వీలు కల్పిస్తుంది. ప్రభుత్వ ఉచిత హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ పరిధిలో సింగిల్ ప్రైవేటు రూమ్‌కు అవకాశం ఉండదు. ఎందుకంటే పన్ను చెల్లింపుదారుల డబ్బులతో అందిస్తున్న ఉచిత ఆరోగ్య పథకంలో ప్రీమియం సదుపాయాల కల్పన కష్టం. ఒకవేళ ప్రైవేటు రూమ్ తీసుకునేట్టు అయితే, తమ జేబు నుంచి పెద్ద మొత్తంలో చెల్లించాల్సి వస్తుంది.

ఆర్థిక భారం పడకుండా..

ఉన్నట్టుండి అత్యవసర వైద్యం అవసరమైతే సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించాల్సి రావచ్చు. అప్పుడు విడిగా హెల్త్‌ప్లాన్ లేకుంటే ఆర్థిక భారం పడుతుంది. ముఖ్యంగా కొన్ని రకాల చికిత్సలకు ప్రైవేటు ఆస్పత్రుల వైపు మొగ్గు చూపుతుంటారు. అలా ఎంపిక చేసుకునే హాస్పిటల్ ఆయుష్మాన్ భారత్ నెట్‌వర్క్ పరిధిలో లేకపోవచ్చు. విడిగా హెల్త్ ఇన్సూరెన్స్ ఇందుకు పరిష్కారం చూపుతుంది. ప్రైవేటు హెల్త్ ప్లాన్‌లో నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌లో చేరి చికిత్స తీసుకున్నా, తర్వాత రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ దాఖలు చేసుకోవచ్చు. ఆయుష్మాన్ భారత్ కింద రీయింబర్స్‌మెంట్‌కు అవకాశం లేదు. కేవలం నగదు రహిత వైద్యమే అందుతుంది. టాప్ రేటెడ్ ప్రైవేటు బీమా సంస్థలు దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో హాస్పిటల్ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తుంటాయి. ''దీర్ఘకాలిక వ్యాధులు లేదా సర్జరీలు, కేన్సర్ తదితర చికిత్సల్లో అధిక సమ్ ఇన్సూర్డ్ (బీమా రక్షణ) ఉండటం వృద్ధులకు ఎంతో కీలకం. వ్యాధులతో బాధపడే వారు స్వతంత్రంగా హెల్త్ కవరేజీ కలిగి ఉండాలి. వృద్ధాప్యంతో అనారోగ్యాలకు ప్రత్యేకమైన చికిత్స అవసరం. అందుకు రూ.5 లక్షల కవరేజీ సరిపోదు. వయసుమీద పడడం వల్ల వచ్చే అనారోగ్యాలకు కొన్ని సందర్భాల్లో ఖరీదైన చికిత్స తీసుకోవాల్సి రావచ్చు. ఆ సమయంలో ఆర్థిక భారం పడుతుంది'' అని పాలసీబజార్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అమిత్ ఛాబ్రా వివరించారు.



ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సకు, ప్రభుత్వ పథకంలో కవరేజీ లేని మరిన్ని రకాల చికిత్సలకు విడిగా హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్‌తో అవకాశం లభిస్తుంది.

30,000 ఆస్పత్రులు ఎంప్యానెల్

పీఎంజేఏవై కింద దేశవ్యాప్తంగా 30,000 ఆస్పత్రులు ఎంప్యానెల్ అయ్యాయి. ఇందులో 13,466 ప్రైవేటు ఆస్పత్రులు కూడా ఉన్నాయి. కానీ, అన్నీ యాక్టివ్‌గా లేవు. యాక్టివ్ హాస్పిటల్ అంటే గడిచిన 45 రోజుల్లో ఆయా ఆస్పత్రుల నుంచి కనీసం ఒక పేషెంట్ అయినా డిశ్చార్జ్ అయి ఉండాలి. యాక్టివ్ ఆస్పత్రులు కేవలం 3,000 మాత్రమే ఉన్నాయి. పైగా ఎంప్యానెల్ అయిన ఆస్పత్రులు అన్నీ కూడా అన్ని రకాల చికిత్సలను ఆఫర్ చేయడం లేదన్నది గుర్తు పెట్టుకోవాలి. అంటే పీఎం జేఏవై కింద ఎంపిక చేసిన ప్యాకేజీలలో కొన్నింటినే ఆఫర్ చేసే వెసులుబాటు ఆస్పత్రులకు ఉంటుంది.



మరో మార్గం?

పీఎం జేఏవై కింద రూ.5 లక్షల కవరేజీ తీసుకున్న వారు.. విడిగా మరో హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుని ప్రీమియం చెల్లించే స్తోమత లేకపోతే ప్రత్యామ్నాయం ఒకటి ఉంది. ఇండివిడ్యువల్ హెల్త్ ప్లాన్‌కు బదులు సూపర్ టాపప్ మంచి ఆలోచన అవుతుంది. రూ.5 లక్షలు డిడక్టబుల్‌తో సూపర్ టాపప్ హెల్త్ ప్లాన్ తీసుకోవాలి. ఏదైనా ఒక సంవత్సరంలో ఆస్పత్రి బిల్లు రూ.5 లక్షలకు మించితే అప్పుడు సూపర్ టాపప్ చెల్లింపులు చేస్తుంది. ఒక్కసారి అడ్మిషన్‌లో రూ.5 లక్షలకు మించి బిల్లు రావాలని లేదు. రెండు మూడు సార్లు చేరి చికిత్స తీసుకుని, మొత్తం బిల్లులు రూ.5 లక్షలు దాటినా సరే సూపర్ టాపప్ కింద పరిహారం పొందొచ్చు. పైగా బేసిక్ హెల్త్ ప్లాన్‌తో పోల్చితే, సూపర్ టాపప్ ప్రీమియం తక్కువగా ఉంటుంది. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని తమ ఆరోగ్య సమస్యలకు మెరుగైన రక్షణ దిశగా వృద్ధులు ప్రణాళిక రూపొందించుకోవాలి.

ఫండ్ స్ట్రీట్

యాక్సిస్ నిఫ్టీ500 వేల్యూ 50 ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా నిఫ్టీ500 వేల్యూ 50 ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ అక్టోబర్ 18తో ముగుస్తుంది. కనీసం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. నిఫ్టీ 500 వేల్యూ 50 సూచీలోని స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెరుగైన రాబడులు అందించడం ఈ ఫండ్ లక్ష్యం. వేల్యూ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయదల్చుకునే దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు, తమ పోర్ట్‌ఫోలియోలో ప్యాసివ్ వ్యూహాన్ని కూడా భాగం చేసుకోవాలనుకునే మదుపర్లు దీన్ని ఎంచుకోవచ్చు.

ఆదిత్య బిర్లా టార్గెట్ మెచ్యూరిటీ ఫండ్


ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ తాజాగా టార్గెట్ మెచ్యూరిటీ ఫండ్ తాజాగా తమ క్రిసిల్-ఐబీఎక్స్ ట్రిపుల్ ఎ ఎన్‌బీఎఫ్‌సీ-హెచ్‌ఎఫ్‌సీ ఇండెక్స్-సెప్టెంబర్ 2026 ఫండ్‌ను ప్రవేశపెట్టింది. ఈ టార్గెట్ మెచ్యూరిటీ ఫండ్ ప్రధానంగా దేశీయంగా టాప్ ఎన్‌బీఎఫ్‌సీలు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల బాండ్లలో ఇన్వెస్ట్ చేస్తుంది. అక్టోబర్ 7 వరకు అందుబాటులో ఉంటుంది. 3 నుంచి 24 నెలల వ్యవధితో ప్యాసివ్ డెట్ వ్యూహాన్ని కోరుకునే ఇన్వెస్టర్లకు ఇది అనువైనదని సంస్థ ఎండీ ఎ. బాలసుబ్రమణియన్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

07-10-2024	
విశాఖ	525-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

ఎన్ని పథకాలు ఎంపిక చేసుకోవాలి?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



స్మాల్ క్యాప్ ఫండ్స్ తమ పెట్టుబడుల్లో ఎక్కువ భాగాన్ని మిడ్‌క్యాప్ స్టాక్స్‌కు ఎందుకు కేటాయింపులు చేస్తుంటాయి?

– వంశీ గౌడ్

నిజానికి స్మాల్‌క్యాప్ ఫండ్స్ పెట్టుబడులు అన్నింటినీ స్మాల్‌క్యాప్ కంపెనీల్లోనే పెట్టేయవు. ఇది సాధారణ నమ్మకానికి విరుద్ధమైనది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మ్యూచువల్ ఫండ్స్‌కు పెట్టుబడుల పరంగా కొంత వెసులుబాటు కల్పించింది. స్మాల్‌క్యాప్ ఫండ్స్ తమ నిర్వహణలోని పెట్టుబడుల్లో కనీసం 65 శాతాన్ని స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తే సరిపోతుంది. మిగిలిన 35 శాతాన్ని ఏ విభాగంలో ఇన్వెస్ట్ చేయాలన్నది పూర్తిగా ఫండ్ మేనేజర్ ఇష్టంపైనే ఆధారపడి ఉంటుంది. మార్కెట్ పరిస్థితులు, పెట్టుబడుల అవకాశాలకు అనుగుణంగా ఈ 35 శాతాన్ని మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్‌లో ఏ విభాగానికి కేటాయించాలన్నది ఫండ్ మేనేజర్లు నిర్ణయిస్తుంటారు. స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఆటుపోట్లు ఎక్కువ. లిక్విడిటీ సమస్యలు కూడా ఉంటాయి. అందుకని పెట్టుబడుల్లో కొంత భాగాన్ని ఇతర మార్కెట్ క్యాప్ విభాగాల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల రిస్కులను అధిగమించొచ్చు. 28 స్మాల్‌క్యాప్ యాక్టివ్ ఫండ్స్‌ను గమనిస్తే.. అవి తమ నిర్వహణలోని పెట్టుబడుల్లో 82 శాతాన్ని స్మాల్ క్యాప్ కంపెనీలకు, 13 శాతాన్ని మిడ్‌క్యాప్ కంపెనీలకు కేటాయించాయి. కేవలం ఆరు పథకాలే మిడ్ క్యాప్ కంపెనీలకు 15 శాతానికి మించి పెట్టుబడులు కేటాయించాయి. వాటి పనితీరు మిశ్రమంగా ఉంది. మూడు పథకాలు నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250కి మించి పనితీరు చూపించాయి. మరో మూడు బెంచ్ మార్క్ పనితీరు స్థాయిలో రాబడులు అందించాయి. కేవలం జేఎం స్మాల్ క్యాప్ ఫండ్, టాటా స్మాల్‌క్యాప్, ఎస్‌బీఐ స్మాల్‌క్యాప్, డీఎస్‌పీ స్మాల్‌క్యాప్ పథకాలే 90 శాతానికి పైగా స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసి ఉన్నాయి.

నా వద్ద రూ.35 లక్షలు ఉన్నాయి. 8 నుంచి 10 ఏళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేద్దామని అనుకుంటున్నాను. ఈ మొత్తాన్ని ఏడు పథకాల పరిధిలో ఇన్వెస్ట్ చేయాలన్నది నా యోచన. రిస్క్ తీసుకునే ఇన్వెస్టర్‌కు ఇది మంచి వ్యూహమే అవుతుందా?


– జయదేవ్

రూ.35 లక్షల పెట్టుబడులను 8–10 ఏళ్ల కాలానికి, వివిధ పథకాల పరిధిలో ఇన్వెస్ట్ చేయడం మంచి నిర్ణయం అవుతుంది. అయితే, ఏడు పథకాల పరిధిలో పెట్టుబడులు పెట్టుకోవడం అన్నది పెద్దగా ఫలితం ఇవ్వదు. దీనికి బదులు మొత్తం పథకాల సంఖ్యను ఐదుకు తగ్గించుకోవడాన్ని పరిశీలించండి. అప్పుడు ఒక్కో పథకానికి 20 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించుకోవచ్చు. కొన్ని పథకాలపైనే దృష్టి సారించడం వల్ల వాటికి అర్థవంతంగా కేటాయింపులు చేసుకోవడానికి వీలుంటుంది. ఐదు పథకాల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల వాటి పనితీరును ఎప్పటికప్పుడు సులభంగా సమీక్షించుకుంటూ, అవసరమైతే సర్దుబాట్లు చేసుకోవచ్చు. పెట్టుబడులను ఎక్కువ పథకాల మధ్య విస్తరించడం వల్ల అది సంతృప్తిని ఇవ్వొచ్చు. కానీ, విడిగా ఒక్కో పథకానికి తగినంత సమయాన్ని కేటాయించడం సాధ్యపడకపోవచ్చు.

పుంజుకున్న వ్యాపార విశ్వాస సూచీ

- రెండు త్రైమాసికాల గరిష్టం
- విధానాల కొనసాగింపుతో ఉత్సాహం
- సీఐఐ బిజినెస్ అవుట్‌లుక్ సర్వే

న్యూఢిల్లీ: సీఐఐ వ్యాపార విశ్వాస సూచీ జూలై–సెప్టెంబర్ కాలంలో రెండు త్రైమాసికాల గరిష్ట స్థాయి అయిన 68.2కు చేరింది. కేంద్ర ప్రభుత్వ విధానాల కొనసాగింపుతో పరిశ్రమల్లో ఉత్సాహం వ్యక్తమైంది. సాధారణ ఎన్నికల అనంతరం సీఐఐ నిర్వహించిన మొదటి సర్వే ఇది. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకున్నట్టు సీఐఐ తెలిపింది. అంతర్జాతీయంగా సవాళ్లు నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక వృద్ధి బలంగా నిలదొక్కుకున్నట్టు పేర్కొంది. ప్రస్తుత పండుగల సీజన్ ఈ వృద్ధి అవకాశాలను మరింత బలోపేతం చేస్తుందని అభిప్రాయపడింది. సీఐఐ 128వ బిజినెస్ అవుట్‌లుక్ సర్వే 2024 సెప్టెంబర్‌లో జరిగింది. అన్ని రంగాలు, ప్రాంతాల నుంచి 200 సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. సర్వేలో పాల్గొన్న కొన్ని కంపెనీలు సుదీర్ఘ కాలం పాటు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేశాయి.



అలాగే, అంతర్జాతీయంగా కమోడిటీల ధరలు పెరిగిపోవడం, వెలుపలి డిమాండ్ బలహీనంగా ఉండడాన్ని ప్రస్తావించాయి. మరోవైపు వినియోగం మెరుగుపడడం, వర్షాలు మెరుగ్గా పడడం, సంస్కరణల పట్ల సానుకూల ధోరణి వంటి సానుకూలతలనూ పేర్కొన్నాయి. ప్రైవేటు పెట్టుబడులు పుంజుకోవడం సానుకూలమన్నారు. 2024–25 మొదటి ఆరు నెలల్లో ప్రైవేటు పెట్టుబడులు, అంతకుముందు ఆరు నెలల కాలంతో పోల్చితే పుంజుకున్నట్టు సర్వేలో 59 శాతం కంపెనీలు తెలిపాయి.

రేట్ల కోతపై అంచనాలు

ఆర్‌బీఐ వడ్డీ రేట్ల కోతను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో (అక్టోబర్–డిసెంబర్) మొదలు పెట్టొచ్చని 34% కంపెనీలు అభిప్రాయపడుతున్నాయి. వడ్డీ రేట్ల తగ్గింపు నాలుగో త్రైమాసికంలో (2025 జనవరి–మార్చి) ఆరంభం కావొచ్చని 31% కంపెనీలు అంచనా వేస్తున్నాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఆర్‌బీఐవైపు ఇన్వెస్టర్ల చూపు | పండుగ సీజన్‌పై 'ఆటో' భారీ ఆశలు

క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ | బ్రోకరేజ్: మోనార్క్ నెట్‌వర్త్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 737 **టార్గెట్:** రూ. 1,230

ఎందుకంటే: సమీకృత ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసుల(ఐఎఫ్‌ఎంఎస్) విభాగంలో సేవలందిస్తున్న క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ వృద్ధి పథంలో సాగుతోంది. ఐఎఫ్‌ఎంఎస్ రంగంలో విభిన్న సర్వీసులు అందించడం ద్వారా అత్యంత వేగంగా విస్తరిస్తోంది. ప్రయివేట్ సెక్యూరిటీ, సిబ్బంది నియామకం(స్టాఫింగ్), కేటరింగ్ తదితర పలు సర్వీసులు సమకూర్చుతోంది. క్లయింట్ల బేస్‌ను వ్యూహాత్మకంగా పెంచుకుంటూ వస్తోంది. 2020-21లో నమోదైన క్లయింట్ల సంఖ్య 262ను గతేడాది(2023-24)కల్లా 369కు చేర్చుకుంది. అంతేకాకుండా గతేడాది 100 శాతం కాంట్రాక్ట్ రెన్యువల్, ఎక్స్‌టెన్షన్ రిటెన్షన్ రేటును సాధించింది. 2021-24 మధ్య కాలంలో వార్షిక ప్రాతిపదికన ఆదాయంలో 30 శాతం పురోభివృద్ధిని అందుకుంది. కస్టమర్ల అవసరాలకు తగిన విధంగా రూపొందించిన సమీకృత సేవలు(బండిల్డ్, కస్టమైజ్‌డ్) అందించడంలో సామర్థ్యం చూపడం ద్వారా ప్రత్యర్థి కంపెనీలకంటే ముందుంటోంది. ఇందుకు పటిష్ట యాజమాన్య నిర్వహణ దోహదపడుతోంది. ఈ అంశాల నేపథ్యంలో గత మూడేళ్లుగా వార్షిక ప్రాతిపదికన కంపెనీ సాధించిన 50 శాతం నిర్వహణ లాభ(ఇబిటా) పురోగతి కంపెనీ నిర్వహణ పటిమను ప్రతిబింబిస్తోంది. ప్రభుత్వ కాంట్రాక్టుల ద్వారా కీలక రంగాలపై సారిస్తున్న వ్యూహాత్మక దృష్టి సత్ఫలితాలను ఇస్తోంది. అసాధారణ సర్వీసుల పోర్ట్‌ఫోలియో, అత్యుత్తమ యాజమాన్య నిర్వహణ ప్రత్యర్థి కంపెనీలకంటే టాప్ ర్యాంకులో క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్‌ను నిలుపుతున్నాయి. వెరసి ఐఎఫ్‌ఎంఎస్ విభాగంలో మార్కెట్ లీడర్‌గా ఆధిపత్యం చూపుతోంది. వీటికి అదనంగా బీటూసీ విభాగంలోనూ అవకాశాలను అన్వేషిస్తోంది. ఇందుకు బ్రాండ్ ప్రాచుర్యం, నైపుణ్యాలను వినియోగించనుంది.

షేర్లు షేర్లు



ఓలా ఎలక్ట్రిక్ | బ్రోకరేజ్: యూఎల్‌జేకే రీసెర్చ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 99 **టార్గెట్:** రూ. 159

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలో ఎలక్ట్రిక్ వాహన కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రోత్సాహకర ఫలితాలను సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో మొత్తం ఆదాయం వార్షిక ప్రాతిపదికన 32 శాతంపైగా జంప్‌చేసి రూ. 1,644 కోట్లను తాకింది. త్రైమాసికవారీగా అంటే జనవరి-మార్చి(క్యూ4)తో పోల్చినా 3 శాతం వృద్ధిని అందుకుంది. నిర్వహణ(ఇబిటా) స్థాయిలో నష్టం రూ. 205 కోట్లకు పరిమితమైంది. వార్షికంగా ఇది 6.3 శాతం మెరుగుపడింది. త్రైమాసికవారీగా చూస్తే మరింత అధికంగా 52 శాతం మెరుగుపడింది. ఇబిటా స్థాయిలో మార్జిన్లు ప్రతికూలంగా అంటే -12.5 శాతంగా నమోదయ్యాయి. అయితే వార్షికరూపేణా ఇవి 500 బేసిస్ పాయింట్లు(5 శాతం) పుంజుకున్నాయి. ఇక త్రైమాసికవారీగా మరింత ఎక్కువగా 7 శాతం బలపడ్డాయి. ఇక నికర నష్టం రూ. 347 కోట్లకు పెరిగింది. అంటే వార్షికంగా 23 శాతం అధికమైంది. త్రైమాసికవారీగా మాత్రం దాదాపు 20 శాతం మెరుగుపడింది. కాగా.. దేశీయంగా ద్విచక్ర ఎలక్ట్రిక్ వాహన విభాగంలో ఓలా ఎలక్ట్రిక్ దాదాపు 49 శాతం మార్కెట్ వాటాను కైవసం చేసుకుంది. స్థూల మార్జిన్లలో వృద్ధిని సాధించింది. ఇందుకు జెన్ 2 ప్లాట్‌ఫామ్ ఆవిష్కరణతో తయారీ వ్యయాలు తగ్గడం తోడ్పాటునిచ్చింది. అంతేకాకుండా ఏఐ వినియోగం ద్వారా వ్యయ నియంత్రణ చర్యలకు తెరతీసింది. వీటికి జతగా డిజిటైజేషన్ చేపట్టి పంపిణీ వ్యయాలను తగ్గించుకుంది. వెరసి త్రైమాసికవారీగా ఇతర వ్యయాలలో 12 శాతం వరకూ కోత పెట్టేందుకు దారి ఏర్పాటు చేసుకుంది. ఎలక్ట్రిక్ టూవీలర్ మార్కెట్లో ఆధిపత్యం, దేశవ్యాప్తంగా ద్విచక్ర ఈవీలకు పెరుగుతున్న డిమాండ్, కొత్తగా ఎలక్ట్రిక్ మోటార్‌సైకిళ్ల విడుదల కంపెనీకి మరింత లబ్ధిని చేకూర్చవచ్చు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

డైరెక్టర్ పోస్టుల భర్తీ ఎప్పుడో..?

టీజీఎన్పీడీసీఎల్‌లో ఆశావహుల ఎదురుచూపులు

- నోటిఫికేషన్ విడుదల చేసి 10 నెలలు
- ప్రస్తుతం పనిచేస్తున్న సీజీఎంలతో పాటు రిటైర్డ్ సీఈలతోపాటు మొత్తం 83 మంది దరఖాస్తు
- ప్రభుత్వ జాప్యంతో ఆశావహుల్లో నైరాశ్యం
- సీజీఎంలనే డైరెక్టర్‌లను కొనసాగిస్తుందా..పూర్తి కాలం డైరెక్టర్‌లను నియమిస్తుందా..?
- ప్రభుత్వం నుంచి కానరాని స్పష్టత



హనుమకొండ: తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలి(టీజీఎన్పీడీసీఎల్)లో కీలకమైన డైరెక్టర్ల పోస్టుల భర్తీ ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అప్పుడప్పుడు కొన్ని నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తున్నా కీలకమైన విద్యుత్ సంస్థల్లోని డైరెక్టర్ పోస్టుల భర్తీ జోలికెళ్లడం లేదు. ఈ పదవులకు విద్యుత్ సంస్థల్లో చీఫ్ ఇంజనీర్ స్థాయిలో పనిచేస్తున్న వారు...పనిచేసి రిటైర్డ్ అయిన వారు మాత్రమే అర్హులు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతంలో నియామకమైన విద్యుత్ సంస్థల సీఎండీలు, డైరెక్టర్లను తొలగించింది. టీజీఎన్పీడీసీఎల్‌లో అప్పటి సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు ప్రభుత్వం మారగానే పదవికి రాజీనామా చేశారు. డైరెక్టర్లు కొనసాగుతుండగా వారిని ఈ ఏడాది జనవరి 29న తొలగించి, జనవరి 30న నూతన డైరెక్టర్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలుండగా టీజీఎన్పీడీసీఎల్ 17 జిల్లాలు, 299 మండలాల్లో విస్తరించి ఉంది. 5,580 గ్రామాలు, 7,474 హామ్లేట్ గ్రామాలకు విద్యుత్ పంపిణీ చేస్తుంది. 64 లక్షల విద్యుత్ వినియోగదారులున్నారు. 9 వేలకు పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు.

అధికారపార్టీ పెద్దల ప్రసన్నానికి పాట్లు

ఆశించే వారు భారీగా ఉండటంతో ఎలాగైనా పదవి దక్కించుకోవాలని అధికార పార్టీ పెద్దల ప్రసన్నం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ఇతర అధికార పెద్దల ద్వారా ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు డైరెక్టర్ల నియామకం చేపట్టినా తమకే అవకాశం దక్కాలని ఆశావహులు పావులు కదుపుతున్నారు. మరోవైపు ఇన్‌చార్జ్ డైరెక్టర్లుగా చీఫ్ ఇంజనీర్‌లు కొనసాగుతుండటంతో పాలనాపరమైన నిర్ణయాల్లో ఎలాంటి ఇబ్బందులు, జాప్యం లేకుండా ముందుకు సాగుతుండటం కూడా పదవుల భర్తీపై ప్రభుత్వం శ్రద్ధ కనబరచడం లేదని పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు నష్టాల్లో ఉన్న విద్యుత్ సంస్థలకు డైరెక్టర్లను నియమిస్తే సంస్థపై కూడా ఆర్థిక భారం పడనుంది. ఒక్కో డైరెక్టర్‌కు జీతం, కారు, ఇతర అలవెన్సులు కలిపి నెలకు రూ.2.40 లక్షల వరకు వ్యయం అవుతుంది. ఇలా నలుగురికి నెలకు రూ.9.60 లక్షలు, ఏడాదికి రూ.1.15,20,000 భారం సంస్థపై పడుతుంది. ఇది కూడా భర్తీ జాప్యానికి ఒక కారణంగా భావిస్తున్నారు.

ఈ క్రమంలో సీజీఎంలనే డైరెక్టర్‌లుగా కొనసాగిస్తుందా? లేదా పూర్తికాలం డైరెక్టర్లను నియమిస్తుందా అనే సందేహాలు నెలకొన్నాయి. ఆలస్యమయ్యే కొద్దీ దరఖాస్తుదారుల్లో మాత్రం ఉత్కంఠ పెరుగుతోంది.

ఓ వైపు అందని సంకేతాలు.. మరోవైపు గందరగోళం..

విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల పోటీ భర్తీపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన సంకేతాలు లేకపోవడంతో ఆ పదవులు ఎప్పుడు భర్తీ అవుతాయో తెలియని అయోమయంలో ఆశావహులు కొట్టుమిట్టాడుతున్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాగానే అప్పటి వరకు పనిచేస్తున్న డైరెక్టర్లను తొలగించి చీఫ్ జనరల్ మేనేజర్లను ఇన్‌చార్జ్ డైరెక్టర్‌లుగా నియమించారు. వీరు సీజీఎంలుగా, డైరెక్టర్‌లుగా రెండు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీజీఎంగా ఒక విభాగం, డైరెక్టర్‌గా మరో విభాగం పర్యవేక్షిస్తుండటంతో గందరగోళం నెలకొంది. నూతనంగా నాలుగు డైరెక్టర్ల పోస్టుల భర్తీకి ఈ ఏడాది జనవరి 30న నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్చి 2 వరకు దరఖాస్తు గడువు విధించగా దాదాపుగా 83 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని టీజీ ట్రాన్స్‌కో, టీజీ జెన్‌కో, టీజీఎన్పీడీసీఎల్, తెలంగాణ సౌతర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో పనిచేస్తున్న సీజీఎంలు, రిటైర్డ్ సీఈలు, గతంలో పనిచేసిన డైరెక్టర్లు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎన్పీడీసీఎల్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న సీజీఎంలు కూడా ఉన్నారు. దరఖాస్తులు స్వీకరించి 10 నెలలవుతున్నా పోస్టులు భర్తీ చేయడంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నాన్చి వేస్తుండటంతో ఎవరికి ఎప్పుడు పదవులు దక్కుతాయోననే ఆశావహులు ఎదురుచూస్తున్నారు.

● కిటకిటలాడిన యాదాద్రి



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు శ్రీస్వామిని దర్శించుకునేందుకు అధికంగా తరలి వచ్చారు. ధర్మ దర్శనానికి సుమారు 3 గంటలు, వీఐపీ దర్శనానికి గంటకు పైగా సమయం పట్టిందని భక్తులు తెలిపారు. శ్రీస్వామి వారిని సుమారు 35 వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీవారికి నిత్యాదాయం రూ.32,50,448 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

\- యాదగిరిగుట్ట

మోదీని బంజారా జాతి ఎన్నడూ మర్చిపోదు

పార్లమెంటు మాజీ సభ్యుడు సీతారాం నాయక్



సాక్షి, హైదరాబాద్: దేశంలోని బంజారా జాతి యావత్తూ ప్రధాని నరేంద్ర మోదీని మర్చిపోదని పార్లమెంటు మాజీ సభ్యుడు సీతారాం నాయక్ అన్నారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్రలో రూ.9 వందల కోట్లతో సంగారా భవన్‌ను నిర్మించి, అందులో బంజారాల సంస్కృతి సంప్రదాయాలతో మ్యూజియంను ప్రారంభించినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. చరిత్ర రూపంలో బంజారాల ఇతిహాసాన్ని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దేశంలో ఎన్నో ఏళ్లుగా ఆదరణ లేకుండా బిక్కుబిక్కుమంటూ గాలిలో దీపంలా ఉన్న బంజారాలకు ప్రధాని మోదీ మనోధైర్యాన్ని కలిగించారన్నారు. దేశంలో కేవలం ఐదు రాష్ట్రాల్లో మాత్రమే బంజారాలను గిరిజనుల కేటగిరీలో చేర్చారని, మిగిలిన చోట్ల ఇతర కులాల్లో చేర్చడం రాజ్యాంగ విరుద్ధమని సీతారాం నాయక్ అన్నారు.

లక్ష్యం చేరని ఆయిల్‌పామ్

ఇప్పటివరకు కేవలం 25 వేల ఎకరాల్లోనే సాగు



- పలుమార్లు మందలించినా పట్టించుకోని ప్రైవేట్ యాజమాన్యాలు
- వాటిపై చర్యలు తీసుకోవడంలో అధికారుల వైఫల్యం
- లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆయిల్‌ఫెడ్ కూడా అంతంతే

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది లక్ష ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయించాలనేది ప్రభుత్వ టార్గెట్. అయితే ఉద్యానశాఖ, ఆయిల్ ఫెడ్, మరోవైపు ప్రైవేట్ కంపెనీలు ఘోరంగా విఫలమయ్యాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు అసహనం, ఆగ్రహం కూడా వ్యక్తం చేశారు. అయినా లక్ష్యంలో పావు వంతు మేరకే చేరుకోగలిగారు. అందులో ఆయిల్‌ఫెడ్ కూడా కేవలం 13 వేల ఎకరాల వరకే పరిమితమైందని సమీక్ష సందర్భంగా మంత్రి తుమ్మల పేర్కొన్న సంగతి విదితమే. ఉద్యానశాఖ, ఆయిల్‌ఫెడ్‌కూ ఐఏఎస్ అధికారి యాస్మిన్ భాషా బాస్‌గా ఉన్నారు. రెండు వైపులా సమీక్షలు చేస్తున్నా, పరిస్థితి మాత్రం అనుకున్నంత సానుకూలంగా లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

రైతులను రిజిస్ట్రేషన్ చేశారే కానీ...

వంట నూనెల జాతీయ పథకం (ఎన్‌ఎంఈవో) ద్వారా కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని వాటికి జిల్లాలను, అందులో భూముల సాగు లక్ష్యాలను నిర్దేశించింది. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు స్థాపించడం, ప్రభుత్వం నిర్దేశించిన భూముల్లోని రైతులను ఒప్పించి మొక్కలను వేయడం, వారికి ప్రోత్సాహకాలు ఇవ్వడం, పంట వచ్చిన తర్వాత కొనుగోలు చేయడం వంటి వాటిని ఈ కంపెనీలు చేపట్టాలి. 2020–21లో కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. కాగా, ఆయిల్‌ఫెడ్‌కు పూర్తిస్థాయిలో యంత్రాంగం ఉంది. అయితే కొత్తగా వచ్చిన కంపెనీల్లో చాలావరకు గతంలో ఆయిల్‌పామ్ సాగుపై ఎలాంటి అనుభవం లేనివి. ఈ ఏడాది లక్ష ఎకరాల లక్ష్యంలో అత్యధికంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోనే సాగు చేయనున్నారు. ఖమ్మం జిల్లాలో 13 వేల ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 11 వేల ఎకరాల్లో సాగు చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత నల్లగొండ జిల్లాలో 6,700 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 4,800 ఎకరాల్లో సాగు చేయాలన్నది ఉద్దేశం. లక్ష ఎకరాల లక్ష్యంలో దాదాపు 75 వేల ఎకరాలకు చెందిన రైతులను సాధారణ రిజిస్ట్రేషన్ చేశారు. కానీ వారిని ఒప్పించి డీడీలు కట్టించేలా చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. చేస్తాం చూస్తాం అని చెబుతున్నారే కానీ రైతుల సంఖ్య, ఎకరాల వారీగా లక్ష్యాన్ని చెప్పలేకపోతున్నారు.

ఖర్చుకు వెనుకాడుతున్న కంపెనీలు

ఒక ఫ్యాక్టరీ పెట్టాలంటేనే రూ. 60 కోట్ల వరకు ఖర్చు చేయాలి. విత్తనాలకు రూ. కోట్లు ఖర్చు చేయాలి. పైగా నాలుగేళ్ల తర్వాతే లాభాలు ఆశించాలి. అప్పటివరకు మొత్తం ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. కొన్ని కంపెనీలైతే కోటి రూపాయలు పెట్టడానికి కూడా ఒకటికి నాలుగుసార్లు ఆలోచిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. మరోవైపు ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయడానికి అవసరమైన భూమిని కొన్ని కంపెనీలు భూములను సేకరించలేదు. దాదాపు మూడేళ్ల క్రితమే ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు ఉన్నా, కంపెనీలు పట్టించుకోవడం లేదు. పంట చేతికొచ్చే సమయానికి ఫ్యాక్టరీ అందుబాటులో లేకుంటే రైతులు ఇబ్బందే. ఇప్పటికే కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేసిన జిల్లాల్లో గెలలు అందుబాటులోకి వచ్చాయి. మరో ఏడాదిలో మరింత ఎక్కువగా అందుబాటులోకి వస్తాయంటున్నారు. ఈ నేపథ్యంలో కంపెనీలు ఇంకా నిర్లిప్తంగా ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంపెనీల నుంచి ఆశించిన స్పందన లేకపోతే అవసరమైతే ఒప్పందాలను రద్దు చేయాలని మంత్రి తుమ్మల చెప్పినా ఆ మేరకు యంత్రాంగం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనేది అనుమానాలకు తావిస్తోంది. కొన్ని కంపెనీలతో కొందరు అధికారులు లాలూచీ పడుతున్నారన్న చర్చ జరుగుతోంది.

‘శ్రీశైలం’ పూడిక నష్టం 102.11 టీఎంసీలు

ప్రాజెక్టులో నానాటికీ పేరుకుపోతున్న పూడిక

- జలాశయ గరిష్ట నీటినిల్వ సామర్థ్యం 308.06 టీఎంసీలు
- తాజా సర్వేలో 205.95 టీఎంసీలకు తగ్గిందన్న సీడబ్ల్యూసీ నివేదిక
- కృష్ణా పరీవాహక ప్రాంతంలో భారీగా అడవుల నరికివేత
- వర్షాలు కురిసినప్పుడు భూమి కోతకు గురై.. వరదతోపాటు మట్టి ప్రవాహం
- ఇదే శ్రీశైలం రిజర్వాయర్‌లో పూడిక పేరుకుపోవడానికి కారణం



సాక్షి, హైదరాబాద్: కృష్ణానది పరీవాహక ప్రాంతంలో రెండు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు అయిన శ్రీశైలం జలాశయంలో పూడిక పేరుకుపోవడంతో గరిష్ట నీటినిల్వ సామర్థ్యం 102.11 టీఎంసీలు తగ్గింది. లైవ్ స్టోరేజీ సామర్థ్యం 72.77 టీఎంసీలు.. డెడ్ స్టోరేజీ సామర్థ్యం 29.33 టీఎంసీలు తగ్గిందన్నది రాష్ట్ర జలవనరులశాఖ, కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) సంయుక్తంగా రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీని ఉపయోగించి నిర్వహించిన హైడ్రోగ్రాఫిక్ సర్వేలో వెల్లడైంది. బేసిన్‌లో పెద్దఎత్తున అడవులను నరికివేస్తుండటంతో వర్షాలు కురిసినప్పుడు వరదతోపాటు భూమి కోతకు గురవడం వల్ల మట్టి కలిసి ప్రవహిస్తూ జలాశయంలోకి వచ్చి చేరుతోంది. ఏటా పూడిక పేరుకుపోతుండటంతో శ్రీశైలం జలాశయంలో నీటినిల్వ సామర్థ్యం భారీగా తగ్గిందని సీడబ్ల్యూసీ తేల్చింది. దేశంలో జలాశయాల్లో పేరుకుపోతున్న పూడికపై 1991, 2001, 2015, 2020లలో సీడబ్ల్యూసీ సర్వే చేసి.. నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. ఈ ఏడాది దేశంలో 548 జలాశయాలలో నీటినిల్వ సామర్థ్యంపై సర్వే చేసింది. పెద్దఎత్తున పూడిక పేరుకుపోవడం వల్ల నీటినిల్వ సామర్థ్యం భారీగా తగ్గిన జలాశయాల్లో శ్రీశైలం మొదటిస్థానంలో నిలిచింది.

45 ఏళ్లలో కొండలా పూడిక

కృష్ణానదిపై నంద్యాల జిల్లాలో శ్రీశైలం సమీపంలో 1960లో జలాశయ నిర్మాణాన్ని ప్రారంభించి, 1976 నాటికి పూర్తి చేశారు. జలాశయంలో నీటినిల్వను 1976 నుంచే ప్రారంభించారు. అప్పట్లో రాష్ట్ర జలవనరుల శాఖ నిర్వహించిన సర్వేలో జలాశయంలో గరిష్ట నీటినిల్వ సామర్థ్యం 308.06 టీఎంసీలు.. సాగు, తాగునీటి అవసరాలకు ఏటా 253.05 టీఎంసీలను వినియోగించుకోవచ్చునని తేల్చింది. జలాశయంలో పూడిక పేరుకుపోతుండటం వల్ల ఏటా నీటినిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తోంది. సీడబ్ల్యూసీ, రాష్ట్ర జలవనరుల శాఖ తాజాగా నిర్వహించిన సర్వేలో శ్రీశైలం గరిష్ట నీటినిల్వ సామర్థ్యం 205.95 టీఎంసీలుగా తేలింది. అంటే.. 45 ఏళ్లలో గరిష్ట నీటినిల్వ సామర్థ్యం 102.11 టీఎంసీలు తగ్గినట్టు స్పష్టమవుతోంది. జలాశయంలో పూడిక కొండలా పేరుకుపోవడం వల్లే ఆ స్థాయిలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందన్నది స్పష్టమవుతోంది.

ఆయకట్టుకు నీళ్లందించడం సవాలే..

శ్రీశైలం జలాశయంపై తెలంగాణలో ఎస్‌ఎల్‌బీసీ, పాలమూరు–రంగారెడ్డి, డిండి, కల్వకుర్తి ఎత్తిపోతలు, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుగంగ, ఎస్సార్బీసీ(శ్రీశైలం కుడి గట్టు కాలువ), గాలేరు–నగరి, హంద్రీ–నీవా ఆధారపడ్డాయి. పూడిక వల్ల శ్రీశైలం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం.. లైవ్ స్టోరేజీ సామర్థ్యం భారీగా తగ్గిన నేపథ్యంలో ఆ ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు నీళ్లందించడం సవాల్‌గా మారుతుందని నీటిపారుదలరంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండలా మారిన పూడికను తొలగించడం భారీ ఎత్తున వ్యయంతో కూడిన పని.. పూడిక తొలగింపు అసాధ్యమని తేల్చిచెబుతున్నారు. తగ్గిన నీటి నిల్వ సామర్థ్యం మేరకు కొత్తగా రిజర్వాయర్ నిర్మించే అవకాశాలను పరిశీలించాలని ప్రభుత్వానికి సూచిస్తున్నారు.

పూడిక పేరుకుపోవడంతో శ్రీశైలం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది ఇలా..:

సంవత్సరం	అధ్యయనం చేసిన సంస్థ	పూర్తి నీటి నిల్వ	లైవ్ స్టోరేజీ	డెడ్ స్టోరేజీ
1. 1976	రాష్ట్ర జలవనరుల శాఖ	308.06	253.05	55.00
2. 1989	సీడబ్ల్యూసీ (రిజర్వాయర్ కెపాసిటీ సర్వే)	194.44	-	-
3. 1997	రాష్ట్ర జలవనరుల శాఖ(హైడ్రోగ్రాఫిక్ సర్వే)	263.60	214.17	49.44
4. 1998	సీడబ్ల్యూసీ (రిజర్వాయర్ కెపాసిటీ సర్వే)	181.95	-	-
5. 2001	సీడబ్ల్యూసీ(హైడ్రోగ్రాఫిక్ సర్వే)	220.55	181.30	39.26
6. 2006	సీడబ్ల్యూసీ (హైడ్రోగ్రాఫిక్ సర్వే)	234.24	200.81	33.44
7. 2011	సీడబ్ల్యూసీ(హైడ్రోగ్రాఫిక్ సర్వే)	215.81	186.83	30.04
8. 2021	రాష్ట్ర జలవనరుల శాఖ(హైడ్రోగ్రాఫిక్ సర్వే)	205.95	180.28	25.67
మొత్తం మీద నీటి నిల్వ సామర్థ్యంలో తగ్గుదల		102.11	72.77	29.33

ఇదీ శ్రీశైలం ప్రాజెక్టు సమగ్ర స్వరూపం

- తొలిసారి రిజర్వాయర్‌ను నింపింది: 1976
- కనీస నీటిమట్టం: 854 అడుగులు
- గరిష్ట నీటిమట్టం: 885 అడుగులు
- క్యాచ్‌మెంట్ ఏరియా: 60,350 చదరపు కిలోమీటర్లు
- గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేసినప్పుడు నీరు నిల్వ ఉండే ప్రాంతం: 615.18 చదరపు కిలోమీటర్లు

రాష్ట్రంలోని ఆయా ప్రాజెక్టుల్లో పూడిక శాతం ఇలా

ప్రాజెక్టు	కట్టింది ఏదాది	కోల్పోయిన నిల్వ శాతం
నిజాంసాగర్	1930	60.47
రాలివాగు	2016	43.30
వైరా	1929	39.66
కడెం	1958	37.17
మంజీరా	1966	36.79
లక్నవరం	1909	31.18
అప్పర్‌మానేరు	1950	30.35
స్వర్ణ	1978	30.11
రామడుగు	1964	29.58
శ్రీరాంసాగర్	1970	28.14
హిమాయత్‌సాగర్	1927	26.56
నాగార్జునసాగర్	1967	23.52
పోచారం	1922	22.45
జూరాల	1996	19.21
మత్తడివాగు	2008	17.79
ఎన్టీఆర్‌సాగర్ (చెలిమలవాగు)	1998	16.30
కిన్నెరసాని	1966	15.61
శనిగరం ట్యాంకు	1891	10.14
బయ్యారం	1962	9.38
కొమురంభీం	2011	8.50
డిండి	1943	8.22
మూసీ	1963	8.05
సింగూరు	1989	2.47
పాలేరు	1928	2.14

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 75,552 మంది స్వామివారిని దర్శించుకోగా 35,885 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.54 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయంకంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవి అలంకారం



పాలకొల్లు సెంట్రల్: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ధైర్యలక్ష్మీగా కనకమహాలక్ష్మి



దాబాగార్డెన్స్: విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు ధైర్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని లక్ష తులసితో పూజ నిర్వహించారు. సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన తదితర పూజలు చేశారు. సోమవారం సంతానలక్ష్మిగా కనకమహాలక్ష్మి దర్శనమివ్వనున్నారని, కలువ పూలతో పూజ నిర్వహిస్తామని ఈవో కె.శోభారాణి తెలిపారు.

అమ్మవారికి వెండి చీర, కిరీటం సమర్పణ



రామచంద్రపురం రూరల్: కోనసీమ జిల్లా ద్రాక్షారామం కన్యకా పరమేశ్వరి ఆలయంలోని అమ్మవారికి గ్రామానికి చెందిన దాత కొమ్మిశెట్టి సుబ్రహ్మణ్య వరప్రసాద్ వంశోద్ధారకులు వెండి చీర సమర్పించారు. అదే గ్రామానికి చెందిన పసుమర్తి కృష్ణ వెండి కిరీటాన్ని సమర్పించారు. వినాయకుడికి తవ్వా నారాయణరావు వెండి కిరీటాన్ని, వీరభద్రుడికి వెచ్చా వీరశంకరం వెండి కిరీటాన్ని సమర్పించారు. వాటిని పండితులు ఆయా దేవతామూర్తుల విగ్రహాలకు అలంకరించారు. ఉత్సవాల నిర్వాహకులు దాతలను అభినందించారు.

లక్ష్మీనృసింహుని సన్నిధికి పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అలాగే స్థానిక అశ్వరూఢాంబిక ఆలయంలో కూడా అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. కాగా దసరా పర్వదినాలకు తోడు ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తుల తాకిడి మరింత పెరిగింది. సాధారణ భక్తులతో పాటు భవానీ భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అలాగే ఆలయంలో నిర్వహించే నారసింహ సుదర్శన హోమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

బ్రహ్మాండనాయకుని కోసం..





శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం అనంతరం అలంకరించేందుకు ప్రత్యేకంగా వివిధ రకాల కిరీటాలు, మాలలు సిద్ధం చేశారు. ఈ ఏడాది తొలిసారిగా కివీ, పైనాపిల్ పండ్లతో తయారు చేసిన కిరీటాలు, మాలలు ఆకట్టుకుంటున్నాయి.

విద్యా సమాచారం

అట్టహాసంగా ముగిసిన మోహన మంత్ర



చంద్రగిరి: శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థలో మూడు రోజులుగా జరుగుతున్న మోహన మంత్ర-2023 కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా ముగిసింది. హర్రర్ హౌస్ విద్యార్థులను ఎంతో ఆకట్టుకుంది. అందులోని విద్యార్థులు వేసిన వేషాలు పిల్లలను భయభ్రాంతులకు గురిచేసింది. టాయ్స్ మాస్క్ సెల్ఫీ, బెలూన్ స్మాష్, ఫొటో ఫ్రేమ్‌లకు ఫోజులిస్తూ విద్యార్థులు కేరింతలు కొట్టారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసిన విద్యార్థులకు మోహన మంత్ర కో-ఆర్డినేటర్ దేవరాజులు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తులకు గడువు పెంపు

తిరుపతి అర్బన్: టూరిజం విభాగం వారు నిర్వహిస్తున్న పోటీలకు సంబంధించి ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 30వ తేదీ వరకు గడువు ఇచ్చామని చెప్పారు. అయితే అందరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నెల 25వ తేదీ వరకు పెంచామని వెల్లడించారు. వీడియోలు లేదా రీల్స్‌ను edtpt@aptdc.in లేదా collector.tirupati@ap.gov.in మెయిల్‌కు ఈనెల 24వ తేదీ లోపు పంపాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 63099 42027, 98488 23086, 97059 33311 ను సంప్రదించగలరని కోరారు.

టీటీడీ డిగ్రీ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల (అటానమస్), శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల (అటానమస్), శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల(అటానమస్), ఎస్వీ ప్రాచ్య(ఓరియంటల్) కళాశాల, ఎస్వీ సంగీత నృత్య కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు టీటీడీ జేఈవో గౌతమి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం విద్యార్థులు అక్టోబరు 7 నుంచి 9వ తేదీ వరకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఆయా కళాశాలల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని కోరారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన వారికి హాస్టల్ వసతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఉండవని తెలిపారు.



వరదలో మునిగిన ఆటోలు (ఫైల్)

‘ఆటో’ బతుకులు అస్తవ్యస్థం

బుడమేరు వరదల వల్ల నీట మునిగిన 15 వేలకుపైగా ఆటోలు

ప్రభుత్వ రికార్డుల ప్రకారం కేవలం 4,348 ఆటోలకే పరిహారం

- చాలా మంది పేర్లు బాధితుల జాబితాలోనే లేవు.. ఉన్నా కొందరికి డబ్బులు పడలేదు
- సమయం పడుతుందని చెప్పి తప్పించుకుంటున్న బీమా సంస్థలు
- రెండు వారాల్లోనే క్లెయిమ్‌లు పూర్తి చేసేలా బీమా సంస్థలతో మాట్లాడామంటున్న ప్రభుత్వం
- ఒక్కో ఆటో మరమ్మతులకే రూ.12 వేల నుంచి రూ.75 వేల వరకూ వ్యయం
- రోజుల తరబడి మెకానిక్ షెడ్ల వద్దే పడి ఉండటంలో ఆటో డ్రైవర్లకు పోయిన ఉపాధి
- ఆదుకుంటామన్న ప్రభుత్వం నిలువునా ముంచేసిందంటున్న బాధితులు
- బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ‘సాక్షి’ గ్రౌండ్ రిపోర్ట్



సాక్షి, అమరావతి: ‘‘ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆటో డ్రైవర్ పేరు కె.శివారెడ్డి. ఊర్మిళనగర్ రెండో లైనులో అద్దె ఇంటిలో నివసిస్తున్నాడు. ఇటీవల వచ్చిన బుడమేరు వరదలకు ఆ ఇల్లు మునిగిపోయింది. జీవనాధారమైన ఆటోతో పాటు ద్విచక్రవాహనం పూర్తిగా పాడైపోయాయి. సచివాలయ సిబ్బంది వచ్చి వివరాలు నమోదు చేసుకుని వెళ్లారు. కానీ ఇంత వరకూ ఒక్క రూపాయి కూడా పరిహారం రాలేదు. అప్పు చేసి ఆటోకు మరమ్మతులు చేయించుకుంటే రూ.45 వేలు ఖర్చయింది. ఇంటికిగానీ, వాహనాలకు గానీ పరిహారం ఇప్పించాలంటూ కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నాడు. పదహారేళ్లుగా ఇదే ప్రాంతంలో ఆటో నడుపుతున్న నా పేరు ఎందుకు జాబితాలో లేదని ఎవరిని అడిగినా సమాధానం చెప్పడంలేదని వాపోతున్నాడు.’’...ఇది బుడమేరు వరదల్లో ఆటోలను కోల్పోయిన వేలాది మంది డ్రైవర్ల ఆవేదన. నగరంలో తిరిగే ఆటోలలో అత్యధికం సింగ్ నగర్, ఇందిరానాయక్ నగర్, పాయకాపురం, కండ్రిగ, వాంబేకాలనీ, మిల్క్ ప్రాజెక్ట్, డాబా కోట్లు సెంటర్, రాజరాజేశ్వరిపేట, నందమూరి కాలనీ, భరతమాత కాలనీ, ఊర్మిళనగర్‌ల నుంచే వస్తున్నాయి. అక్కడి నిరుద్యోగులు డ్రైవర్లుగా మారి జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు వారందరి జీవితాలు అస్తవ్యస్తంగా మారాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో పర్యటించి బాధితుల బతుకు చిత్రంపై సాక్షి గ్రౌండ్ రిపోర్ట్ ఇది.

మరమ్మతులకు కొత్త అప్పులు

రోజుల తరబడి ముంపులోనే ఉండటంతో ఆటోలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బయట మెకానిక్ దగ్గర నుంచి కంపెనీ షోరూమ్ వరకూ ఒక్కో దాని మరమ్మతులకే రూ.12 వేల నుంచి రూ.75 వేల వరకూ వ్యయం అవుతోంది. రేడియేటర్, ఇంజిన్, బ్యాటరీతో పాటు బీఎస్ 6 వాహనాల్లో సెన్సార్లు పాడవ్వడంతో ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇన్ని వాహనాలకు మరమ్మతులు చేసేందుకు మెకానిక్‌ల కొరత ఉండటంతో రోజుల తరబడి మోటార్ షెడ్ల వద్దే ఆటోలు పడి ఉంటున్నాయి. ఒకసారి మరమ్మతు చేసినా మళ్లీ మళ్లీ కొత్త లోపాలు బయటపడుతున్నాయి. దీంతో కొత్త అప్పులు చేసి మరమ్మతులకు వెచ్చిస్తున్నారు. ఉపాధి లేక, కుటుంబాలను పోషించుకోలేక, వాయిదాలు కట్టలేక అవస్థలు పడుతున్నామని డ్రైవర్లు నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. ఓట్లేయించుకున్న రాష్ట్ర ప్రభుత్వంగానీ, స్థానిక ప్రజాప్రతినిధులుగానీ తమను అసలు పట్టించుకోవడం లేదని కన్నీరు మున్నీరవుతున్నారు.



ఆటోకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్ (ఫైల్)

బీమా సంస్థల కొర్రీలు

వరద నీటిలో మునిగిన ఆటోలకు క్లెయిమ్‌లు ఎగవేసేందుకు బీమా సంస్థలు ఉన్న అన్ని అవకాశాలనూ వాడుకుంటున్నాయి. బీమా చేసే సమయంలో డ్రైవర్ల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారికి తెలియని షరతులను పొందుపరిచి వాటిని ఇప్పుడు సాకుగా చూపిస్తున్నాయి. ఒక ఆటోకి బీమా రావాలంటే సుమారు రెండు నెలలు సమయం పడుతుందని తప్పించుకుంటున్నాయి. అదికూడా వరద వచ్చినప్పటి నుంచి ప్రతి దశలోనూ తీసిన ఫొటోలు, వీడియోలు ఉంటేనే బీమా వర్తిస్తుందని మెలికపెడుతున్నాయి. ప్రాణాలే కాపాడుకుంటామా, ఫొటోలు తీస్తామా అంటూ బాధితులు అడుగుతుంటే బీమా సంస్థలు సమాధానం చెప్పడం లేదు. రెండు వారాల్లోనే క్లెయిమ్‌లు పూర్తి చేసేలా బీమా సంస్థలతో మాట్లాడామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. ఆచరణలో మాత్రం అది శూన్యం. బీమా సంస్థలు కనీసం 45 రోజుల పాటు ఆటోను ఉన్న చోటు నుంచి కదపకుండా ఉంచాలని చెప్పాయి. అప్పటి వరకూ మరమ్మతు చేయకపోతే మొత్తానికే పనికిరాదని, ప్రభుత్వం ఈ విషయంలో పట్టించుకోవడం లేదని డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు.

ఎవరూ పట్టించుకోవట్లేదు



‘‘వరదల్లో ఇల్లు మునిగిపోయింది. ఆటో బాగా దెబ్బతింది. ప్రస్తుతానికి నడిచేలా చేయడానికి రూ.8 వేలు ఖర్చయ్యింది. ప్రభుత్వం రూ.10 వేల ఇస్తామని చెప్పింది. కానీ మా వివరాలను నమోదు చేయడానికి కూడా ఎవరూ రాలేదు. సచివాలయంలో అడిగితే కలెక్టరేట్‌కు వెళ్లమని చెప్పారు. అక్కడికి వెళితే ఎవరూ పట్టించుకోవడం లేదు.’’

–లింగయ్య, ఆటో డ్రైవర్, రాజీవ్‌నగర్ కాలనీ.

జీవనాధారం పోతే పరిహారం రాదా?



‘‘ఆటో నడిపితేగానీ మా కుటుంబం నడవదు. వరదల వల్ల ఆటో మునిగిపోయి జీవనాధారాన్ని కోల్పోయాం. బీమా రావాలంటే 45 రోజులు ఆటోను వాడకూడదంటున్నారు. బాగు చేయించుకునే స్తోమత కూడా లేదు. అయినా జాబితాలో మా పేరు లేదంటున్నారు. సచివాలయానికి వెళ్లి అడిగితే తమకేమీ తెలియదని చెబుతున్నారు. మా గోడును ఎవరికి చెప్పుకోవాలి. మమ్మల్ని ఆదుకునేవారెవరు.’’

–బాబ్జి, ఆటో డ్రైవర్, రాజరాజేశ్వరిపేట.

అద్దె ఆటోనే ఆధారం



‘‘నేను ఆటోను అద్దెకు తీసుకుని నడుపుతున్నాను. వరదకు ఆటో మునిగిపోయింది. ఎలాంటి పరిహారం రాలేదు. ఎవరిని అడిగినా ఎలాంటి ఉపయోగం లేదు.ఏం చేయాలో తెలియడం లేదు.’’

–దుర్గారావు, ఆటో డ్రైవర్, వాంబేకాలనీ.

చాలా ఖర్చవుతోంది



‘‘ఇంటర్ చదివి ఆటో నడుపుతున్నాను. మా నాన్న కూడా ఆటో డ్రైవరే. రెండు ఆటోలూ వరదలో మునిగిపోయాయి.ఒక సారి రిపేరుకి రూ.12 వేలు ఖర్చయ్యింది. కానీ మళ్లీ రేడియేటర్ పాడయ్యింది. నాలుగు రోజులుగా మెకానిక్ దగ్గరే పెట్టి బాగుచేయిస్తున్నాం.’’

–వై.సాయి, ఆటో డ్రైవర్, పాయకాపురం.

పరిహారం లేదు

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సెప్టెంబర్ 1న విజయవాడలో వరద విలయం సృష్టించింది. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. వారి జీవనాధారాలైన ఆటోలు, మోటార్ సైకిళ్లు వరద నీటిలో పూర్తిగా మునిపోయాయి. రోజుల తరబడి బురద నీటిలోనే నానిపోవడంతో ఇంజిన్, సెన్సార్లు, కార్బొరేటర్ వంటి ముఖ్యమైన భాగాలు దెబ్బతిన్నాయి. ఆటోకి రూ.10 వేలు, ద్విచక్ర వాహనానికి రూ.3 వేలు చొప్పున పరిహారం ఇస్తామన్న ప్రభుత్వం రకరకాల కొర్రీలతో మూడొంతుల మందిని మోసం చేసింది. ఆటో నడిపితేగానీ పూటగడవని నిరుపేదలు వాటిని బాగు చేసుకోలేక, కుటుంబాన్ని పోషించుకోలేక ప్రభుత్వ కార్యాలయాలు,అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. బుడమేరు వరదల వల్ల దాదాపు 15 వేలకుపైగా ఆటోలు నీట మునిగితే ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం కేవలం 6,515 మాత్రమే ఉన్నట్టు రవాణా శాఖ అధికారులు వెల్లడించారు. వీటిలో 4,348 ఆటోలకు పరిహారం అందించినట్లు ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేశారు. కానీ వాస్తవానికి మొత్తం బాధితుల్లో దాదాపు 80 శాతం మంది ఆటోవాలాలకు నష్టం పరిహారం అందలేదని బాధితులు చెబుతున్నారు. చాలా మంది పేర్లు బాధితుల జాబితాలోనే లేవు.. కొందరి పేర్లు ఉన్నా వారికి డబ్బులు పడలేదు.

చంద్రబాబువి ఊసరవెల్లి రాజకీయాలు

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి ధ్వజం



సాక్షి,అమరావతి: దేశంలో చంద్రబాబు అంత ఊసరవెల్లి రాజకీయాలు ఎవ్వరూ చేయరని..టీడీపీ అంత దుర్మార్గమైన పార్టీ మరొకటి ఉండదని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభలో పార్టీ నేత విజయసాయిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ప్రజా సమస్యలను పూర్తిగా వదిలేసిన కూటమి ప్రభుత్వం, రాష్ట్రాన్ని ఏ దిశలో నడుపుతుందో తెలియడం లేదన్నారు. 100 రోజుల పాలనలో అన్నింటా విఫలమైన ప్రభుత్వం, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ, తిరుమల లడ్డూల్లో కల్తీ నెయ్యి వాడారని దుష్ప్రచారం చేస్తోందని ఆక్షేపించారు. కల్తీనెయ్యి ఆరోపణల వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు కానున్న ‘సిట్’ నిష్పాక్షిక విచారణ చేసి నిజాలను నిగ్గు తేల్చాలని కోరారు. రాష్ట్రంలో తీవ్ర ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక అల్లాడుతున్నారని ఆవేదన చెందారు. నిత్యావసరాల ధరలు మండుతున్నాయని, కిలో ఉల్లి రైతు బజారులో రూ.60కి పైనే ఉండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.75కు పైగా పలుకుతోందని, 25 కేజీల బియ్యం ధర రూ.150 నుంచి రూ.200 వరకు పెరిగిందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఇలా నిత్యావసరాల ధరలు పెరిగితే, ధరల స్థిరీకరణ నిధి నుంచి ఖర్చు చేసి తక్కువ ధరకు వినియోగదారులకు అందించామని గుర్తు చేశారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ అని చెప్పుకొంటున్నారు కానీ, ఆడపిల్లల ప్రాణాలకు గ్యారెంటీ లేదని పేర్కొన్నారు.

కేంద్రం దృష్టికి స్టీల్‌ప్లాంట్ సమస్యలు

కార్మిక సంఘాల ప్రతినిధులతో పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి: విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు కార్మికులు, ఉద్యోగులు, భూనిర్వాసితులు తెలియజేసిన అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మిక, ఉక్కు పరిరక్షణ సంఘాల ప్రతినిధులు ఆదివారం మంగళగిరిలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో పవన్‌కళ్యాణ్‌తో సమావేశమయ్యారు. ‘విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయాలనే ప్రతిపాదన రాగా.. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడాం. స్టీల్‌ప్లాంట్ వద్ద సభ నిర్వహించి ఉద్యోగ, కార్మిక సంఘాలన్నీ ఒక తాటిపైకి వచ్చి అఖిలపక్షంతో కేంద్రానికి విజ్ఞాపన ఇద్దామని చెబితే ఎవరూ ముందుకు రాలేదు. ఆ రోజే అందరూ కలసి వచ్చి ఉంటే ఇప్పుడు ఇంత ఆందోళన చెందాల్సిన అవసరం ఉండేది కాదు. మీ ఆందోళనను కేంద్ర ప్రభుత్వానికి తెలియచేస్తామ’ని పవన్ వారితో చెప్పారు.

వరదలకు నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలి

సాక్షి, అమరావతి: బుడమేరు, కృష్ణా వరదల కారణంగా నష్టపోయిన రైతులు, కౌలురైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని ఏపీ కౌలు రైతుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకూ బాధితులకు నష్టపరిహారం అందలేదని, నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలని, రూ.2లక్షల వరకు రుణాలు రీ షెడ్యూల్ చేయాలని, కొత్తగా పంట రుణాలివ్వాలని కోరారు.

విద్యారంగం తిరోగమనం

- ఏఐఎఫ్‌ఆర్‌టీఈ చైర్మన్ ప్రొఫెసర్ జగ్‌మోహన్ సింగ్




విజయనగరం అర్బన్ : దేశంలో, రాష్ట్రంలో విద్యారంగంలో ప్రవేశపెడుతున్న సంస్కరణలు తిరోగమనం చెందేలా ఉన్నాయని అఖిల భారత విద్యా హక్కు వేదిక (ఏఐఎఫ్‌ఆర్‌టీఈ) చైర్మన్, ప్రొఫెసర్ జగ్‌మోహన్ సింగ్ పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభల్లో భాగంగా తొలిరోజు ప్రారంభోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యారంగంలో సంస్కరణలు పురోగమించాలని సూచించారు. దురదృష్టవశత్తూ ప్రస్తుతం తిరోగమనంలో పయనించేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు ఈ విషయాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, ఎమ్మెల్యే పూసపాటి అతిథి విజయలక్ష్మి గజపతి రాజు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు తదితరులు పాల్గొన్నారు.

లడ్డూలకు ఆధార్ స్కానింగ్ విధానం

తిరుమల : ఆధార్‌కార్డుతో శ్రీవారి భక్తులకు ఇకపై సులభంగా, వేగంగా లడ్డూలను అందించేందుకు టీటీడీ అధికారులు చర్యలు చేపట్టారు. శ్రీవారి దర్శన టికెట్లు లేని భక్తులకు ప్రస్తుతం ఆధార్‌కార్డుకు రెండు లడ్డూలను పంపిణీ చేస్తున్నారు. భక్తుడు తన ఆధార్‌కార్డు లడ్డూకౌంటర్లో ఇస్తే దానిపై ఉన్న పేరు, నంబర్‌ను కంప్యూటర్లో నమోదుచేసుకుని లడ్డూలను ఇచ్చేవారు. దీంతో ఎక్కువ సమయం భక్తుడు క్యూలో వేచి ఉండాల్సి వచ్చేది. దీంతో టీటీడీ ఆధార్‌కార్డు స్కాన్ చేసేవిధంగా ఆధునాతన స్కానర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్కానర్ ముందు ఆధార్‌కార్డు ఉంచగానే ఆధార్‌లోని వ్యక్తి పూర్తి వివరాలు ప్రత్యక్షమవుతాయి. దీంతో త్వరగా లడ్డూలను అందించేందుకు వీలుపడుతుంది.


సాక్షి ప్లస్
సోమవారం ॥ 7-10-2024

ట్రావెల్ ఆర్ట్ & కల్చర్



ఎల్లోరా గుహలు గురించి చాలామంది ఎన్నోసార్లు విని ఉంటారు, ఒకటి - రెండు సార్లయినా చూసి ఉంటారు కూడా. ఆ గుహల్లో ఒక శిలాగ్రంథం ఉంది. ఇది శివుడికి అంకితం చేసిన కైలాస్‌నాథ్ ఆలయం. కానీ రామాయణ, మహాభారత గ్రంథాలకు శిల్పరూపం ఈ ఆలయం. ఎల్లోరా గుహల్లో చెక్కిన ఏకరాతి ఆలయమే ఈ కైలాసనాథ్ ఆలయం.





కైలాస్‌నాథ్... చరణాద్రి శిఖరం

నంబర్ 16... కట్టిపడేసే గుహ


ఎల్లోరా గుహలను ఏ కొండల్లో చెక్కారు? సమాధానం కొంచెం కష్టమే. ఎందుకంటే అవి మనకు ఎల్లోరా గుహలుగానే తెలుసు. ఆ గుహలను చరణాద్రి కొండల్లో చెక్కారు. సహ్యాద్రి శ్రేణుల్లో ఒక భాగం చరణాద్రి కొండలు. మహారాష్ట్ర, ఔరంగాబాద్ జిల్లాలో ఉన్నాయి. ఎల్లోరా గుహలనగానే బౌద్ధ చైత్య, విహారాలే గుర్తొస్తాయి. కానీ ఈ గుహలు బౌద్ధ, హిందూ, జైన మతాల విశ్వాసాలకు ప్రతీకలు. ఒకటి నుంచి పన్నెండు వరకు బౌద్ధ గుహలు, 13 నుంచి 29 వరకు హిందూ గుహలు, 30 నుంచి వరకు 34 జైన గుహలు. కైలాస్‌నాథ్ ఆలయం 16వ గుహలో ఉంది. ఇవన్నీ ఏకకాలంలో చెక్కినవి కాదు. ఎల్లోరా గుహలు వందకు పైగా ఉన్నాయి. కానీ పర్యాటకులకు అనుమతి 34 వరకే. ఇవన్నీ ఒకేసారి చెక్కినవి కాదు. 8, 9,10 శతాబ్దాల్లో చెక్కిన గుహలు. కైలాస్‌నాథ్ గుహాలయాన్ని మాత్రం రాష్ట్రకూట రాజు మొదటి కృష్ణుని కాలంలో క్రీ.శ 756 – 773 మధ్యకాలంలో చెక్కారు. రాజు తీవ్రమైన అస్వస్థతకు గురైనప్పుడు రాణి ఆయన ఆరోగ్యం కోసం శివుడిని ప్రార్థించిందని, కైలాసాన్ని పోలిన ఆలయాన్ని నిర్మిస్తానని మొక్కిందని చెబుతారు. రాజు ఆరోగ్యవంతుడైన తర్వాత కోకస శిల్పి పర్యవేక్షణలో కైలాస్‌నాథ్ ఆలయం రూపుదిద్దుకుంది. ఎల్లోరా పర్యాటకులు 33 గుహలకు కేటాయించినంత సమయం 16వ గుహలో గడుపుతారు. ఉత్తరాది ఆలయాలను చూసిన కళ్లకు ద్రవిడ శైలిలో చెక్కిన ఈ ఆలయం కనువిందు చేస్తుంది.


గ్రంథాలకు శిల్పరూపం

ప్రత్యేకించి ఈ ఆలయం పొడవు 164 అడుగులు, వెడల్పు 109 అడుగులు, ఎత్తు 98 అడుగులు. ఏకరాతి ఆలయం అంటే చిన్నదో లేదా ఒక మోస్తరు ఆలయమో అనుకుంటాం. కానీ ఈ ఆలయాన్ని పూర్తిగా శిల్పసౌందర్యాన్ని ఆస్వాదిస్తూ తిలకించడానికి మూడు గంటలు కేటాయించాలి. భారతీయ శిల్పచాతుర్యానికి గీటురాయి ఇది. ఆలయం రథం ఆకారంలో ఉంటుంది. ఒక్కో పార్శ్వంలో ఒక్కో పౌరాణిక గ్రంథాన్ని చూడవచ్చు. 14 కాండల రామాయణం ఒక గోడలో, 18 పర్వాల మహాభారతం మరో గోడలో శిల్పాల రూపంలో ఒదిగిపోయాయి. ఇన్ని ప్రత్యేకతలున్నప్పుడు యునెస్కో గుర్తించకుండా ఉంటుందా? ఎల్లోరాను 1983లోనే గుర్తించింది.









ఈ సెలవుల్లో వెళ్లాలి!

శిరిడీ, ఔరంగాబాద్, అజంతా, ఎల్లోరాలు సాధారణంగా వేసవి సెలవుల టూర్ ప్లాన్‌లో ఉంటాయి. కానీ వేసవిలో గుహల్లో పర్యటన కష్టం. గుహలోపల ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నప్పటికీ బయటకు రాగానే భరించలేనంత వేడితో సతమతమవుతాం. కాబట్టి దక్కనులో గుహల పర్యటనకు ఈ సీజన్ బాగుంటుంది.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

హవామహల్

పింక్‌సిటీలో విరిసిన కలువ



హవామహల్... పగడాన్ని కిరీటంలా చెక్కినట్లు కనిపిస్తుంది. ఎరుపు, గులాబీరంగుల సాండ్‌స్టోన్‌తో నిర్మించిన ఈ మహల్ మీద తెల్లటి ముగ్గుతో అందంగా చిత్రించిన కలువలు, పూల కుండీలు, వినాయకుడి బొమ్మలు, చిన్న చుక్కల ముగ్గులతో ముచ్చటగా ఉంటుంది. రాజ్‌పుత్ – ఇస్లామిక్ ఆర్కిటెక్చర్‌ల సమ్మేళనం. ప్యాలెస్‌లోకి వెళ్లే గాలిని చల్లబరిచే 953 ఝరోకాలు, లోపలి గదుల్లో గదికో రంగు మార్బుల్ స్టోన్‌లతో అడుగడుగునా ఆశ్చర్యం కలిగించే ఈ మహల్‌ను కట్టించిన రాజ్‌పుత్ రాజు ఎవరనే ప్రశ్నకంటే ముందు ఇంత అద్భుతమైన నిర్మాణానికి రూపశిల్పి ఎవరనే ప్రశ్న తలెత్తుతుంది. ఆ శిల్పి పేరు లాల్ చంద్ ఉస్తాద్. మహారాజా సవాయ్ ప్రతాప్‌సింగ్ కోరిక మేరకు ఈ డిజైన్‌ను రూపొందించాడు. ఇంతకీ ఇంత గొప్ప నిర్మాణాన్ని మరీ రోడ్డు మీదకు ఎందుకు నిర్మించారనే సందేహమూ కలుగుతుంది. రాణివాస మహిళలు నగరంలో జరిగే వేడుకలను వీక్షించడం కోసం చేసిన ఏర్పాటు ఇది. ప్యాలెస్ లోపల వాటర్ ఫౌంటెయిన్ 18వ శతాబ్దంలో నిర్మించిన నాటి నుంచి ఇప్పటికీ పని చేస్తోంది. హవామహల్ తర్వాత జైపూర్‌లో చూడాల్సిన ప్యాలెస్‌లు చాలా ఉన్నాయి. సిటీ ప్యాలెస్, జంతర్‌మంతర్, ఆల్బర్ట్ హాల్, బిర్లామందిర్‌లతోపాటు అమేర్‌ఫోర్ట్ కూడా చూడాలి. ఇక్కడున్న జంతర్‌మంతర్ ఢిల్లీలోని జంతర్‌మంతర్‌కంటే పెద్దది. రాజస్థాన్ టూర్‌కి ఎండాకాలం కష్టం. శీతాకాలం గడ్డకట్టే చలి. అక్టోబర్ నెలలో వాతావరణం వేడి తగ్గుతూ చల్లగాలులకు స్వాగతం పలుకుతుంటుంది. రంగురంగుల రాళ్లను పూసలుగా చేసి, ఆ పూసలతో అల్లిన హారాలకు జైపూర్ ఫేమస్. జాతిరాళ్లకంటే తక్కువ గ్రేడ్ రాళ్లు ఉంటాయి. అలాగే నకిలీ పూసలను రాళ్ల దండలని నమ్మించే ప్రయత్నమూ జరుగుతుంది. కాబట్టి ప్రభుత్వ అధీకృత డీలర్‌ల దగ్గర కొనడం మంచిది. జైపూర్ టూర్‌లో హాట్ ఎయిర్ బెలూన్‌లో విహారాన్ని మిస్ కావద్దు.





ఆర్ట్

జెండర్, లైంగిక సమస్యల పరిష్కారంలో థియేటర్ రోల్



వర్గం, మతం, జెండర్, లైంగిక సమస్యలను పరిష్కార దిశగా న్యూ ఢిల్లీలోని కిరణ్ నాడార్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్ థియేటర్‌లో జరిగిన ఫెస్టివల్ నటీనటుల పెర్ఫార్మెన్స్‌ను సరికొత్తగా చూపింది. లైంగికతతో పాటు సామాజిక దుర్బలత్వాలను పరిష్కరించడంలో ఈ సమకాలీన థియేటర్ దృష్టి పెడుతుంది.

ఫెస్టివల్ క్యూరేటర్‌గా ఉన్న బెంగళూరుకు చెందిన నటుడు, దర్శకుడు, చిత్రనిర్మాత కీర్తన కుమార్ కొత్త విషయాలను అన్వేషించే నాటకాలను ఒకచోట చేర్చాలని కోరుకున్నారు. అలాగే ‘ఈ రోజుల్లో కళాకారులు ఎలాంటి నాటకాలు వేస్తున్నారు’ అనే అంశం గురించి సంభాషణలను ప్రోత్సహించారు. ‘ఈసారి దృష్టి సమకాలీన థియేటర్‌పై ఉంది. ఎందుకంటే కళాకారులు ఏం చెబుతున్నారో తెలుసుకోవాలనే ఆసక్తితో పాటు వారు ఏ రంగస్థల రూపాలు, భాషలను అన్వేషిస్తున్నారు, ఏ సమస్యలు వారిని ఉత్తేజపరుస్తాయి, ఎలా సృష్టిస్తారు, డబ్బు సమస్యలేంటి, వారి ప్రేరణ ఏమిటి, ఏం వ్యక్తం చేయాలనుకుంటున్నారు...అనేవి ఈ విధానం ద్వారా తెలుస్తుంది. అంతేకాదు జాతీయ దృష్టిని ఆకర్షించని కళాకారుల నాటకాలు, వారి ఆలోచనలు, రూపాలను ఆహ్వానించాలనుకుంటున్నాను’అని కీర్తన కుమార్ చెప్పింది.

ఇతిహాసాల నుంచి...

మైసూరు ప్రాంతాలకు సమీపంలో ఉన్న మలే మహదేశ్వర కొండల లోని హాలు కురుబా కమ్యూనిటీ పురుషలతో అనుబంధించబడిన బీసు కంసలే అనే విన్యాస జానపద రూపంతో ఈ పండుగ ప్రారంభమైంది. దీని తర్వాత కటకథ పప్పెట్ ఆర్ట్స్ ట్రస్ట్ సమర్పించిన ది నైట్స్, అరేబియన్ నైట్స్ సిరియన్, చైనీస్, ఇండియన్ వెర్షన్‌లకు తోలుబొమ్మల గౌరవం, కీటకాలతో నిండిన అద్భుత ప్రపంచంలోకి ప్రేక్షకులను స్వాగతించింది. ఇంకా, రామాయణంలోని అరణ్యకాండ నుండి తీసుకున్న అడవిలో నివసించే సోదరులు, వాలి మరియు సుగ్రీవుల కథను పరిచయం చేసింది.





మోహిత్ తకల్కర్ రాసిన ‘లవ్ అండ్ ఇన్ఫర్మేషన్ ఛానల్-హాపింగ్ / సోషల్ మీడియా స్క్రోలింగ్’ వేగాన్ని ప్రతిబింబిస్తుంది. అభి తాంబే ద్వారా పోర్టల్ పెయింటింగ్, థియేటర్‌లో రాక్ షో అనుభవం మనల్ని సమ్మోహితులను చేస్తాయి. నిషా అబ్దుల్లా సోలో ప్రదర్శన. ఇది పోగొట్టుకున్న, శాశ్వతమైన స్నేహాల గురించి మాట్లాడటానికి పాట, కథ, పురాణం, చరిత్రను కలిపి అల్లినది.

మైసూర్

దసరాకి ప్యాలెస్ పిలుస్తోంది!



మైసూర్ అంటేనే దసరా ఉత్సవాలు. దసరా అంటేనే మైసూర్‌లో జరిగే ఉత్సవాలు. ఇదీ ఒక్కమాటలో చెప్పాలంటే మైసూర్ టూర్. వడయార్ రాజకుటుంబీకులు మైసూర్ ప్యాలెస్‌లో సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహిస్తారు. దసరా ఉత్సవాల సందర్భంగా పబ్లిక్‌ను ప్యాలెస్‌లోకి అనుమతిస్తారు. ప్యాలెస్ లోపల వడయార్ కుటుంబీకులు ఉపయోగించిన వస్తువులు, నాటి హస్తకళాఖండాలుంటాయి. దర్బార్ హాల్‌లో బంగారు సింహాసనాన్ని చూడవచ్చు. రోజుల్లో అందంగా అలంకరించిన ఏనుగులు ఈ వేడుకలో ప్రత్యేకాకర్షణ. పది రోజుల పాటు ప్యాలెస్ ఆవరణలో సంగీత, నాట్య ప్రదర్శనలు జరుగుతుంటాయి. మైసూర్ ప్యాలెస్‌ని చూసిన తర్వాత కరంజి లేక్‌లో బోట్ షికారు చేసి, వన్యప్రాణుల మధ్య విహరించాలి. జయచామరేంద్ర ఆర్ట్ గ్యాలరీ, ఫిలోమినా చర్చ్ కోసం కూడా కొంత టైమ్ కేటాయించుకోవాలి. ఇక మైసూరు వంటలను రుచి చూడడంతోపాటు మైసూర్ సిల్క్ చీరలను కొనడంతో ట్రిప్ పరిపూర్ణమవుతుంది. పిల్లలతో వెళ్లిన వాళ్లు తప్పకుండా రైల్ మ్యూజియాన్ని కవర్ చేయాలి.



ఉదయాన్నే చూడాలి!

మైసూర్ ప్యాలెస్ లోకి పదిగంటలకు పర్యాటకులను అనుమతిస్తారు. ఆ సమయానికి పది నిమిషాల ముందే చేరినట్లయితే జనం తక్కువగా ఉంటారు. పదిన్నర తర్వాత ప్రతి అరగంటకు జనసమ్మర్దం గణనీయంగా పెరుగుతుంది. తొమ్మిదింటికే చేరగలిగితే సూర్యకిరణాలకు మెరిసే ప్యాలెస్ సౌందర్యాన్ని కూడా వీక్షించవచ్చు
- ప్యాలెస్ లోపల ఫొటోలు తీసుకోవడానికి అనుమతి ఉండదు. కెమెరాకు టికెట్ తీసుకున్నప్పటికీ కొన్నిచోట్ల మాత్రమే అనుమతిస్తారు
- పర్యాటకుల వస్త్రధారణ ప్యాలెస్ నియమాలకు లోబడి ఉండాలి. దుస్తులు భుజాలను కవర్ చేస్తూ, మోకాళ్ల కింద వరకు ఉండాలి
- ప్యాలెస్ లోపల కొన్ని చోట్లకు పాదరక్షలను అనుమతించరు. ఈ కాలం నేల చల్లగా ఉంటుంది. కాబట్టి పిల్లలకు సాక్స్ వేయడం మంచిది
- పెద్దవాళ్లు ప్యాలెస్ మొత్తం నడుస్తూ చూడడం కష్టమే. సిద్ధంగా ఉంచిన వీల్ చైర్‌లను వాడుకోవచ్చు.
- గైడ్ చెప్పే ఆసక్తికరమైన, హాస్యపూరితమైన కథనాలను ఎంజాయ్ చేయవచ్చు
- ఆడియో గైడ్ సౌకర్యం ఉంది. దానికి చార్జ్ ఎక్కువనిపించినప్పటికీ తప్పకుండా ఆడియోలో ప్యాలెస్ గురించిన వివరాలను వింటూ తిలకించాలి
- రాత్రి లైట్ షో కూడా చూడాలి. ఆ షోకు కూడా ముందుగా వెళ్తే షో బాగా కనిపించే సీట్‌లో కూర్చోవచ్చు.



• బతుకమ్మ దశ దిశలా చాటే సంస్కృతి

చేతల్లోనూ, గొంతుల్లోనూ, ఊరువాడల్లోనూ విరాజిల్లుతూ వర్ధిల్లే బతుకమ్మ ఏనాడు పుట్టిందో, ఏనాడు పెరిగిందో నేటికీ తెలంగాణను ఒక్కతాటి మీదుగా నిలుపుతోంది. జాతి వైభవాన్ని చాటుతోంది.

శీతాకాలం ప్రారంభానికి ముందు వర్షాకాలం చివరి భాగంలో (ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుంచి తొమ్మిది రోజులు) జరిగే వేడుక బతుకమ్మ. రుతుపవనాల వర్షాలు మంచినీటి చెరువులలోకి పుష్కలంగా నీటిని తెస్తాయి. తెలంగాణ ప్రాంతంలోని సాగు చేయని, బంజరు మైదానాలలో అడవి పువ్వులు వివిధ రంగులలో వికసించే సమయం కూడా ఇదే. వీటిలో అత్యధికంగా లభించేవి ‘గునుగు, తంగేడు పూలు.’ ఇక సీతజడ, బంతి, చెమంతి, గోరింట, గుమ్మడి, కట్లపూలు... పూల పేర్లు చెప్పుకుంటే పోవడం కన్నా అవన్నీ ఒక్క చోట చేర్చిన వారి శ్రమ, ఆ పూల అందం ఎంత చెప్పినా తనివి తీరదు. ప్రకృతి తన సౌందర్యాన్ని ఈ అనేక రకాల పువ్వుల రంగులతో తెలియజేస్తుంది. ఈ పూలన్నీ కలిస్తే ఉండే అందం స్త్రీలంతా ఒక్కచోట చేరి ఆట పాటలతో శక్తి స్వరూపిణిని కొలవడంలో, వారి పాటల్లో తెలుస్తుంటుంది.

స్వేచ్ఛకు ప్రతీక

దసరాకు ముందు వచ్చే ‘సద్దుల బతుకమ్మ’ కి ఆడబిడ్డలు అత్తవారింటి నుండి తల్లిగారింటికి తిరిగి వచ్చి, పువ్వుల రంగులను జరుపుకోవడానికి స్వేచ్ఛ, స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటారు. సద్దుల బతుకమ్మ రోజున ఇంటి పెద్దతో పాటు బతుకమ్మ ను అందంగా పేర్చడానికి ఆ ఇంట్లో అందరూ ఒక చోట కూర్చుంటారు. పువ్వులు వృత్తాకార వరుసలలో, రంగులలో ఇత్తడి ప్లేట్‌లో జాగ్రత్తగా వరుస తర్వాత వరుసలో అమర్చుతారు. సాయంత్రం సంప్రదాయ వేష ధారణలో తమ ప్రాంగణంలో అంతా చేరి, బతుకమ్మను ఉంచి, చుట్టుపక్కల మహిళలు పెద్ద వలయంలో గుమికూడుతారు. బతుకమ్మల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నట్టు తిరుగుతూ, పాటలు పాడటం మొదలు పెడతారు. ఐకమత్యం, ప్రేమ, సోదరీమణుల ఆనందానికి బతుకమ్మ ప్రతీక.

సామూహిక సందడి

బతుకమ్మ పాటలు పాడి, ఆడలు ఆడి, చివరకు వాటిని తలపై ఎత్తుకొని ఊరేగింపుగా



పెద్ద నీటి ప్రదేశానికి చేరుకుంటారు. బతుకమ్మలను నెమ్మదిగా ఆ నీటిలో వదులుతారు. చేసిన ప్రసాదాలను పంచుకుని, బతుకమ్మను కీర్తిస్తూ పాటలు పాడుతూ తిరిగి వస్తారు. కష్టం, సుఖం చెప్పుకోవడం, తీపిదనాన్ని పంచుకోవడం కూడా ఈ వేడుక మనసును తృప్తి పరుస్తుంది.

ఏమేమి పువ్వొప్పనే గౌరమ్మ
ఏమేమి కాయొప్పనే గౌరమ్మ
గుమ్మాడి పువ్వొప్పనే గౌరమ్మ
గుమ్మాడి కాయొప్పనే గౌరమ్మ
ఆట చిలుకాలారా.. పాట చిలుకాలారా
తారు గోరంటాలు.. ఎర్రొద్దురాక్షలు
పోను తంగేడుపూలు ...
రాను తంగేడుపూల
ఘనమైన పొన్నపూలే గౌరమ్మ....
దైవాన్ని కొలవడానికి
పూల సేకరణలోని శ్రమ...
పూల తేరును పేర్చడంలో కళ ..
పాట అల్లికలోని సొగసు..
తెలంగాణ సంస్కృతిక కళా వైభవాన్ని
దశదిశలా చాటుతోంది.

నీటి స్వచ్ఛత

బతుకమ్మ... భూమి, నీళ్లతో మానవుల మధ్య అంతర్గత సంబంధాన్ని చూపుతుంది. కొన్ని చోట్ల బతుకమ్మతో పాటు ‘బొడ్డెమ్మ’ (గౌరీ దేవిని మట్టితో తయారు చేస్తారు)ను చెరువులో నిమజ్జనం చేస్తారు. ఈ ప్రక్రియ చెరువులను బలోపేతం చేయడానికి, మరింత నీటిని నిలుపుకోవడానికి సహాయపడుతుంది. బతుకమ్మలో ఉపయోగించే పువ్వులు నీటిని శుద్ధి చేసే గొప్ప నాణ్యతను కలిగి ఉంటాయి. వ్యవసాయ నేపథ్యం ఉన్న స్త్రీలు ప్రకృతి సౌందర్యాన్ని పండగలా జరుపుకోవడం ద్వారా చెరువులను ఎలా మెరుగుపరచాలో అంతర్లీనంగా వారికి తెలుసు. ఈ పండుగ ప్రకృతి, ప్రజల సామూహిక, మహిళా జనాదరణ పొందిన స్ఫూర్తి. అలాగే ప్రకృతి వనరులను వేడుకగా సంరక్షించడంలో వ్యవసాయదారుల శాస్త్రీయ దృక్పథాన్ని తెలియజేస్తుంది. అందుకే బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక గుర్తింపుకు చిహ్నం.

మన దేశంలో...

- బతుకమ్మ వేడుకను దేశంలోని మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడులలో స్థిరపడిన తెలంగాణ వాళ్లు ఇప్పటికీ జరుపుకుంటున్నారు
- బతుకమ్మ పండగ వచ్చిందంటే బెంగళూరు, పుణె వీధుల్లోనూ ఊయ్యాల ఆట, పాటల కళ కనపడుతుంది. పూణెలో కూడా బతుకమ్మ పండగ సందడి జోరుగానే ఉంది
- ముంబైలో డీజే పాటల స్టెప్స్ వేస్తూ బతుకమ్మ ఆటలతో సందడి చేస్తుంటారు. భిన్న సంస్కృతుల ముంబై తెలంగాణ సంస్కృతినీ స్వీకరించింది.

విదేశాలలోనూ... నేపాల్, అమెరికా, సింగపూర్, కెనడాలో, న్యూజిలాండ్.. మొదలైన దేశాలలో ఉన్న తెలంగాణీయులు బతుకమ్మ సంస్కృతికి జీవం పోస్తున్నారు. తమ కమ్యూనిటీలో అందరినీ ఒక చోట చేర్చి, సంబరం జరుపుకుంటున్నారు. భావి తరాలకు బతుకమ్మను మరింత వైభవంగా అందిస్తున్నారు.





హెరిటేజ్

యునెస్కో జాబితాలో బీజింగ్ సెంట్రల్ యాక్సిస్



బీజింగ్ సెంట్రల్ యాక్సిస్ ను ఇటీవల యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చారు. ఈ ఐకానిక్ ఆర్కిటెక్చరల్ కట్టడం చైనా రాజధాని ఆదర్శ పట్టణ రూపకల్పనను ప్రతిబింబిస్తుంది. దాని మూలాలు 13వ శతాబ్దం నాటివి. చైనాలో సాంప్రదాయ పద్ధతిలో ఉత్తమంగా సంరక్షించబడిన వాటిలో సెంట్రల్ యాక్సిస్ ఒకటిగా నిలిచింది. శతాబ్దాల చరిత్రను నింపుకున్న ఈ కట్టడం ఎన్నో నాటి అద్భుతాలను ఇప్పటికీ కళ్లకు కడుతుంది.



వ్యాపారంలో విజయవంతం కావాలంటే..
మీ ధ్యాస, శ్వాస దానిపైనే కేంద్రీకరించాలి...
- థామస్ జే. వాట్సన్, ఐబీఎం మాజీ చైర్మన్, సీఈఓ

ఆర్‌బీఐవైపు ఇన్వెస్టర్ల చూపు

బుధవారం పరపతి సమీక్ష • యథాతథ పాలసీకి చాన్స్ • స్టాక్ మార్కెట్‌పై ప్రభావం • ఈ వారం ట్రెండ్‌పై అంచనాలు

ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లపై ప్రభావాన్ని చూపే అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఇప్పటికే వడ్డీ రేట్ల తగ్గింపు బాట పట్టింది. గత పాలసీ సమీక్షలో 0.5 శాతం వడ్డీ రేటును తగ్గించింది. ఈ ప్రభావం దేశీ కేంద్ర బ్యాంకు ఆర్‌బీఐపైనా ఉండవచ్చని బ్యాంకింగ్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశీ స్టాక్ మార్కెట్లు ప్రభావితంకానున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. వివరాలు చూద్దాం..

– సాక్షి, బిజినెస్ డెస్క్



దేశీ స్టాక్ మార్కెట్లు నేటి(7) నుంచి ప్రారంభం కానున్న రిజర్వ్ బ్యాంక్ పాలసీ సమీక్షా సమావేశాలపై దృష్టి పెట్టనున్నాయి. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన మానిటరీ పాలసీ కమిటీ(ఎంపీసీ) బుధవారం(9న) పరపతి నిర్ణయాలను తీసుకోనుంది. వెరసి ఈ వారం ఇన్వెస్టర్లు ఆర్‌బీఐ పాలసీ నిర్ణయాలపై అధికంగా దృష్టి సారించనున్నట్లు మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. గత నెల18న యూఎస్ ఫెడ్ నాలుగేళ్ల తదుపరి యూటర్న్ తీసుకుంటూ వడ్డీ రేట్లలో 0.5 శాతం కోత పెట్టింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు 4.75–5 శాతానికి దిగివచ్చాయి. ఫెడ్ పాలసీ నిర్ణయాల వివరాలు(మినిట్స్) బుధవారం వెల్లడికానున్నాయి. అయితే దేశీయంగా ద్రవ్యోల్బణ పరిస్థితులు, మధ్యప్రాచ్య అనిశ్చితులు వంటి అంశాల నేపథ్యంలో ఆర్‌బీఐ యథాతథ పాలసీ అమలుకే మొగ్గు చూపవచ్చని బ్యాంకింగ్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం దేశీయంగా వడ్డీ రేట్లకు కీలకమైన రెపో రేటు 6.5 శాతంగా అమలవుతోంది.

ఎఫ్‌పీఐల భారీ అమ్మకాలు

ఇటీవలి యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఉన్నట్టుండి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) అమ్మకాల బాట పట్టారు. దేశీ స్టాక్స్ నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకునేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో ఈ నెల(అక్టోబర్)లో భారీ గా అమ్మకాలకు తెరతీశారు. ఈ నెలలో తొలి మూడు(1–4 మధ్య) సెషన్లలోనే భారీగా రూ. 27,142 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. ఇందుకు ముడిచమురు ధరలు జోరందుకోవడం, చైనాలో సహాయక ప్యాకేజీల ప్రకటనలు సైతం ప్రభావం చూపాయి. అయితే సెప్టెంబర్‌లో గత తొమ్మిది నెలల్లోనే అత్యధికంగా దేశీ స్టాక్స్‌లో రూ. 57,724 కోట్లు ఇన్వెస్ట్ చేసిన ఎఫ్‌పీఐలు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఊపందుకోవడంతో అమ్మకాల యూటర్న్ తీసుకున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో అమ్మకాలకే ప్రాధాన్యమిచ్చిన ఎఫ్‌పీఐలు జూన్ నుంచి కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్న విషయం విదితమే.

ఫలితాల సీజన్ షురూ

ఈ వారం నుంచి దేశీ కార్పొరేట్ జులై–సెప్టెంబర్ (క్యూ2) ఫలితాల సీజన్ ప్రారంభంకానుంది. ప్రధానంగా ఐటీ దిగ్గజాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) క్యూ2 ఫలితాల సీజన్‌కు తెరతీయనున్నాయి. జాబితాలో టాటా గ్రూప్ దిగ్గజాలు టీసీఎస్, టాటా ఎలక్సీ 10న క్యూ2 పనితీరు వెల్లడించనున్నాయి. ఈ బాటలో డెన్ నెట్‌వర్క్స్, జీఎం బ్రూవరీస్, ఇరెడా సైతం ఇదే రోజు ఫలితాలు ప్రకటించనున్నాయి. కాగా.. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ వాతావరణం సెంటిమెంటుపై ప్రభావాన్ని చూపగలదని స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ టెక్నికల్ నిపుణులు ప్రవేశ్ గౌర్ అంచనా వేశారు. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలతో సెన్సెక్స్ 85,000, నిఫ్టీ 26,000 పాయింట్ల మైలురాళ్లను స్వల్ప కాలంలోనే కోల్పోయినట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ పేర్కొన్నారు. గత వారం మార్కెట్లు 4 శాతం పతనమైన సంగతి తెలిసిందే.

ఇతర అంశాలు కీలకం

ఆర్‌బీఐ పాలసీ సమీక్ష, పశ్చిమాసియా ఉద్రిక్తతలతోపాటు.. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు లేదా విక్రయాలు, ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ కదలికలు, చమురు ధరలు వంటి అంశాలు సైతం దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రెండ్‌ను నిర్దేశిస్తాయని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా వివరించారు. మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ డైరెక్టర్ పల్కా ఆరోరా చోప్రా సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత వారం పశ్చిమాసియాలో చెలరేగిన యుద్ధవాతావరణం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల భారీ అమ్మకాలు దేశీ మార్కెట్లను దెబ్బతీసిన విషయం విదితమే. సెన్సెక్స్ 3,883 పాయింట్లు(4.5 శాతం) పతనమై 81,688 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 1,164 పాయింట్లు(4.5 శాతం) కోల్పోయి 25,015 వద్ద ముగిసింది. దీంతో గత వారం ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)లో రూ. 16.25 లక్షల కోట్లు ఆవిరికావడం ప్రస్తావించదగ్గ అంశం! కాగా.. దేశీయంగా లిక్విడిటీ పటిష్టంగా ఉన్నదని గౌర్ పేర్కొన్నారు. ప్రస్తుతం అధిక విలువల్లో ఉన్న రంగాల నుంచి ఆకర్షణీయ విలువల్లో ఉన్న స్టాక్స్‌వైపు పెట్టుబడులు తరలే వీలున్నట్లు అభిప్రాయపడ్డారు.

బిజినెస్ రీల్

'బీఈ' నుంచి కేర్ ఆన్ వీల్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బయోలాజికల్ ఈ (బీఈ)లో సీఎస్ఆర్ విభాగమైన దాట్ల ఫౌండేషన్ తాజాగా ఇంపాక్ట్ గురు ఫౌండేషన్ (ఐజీఎఫ్)తో కలిసి కేర్ ఆన్ వీల్స్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. తెలంగాణలోని సంగారెడ్డి, రంగారెడ్డి తదితర జిల్లాల్లో అట్టడుగుల వర్గాల వారికి ఇంటి దగ్గరే అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. దీని కింద మధుమేహం, హెమోగ్లోబిన్ వంటి వైద్యపరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు మొదలైనవి వారానికి అయిదు రోజుల పాటు నిర్వహిస్తారు. అట్టడుగు వర్గాలకు కూడా నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించే లక్ష్యంతో దీన్ని ప్రారంభించినట్లు దాట్ల ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ త్రిశన్య రాజు, ఐజీఎఫ్ సీవో సందీప్ తల్వార్ తెలిపారు.

టాటా పంచ్‌లో స్పెషల్ ఎడిషన్



ముంబై: వాహనాల తయారీ దిగ్గజం టాటా మోటార్స్ తమ పంచ్ కారుకు సంబంధించి (క్యామో) సీఏఎంవో స్పెషల్ ఎడిషన్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో ప్రీమియం అప్‌హోల్‌స్టరీ, 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్, వైర్‌లెస్ చార్జర్, మొదలైన ఫీచర్లు ఉన్నాయి. దీని ప్రారంభ ధర రూ. 8,44,900 (ఎక్స్ షోరూం ఢిల్లీ). 2021 అక్టోబర్‌లో ప్రవేశపెట్టినప్పటి నుండి పంచ్‌కి గణనీయంగా ఆదరణ ఉంటోందని కంపెనీ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వివేక్ శ్రీవాస్తవ తెలిపారు.

ఇక అనిల్ కంపెనీల జోరు

- రూ. 17,600 కోట్ల సమీకరణకు రెడీ
- జాబితాలో రిలయన్స్ ఇన్‌ఫ్రా, ఆర్‌పవర్



న్యూఢిల్లీ: ప్రసిద్ధ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలు రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ పవర్ వృద్ధి బాటలో సాగనున్నాయి. ఇటీవల ఉమ్మడిగా రూ. 17,600 కోట్ల పెట్టుబడులు సమీకరించే ప్రణాళికలకు తెరతీయడంతో వృద్ధి వ్యూహాలను అమలు చేయనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. గత రెండు వారాలుగా ఇరు కంపెనీలు ఈక్విటీ షేర్ల ప్రిఫరెన్షియల్ కేటాయింపుల ద్వారా రూ. 4,500 కోట్లు సమీకరించడంతోపాటు.. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ వర్డే పార్ట్‌నర్స్ నుంచి రూ. 7,100 కోట్లు అందుకునేందుకు సన్నాహాలు ప్రారంభించాయి. ఈక్విటీ ఆధారిత దీర్ఘకాలిక ఎఫ్‌సీసీబీల జారీ ద్వారా నిధుల సమీకరణకు ప్రణాళికలు వేశాయి. పదేళ్ల ఈ విదేశీ బాండ్లకు 5 శాతం వడ్డీ రేటును ఆఫర్ చేయనున్నాయి. వీటికి జతగా అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) ద్వారా రూ. 3,000 కోట్లు చొప్పున సమీకరించనున్నట్లు ఇరు కంపెనీల అధికార వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే బోర్డు ఆమోదించిన పలు తీర్మానాలపై ఈ నెలాఖరుకల్లా వాటాదారుల నుంచి అనుమతులు లభించగలవని తెలియజేశాయి. వెరసి నిధుల సమీకరణ ద్వారా గ్రూప్ కంపెనీల విస్తరణకు అనుగుణమైన పెట్టుబడులను వినియోగించనున్నట్లు వివరించాయి.

10,000 మార్కుకు బీఎండబ్ల్యూ-మినీ



ముంబై: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న బీఎండబ్ల్యూ గ్రూప్ భారత్‌లో సరికొత్త రికార్డు సృష్టించింది. 17 ఏళ్ల కంపెనీ చరిత్రలో బీఎండబ్ల్యూ, మినీ బ్రాండ్లు దేశీయంగా 10,000 యూనిట్ల మార్కును తొలిసారిగా దాటాయి. గతేడాదితో పోలిస్తే 2024 జనవరి–సెప్టెంబర్ మధ్య 10 శాతం వృద్ధితో 10,556 యూనిట్లు కస్టమర్ల చేతుల్లోకి వెళ్లాయి. ఇందులో 10,056 బీఎండబ్ల్యూ, 500 యూనిట్లు మినీ బ్రాండ్‌లో విక్రయించింది. 2023 జనవరి–సెప్టెంబర్ మధ్య రెండు బ్రాండ్లలో కలిపి మొత్తం 9,580 యూనిట్లు రోడ్డెక్కాయి. మోటరాడ్ బ్రాండ్‌లో 5,638 యూనిట్ల మోటార్‌సైకిల్స్ సైతం అమ్ముడయ్యాయని బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్, సీఈవో విక్రమ్ పావా తెలిపారు. బీఎండబ్ల్యూ, మినీ బ్రాండ్లలో ఈ ఏడాది 725 ఎలక్ట్రిక్ వాహనాలు రోడ్లపై పరుగుతీస్తున్నాయని చెప్పారు. భారత్‌లో లగ్జరీ కార్ల రంగంలో 2,000 యూనిట్ల ఈవీల అమ్మకాల మార్కును దాటిన తొలి కంపెనీగా స్థానం సంపాదించామన్నారు. బీఎండబ్ల్యూ భారత్‌లో శుక్రవారం ఎం4 సీఎస్ లగ్జరీ స్పోర్ట్స్ కారును ప్రవేశపెట్టింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.1.89 కోట్లు.

పండుగ సీజన్‌పై భారీ ఆశలు

జోరుగా వాహన విక్రయాలు • ఆటో కంపెనీల అంచనాలు



న్యూఢిల్లీ: పండుగ సీజన్‌పై ఆటోమొబైల్ కంపెనీలు భారీ ఆశలు పెట్టుకున్నాయి. ఇటీవల అమ్మకాలు మందగించినప్పటికీ వినియోగదారుల సెంటిమెంటు మెరుగుపడి, మిగతా ఏడాదంతా అమ్మకాలు పుంజుకుంటాయని భావిస్తున్నాయి. ఏటా పండుగ సీజన్ సాధారణంగా ఓనంతో ప్రారంభమై దీపావళితో ముగుస్తుంది. గతేడాదితో పోలిస్తే ఈసారి 3–4 నెలలుగా విక్రయాలు నెమ్మదించాయని కియా ఇండియా నేషనల్ హెడ్ (సేల్స్, మార్కెటింగ్) హర్‌దీప్ సింగ్ బ్రార్ తెలిపారు. అయితే, గత కొద్ది నెలలుగా కొంత డిమాండ్ పేరుకున్న నేపథ్యంలో ఇక్కడి నుంచి మార్కెట్ మెరుగుపడగలదని ఆశిస్తున్నట్లు వివరించారు. సెప్టెంబర్‌లో బుకింగ్స్ పుంజుకున్నాయని, అక్టోబర్‌లోనూ ఇదే ధోరణి కొనసాగే సంకేతాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. 'ఈసారి పండుగలన్నీ కూడా అక్టోబర్‌లోనే ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే అమ్మకాలు 5–10 శాతం వృద్ధి చెందుతాయని అంచనా వేస్తున్నాం' అని బ్రార్ వివరించారు. జనవరి–ఏప్రిల్ మధ్య కాలంలో ప్యాసింజర్ వాహనాల పరిశ్రమ 7 శాతం వృద్ధి చెందగా, మే–సెప్టెంబర్ వ్యవధిలో 2–3 శాతం మేర తగ్గింది. దీంతో నిల్వలు పేరుకుపోయాయి.

కఠిన పరిస్థితులు..

మూడు, నాలుగు నెలలుగా పరిశ్రమ కఠిన పరిస్థితులు ఎదుర్కొంటోందని, పండుగ సీజన్‌లో కొంత ఊరట లభించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు నిస్సాన్ మోటర్ ఇండియా ఎండీ సౌరభ్ వత్స తెలిపారు. 'ఈ త్రైమాసికం ఎలా ఉండబోతోందనేది పండుగ సీజన్‌ను బట్టి తెలుస్తుంది. అలాగే మూడో త్రైమాసికాన్ని బట్టి మిగతా సంవత్సరం ఎలా ఉండబోతోందనేది తెలుస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. అందుకే అంతా పండుగ సీజన్ విషయంలో ఆతృతగా ఉన్నట్లు వివరించారు. మరోవైపు, షోరూమ్‌లను సందర్శించే వారు, వాహనాల కోసం ఎంక్వైరీ చేసే వారు క్రమంగా పెరుగుతున్నారని టయోటా కిర్లోస్కర్ మోటర్ వైస్ ప్రెసిడెంట్ (సేల్స్, సర్వీస్, యూజ్డ్ కార్ వ్యాపార విభాగం) శబరి మనోహర్ తెలిపారు. పెరుగుతున్న డిమాండ్‌కి అనుగుణంగా కార్యకలాపాల నిర్వహణ కూడా మెరుగుపర్చుకున్నట్లు, మూడో షిఫ్టును ప్రవేశపెట్టడం మొదలైనవి చేసినట్లు ఆయన చెప్పారు. బాగా డిమాండ్ ఉన్న అర్బన్ క్రూయిజర్ హైరైడర్ లాంటి మోడల్స్ సరఫరాను పెంచడంతో వెయిటింగ్ పీరియడ్ తగ్గుతోందని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో కూడా పర్యావరణ అనుకూల టెక్నాలజీ ఉన్న వాహనాలపై ఆసక్తి పెరుగుతోందని మనోహర్ పేర్కొన్నారు.

లిమిటెడ్ ఎడిషన్లు..

కొత్తగా లిమిటెడ్ ఎడిషన్ మోడల్స్‌ను ప్రవేశపెట్టడం ద్వారా విక్రయాలు పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, సేల్స్) పార్థో బెనర్జీ తెలిపారు. వినాయక చవితి, జన్మాష్టమి సందర్భంగా అమ్మకాలు పుంజుకున్నాయని పేర్కొన్నారు. సెప్టెంబర్ ఆఖరు నాటికి తమ వాహన విక్రయాలు మరింతగా పెరిగాయని, మిగతా సీజన్‌లోను ఇదే సానుకూల ధోరణి కనిపించే అవకాశాలు ఉన్నాయని టాటా మోటర్స్ ఎండీ శైలేష్ చంద్ర చెప్పారు.

అక్టోబర్ నుండి ఆరు మార్పులు

అక్టోబర్ 1 నుండి ఆదాయపు పన్ను చట్టానికి సంబంధించి, అంటే, ఈ నెల మొదలు నుండి ఆరు మార్పులు వచ్చాయి. వీటిని తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు



1. మొదటగా వివాద్ సే విశ్వాస్ అనే పథకం. ఈ పథకం గురించి గతవారం ఎంతో విపులంగా తెలియజేశాం. అప్పీలేట్లు దగ్గర గానీ, హైకోర్టు దగ్గర గానీ సుప్రీం కోర్టులో గానీ పెండింగ్ ఉన్న ట్యాక్స్ వివాదం, పెనాల్టీ, వడ్డీ వివాదాలను మీరు విత్‌డ్రా చేసుకుని, ఈ స్కీమ్‌లో డిక్లేర్ చేస్తే ఎంతో ఉపశమనం పొందవచ్చు. ఒక విధంగా ఆమ్నెస్టీ స్కీమ్‌లాంటిది. బ్యాంకు లోన్ల భాషలో చెప్పాలంటే వన్ టైమ్ సెటిల్మెంట్‌లాంటిది.
2. **ఆధార్ కార్డు వివరాలు**
   పాన్ కోసం దరఖాస్తు చేసేటప్పుడు ఆధార్ నంబరుకు బదులుగా ఆధార్ కార్డు నమోదు ఐడీని నింపమనేవారు. కానీ ఇక నుండి ఆ ఆటలు సాగవు. ఆధారం నంబరు వేయకపోవడం వల్ల పాన్ విషయంలో దుర్వినియోగం అవుతోంది. పాన్, ఆధార్ కార్డు అనుసంధానం సరిగ్గా జరగడం లేదు. ఈ మార్పుతో జాప్యాన్ని, దుర్వినియోగాన్ని అరికట్టవచ్చు.
3. **సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ రేటు పెంపు**
   ఫ్యూచర్స్, ఆప్షన్స్‌కి సంబంధించి ఎస్‌టీటీని పెంచారు. ఇక నుంచి ఫ్యూచర్స్ విషయంలో ఈ రేటు 0.02%గా ఉంటుంది. అలాగే ఆప్షన్స్‌కి ఎస్‌టీటీ రేటు 0.01%గా ఉంటుంది. ఇవి ఈ భారీ మార్కెట్ వృద్ధికి తగ్గట్లుగా ఉంటాయని, రేట్ల క్రమబద్ధీకరణ జరుగుతుందని అంచనా.
4. **ఫ్లోటింగ్ టీడీఎస్ రేటు**
   ఇది చిన్న మదుపర్లకు ఇబ్బంది కలగకుండా, అంటే, బాండ్ల మీద వడ్డీ సంవత్సరానికి రూ. 10,000 దాటితేనే వర్తిస్తుంది. 10 శాతం రేటు సెంట్రల్, రాష్ట్ర గవర్నమెంట్ బాండ్ల మీద ఫ్లోటింగ్ రేటు అమలు చేస్తారు. విధివిధానాలు తెలియపరుస్తారు.
5. **బైబ్యాక్ షేర్ల మీద పన్ను విధింపు**
   ఇదొక ముఖ్యమైన మార్పు. ఇక నుంచి ఉద్యోగస్తుల మీద కాకుండా పన్నును కంపెనీలకు విధిస్తారు. ఎలాగైతే డివిడెండ్ల విషయంలో కంపెనీలను పన్ను పరిధిలోకి పట్టుకొచ్చారో అలాగే దీన్ని కూడా ప్రతిపాదించారు. రెసిడెంట్లకు 10 శాతం చొప్పున, నాన్ రెసిడెంట్లకు 20 శాతం చొప్పున అమలు చేస్తారు.
6. **టీడీఎస్ రేట్ల సవరణ**
   కొన్ని టీడీఎస్ రేట్లను సవరించారు. శుభవార్త ఏమిటంటే తగ్గించారు.

			పాతది (శాతాల్లో)	కొత్తది (శాతాల్లో)
a.	194డి	ఇన్సూరెన్స్ కమీషన్	5	2
b.	194డీఏ	జీవిత బీమా చెల్లింపులు	5	2
c.	104జి	లాటరీ టికెట్ కమీషన్	5	2
d.	194హెచ్	బ్రోకరేజీ	5	2
e.	194.1బీ	అద్దె	5	2
f.	194ఎం	కాంట్రాక్టర్లకు చెల్లింపులు	5	2
g.	194	ఈ–కామర్స్	5	2

పై వాటిల్లో మొదటిది 2025 ఏప్రిల్ 1 నుండి, మిగతావన్నీ 2024 అక్టోబర్ 1 నుండి అమల్లోకి వచ్చాయి. ఈ మార్పుల వల్ల మీ పన్ను భారం మారకపోవచ్చు. పన్ను లెక్కలు మారతాయి. తక్కువ పన్ను భారం ఉన్నవారు రిఫండ్‌క్లెయిమ్ చేయనక్కర్లేకుండా బైటపడొచ్చు.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

అన్ని కాలాలకూ అనువైనది

• ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వ్యాల్యూ డిస్కవరీ ఫండ్

ఈక్విటీ మార్కెట్లు ఇటీవలి కాలంలో నూతన గరిష్టాలకు చేరడం చూశాం. అక్కడి నుంచి కొంత దిద్దుబాటు కనిపిస్తోంది. అయినప్పటికీ కొన్ని చోట్ల వ్యాల్యూయేషన్లు ఇంకా ఎక్కువగానే ఉన్నాయి. ఈ తరుణంలో విలువ ఆధారిత స్టాక్స్ ఎంపిక (వ్యాల్యూ ఇన్వెస్టింగ్) ఇన్వెస్టర్లకు మంచి ఫలితాన్నిస్తుంది. వ్యాల్యూ విధానంలోనూ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేసుకోవడం అవసరం. తద్వారా ఇన్వెస్టర్లకు మెరుగైన రాబడులు అందుకోగలరు. ఈ విభాగంలో దీర్ఘకాలంలో సంపద సృష్టించుకోవాలని కోరుకునే వారికి ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వ్యాల్యూ డిస్కవరీ ఫండ్ మెరుగైన ఎంపిక అవుతుంది.



రాబడులు..

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వ్యాల్యూ డిస్కవరీ ఫండ్ గడిచిన 20 ఏళ్ల కాలంలో ఏటా 21.2 శాతం చొప్పున పెట్టుబడులను రెగ్యులర్ ప్లాన్‌లో వృద్ధి చేసింది. మధ్యలో కొన్ని సందర్భాల్లో తక్కువ పనితీరు చూపించినప్పటికీ నిర్ణీత కాలంలో బలమైన పనితీరును ప్రదర్శించింది. ఈక్విటీ విభాగంలో అత్యుత్తమ పనితీరు రాబడులు అందించడంలో ఈ పథకం ముందుంది. ఏడాది కాలంలో 46.5 శాతం మేర పెట్టుబడులపై రాబడులు అందించింది. మూడేళ్లలో ఏటా 26.4 శాతం, ఐదేళ్లలో 28.7 శాతం, పదేళ్లలో ఏటా 18 శాతం చొప్పున ఇన్వెస్టర్లకు పెట్టుబడులపై ప్రతిఫలాన్ని అందించింది. నిఫ్టీ 500 టోటల్ రిటర్న్ ఇండెక్స్ కంటే 3–8 శాతం మేర వివిధ కాలాల్లో ఈ పథకమే అధిక రాబడి తెచ్చిపెట్టింది. 2013 జనవరి నుంచి 2024 సెప్టెంబర్ వరకు దశాబ్ద కాలంలో ఈ పథకంలో సగటు రాబడులు 15.4 శాతంగా ఉన్నాయి. ఇదే కాలంలో నిఫ్టీ 500 టీఆర్ఐలో రాబడి 13.6 శాతంగానే ఉంది. కనీసం పదేళ్లు, అంతకుమించిన దీర్ఘకాల లక్ష్యాల కోసం ఈ పథకాన్ని పరిశీలించొచ్చు. అది కూడా సిప్ విధానం అయితే రాబడులు మరింత మెరుగ్గా ఉంటాయి.



పెట్టుబడుల విధానం

ఈ పథకం వ్యాల్యూ ఇన్వెస్టింగ్‌లో భాగంగా లార్జ్‌క్యాప్ కంపెనీలకు ప్రాధాన్యం ఇస్తుంటుంది. కొంత మొత్తాన్ని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్ కూడా కేటాయిస్తుంటుంది. దాదాపుగా 70 శాతం, అంతకంటే ఎక్కువ కేటాయింపులు లార్జ్‌క్యాప్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటుంది. గడిచిన కొన్నేళ్లలో మిడ్, స్మాల్‌క్యాప్ విభాగం పరుగులు పెట్టినప్పటికీ, తన పెట్టుబడుల కేటాయింపుల్లో ఈ పథకం లార్జ్‌క్యాప్ కంపెనీల వైపే మొగ్గును కొనసాగించింది. కేవలం వ్యాల్యూ ఇన్వెస్టింగే కానీ, మూమెంటమ్ (పరుగులు పెట్టే) విధానాన్ని అనుసరించదు. 2019 చివర్లో, 2020 ఆరంభంలో ఎక్కువగా దిద్దుబాటుకు గురైన ఐటీ, ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్ స్టాక్స్‌కు కేటాయింపులు పెంచింది. ఆ తర్వాత కాలంలో ఈ రంగాలు గొప్పగా ర్యాలీ చేయడం తెలిసిందే. ముఖ్యంగా గత 2–3 ఏళ్లలో బ్యాంక్‌లకు ప్రాధాన్యాన్ని పెంచింది. పోర్ట్‌ఫోలియోలో ప్రస్తుతం బ్యాక్ స్టాక్స్ టాప్ హోల్డింగ్స్‌గా ఉన్నాయి. కరోనా అనంతరం కొంత ఎక్స్‌పోజర్ తగ్గించుకున్నా కానీ, ఐటీ, ఫార్మాలో ఇప్పటికీ చెప్పుకోతగ్గ మేర కేటాయింపులు ఉన్నాయి. ఈ పథకం విధానం మోస్తరు రిస్క్ ఆధారితంగా ఉంటుంది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	9.42
ఇన్ఫోసిస్	6.91
ఐసీఐసీఐ బ్యాంక్	6.24
సన్ ఫార్మాస్యూటికల్	5.21
రిలయన్స్ ఇండస్ట్రీస్	4.94
హిందుస్థాన్ యూనిలీవర్	3.13
ఎన్‌టీపీసీ	3.12
భారతీ ఎయిర్‌టెల్	3.09
ఎల్‌అండ్‌టీ	2.53
యాక్సిస్ బ్యాంక్	2.38

పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో రూ.50,154 కోట్లు ఉన్నాయి. ఇందులో 86 శాతం ఈక్విటీలకు, 0.94 శాతం చొప్పున డెట్‌కు కేటాయించింది. మెరుగైన అవకాశాలు వచ్చినప్పుడు ఇన్వెస్ట్ చేయడానికి వీలుగా 12.95 శాతం మేర నగదు నిల్వలు కొనసాగిస్తోంది. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 68 స్టాక్స్ ఉన్నాయి. దాదాపు 90 శాతం పెట్టుబడులు లార్జ్ క్యాప్‌లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్‌లో 8.77 శాతం, స్మాల్‌క్యాప్‌లో 1.59 శాతం చొప్పునే కేటాయింపులు కలిగి ఉంది. వ్యాల్యూ ఇన్వెస్టింగ్ (వ్యాల్యూషన్ల పరంగా తక్కువకు లభ్యమయ్యేవి), పెట్టుబడుల్లో సింహ భాగం లార్జ్‌క్యాప్‌లో కలిగి ఉండడంతో రిస్క్ తక్కువ కోరుకునే వారికి ఈ పథకం అనుకూలం.

– సాక్షి, బిజినెస్ డెస్క్

వెస్టిండీస్ ధనాధన్ విజయం

100 పరుగుల లక్ష్యాన్ని 11.4 ఓవర్లలో ఛేదించిన మాజీ చాంపియన్

- స్కాట్లాండ్‌కు రెండో ఓటమి
- చినెల్లి ఆల్‌రౌండ్ ప్రదర్శన
- దంచేసిన క్వినా, డాటిన్

దుబాయ్: మాజీ చాంపియన్ వెస్టిండీస్ మహిళల టి20 ప్రపంచకప్‌లో తమ రెండో లీగ్ మ్యాచ్‌లో గెలుపు ఖాతా తెరిచింది. తొలి మ్యాచ్‌లో సఫారీ చేతిలో ఓడిన 2016 చాంపియన్ ఆదివారం గ్రూప్ 'బి'లో జరిగిన పోరులో 6 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌పై ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. ఓపెనర్లు సారా బ్రిస్ (2), సస్కియా హార్లీ (11)లను ఆరంభంలోనే అవుట్ చేయడంతో స్కాట్లాండ్ తిరిగి పుంజుకోలేకపోయింది. వన్‌డౌన్ బ్యాటర్, కెప్టెన్ కేథరిన్ బ్రిస్ (31 బంతుల్లో 25; 1 ఫోర్), అయిల్సా లిస్టర్ (33 బంతుల్లో 26; 1 ఫోర్) కాసేపు క్రీజులో నిలబడటంతో స్కాట్లాండ్ ఆ మాత్రం స్కోరు చేయగలిగింది. కరీబియన్ బౌలర్లలో అఫీ ఫ్లెచర్ 3 వికెట్లు తీయగా, చినెల్లి హెన్రీ, హేలీ మాథ్యూస్, కరిష్మా తలా ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం సులువైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన వెస్టిండీస్ ఆరంభంలోనే ఓపెనర్లు స్టెఫానీ టేలర్ (4), హేలీ మాథ్యూస్ (8) వికెట్లను కోల్పోయి తడబడింది. అయితే క్వినా జోసెఫ్ (18 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్), డియాండ్రా డాటిన్ (15 బంతుల్లో 28 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), చినెల్లి హెన్రీ (10 బంతుల్లో 18 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ ఆట ఆడి వేగంగా మ్యాచ్‌ను ముగించారు. దీంతో విండీస్ 11.4 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 101 పరుగులు చేసి గెలిచింది. ఒలివియా బెల్‌కు 2 వికెట్లు దక్కాయి. రాచెల్, ప్రియనాజ్ ఛటర్జీ చెరో వికెట్ తీశారు.


అఫీ ఫ్లెచర్


చినెల్లి హెన్రీ

స్కోరు వివరాలు

స్కాట్లాండ్ ఇన్నింగ్స్: హార్లీ (సి) డాటిన్ (బి) హేలీ మాథ్యూస్ 11; సారా బ్రిస్ (బి) హెన్రీ 2; కేథరిన్ బ్రిస్ (సి) కరిష్మా (బి) ఫ్లెచర్ 25; లిస్టర్ (సి) కరిష్మా (బి) ఫ్లెచర్ 26; ప్రియనాజ్ ఛటర్జీ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫ్లెచర్ 0; జాక్ బ్రౌన్ (రనౌట్) 11; డార్సీ కార్టర్ (నాటౌట్) 14; కేథరిన్ ఫ్రేజర్ (రనౌట్) 6; రాచెల్ (బి) కరిష్మా 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం** (20 ఓవర్లలో 8 వికెట్లకు) 99. **వికెట్ల పతనం:** 1-13, 2-13, 3-59, 4-59, 5-76, 6-76, 7-98, 8-99. **బౌలింగ్:** హెన్రీ 4-2-10-1, హేలీ మాథ్యూస్ 4-0-21-1, కరిష్మా 4-0-24-1, అష్మిని మునిసర్ 1-0-8-0, అఫీ ఫ్లెచర్ 4-0-22-3, క్వినా జోసెఫ్ 1-0-2-0, ఆలియా అలెన్ 2-0-10-0.

వెస్టిండీస్ ఇన్నింగ్స్: హేలీ మాథ్యూస్ (సి) కేథరిన్ బ్రిస్ (బి) ప్రియనాజ్ 8; స్టెఫానీ (బి) రాచెల్ 4; క్వినా జోసెఫ్ (సి) ప్రియనాజ్ (బి) ఒలివియా బెల్ 31; షెర్మయిన్ (సి అండ్ బి) ఒలివియా బెల్ 2; డాటిన్ (నాటౌట్) 28; చినెల్లి హెన్రీ (నాటౌట్) 18; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం** (11.4 ఓవర్లలో 4 వికెట్లకు) 101. **వికెట్ల పతనం:** 1-5, 2-32, 3-48, 4-59. **బౌలింగ్:** రాచెల్ స్లేటర్ 2-0-17-1, కేథరిన్ బ్రిస్ 3-0-22-0, ఒలివియా బెల్ 3-0-18-2, ప్రియనాజ్ 1-0-15-1, అబ్తాహ మక్సూద్ 2.4-0-28-0.



సింగపూర్ ఓపెన్ స్నూకర్ టోర్నీ
విజేత పంకజ్ అద్వానీ

సింగపూర్: భారత దిగ్గజ క్యూ స్పోర్ట్స్ (బిలియర్డ్స్-స్నూకర్) ప్లేయర్ పంకజ్ అద్వానీ అంతర్జాతీయస్థాయిలో మరో టైటిల్ సాధించాడు. ఆదివారం ముగిసిన సింగపూర్ ఓపెన్ స్నూకర్ టోర్నమెంట్‌లో పంకజ్ అద్వానీ చాంపియన్‌గా నిలిచాడు. జాడెన్ ఓంగ్ (సింగపూర్)తో జరిగిన ఫైనల్లో పంకజ్ 5-1 (65-57, 62-46, 85-18, 15-66, 71-62, 75-11) ఫ్రేమ్‌ల తేడాతో విజయం సాధించాడు. సెమీఫైనల్లో పంకజ్ 4-3తో ప్రపంచ మాజీ స్నూకర్ చాంపియన్ దెచావత్ పూమ్‌జేంగ్ (థాయ్‌లాండ్)పై గెలుపొందాడు. ఐదు దేశాల నుంచి 123 మంది ప్లేయర్లు ఈ టోర్నీలో పోటీపడ్డారు. విజేతగా నిలిచిన పంకజ్‌కు 11 వేల సింగపూర్ డాలర్లు (రూ. 7 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. పుణేలో జన్మించి బెంగళూరులో స్థిరపడ్డ 39 ఏళ్ల పంకజ్ తన కెరీర్‌లో వివిధ ఫార్మాట్‌లలో 27 ప్రపంచ టైటిల్స్‌ను సాధించాడు.



అనిరుధ్
నిక్కీ పునాచా

అనిరుధ్‌కు రెండో టైటిల్

విలేనా (స్పెయిన్): హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ ఈ ఏడాది తన ఖాతాలో రెండో అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను జమ చేసుకున్నాడు. స్పెయిన్‌లో జరిగిన విలేనా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టోర్నీలో భారత్‌కే చెందిన నిక్కీ కలియంద పునాచాతో కలిసి అనిరుధ్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో అనిరుధ్-నిక్కీ ద్వయం 7-6 (7/2), 6-4తో రొమైన్ అర్నియోదో (మొనాకో)-ఇనిగో సెర్వాంటెస్ (స్పెయిన్) జోడీపై గెలిచింది. 87 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుద్-నిక్కీ నాలుగు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు. టైటిల్ గెలిచే క్రమంలో భారత జంట ఈ టోర్నీలో ఒక్క సెట్ మాత్రమే కోల్పోయింది. అనిరుధ్-నిక్కీ జోడీకి 6,845 యూరోల (రూ. 6 లక్షల 31 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 100 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 26 ఏళ్ల అనిరుధ్ ఈ ఏడాది మనాకోర్ ఓపెన్, ఓల్‌రాస్ ఓపెన్ టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచి... ఓల్‌రాస్ ఓపెన్, విలేనా ఓపెన్‌లలో టైటిల్స్ సాధించాడు.

హెడ్ కోచ్ శ్రీజేశ్ ఆధ్వర్యంలో...

- సుల్తాన్ జొహోర్ కప్ హాకీ టోర్నీ బరిలో భారత్
- 19 నుంచి మలేసియాలో టోర్నీ

బెంగళూరు: భారత సీనియర్ హాకీ జట్టు మేటి గోల్‌కీపర్, ఇటీవల ఆటకు వీడ్కోలు పలికిన పీఆర్ శ్రీజేశ్ కొత్త పాత్రలో కనిపించనున్నాడు. భారత జూనియర్ పురుషుల హాకీ జట్టుకు తొలిసారి హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నాడు. ఈనెల 19 నుంచి మలేసియాలో జరిగే సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ టోర్నీలో పాల్గొనే భారత జట్టుకు శ్రీజేశ్ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తాడు. ఈ టోర్నీలో పాల్గొనే 18 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ఆదివారం హాకీ ఇండియా ప్రకటించింది. డిఫెండర్లు అమీర్ అలీను కెప్టెన్‌గా, రోహిత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఆతిథ్య మలేసియాతోపాటు భారత్, బ్రిటన్, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లు ఈ టోర్నీలో పాల్గొంటాయి. లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాక టాప్-2లో నిలిచిన జట్లు 26న జరిగే ఫైనల్లో తలపడతాయి. భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను 19న జపాన్‌తో ఆడుతుంది. ఆ తర్వాత బ్రిటన్ (20న), మలేసియా (22న), ఆస్ట్రేలియా (23న), న్యూజిలాండ్ (25న) జట్లతో భారత్ తలపడుతుంది.

భారత జట్టు: అమీర్ అలీ (కెప్టెన్), రోహిత్ (వైస్ కెప్టెన్), బిక్రమ్‌జీత్ సింగ్, అలీఖాన్, తాలెమ్ ప్రియోబర్తా, శారదనాంద్ తివారి, సుఖ్‌వీందర్, అన్‌మోల్ ఎక్కా, అంకిత్ పాల్, మన్మీత్ సింగ్, రోషన్ కుజుర్, ముకేశ్ టొప్పో, చందన్ యాదవ్, గుర్జోత్ సింగ్, సౌరభ్ ఆనంద్ కుశ్వా, దిల్‌రాజ్ సింగ్, అర్ష్‌దీప్ సింగ్, మొహమ్మద్ కొనైన్ దడ్.






అమెరికా ఆర్మీ పోలో జట్టుపై భారత్ మిలటరీ జట్టు గెలుపు

సాక్రమెంటో (అమెరికా): భారత ఆర్మీ ఎరీనా పోలో జట్టు... అమెరికా మిలటరీ జట్టుపై విజయం సాధించింది. పృథ్వీ సింగ్, యతిందర్ కుమార్, మృత్యుంజయ్ సింగ్, ఆర్‌కే గౌతమ్‌తో కూడిన భారత ఆర్మీ జట్టు 13-10 తేడాతో అమెరికా జట్టుపై గెలుపొందింది. 2019 తర్వాత ఆడిన తొలి అంతర్జాతీయ పోరులో భారత ఆర్మీ జట్టు సమష్టిగా సత్తా చాటింది. లేక్‌సైడ్ పోలో క్లబ్‌లో జరిగిన ఈ పోరు మధ్యలో మృత్యుంజయ్ సింగ్ గాయపడగా... అతడి స్థానంలో గౌతమ్ సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగాడు. మామూలు పోలో మ్యాచ్ సాధారణంగా సువిశాల మైదానాల్లో నిర్వహిస్తారు. అయితే ఎరీనా పోలోలో మాత్రం మైదానం సరిహద్దుల్లో ఎత్తయిన గోడ నిర్మించి ఉంటుంది. సాధారణ పోలో గేమ్‌లో ఒక్కొక్కటి ఏడున్నర నిమిషాల నాలుగు చకర్స్ ఉంటాయి. అదే ఎరీనా పోలో ఆటను మాత్రం ఎగుడుదిగుడు ఉపరితలంపై నిర్వహిస్తారు. దీంతో అసమతల ఉపరితలంపై బంతి ఎక్కువ బౌన్స్ అవుతూ గుర్రాలను దౌడు తీయించే ప్లేయర్లను పరీక్ష పెడుతుంది.

అమెరికా జాతీయ క్రికెట్ లీగ్ భాగస్వామిగా సచిన్



వాషింగ్టన్: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అమెరికాకు చెందిన నేషనల్ క్రికెట్ లీగ్ (ఎన్‌సీఎల్) యాజమాన్యంలో భాగస్వామి అయ్యాడు. ఈ టోర్నీలో ఇప్పటికే వివిధ దేశాలకు చెందిన దిగ్గజ క్రీడాకారులు ఏదో ఒక రూపంలో పాల్గొంటుండగా... ఇప్పుడు ఆ జాబితాలో సచిన్ టెండూల్కర్ పేరు చేరింది. అమెరికాలో క్రికెట్‌కు మరింత ఆదరణ పెంచేందుకు ఇది ఉపయోగపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. 'క్రికెట్ నా జీవితంలో అతి ముఖ్య భాగం. అలాంటి ఈ ప్రయాణంలో ఎన్‌సీఎల్‌లో భాగం కావడం మరింత ఆనందాన్నిస్తోంది. అమెరికాలో క్రికెట్‌కు మరింత ప్రాచుర్యం లభించే విధంగా కృషి చేస్తా. కొత్త ఆలోచనలతో ముందుకు వచ్చిన ఎన్‌సీఎల్‌లో నేను భాగస్వామి కావడం సంతోషంగా ఉంది' అని సచిన్ పేర్కొన్నాడు. ఎన్‌సీఎల్ తొలి సీజన్‌లో సునీల్ గవాస్కర్, వెంగ్‌సర్కార్, వెంకటేశ్ ప్రసాద్ (భారత్), జహీర్ అబ్బాస్, అక్రమ్, మొయిన్‌ఖాన్ (పాకిస్తాన్), రిచర్డ్స్ (వెస్టిండీస్), జయసూర్య (శ్రీలంక) వేర్వేరు జట్లకు కోచ్, మెంటార్‌లుగా వ్యవహరించనున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో మార్పులను స్వాగతించే వారిలో ముందు వరుసలో ఉండే సచిన్... ఇప్పుడు ఈ 60 స్ట్రయిక్ ఫార్మాట్‌లో భాగం కానున్నారు. ఇప్పటికే విశ్వవ్యాప్తంగా టి20, టి10, హండ్రెడ్ ఫార్మాట్‌లు ప్రాచుర్యం పొందగా... ఇప్పుడు మరో అడుగు ముందుకు వేస్తూ ఎన్‌సీఎల్ సిక్స్‌టీ స్ట్రయిక్స్ పేరుతో మరో కొత్త ఫార్మాట్‌కు తెరలేపుతోంది. తొలి ఎడిషన్‌లో రైనా, దినేశ్ కార్తీక్, అఫ్రిది, షకీబ్, షమ్సీ, క్రిస్ లిన్, ఏంజెలో మాథ్యూస్, బిల్లింగ్స్ వంటి పలువురు ప్లేయర్లు పాల్గొంటారు.



సిరీస్ ట్రోఫీతో ఓలీ పోప్, మసూద్

పాకిస్తాన్‌కు పరీక్ష

- నేటి నుంచి ఇంగ్లండ్‌తో తొలి టెస్టు
- ఉదయం గం. 10:30 నుంచి ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ముల్తాన్: స్వదేశంలో పాకిస్తాన్ జట్టు మరో టెస్టు సిరీస్‌కు సిద్ధమైంది. ఇటీవల బంగ్లాదేశ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైన పాకిస్తాన్ నేటి నుంచి ఇంగ్లండ్‌తో తలపడనుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా సోమవారం నుంచి ముల్తాన్ వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుంది. రెగ్యులర్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఈ మ్యాచ్‌కు దూరం కాగా... అతడి స్థానంలో ఓలీ పోప్ ఇంగ్లండ్ జట్టుకు సారథిగా వ్యవహరించనున్నాడు. ఇటీవల శ్రీలంకపై మూడు మ్యాచ్‌ల సిరీస్‌కు కూడా స్టోక్స్ అందుబాటులో లేకపోగా... పోప్ కెప్టెన్సీలో ఇంగ్లండ్ జట్టు సిరీస్ గెలుచుకుంది. రెండేళ్ల క్రితం పాకిస్తాన్‌లో పర్యటించిన ఇంగ్లండ్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. విపరీతమైన వేడి ఉండే ముల్తాన్‌లో స్పిన్నర్లకు సహకారం లభించే అవకాశం ఉండటంతో జాక్ లీచ్, షోయబ్ బషీర్ రూపంలో ఇద్దరు స్పిన్నర్లకు ఇంగ్లండ్ తుది జట్టులో చోటు కల్పించింది. పేస్ బౌలింగ్‌లో మాత్రం అనుభవరాహిత్యం కనిపిస్తోంది. పేస్ బౌలర్ బ్రైడన్ కార్స్ టెస్టు అరంగేట్రం చేయనుండగా.. అతడితో పాటు అట్కిన్‌సన్, వోక్స్, బ్రూక్ పేస్ విభాగాన్ని నడిపించనున్నారు. మరోవైపు గత నాలుగేళ్లుగా స్వదేశంలో టెస్టు సిరీస్ గెలవలేకపోయిన పాకిస్తాన్ ఈసారి అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతోంది. టెస్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ జట్టును గెలిపించలేకపోయిన పాక్ సారథి షాన్ మసూద్‌పై తీవ్ర ఒత్తిడి ఉంది. మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్‌తో పాటు వికెట్ కీపర్ రిజ్వాన్, అబ్దుల్లా షఫీఖ్, సాద్ షకీల్, సల్మాన్ సమష్టిగా సత్తా చాటాలని పాకిస్తాన్ టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. బౌలింగ్‌లో షాహీన్ అఫ్రిది, నసీమ్ షా, కీలకం కానున్నారు. అబ్రార్, సల్మాన్ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నారు.

భారత మహిళల రగ్బీ జట్టుకు
రజత పతకం

ముంబై: ఆసియా రగ్బీ ఎమిరేట్స్ సెవెన్స్ ట్రోఫీలో భారత మహిళల జట్టు రజత పతకం కైవసం చేసుకుంది. నేపాల్‌లో జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో భారత్ 5-7 పాయింట్ల తేడాతో ఫిలిప్పీన్స్ చేతిలో ఓటమి పాలైంది. శిఖా యాదవ్ సారథ్యంలోని భారత జట్టు అంతకుముందు సెమీఫైనల్లో 24-7 తేడాతో గువామ్‌పై గెలిచి పట్టికలో అగ్రస్థానంతో తుదిపోరుకు చేరింది. లీగ్ దశలో భారత్ 29-10 తేడాతో శ్రీలంకపై... 17-10తో ఇండోనేసియాపై గెలిచి సంపూర్ణ ఆధిపత్యం కనబర్చింది. ఈ టోర్నీలో మరోసారి రజతం గెలవడం ఆనందంగా ఉందని శిఖా యాదవ్ పేర్కొంది. 'ప్లేయర్లంతా సమష్టిగా సత్తా చాటారు. కఠిన ప్రత్యర్థులపై చక్కటి ప్రదర్శన కనబర్చడం వల్లే రజత పతకం సాధించగలిగాం. సహచరుల ఆటతీరుతో గర్వపడుతున్నా. ఈ విజయంలో కోచ్‌లతోపాటు సహాయక సిబ్బంది పాత్ర ఎంతో ఉంది' అని శిఖా యాదవ్ చెప్పింది.





కోకో గాఫ్‌దే చైనా ఓపెన్

కెరీర్‌లో ఎనిమిదో సింగిల్స్ టైటిల్ నెగ్గిన అమెరికా టెన్నిస్ స్టార్

రూ. 9 కోట్ల 24 లక్షల ప్రైజ్‌మనీ సొంతం

బీజింగ్: అమెరికా టెన్నిస్ స్టార్ కోకో గాఫ్ ఈ ఏడాది రెండో టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం ముగిసిన చైనా ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 ప్రీమియర్ టోర్నీలో ప్రపంచ ఆరో ర్యాంకర్ కోకో గాఫ్ చాంపియన్‌గా అవతరించింది. ఏకపక్షంగా జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో కోకో గాఫ్ 6-1, 6-3తో కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్)ను ఓడించింది. 76 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో కోకో ఆరు ఏస్‌లు సంధించింది. ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. విజేతగా నిలిచిన కోకో గాఫ్‌కు 11 లక్షల డాలర్ల (రూ. 9 కోట్ల 24 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ ముకోవాకు 5,85,000 డాలర్ల (రూ. 4 కోట్ల 91 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 650 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ గెలుపుతో గత 14 ఏళ్లలో ఈ టోర్నీ టైటిల్ సాధించిన పిన్న వయస్కురాలిగా 20 ఏళ్ల కోకో గాఫ్ గుర్తింపు పొందింది. సెరెనా విలియమ్స్ (2004, 2013) తర్వాత చైనా ఓపెన్ సాధించిన రెండో అమెరికన్ ప్లేయర్‌గానూ కోకో గాఫ్ ఘనత వహించింది. ఓవరాల్‌గా కోకో కెరీర్‌లో ఇది ఎనిమిదో సింగిల్స్ టైటిల్. తాజా టైటిల్‌తో సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌కు అర్హత సాధించేందుకు కోకో గాఫ్ చేరువైంది.



కెనడాలో వెయిటర్ ఉద్యోగం కోసం... వేలాదిగా మనోళ్ల క్యూ

విదేశాల్లో చదువును చాలా గొప్పగా ఊహించుకుంటాం. కానీ జీవన వ్యయం ఎక్కువ కావడంతో విద్యార్థులు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేయాల్సి వస్తోంది. విదేశీ విద్యార్థులకోసం ఆ దేశం విధించిన నియమాలకు అనుగుణంగా బ్యాంకు బ్యాలెన్స్‌లు ఉంచడం కోసం విద్యార్థులు కష్టపడుతుంటారు. ఉద్యోగాల కోసం పోటీ పడుతుంటారు. కెనడాలోనూ అలాంటి దృశ్యమే కనబడింది. వేలాది మంది భారతీయ విద్యార్థులు వెయిటర్ ఉద్యోగాల కోసం క్యూ కట్టారు. బ్రాంప్టన్‌లో కొత్తగా ప్రారంభించిన 'తందూరీ ఫ్లేమ్' అనే రెస్టారెంట్ ముందు దాదాపు 3వేల మంది భారత విద్యార్థులు క్యూ కట్టారు. ఎక్స్ ఖాతాదారు మేఘ్ అప్‌డేట్స్ పోస్ట్ చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ వీడియో భారత్ నుంచి కెనడాకు బయలుదేరే విద్యార్థులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. చదువుకుంటూ పార్ట్‌టైమ్ పనిచేయడం కెనడాలో అంతర్జాతీయ విద్యార్థులకు సాధారణ విషయమే. అయినా కొద్ది ఉద్యోగాలకు ఎక్కువమంది పోటీ పడటం చూస్తే కెనడాలో నెలకొన్న ఆర్థిక అనిశ్చితి అర్థమవుతోందని కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. మాంద్యం ముంచుకొస్తున్న నేపథ్యంలో విదేశాలకు వెళ్లడానికి ఇది సరైన సమయం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. - టొరంటో



టక్ చేయలేదని చితక్కొట్టిన టీచర్

కర్ణభేరి పగిలి ఎడమ చెవి పాడైన వైనం

టక్ చేయలేదన్న ఒకే ఒక్క కారణంతో పట్టరాని ఆగ్రహంతో ఊగిపోయిన ఉపాధ్యాయుడు విద్యార్థిని చితకబాదిన ఘటన మహారాష్ట్రలో చోటుచేసుకుంది. ఎడమ చెవిపై గట్టిగా కొట్టడంతో కర్ణభేరి పగిలింది. దాంతో ఆ చెవి శాశ్వతంగా వినికిడి సామర్థ్యం కోల్పోయింది. సీసీటీవీ ఫుటేజీతో ఈ ఘటన వెలుగులోకి రావడంతో టీచర్‌పై పిల్లాడి తల్లిదండ్రులు ఫిర్యాదుచేశారు. నిర్లక్ష్యంగా సమాధానమిచ్చిన టీచర్‌ను తల్లిదండ్రులు పోలీసుల ఎదుట చితక్కొట్టారు. కంప్యూటర్ సబ్జెక్ట్ బోధించే సందేశ్ బోసాలే సెప్టెంబర్ 27న ఆరో తరగతి గదిలో ఓ విద్యార్థి టక్ చేసుకోకపోవడం గమనించి కోపంతో కొట్టాడు. మెడ పట్టి క్లాసు నుంచి గెంటేశాడు. దెబ్బలకు బాలుని ముక్కు, ఎడమ చెవి నుంచి రక్తం కారింది. ఇంటికెళ్లి తల్లిదండ్రులకు జరిగిన విషయం చెప్పాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా ఎడమ చెవి కర్ణభేరి పగిలిందని వైద్యుడు చెప్పాడు. కుటుంబ సభ్యులు స్కూలు యాజమాన్యాన్ని నిలదీసినా తమకు సంబంధం లేదన్నారు. దాంతో మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన సలహాపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి ఇరు వర్గాలను స్కూలుకు పిలిపించారు. అప్పటికే కోపంతో ఉన్న కుటుంబసభ్యులు, నవనిర్మాణ్ సేన కార్యకర్తలు పోలీసుల సమక్షంలోనే టీచర్‌ను చితకబాదారు. - పుణె

పాలస్తీనాకు మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా ర్యాలీలు



టోక్యోలో గాజా ఆకారంలో కొవ్వొత్తులతో నిరసనలు

రోమ్/టెల్ అవీవ్: గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ, పాలస్తీనియన్లకు మద్దతుగా పలు దేశాల్లో ర్యాలీలు జరిగాయి. హమాస్–ఇజ్రాయెల్ యుద్ధానికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా శనివారం మొదలైన నిరసనలు ఆదివారమూ కొనసాగాయి. పలు దేశాల్లో ఇజ్రాయెల్ మద్దతుదారులూ ర్యాలీలు చేశారు. ఈ సందర్భంగా యూరప్‌లోని పలు ప్రధాన నగరాల్లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇజ్రాయెల్‌ను నిందిస్తున్న ఆందోళనకారులను పోలీసులు బాష్పగోళాలు, వాటర్ క్యానన్లు ప్రయోగించి చెదరగొట్టారు. లండన్ (బ్రిటన్), బెర్లిన్, హాంబర్గ్ (జర్మనీ), రోమ్ (ఇటలీ), పారిస్ (ఇటలీ), న్యూయార్క్ (అమెరికా)లోని టైమ్స్ స్క్వేర్లలో భారీ ర్యాలీలు జరిగాయి. డెన్మార్క్, స్విట్జర్లాండ్, భారత్, ఫిలిప్పీన్స్‌తో పాటు పలు దక్షిణ అమెరికా దేశాల్లోనూ ప్రదర్శనలు జరిగాయి. అమెరికాలో వాషింగ్టన్‌లో శ్వేతసౌధం సమీపంలో 3,000 మంది నిరసనలో పాల్గొన్నారు. పలు దేశాల్లో వేలాది మంది ఇజ్రాయెల్‌కు మద్దతుగా ర్యాలీలు చేపట్టారు.

రోమ్‌లో ఉద్రిక్తత

రోమ్‌లో ఆందోళనకారులు పోలీసులపైకి రాళ్లు, నీళ్లసీసాలు, పేపర్ బాంబులు విసిరారు. ఘర్షణల్లో 30 మంది అధికారులు, ముగ్గురు నిరసనకారులు గాయపడ్డారు. పాలస్తీనా వ్యతిరేక ర్యాలీలను ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఖండించారు. లండన్ డౌనింగ్ స్ట్రీట్ వద్ద 17 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

ఆ చిచ్చుకు ఏడాది

శవాల దిబ్బగా మారిన గాజా

- వేలాది మరణాలు, లక్షలాది శరణార్థులు
- అంతులేని మానవతా సంక్షోభం
- ఏడాదైనా దాడులాపని ఇజ్రాయెల్



గత ఏడాది అక్టోబర్ 23న గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడి దృశ్యం (ఫైల్)

ఇజ్రాయెల్‌-హమాస్ యుద్ధానికి నేటితో ఏడాది! ప్రాచీన మత సంబంధ కట్టడాల్లోకి పాలస్తీనియన్లను అనుమతించకపోవడం, ఇజ్రాయెలీ సెటిల్‌మెంట్ల వద్ద పాలస్తీనియన్లపై పెరిగిన ఆగడాలతో కట్టలు తెంచుకున్న ఆగ్రహం ఇజ్రాయెల్ శివారు గ్రామాలపై మెరుపుదాడికి హమాస్‌ను పురిగొల్పింది. 2023 అక్టోబర్ 7న న్యూ ఇయర్ వేడుకల్లో మునిగి తేలుతున్న ఇజ్రాయెలీపై విరుచుకుపడింది. 1,200 మందిని హతమార్చి, దాదాపు 250 మందిని అపహరించింది. ప్రతీకారేచ్ఛతో రగిలిపోయిన ఇజ్రాయెల్ గాజాపై విరుచుకుపడింది. ఆ ప్రాంతమంతటినీ దాదాపు శ్మశానంగా మార్చేసింది. హమాస్ అంతమే లక్ష్యంగా ఏడాదైనా నిర్నిరోధంగా దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఈ యుద్ధాగ్ని క్రమంగా లెబనాన్, ఇరాన్‌లకూ వ్యాపించింది. దాంతో పశ్చిమాసియా రావణకాష్టంగా మారుతుందన్న భయాందోళనలు ప్రపంచ దేశాలను పట్టిపీడిస్తున్నాయి.

గాజా.. మరుభూమి

కేవలం 10 కిలోమీటర్ల వెడల్పు, 45 కిలోమీటర్ల పొడవులో దీర్ఘచతురస్రాకారంలో విస్తరించిన అత్యంత చిన్న ప్రాంతం గాజా. కానీ జనాభా మాత్రం 23 లక్షల పైమాటే. కిక్కిరిసిన జనావాసాలపై ఇజ్రాయెల్ దాడులకు అమాయక పాలస్తీనియన్లు భారీ సంఖ్యలో బలయ్యారు. ఏడాదిగా సాగుతున్న యుద్ధంలో 42,000 మందికి పైగా అమాయకులు చనిపోయారు. లక్ష మందికి పైగా గాయపడ్డారు.



రఫాలో ఆహార పంపిణీ కేంద్రం వద్ద అన్నార్తులు (ఫైల్)

ఇజ్రాయెల్‌లోనూ..

ఇజ్రాయెల్ లోనూ యుద్ధం పట్ల క్రమంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నెతన్యాహూ ప్రభుత్వ వ్యతిరేకంగా నిరసనలు హోరెత్తుతున్నాయి. ఏడాది గడుస్తున్నా తమ వారు హమాస్ చెరలోనే ఉండటాన్ని ఇజ్రాయెలీలు జీర్ణించుకోలేకపోతున్నారు. కాల్పుల విరమణ అమలు చేసి వారిని విడుదల చేయించాలని పట్టుబడుతున్నారు.

విస్తరిస్తున్న యుద్ధజ్వాలలు

హమాస్‌కు మద్దతుగా ఎర్రసముద్రంలో యెమన్ హౌతీలు ఇజ్రాయెల్‌కు మద్దతిచ్చే దేశాల సరుకు రవాణా నౌకలపై దాడులకు దిగారు. హమాస్‌కు దన్నుగా లెబనాన్‌లోని హెజ్‌బొల్లా సైతం ఇజ్రాయెల్‌పై దాడులను ఉధృతం చేసింది. దీంతో దక్షిణ లెబనాన్ సరిహద్దులపై ఇజ్రాయెల్ తాజాగా భీకర దాడులకు దిగింది. వీటిలో ఇప్పటికే 2,000 మంది దాకా చనిపోయారు. 12 లక్షల మంది లెబనీయులు వలస బాట పట్టారు. ఇజ్రాయెల్‌పై భారీ రాకెట్ దాడుల ద్వారా తాజాగా ఇరాన్ కూడా యుద్ధ రంగంలో ప్రవేశించినట్టయింది. ఇరాన్‌పై ఏ క్షణమైన ఇజ్రాయెల్ ప్రతీకార దాడులకు దిగొచ్చనే వార్తల నడుమ పశ్చిమాసియాలో పరిస్థితి నివురుగప్పిన నిప్పును తలపిస్తోంది.

పశ్చిమాసియా సంక్షోభంలో కీలక ఘట్టాలు

2023 అక్టోబర్ 7: ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతాలపై హమాస్ మెరుపుదాడి. 1,200 మంది హత్య, 250 మంది కిడ్నాప్

అక్టోబర్ 8: ప్రతీకార దాడులకు తెర తీసిన ఇజ్రాయెల్

నవంబర్ 24: తొలిసారిగా కాల్పుల విరమణ పలువురు బందీల విడుదల. బదులుగా 240 మంది పాలస్తీనా ఖైదీల అప్పగింత

నవంబర్ 30: కాల్పుల విరమణ ముగిసి మళ్లీ మొదలైన ఇజ్రాయెల్ దాడులు

2024 జనవరి 2: బీరుట్‌లో హమాస్ డెప్యూటీ లీడర్ సలేహ్ అల్ అరూరీని చంపేసిన ఇజ్రాయెల్

ఏప్రిల్ 1: సిరియాలోని డమాస్కస్ సిటీలో ఇరాన్ రాయబార కార్యాలయంపై ఇజ్రాయెల్ దాడి. ఇద్దరు ఇరాన్ జనరల్ల మరణం

జూలై 30: బీరుట్ సమీపంలో క్షిపణి దాడిలో హెజ్‌బొల్లా కమాండర్, ఇరాన్ సైనిక సలహాదారులు ఫౌద్ షుక్ర్ హత్య

జూలై 31: ఇరాన్‌లోని టెహ్రాన్‌లో హమాస్ రాజకీయవిభాగ అధినేత ఇస్మాయిల్ హనియాను బాంబు దాడితో అంతం చేసిన ఇజ్రాయెల్

సెప్టెంబర్ 17: వేలాది హెజ్‌బొల్లా సభ్యులు వాడుతున్న వేలాది పేజర్లు ఒక్కసారిగా పేలడంతో కలకలం. పదుల సంఖ్యలో మరణాలు. వందలాది మందికి తీవ్ర గాయాలు.

సెప్టెంబర్ 18: వాకీటాకీలు, రేడియోసెట్లు పేలడంతో పలువురు హెజ్‌బొల్లా సభ్యుల మృతి

సెప్టెంబర్ 20: టాప్ హెజ్‌బొల్లాకమాండర్ ఇబ్రహీం అగిల్‌ను చంపేసిన ఇజ్రాయెల్

సెప్టెంబర్ 27: హెజ్‌బొల్లా అధినేత హసన్ నస్రల్లాను బంకర్ బ్లాస్ట్ బాంబులతో హతమార్చిన ఇజ్రాయెల్

సెప్టెంబర్ 30: దక్షిణ లెబనాన్ సరిహద్దు గుండా భూతల దాడులకు తెర తీసిన ఇజ్రాయెల్

అక్టోబర్ 1: ఆగ్రహంతో ఇజ్రాయెల్‌పైకి ఒకేసారి 180 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన ఇరాన్

- సాక్షి, నేషనల్ డెస్క్

మహాకుంభ మేళా-2025 లోగో ఆవిష్కరించిన యోగి



ప్రయాగ్‌రాజ్‌లో గంగా పూజ చేస్తున్న యోగి ఆదిత్యనాథ్

ప్రయాగ్‌రాజ్: మహాకుంభ మేళా–2025 లోగోను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదివారం ప్రారంభించారు. లక్నోలో జరిగిన ఒక కార్యక్రమంలో లోగోను ఆవిష్కరించినట్లు సీఎంఓ ఓ ప్రకటనలో తెలిపింది. కుంభమేళా భారతదేశంలోని అతిపెద్ద పండుగలలో ఒకటి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది హిందువులకు ఇది అత్యంత ముఖ్యమైన తీర్థయాత్ర. ఇది నాసిక్, ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయినిలలో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. తదుపరి కుంభమేళా 2025 ప్రయాగ్‌రాజ్‌లో జరుపుకోబోతోంది.

దస్నా ఆలయంపై నిరసనకారుల దాడి

ఘజియాబాద్: దస్నాదేవి ఆలయంపై శుక్రవారం రాత్రి కొందరు దాడి చేశారని బీజేపీ ఎమ్మెల్యే నంద్ కిశోర్ గుర్జర్ తెలిపారు. రాళ్లు రువ్విన 10–20 మందిపై పోలీసులు లాఠీచార్జికి బదులు కాల్పులు జరిపి ఉండాల్సిందని ఆయన వ్యాఖ్యానించారు. దాడికి పాల్పడిన ఆ 10–20 మంది ఎన్‌కౌంటర్ చేసేస్తే ఇక ఆందోళనకారులు ఉండరన్నారు. ఆలయంపై దాడిని సనాతన ధర్మంపై, హిందుత్వపై జరిగిన దాడిగా ఆయన పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై జాతీయ భద్రతా చట్టం ప్రయోగించాలన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యల వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైంది. ప్రవక్తపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన యతి నర్సింగానంద దస్నా దేవి ఆలయ పూజారిగా ఉన్నారు. కాగా, దస్నా దేవి ఆలయంపై దాడి చేసినందుకు 150 మందిపై వేవ్ సిటీ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఘటన నేపథ్యంలో ఆలయం వద్ద బందోబస్తును పెంచారు.

మహిళ కడుపులో 2 కిలోల వెంట్రుకలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో ఓ మహిళ కడుపునుంచి 2 కిలోల వెంట్రుకలను వైద్యులు బయటకు తీశారు. కర్‌గైనా నివాసి అయిన మహిళ తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోంది. ఏది తిన్నా, తాగినా వాంతులు కావడంతో డాక్టర్‌ను సంప్రదించారు. డాక్టర్ సూచించిన మేరకు సిటీ స్కాన్ చేయించారు. కడుపులో వెంట్రుకలు పేరుకుపోయినట్లు డాక్టర్ గుర్తించారు. అయితే ఐదేళ్ల వయసు నుంచే తన వెంట్రుకలను తింటున్నానని ఆమె అంగీకరించింది. దీంతో బరేలీలోని జిల్లా ఆసుపత్రిలో వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. కుహరాన్ని, పేగులోని కొంత భాగాన్ని పూర్తిగా ఆక్రమించుకున్న వెంట్రుకలను తొలగించామని వైద్యులు తెలిపారు. 21 ఏళ్ల మహిళ 16 ఏళ్లుగా వెంట్రుకలను తింటోందని, వైద్య పరిభాషలో దీనిని ట్రైకోఫాగియా, రాపుంజెల్ సిండ్రోమ్ అంటారని సర్జన్ డాక్టర్ ఎంపీ సింగ్ చెప్పారు. వ్యాధి నిర్ధారణ అనంతరం ఆ మహిళకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

నదీ స్నానానికి వెళ్లి ఆరుగురు చిన్నారులు మృత్యువాత

ససరాం: బిహార్ రాష్ట్రం రొహతాస్ జిల్లాలోని సోనె నదిలో స్నానానికి వెళ్లిన ఆరుగురు చిన్నారులు సజీవ సమాధి అయ్యారు. ఆదివారం చోటుచేసుకున్న ఈ విషాద ఘటనలో ఒక చిన్నారి గల్లంతు కాగా, మరో చిన్నారిని రక్షించినట్లు రాష్ట్ర విపత్తు స్పందన దళం తెలిపింది. టుంబా గ్రామానికి చెందిన 10–12 ఏళ్ల వయస్సున్న 8 మంది చిన్నారులు స్నానానికి వెళ్లి ఎక్కువ లోతున్న నీళ్లలోకి పడిపోయారని తెలిపింది. గల్లంతైన చిన్నారి కోసం గాలింపు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

న్యాయవ్యవస్థ పరిమితులు దాటొద్దు

కార్యనిర్వాహక బాధ్యతలు నెత్తిన వేసుకోరాదు: ధన్‌ఖడ్



కార్యక్రమంలో ధన్‌ఖడ్, కరణ్ సింగ్

న్యూఢిల్లీ: న్యాయ, శాసన వ్యవస్థల మధ్య అధికార పంపిణీలో పొడచూపుతున్న అసమతుల్యతలను సరిచేయాల్సిన బాధ్యతను మేధావులు, విద్యావేత్తలు తమ భుజస్కంధాలపై మోయాల్సిన సమయమొచ్చిందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కురువృద్ధుడు, జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ కరణ్ సింగ్ ప్రజాజీవితంలో 75 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయనను ఆదివారం ఢిల్లీలో సత్కరించిన సందర్భంగా ధన్‌ఖడ్ ప్రసంగించారు. ''న్యాయవ్యవస్థ తన అధికారాలను అమలుపరిచే క్రమంలో రాజ్యాంగం నిర్దేశించిన అధికార పరిమితులను దాటుతోంది. ఈ నేపథ్యంలో కార్యనిర్వాహక, న్యాయ, శాసన వ్యవస్థల మధ్య రాజ్యాంగబద్ధ విభజన రేఖను మరోసారి గుర్తుచేయాల్సిన బాధ్యత మేధావులు, విద్యావేత్తలదే. ఏ వ్యవస్థ అయినా పరిధి దాటి ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుంది. కార్యనిర్వాహక బాధ్యతలనూ న్యాయవ్యవస్థ నెత్తినేసుకోవడం రాజ్యాంగబద్ధం అనిపించుకోదు. ఈ విపరీత ధోరణులు విపరిణామాలకు దారితీస్తాయి'' అన్నారు.

ముంబైలో అగ్ని ప్రమాదం.. ఏడుగురు మృతి

ముంబై: ముంబైలోని చెంబూర్ ప్రాంతంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. రెండంతస్తుల భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో దుకాణం నిర్వహిస్తుండగా, పై ఫ్లోర్‌లో కొన్ని కుటుంబాలుంటున్నాయి. ఆదివారం ఉదయం 5.20 గంటల సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఎలక్ట్రిక్ వైరింగ్ నుంచి మొదలైన మంటలు మొదటి ఫ్లోర్‌కు వ్యాపించాయి. తీవ్రంగా గాయపడిన ఏడుగురిని ఆస్పత్రికి తరలించామని, వారు అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారని అగ్నిమాపక అధికారులు తెలిపారు. ఉదయం 9.15 గంటలకల్లా మంటలను అదుపులోకి తెచ్చామన్నారు.

చెన్నై విద్యార్థికి నాసా ప్రశంస!

సాక్షి, చెన్నై: అమెరికా అంతరిక్ష సంస్థ నాసా అధికారిక ఈ–మెయిల్‌లో లోపాన్ని ఎత్తిచూపిన చెన్నై విద్యార్థిని ఆ సంస్థ ప్రశంసించింది. చెన్నైకి చెందిన మహేశ్వరన్ (20) హిందుస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో బీసీఏ చదువుతున్నాడు. ఇటీవల నాసా వెబ్‌సైట్‌ను తనకు అవసరమైన సమాచారం కోసం అన్వేషించాడు. నాసా పాస్‌వర్డ్, అనుమతి వంటివి అవసరం లేకుండానే ఈ మెయిల్ ఆధారంగా సర్వర్‌కు కనెక్ట్ అవడం అతను గమనించాడు. ఈ మెయిల్‌ను పంపడానికి అనుమతించడం వల్లే ఈ లోపాన్ని గుర్తించినట్లు నాసాకు అతడు సమాచారమిచ్చాడు. దీంతో, నాసా సీనియర్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అధికారి మైక్ విట్ మహేశ్వరన్‌ను అభినందిస్తూ లేఖ రాశారు.



అంటార్కిటికా హరితమయం!

కరిగిపోతున్న మంచు

భూతాపమే ప్రధాన కారణం

న్యూఢిల్లీ: మంచుతో కప్పి ఉండే అంటార్కిటికా ద్వీపకల్పం క్రమంగా హరితమయం అవుతోంది. ఇక్కడ పచ్చదనం పెరుగుతోంది. పచ్చిక పరిధి విస్తృతమవుతోంది. గత మూడు దశాబ్దాల కాలంతో పోలిస్తే ఈ పరిణామం ఇటీవల 30 శాతానికిపైగా వేగం పుంజుకున్నట్లు సైంటిస్టులు గుర్తించారు. అంటార్కిటికా పరిణామాలపై యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ ఎక్సెటర్ సైంటిస్టులు అధ్యయనం చేశారు. ఇందుకోసం శాటిలైట్ డేటాను ఉపయోగించారు. అంటార్కిటికాలో 1986లో చదరపు కిలోమీటర్ కంటే తక్కువ వైశాల్యంలో పచ్చదనం ఉండగా, 2021 నాటికి అది 12 చదరపు కిలోమీటర్లకు చేరుకున్నట్లు తేల్చారు. ఇక్కడ పచ్చదనం పెరిగిపోతుండానికి కారణంగా భూతాపం, వాతావరణ మార్పులేనని చెబుతున్నారు. ఒకవైపు మంచు పరిమాణం తగ్గిపోతుండగా, అదే సమయంలో పచ్చదనం పెరుగుతోంది. ఈ రెండింటికీ సంబంధం ఉందని అంటున్నారు. ఆధునిక కాలంలో ప్రపంచ సగటుతో పోలిస్తే అంటార్కిటికా ద్వీపకల్పం వేగంగా వేడెక్కుతోంది. ఇక్కడ వడగాల్పులు సర్వసాధారణంగా మారిపోయాయి. మంచి కరిగిపోయి, ఆ ప్రాంతంలో పచ్చిక కనిపిస్తోంది. ఇది కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో పచ్చిక అని సైంటిస్టులు చెప్పారు. వాతావరణ మార్పులను అడ్డుకోకపోతే అంటార్కిటికాలో మంచు పూర్తిగా కనుమరుగైనా ఆశ్చర్యం లేదని పేర్కొన్నారు. అదే జరిగితే ప్రపంచవ్యాప్తంగా మానవాళి మనుగడపై ప్రతికూల ప్రభావం తప్పదని హెచ్చరిస్తున్నారు.

కిమ్ కాదు, సోరోస్ కాదు.. ఉపవాసానికే నా ఓటు!

విదేశాంగ మంత్రి సరదా సమాధానం



ఓవైపు అంతర్జాతీయ అంశాలపై అనర్గళంగా మాట్లాడి ఆకట్టుకునే విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తనలోని సరదా కోణాన్ని ఆవిష్కరించారు. వాక్చాతుర్యంతో సభికులను కడుపుబ్బా నవ్వించారు. ఒక కార్యక్రమంలో ముఖాముఖి సందర్భంగా వ్యాఖ్యాత ఆయనకు ర్యాపిడ్‌ఫైర్ ప్రశ్న సంధించారు. ఉత్తరకొరియా నియంత కిమ్ జాంగ్ ఉన్, భారత్‌ను విమర్శించే హంగరీ అమెరికన్ కుబేరుడు జార్జ్ సోరోస్‌ల్లో మీరు ఎవరితో భోజనం చేస్తారని అడిగారు. జైశంకర్ ఏ మాత్రం తడుముకోకుండా, 'దుర్గా నవరాత్రులు కదండీ! నేను ఉపవాస దీక్షలో ఉన్నా!' అంటూ బదులివ్వడంతో అంతా పగలబడి నవ్వారు.

ఐరాస.. ఓ పాత కంపెనీ

ఐక్యరాజ్యసమితి ప్రస్తుత పరిస్థితిపై జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎంతో స్థలాన్ని ఆక్రమించుకుని, మార్కెట్ అవసరాలను పూర్తిస్థాయిలో తీర్చలేని పాత కంపెనీలా మారిందంటూ ఆక్షేపించారు. ఆదివారం ఆయన కౌటిల్య ఆర్థిక సదస్సులో మాట్లాడారు. ''ప్రపంచ దేశాలను నేడు రెండు తీవ్ర సంక్షోభాలు తీవ్రంగా ఆందోళన పరుస్తున్నాయి. ఇలాంటి కీలక సమయంలో ఐరాస ప్రేక్షకపాత్రకు పరిమితమైంది. కీలకాంశాలను పట్టించుకోకుంటే దేశాలు తమ దారి చూసుకుంటాయి. కోవిడ్ కల్లోలంలోనూ ఐరాస చేసింది చాలా తక్కువ'' అన్నారు. – న్యూఢిల్లీ



ఎవరెస్ట్ సమీపంలో అరుణ్ నదీ ప్రవాహ దృశ్యం

ఎవరెస్టు ఎత్తు.. రెట్టింపు వేగం

ఏటా 2 మి.మీ. పెరుగుదల

కోసీలో అరుణ్ నది విలీనం వల్లే

ప్రపంచంలో అత్యంత ఎత్తయిన శిఖరం ఏదంటే ఎవరెస్ట్ అని ఠక్కున చెప్పేస్తాం. ఈ హిమాలయ శిఖరం ఎత్తు 29,031.69 అడుగులు (8,848.86 మీటర్లు). దాదాపు 5 కోట్ల ఏళ్ల క్రితం ఎవరెస్టు ప్రయాణం మొదలైంది. అప్పట్లో భూ అంతర్భాగంలో ఇండియా ఫలకం, యూరేషియన్ ఫలకం ఢీకొట్టడంతో హిమాలయ పర్వతాలు ఏర్పడ్డాయి. మొదట్లో ఎవరెస్ట్ ఎత్తు 820 అడుగులే. లక్షల సంవత్సరాలుగా క్రమంగా పెరుగుతూ ఇప్పుడున్న ఎత్తుకు చేరుకుంది. ఎవరెస్టు ఎత్తు ప్రతిఏటా అంచనా వేసినదానికంటే రెట్టింపు పెరుగుతున్నట్లు పరిశోధకులు తాజా అధ్యయనంలో గుర్తించారు. సాధారణంగా ఎవరెస్టు ప్రతిఏటా 0.04 అంగుళాల(ఒక మిల్లీమీటర్) చొప్పున పెరుగుతున్నట్లు అంచనా. కానీ, ఇది సంవత్సరానికి 0.08(2 మిల్లీమీటర్ల) చొప్పున పెరుగుతున్నట్లు అధ్యయనంలో జీపీఎస్ గణాంకాల ఆధారంగా తేల్చారు. ఈ వివరాలను నేచర్ జియోసైన్స్ పత్రికలో ప్రచురించారు. ఎవరెస్టు శిఖరం ఎత్తు రెట్టింపు పెరుగుతుండడానికిగల కారణం ఏమిటో కనిపెట్టారు. ఎవరెస్టు సమీపంలోనే కోసీ నది ప్రవహిస్తోంది. 89 వేల సంవత్సరాల క్రితం అరుణ్ అనే చిన్న నదిని కోసీ తనలో విలీనం చేసుకుంది. ఈ విలీనం వల్ల కోసీ నదిలో నీటి ఉధృతి పెరిగింది. నీటి ప్రవాహ వేగానికి ఎవరెస్టు దిగువన ఉన్న లోయలోనుంచి రాళ్లు కొట్టుకుపోతున్నాయి. రాతి భూభాగం కుంగిపోతుండడంతో ఆ నష్టాన్ని భర్తీ చేయడానికి హిమాలయాల ఎత్తు పెరుగుతోంది. – న్యూఢిల్లీ

సమన్యాయ పాలనను ప్రతిపాదించిందెవరు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రాథమిక హక్కులు-వర్గీకరణ

సమానత్వ హక్కు (ప్రకరణ 14-18)

ప్రకరణ 14 ప్రకారం చట్టం దృష్టిలో అందరూ సమానులే. ఈ భావన బ్రిటిష్ రాజ్యాంగంలోని సమ న్యాయపాలన (Rule of law)కుఅనుగుణం గా పొందుపరిచారు. వ్యక్తి హోదా, గౌరవంతో సంబంధం లేకుండా హక్కులు కల్పిస్తారు. సమన్యాయ పాలన భావాన్ని 'ఎ.వి. డైసీ'అనే రాజ్యాంగ నిపుణుడు ప్రతిపాదించాడు. చట్టం మూలంగా సమాన రక్షణ (Equal protection of law) అనేది అమెరికా రాజ్యాంగం నుంచి గ్రహించారు. దేశంలో ఒకే చట్టం ఉన్నప్పటికీ, ఆ చట్టాన్ని అమలు చేసే సమయంలో ప్రజలను వర్గీకరించి అమలు చేయొచ్చు. అయితే వర్గ చట్టాలు చేయొద్దు (Classific-ation of people but not class legislation). దీన్నే 'రక్షిత వివక్ష' అంటారు. దీంతో సామాజిక న్యాయం సాధ్యమవుతుంది. ప్రకరణ 14 ప్రకారం, చట్టం ముందు అందరూ సమానులే. అయినప్పటికీ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వొచ్చు. హేతుబద్ధ, శాస్త్రీయ వర్గీకరణ ద్వారా మినహాయింపులు ఇవ్వడం ప్రకరణ 14కు వ్యతిరేకం కాదు. భౌగోళిక ప్రాంతం, అక్షరాస్యత, పెద్ద, చిన్న పరిశ్రమలు, మైనర్, మేజర్, స్త్రీలు, పురుషులు మొదలైన ప్రాతిపదికలపైన మినహాయింపులు ఇవ్వొచ్చు.

ప్రత్యేక వివరణ

ప్రకరణ 39(బి), (సి)లోని ఆదేశికాలను అమలు చేయడానికి చర్యలు తీసుకుంటే అవి ప్రకరణ 14కు వ్యతిరేకమని న్యాయస్థానంలో ప్రశ్నించొద్దు. వీటిని అమలు చేయడానికి ప్రకరణ 14 అడ్డుకాదు.

మినహాయింపులు

- నిబంధన 14లో పేర్కొన్న' అందరూ సమానులు' అనే సూత్రం రాష్ట్రపతి, గవర్నర్లకు వర్తించదు. వారు ఈ సూత్రానికి మినహాయింపు.
- ప్రకరణ 361 ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్ తమ అధికార విధుల నిర్వహణలో ఏ న్యాయ స్థానా నికీ జవాబుదారులు కారు. వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు పెట్టడానికి వీలులేదు. అయితే రెండు నెలల ముందస్తు నోటీసుతో సివిల్ కేసులు పెట్టొచ్చు.
- ప్రకరణ 105, 194 ప్రకారం, పార్లమెంట్, రాష్ట్ర శాసన సభల్లో సభ్యులు వ్యక్తీకరించిన అభి ప్రాయాలకు వారు ఏ న్యాయస్థానానికీ బాధ్యులు కారు.
- విదేశీ సార్వభౌములకు, దౌత్యవేత్తలకు కూడా మినహాయింపు ఉంటుంది.
- ఐక్యరాజ్యసమితి వివిధ విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందికి కూడా ఈ మినహాయింపు వర్తిస్తుంది.

ప్రకరణ 15

ప్రకరణ 15(1): మత, జాతి, కుల, లింగ,పుట్టుక అనే వివక్షను పాటించొద్దు.

ప్రకరణ 15(2): ప్రజా ప్రయోగకర ప్రదేశాల్లోకి అందరికీ సమాన ప్రవేశం ఉండాలి. ఈ సౌకర్యాల విషయంలో వివక్ష చూపొద్దు. బావులు, చెరువులు, రోడ్లు, హోటళ్లు, వినోద ప్రదేశాలు, ఇతర ప్రజా సంబంధ ప్రదేశాల్లోకి అందరికీ సమాన అవకాశాలు ఉండాలి.

మినహాయింపులు

ప్రకరణ 15(3): దీని ప్రకారం మహిళలు, బాలలకు ప్రత్యేక మినహాయింపులు, సౌకర్యాలు కల్పించవచ్చు.

ప్రకరణ 15(4): సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక సౌకర్యాలు, మినహాంపులు ఇవ్వొచ్చు. ఈ క్లాజ్‌ను 1951లో 1వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

ప్రకరణ 15(5): ప్రైవేట్, ప్రభుత్వ ధన సహాయం పొందిన విద్యాసంస్థల్లో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు లేదా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి ప్రత్యేక మినహాయింపులు, సౌకర్యాలు కల్పించవచ్చు. అయితే ఇది ప్రకరణ 30లో పేర్కొన్న మైనారిటీ సంస్థలకు వర్తించదు. ప్రకరణ 15(5) క్లాజ్‌ను 2005లో 93వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

ప్రకరణ 16

ప్రకరణ 16(1): ప్రభుత్వోద్యోగాల్లో పౌరులందరికీ సమాన అవకాశాలు.

ప్రకరణ 16(2): ప్రభుత్వోద్యోగాల్లో పౌరులను జాతి, మత, కుల, లింగ పుట్టుక వారసత్వ, స్థిర నివాస అనే ఏడు ప్రాతిపదికలపై వివక్ష చూపొద్దు.

ప్రకరణ 16(3): ప్రభుత్వ ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక మినహాయింపులు, సదుపాయాలు కల్పించవచ్చు.

ప్రకరణ 16(4ఎ): ప్రభుత్వోద్యోగాలు, ప్రమోషన్లలో షెడ్యూల్డ్ కులాలు, తెగలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించవచ్చు. ఈ అంశాన్ని 1995లో 77వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలో పొందుపరిచారు.

ప్రకరణ 16(4బి): ఈ క్లాజును 81వ రాజ్యాంగ సవరణ ద్వారా 2000లో చేర్చారు. ఎస్సీ, ఎస్టీలకు ఒక ఏడాదిలో కేటాయించిన రిజర్వ్ కోటా భర్తీ కాకుంటే ఆ ఖాళీలను తర్వాత సంవత్సరంలో సంబంధిత రిజర్వేషన్ కోటాలో కలుపుతారు. అప్పుడు రిజర్వేషన్ల శాతం 50కి మించిందా లేదా అనే విషయాన్ని నిర్ధారించడానికి ఆ ఏడాది రిజర్వేషన్ కోటాలో కలిసిన గత సంవత్సరం కోటాను పరిగణనలోకి తీసుకోకుండా, మిగిలిన ఖాళీలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. దీని ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల విషయంలో క్యారీ ఫార్వర్డ్ అవకాశాన్ని కల్పించారు.

ప్రకరణ 16(5): ప్రభుత్వంలో ఏదైనా ఒక శాఖలో పూర్తిగా ఒక మత విశ్వాసానికి సంబంధించిన విషయం ఉంటే ఆ శాఖలో కేవలం ఆ మత విశ్వాసాలకు చెందిన వారిని మాత్రమే నియమించడానికి తగిన చట్టాలను ప్రభుత్వాలు రూపొందించుకోవచ్చు.

దేవాదాయ ధర్మాదాయ శాఖలో పనిచేయడానికి హిందువులు మాత్రమే అర్హులు. అలాగే వక్ఫ్‌బోర్డు ఇతర మత సంస్థల్లో నియామకాలకు సంబంధిత మత విశ్వాసం ఉన్నవారే అర్హులు. అదేవిధంగా 2001లో 85వ రాజ్యాంగ సవరణ ప్రకారం, పదోన్నతుల్లో రిజర్వేషన్లు పొందిన ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ ఉద్యోగులకు తద్వారా లభించే సీనియారిటీ అర్హత కూడా లభిస్తుంది. ఈ సవరణ 1995 నుంచి వర్తిస్తుంది.

ప్రత్యేక వివరణ

81, 85వ రాజ్యాంగ సవరణల ద్వారా గతంలో సుప్రీంకోర్టు బాలాజీ వర్సెస్ మైసూరు (1963), ఇంద్ర సహాని వర్సెస్ భారత ప్రభుత్వం (1992) కేసుల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని చెప్పిన తీర్పులకు మినహాయింపు లభించింది.

మండల్ కమిషన్ నివేదిక

వెనుకబడిన తరగతులను వర్గీకరించి తగిన రాయితీలు కల్పించడానికి 1979లో నాటి జనతా ప్రభుత్వం బి.పి. మండల్ అధ్యక్షతన కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు కేంద్ర సర్వీసుల్లో 27 శాతం రిజర్వేషన్లను కల్పించాలని 1980లో తన తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. 1989లో అధికారంలోకి వచ్చిన వి.పి.సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికను అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. దీన్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. తర్వాత పి.వి. నరసింహారావు ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికకు రెండు సవరణలు చేసింది.

ఎ) వెనుకబడిన తరగతులకు కేటాయించిన రిజర్వేషన్లను ఆర్థిక ప్రాతిపదికన అమలు చేయడం.

బి) అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం.

పై అంశాలు ఇంద్రా సహాని కేసులో సుప్రీం కోర్టులో చర్చకు వచ్చాయి.

ఇంద్రా సహాని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (మండల్ కేసు) (1993)

- వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగబద్ధమే.
- వెనుకబడిన తరగతుల్లో క్రీమీలేయర్ (మెరుగైన వర్గాలు)ను గుర్తించి వారిని రిజర్వేషన్లకు అనర్హులుగా పరిగణించాలి.
- కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మినహా, అన్ని రకాల రిజర్వేషన్లు కలిపి 50 శాతం మించొద్దు.
- ఆర్థికపరమైన రిజర్వేషన్లు చెల్లవు. రాజ్యాంగంలో ఈ ప్రాతిపదికన మినహాయింపులు లేవని సుప్రీం కోర్టు ఈ కేసులో తీర్పు చెప్పింది.

గమనిక: క్రీమీలేయర్ వర్గాలను గుర్తించడానికి 1993లో రామ్‌నందన్ ప్రసాద్ కమిటీని నియమించారు.

ప్రకరణ 17

ఈ ప్రకరణ ప్రకారం అస్పృశ్యతను నిషేధించారు. ఈ ప్రకరణ తనంతట తాను అమలులోకి రాదు. దీని అమలుకు సంబంధిత చట్టాలను రూపొందించాలి. అయితే అస్పృశ్యత అనే పదాన్ని రాజ్యాంగంలోగాని, చట్టంలోగానీ నిర్వచించలేదు. కులతత్వ నేపథ్యంలో అస్పృశ్యతను గమనించాలని కర్ణాటక హైకోర్టు అభిప్రాయపడింది. దీని అమలుకు సంబంధించి పార్లమెంట్ ఈ కింది చట్టాలను రూపొందించింది.

అస్పృశ్యత నిషేధ చట్టం (1955)

అస్పృశ్యతను నిషేధిస్తూ, దాన్ని నేరంగా పరిగణిస్తూ, పార్లమెంట్ 1955లో ఈ చట్టాన్ని రూపొందించింది. అయితే ఈ చట్టంలోని లొసుగులను తొలగించడానికి 1976లో ఈ చట్టాన్ని సమగ్రంగా సవరించి పౌరహక్కుల పరిరక్షణ చట్టంగా పేరు మార్చారు. ఈ చట్టం ప్రకారం నేరం రుజువైతే రెండేళ్ల వరకు జైలు, అలాగే ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులుగా ప్రకటిస్తారు.

ఎస్సీ, ఎస్టీలపై అకృత్యాల నిషేధ చట్టం (1989)

ఈ చట్టం ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, తెగలపై అకృత్యాలను సమగ్రంగా నిరోధిస్తూ కఠినమైన నియమ నిబంధనలను రూపొందించారు.

ప్రకరణ 18

18(1): సైనిక, విద్యాపరమైన గుర్తింపు మినహా మిగతా బిరుదుల రద్దు.

18(2): భారత పౌరులు విదేశీ బిరుదులను స్వీకరించొద్దు.

18(3): భారత పౌరులు కానప్పటికీ భారత ప్రభుత్వంలో లాభదాయక పదవుల్లో ఉన్నప్పుడు రాష్ట్రపతి అనుమతి లేకుండా విదేశాల నుంచి ఎలాంటి బిరుదులు స్వీకరించొద్దు.

18(4): ప్రభుత్వంలో లాభదాయక పదవుల్లో ఉన్న వ్యక్తులు రాష్ట్రపతి అనుమతి లేకుండా విదేశాల నుంచి ఎలాంటి బహుమతులను, భత్యాన్ని, ఉద్యోగాన్ని స్వీకరించొద్దు.

ఈ ప్రకరణలో కొన్ని రకాల బిరుదులను రద్దు చేశారు. ఉదాహరణకు, బ్రిటిష్ పాలనా కాలంలో సమాజంలోని వ్యక్తుల సామాజిక, ఆర్థిక ప్రాతిపదికలపై కల్పించిన ప్రత్యేక హోదాలైన రావ్ బహద్దూర్, రావ్ సాహెబ్, రాజా విక్రమార్క, జాగిర్దార్, ఇనాందార్, జమిందార్ మొదలగు వాటిని రద్దు చేశారు. అయితే ఈ నిషేధం విద్యా, సైనిక, విశిష్ట యోగ్యతాపరమైన బిరుదులకు వర్తించదు. ఉదాహరణకు భారతరత్న, పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ. అదే విధంగా సైనిక హోదాలైన పరమ వీరచక్ర, అశోక చక్ర, శౌర్య చక్ర, మొదలగు వాటిని ఇవ్వవచ్చు.

ప్రత్యేక వివరణ

భారతరత్న, పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ లాంటివి ప్రత్యేక పౌర పురస్కారాలేకానీ బిరుదులు కావు. వీటిని పేరుకు ముందుకానీ, పేరుకు తర్వాత కానీవాడటం, వ్యాపార కార్యక్రమాలకు వినియోగించొద్దని బాలాజీ రాఘవన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1996)లో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

గతంలో సినీనటులు మోహన్‌బాబు, బ్రహ్మానందం తమ పద్మశ్రీ గుర్తింపును వ్యాపారపరంగా ఉపయోగించారనే అభియోగంతో వాటిని రద్దు చేయాలని కోర్టు సూచించింది.

సుప్రీంకోర్టు ముఖ్య తీర్పులు

చిరంజిత్ లాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1950)

చట్టం ముందు అందరూ సమానులే అంటే సమానుల్లో మాత్రమే సమానత్వం అమలు చేస్తారని సుప్రీంకోర్టు పేర్కొంది. హేతుబద్ధమైన వర్గీకరణ చెల్లుబాటు అవుతుంది.

బెన్నెట్ కోల్‌మెన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1973)

పత్రికలను చిన్న, పెద్ద పత్రికలు అనే ప్రాతిపదికపై వర్గీకరించి న్యూస్ ప్రింట్ పంపిణీ చేయడం చెల్లుబాటు అవుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. అన్ని పత్రికలకు సమానంగా పంపిణీ చేయడం న్యాయసమ్మతం కాదని పేర్కొంది.

విశాఖ వర్సెస్ స్టేట్ ఆఫ్ రాజస్థాన్ (1997)

పనిచేసే ప్రదేశాల్లో మహిళా ఉద్యోగుల పట్ల అనుచిత ప్రవర్తన, లైంగిక వేధింపులు ప్రకరణ 14లోని చట్టం ముందు అందరూ సమానులే అనే సూత్రానికి వ్యతిరేకం, స్త్రీల పట్ల వివక్ష అని, పురుషులతో సమానంగా వారు హక్కులను కలిగి ఉండే అధికారం ఉందని పేర్కొంది. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు నివారించడానికి సమగ్ర మార్గదర్శక సూత్రాలను సుప్రీం కోర్టు జారీ చేసింది.

ప్రధాన మంత్రులు.. పదవీ కాలం

జవహర్‌లాల్ నెహ్రూ	1947 - 1964
గుల్జారీ లాల్ నందా	1964 మే-జూన్
లాల్ బహదూర్ శాస్త్రి	1964 -1966
గుల్జారీ లాల్ నందా	1966 జనవరి 11- 24
ఇందిరా గాంధీ	1966 - 1977
మొరార్జీ దేశాయ్	1977 - 1979
చరణ్ సింగ్	1979 - 1980
ఇందిరా గాంధీ	1980 - 1984
రాజీవ్ గాంధీ	1984 - 1989
విశ్వనాథ్ ప్రతాప్ సింగ్	1989 - 1990
చంద్రశేఖర్	1990 - 1991
పీవీ నరసింహారావు	1991 - 1996
అటల్ బిహారీ వాజ్‌పేయి	1996 మే 16-28,
హెచ్‌డీ దేవెగౌడ	1996 - 1997
ఐ.కె. గుజ్రాల్	1997 ఏప్రిల్ 21 - 1998 మార్చి 18
అటల్ బిహారీ వాజ్‌పేయి	1998 మార్చి 19- 1999 అక్టోబర్ 13
అటల్ బిహారీ వాజ్‌పేయి	1999 అక్టోబర్ 13 - 2004 మే
డాక్టర్ మన్మోహన్ సింగ్	2004 మే 22 - 2009 ఏప్రిల్ 21
డాక్టర్ మన్మోహన్ సింగ్	2009 మే 22 - 2014 మే
నరేంద్ర మోదీ	2014 మే 26 నుంచి..

కనుల కొలనులో దాగిన నీ రూపం

కావ్య సరస్వతికి శోభను చేకూర్చేవి అలంకారాలు. 'అలం' శబ్దానికి 'కృ' ధాతువు చేరి 'అలంకారం' అనే రూపం సిద్ధించింది. అలంకారమంటే భూషణం అని అర్థం. ఇవి కావ్య సౌందర్యాన్ని పెంపొందించి, శోభను కలిగిస్తాయి. ఆలంకారకులు వీటిని ప్రధానంగా శబ్దాలంకారాలు, అర్థాలంకారాలని రెండు రకాలుగా విభజించారు. భోజుడు 'సరస్వతీ కంఠాభరణం'లో మూడు విధాలుగా పేర్కొన్నాడు. శబ్ద, అర్థాలంకారాలతో పాటు ఉభయాలంకారాలను (శబ్దార్థ మిశ్రమాలు) వివరించాడు. ఆ తర్వాత మమ్మటుడు, రుయ్యకుడు, విశ్వనాథుడు, విద్యానాథుడు లాంటివారు మిశ్రాలంకారాల గురించి ప్రస్తావించారు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

అలంకారాలు

అలంకారాల్లో ప్రధానమైనవి శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు.

శబ్దాలంకారాలు

శబ్ద వైచిత్రీ రామణీయకత వల్ల కావ్యానికి సౌందర్యాన్ని చేకూర్చేవి శబ్దాలంకారాలు. సంగీతానుగుణ్యమైన శ్రవణ పేయతతో పాఠకులకు ఆహ్లాదం కలిగించేవి శబ్దాలంకారాలు. ఇవి ఆరు రకాలు.

1. వృత్త్యనుప్రాసం 2. ఛేకానుప్రాసం
3. లాటాను ప్రాసం 4. యమకం
5. ముక్తపదగ్రస్థం 6. అంత్యానుప్రాసం

1. వృత్త్యనుప్రాసం: ఒకటి లేదా రెండు మూడు వర్ణాలు పునరుక్తాలై ఆహ్లాదం కలిగిస్తే అది వృత్త్యనుప్రాసం.

ఉదా: 'హరిహరి సిరియురమున గలహరి'
ఇందులో 'ర' కారం పునరుక్తమై ఆహ్లాదం కలిగిస్తోంది. అందువల్ల ఇది వృత్త్యనుప్రాసం.

2. ఛేకానుప్రాసం: అర్థ భేదం ఉన్న రెండేసి హల్లులు అవ్యవధానంగా పునరుక్తమై ఆహ్లాదాన్ని కలిగిస్తే అది ఛేకానుప్రాసం. ఛేకులంటే పండితులు అని అర్థం. ఛేకులకు ఆహ్లాదం కలిగించే అనుప్రాసం ఛేకానుప్రాసం.

ఉదా: 'కందర్పదర్పములగు సందర దరహాస రుచులు'. ఈ లక్ష్యంలో దర్ప-దర అనే రెండేసి హల్లులు అర్థభేదంతో పునరుక్తమయ్యాయి. కాబట్టి ఇది ఛేకానుప్రాసం.

3. లాటాను ప్రాసం: తాత్పర్య భేదం ఉన్న శబ్దాలు పునరుక్తాలై ఆహ్లాదాన్ని కలిగిస్తే అది లాటానుప్రాసం.

ఉదా: 'కమలాక్షునర్చించు **కరములు కరములు** శ్రీనాథు వర్ణించు **జిహ్వ జిహ్వ**' 'కరములు', 'జిహ్వ' శబ్దాలు తాత్పర్య భేదంతో పునరుక్తాలైనందువల్ల ఇది లాటానుప్రాసం.

4. యమకం: సమాన స్వరసహితాలైన వ్యంజనాలు అర్థభేదంతో అవ్యవహితంగా పునరుక్తాలైతే అది యమకం.

ఉదా:'మన **సుభద్ర** మన**సుభద్ర**మయ్యె'
సుభద్ర అనే అక్షరాలు అర్థభేదంతో అవ్యవహితంగా వచ్చాయి. కాబట్టి ఇది యమకం.

5. ముక్తపదగ్రస్థం: మొదటి పాదం చివరి పదం రెండో పాదంలో మొదటి పదంగా రావడాన్ని ముక్తపదగ్రస్థం అంటారు. అంటే విడిచిన పదాన్ని గ్రహించడం అని అర్థం.

ఉదా:'సుదతీ నూతన మదనా
మదనా గతురంగ పూర్ణ మణిమయసదనా'
మొదటి పాదం చివర ఉన్న 'మదనా' పదం రెండోపాదం మొదటిపదంగా వచ్చింది. అందువల్ల ఇది ముక్తపదగ్రస్థం.

6. అంత్యానుప్రాసం: ప్రతి పాదం చివరన ఒకే అక్షరం లేదా పదం రావడాన్ని అంత్యాను ప్రాసం అంటారు.

ఉదా:కమనీయశుభగా**త్రు** - కంజాతదళనే**త్రు**
వసుధాకళ**త్రు** - పావన చరి**త్రు**
'త్రు' అనే అక్షరం పాదాల చివర వచ్చినందువల్ల ఇది అంత్యానుప్రాసం.

అర్థాలంకారాలు

అర్థ సౌందర్యం వల్ల కావ్య శోభను ద్విగుణీకృతం చేసేవి అర్థాలంకారాలు. అర్థం లేని శబ్ద సౌందర్యం ఆహ్లాదకరం కాదు. అర్థ ప్రధానమైన అలంకారాలు అర్థాలం కారాలు. వీటిలో ప్రధానమైనవి..

1. ఉపమాలంకారం: ఉపమాన, ఉపమేయా లకు మనోహరమైన సాదృశ్యాన్ని చెప్పడాన్ని ఉపమాలంకారం అంటారు. ఇందులో ఉపమేయం (ప్రస్తుతం), ఉపమానం (అప్రస్తుతం), సమాన ధర్మం (ఉప మేయ, ఉపమానాల్లో సమానంగా ఉండేది), ఉపమావాచకం (ఉపమేయ, ఉపమానాలకు సమాన ధర్మాన్ని సూచించేది) ఉంటాయి. వలెన్, పోలెన్, ఎంతయున్, కైవడి, భంశి, అట్లు, అనంగ మొదలైనవి ఉపమావాచకాలు. పైన పేర్కొన్న నాలుగు అంశాలుంటే దాన్ని పూర్ణోపమాలంకారం అంటారు. ఏదైనా ఒక అంశం లోపిస్తే దాన్ని లుప్తోపమాలంకారం అంటారు.

భరతుడు ఉపమాలంకారంలో ఐదు భేదాలను చెప్పాడు. మమ్మటుడు లాంటి ఆలంకారికులు 25 భేదాలను పేర్కొన్నారు. దండి 32 భేదాలను చెప్పాడు. చంద్రాలోకకర్త చెప్పిన ఏడు భేదాలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

అలంకారాల్లో ప్రసిద్ధమైంది, ప్రాచీన మైంది ఉపమాలంకారం. దీన్ని ప్రయోగించని కవులు లేరు. కాళిదాసు లాంటి సంస్కృత కవులు విరివిగా ఉపయోగించారు. అందుకే 'ఉపమా కాళిదాసస్య' అనే నానుడి ప్రసిద్ధమైంది.

లక్ష్యం:
ఓ కృష్ణా! నీ కీర్తి హంసవలె ఆకాశ
గంగయందు మునుగుచున్నది
ఉపమేయం = కీర్తి, ఉపమానం = హంస,
'ఆకాశగంగయందు మునుగుట' ఉపమేయ ఉపమానాలు రెండింటిలో ఉన్నందువల్ల ఇది సమాన ధర్మం. ఉపమావాచకంలా ఇందులో నాలుగు అంశాలున్నందువల్ల ఇది 'పూర్ణోపమ అలంకారం'.

2. ఉత్ప్రేక్షాలంకారం: జాతి, గుణ, ధర్మ సామ్యం వల్ల ఉపమేయాన్ని ఉపమానంగా ఊహిస్తే అది ఉత్ప్రేక్షాలంకారం. ఇందులో ఉపమేయ ఉపమానాలతోపాటు ఉత్ప్రేక్షా వాచకం ఉంటుంది. తలంచెదన్, ఎంచెదన్, భావించెదన్, ఊహించెదన్, అనన్ మొదలైనవి ఉత్ప్రేక్షా వాచకాలు.

లక్ష్యం: ''ఈ చీకటిని చక్రవాక విరహాగ్ని నుండి పుట్టిన ధూమమో అని తలంతును''
ఇందులో చీకటి ఉపమేయం, ధూమం ఉపమానం. ధూమం నల్లనిది, దృష్టిని ఆపుచేసేది. ఈ గుణ సామ్యం వల్ల ఉపమేయమైన చీకటిని ఉపమానమైన ధూమంగా ఊహించారు. కాబట్టి ఇది ఉత్ప్రేక్షాలంకారం.

3. రూపకాలంకారం: ఉపమేయంలో ఉపమాన ధర్మాన్ని ఆరోపించడం లేదా ఉపమేయ ఉపమానాలకు భేదం లేనట్లుగా వర్ణించడం రూపకాలంకారం. ఇందులో రూపక సమాసం కూడా ఉంటుంది.

లక్ష్యం: రాజుపై **లతాలలనలు కుసుమాక్షతలు** చల్లిరి. ఇందులో ఉపమేయమైన లతల్లో ఉపమానమైన లలనల ధర్మం ఆరోపించారు. ఉపమేయమైన కుసుమాల్లో ఉపమానమైన అక్షతల ధర్మాన్ని ఆరోపించారు. కాబట్టి ఇది రూపకాలంకారం.

4. అనన్వయాలంకారం: ఒక వస్తువు సాటి లేనిది అని చెప్పడానికి అదే వస్తువుతో పోల్చడాన్ని అనన్వయాలంకారం అంటారు. ఇందులో ఉపమేయమే ఉపమానంగా ఉంటుంది.

లక్ష్యం:
'మేరునగానికి సాటి మేరునగమే
సముద్రానికి సాటి సముద్రమే'
ఇందులో ఉపమేయమైన మేరునగమే ఉపమానంగా ఉంది. ఉపమేయమైన సముద్రమే ఉపమానంగా ఉంది. అందువల్ల ఇది అనన్వయాలంకారం.

5. స్వభావోక్తి: జాతి, గుణక్రియాదులను సహజ సిద్ధంగా, మనోహరంగా వర్ణించడాన్ని స్వభావోక్తి అలంకారం అంటారు.

లక్ష్యం: ''ఉద్యానవనంలో జింకలు చెవులు రిక్కించి చంచల నేత్రాలతో సరోవరంలో నీళ్ల త్రాగుచున్నవి'' ఇందులో జింకల స్థితిని మనోహరంగా, సహజసిద్ధంగా వర్ణించారు. అందువల్ల ఇది స్వభావోక్తి.

6. అర్థాంతరన్యాసాలంకారం:
విశేషాన్ని సామాన్యంతో లేదా సామాన్యాన్ని విశేషంతో సమర్థించి వర్ణిస్తే.. అది అర్థాంతరన్యాసాలంకారం.

లక్ష్యం: 1
''ఆంజనేయుడు సముద్రాన్ని దాటాడు
మహాత్ములకు అసాధ్యమైంది లేదు కదా!''
ఆంజనేయుడు సముద్రాన్ని దాటడం విశేష విషయం. మహాత్ములకు సాధ్యం కానిది లేదు అనే సామాన్య విషయంతో సమర్థించినందువల్ల ఇది అర్థాంతరన్యాస అలంకారం.

లక్ష్యం: 2
పూలతో కూడిన నారకు వాసన కలిగినట్లు
సజ్జన సాంగత్యం వల్ల సర్వశ్రేయాలు కలుగుతాయి.
పూలతో కూడిన నారకు వాసన కలగడం సామాన్య విషయం. సజ్జన సాంగత్యం వల్ల సర్వశ్రేయాలు కలుగుతాయి అనే విశేష విషయంతో దీన్ని సమర్థించడం వల్ల ఇది అర్థాంతరన్యాస అలంకారం.

7. అతిశయోక్తి అలంకారం: లోకస్థితిని మించి అతిశయించి వర్ణిస్తే అది అతిశయోక్తి అలంకారం.

లక్ష్యం: ఆ పట్టణమందలి సౌధాలు చంద్ర మండలాన్ని తాకుచున్నవి. సహజస్థితిని మించి వర్ణించడం వల్ల ఇది అతిశయోక్తి.

8. శ్లేషాలంకారం: అనేక అర్థాలకు ఆశ్రయ మైంది శ్లేషాలంకారం. చమత్కారమైన పదా ల విరుపులతో అనేక అర్థాల వల్ల అహ్లాదం కలిగించేది శ్లేష.

లక్ష్యం: 'రాజు కువల యానందకరుడు'
ఇందులో రాజు శబ్దానికి పాలకుడు, చంద్రుడు అని; 'కువలయం' పదానికి భూమి, కలువ అనే అర్థాలున్నాయి. రాజు భూ ప్రజలకు సుపరిపాలనతో ఆనందం కలిగించేవాడని ఒక అర్థం. చంద్రుడు కలువలను వికసింపజేసి ఆనందం కలిగించేవాడని మరో అర్థం ఉన్నందువల్ల ఇది శ్లేషాలంకారం.

9. సమాసోక్తి అలంకారం: ప్రస్తుత వర్ణన వల్ల అప్రస్తుత విషయం స్ఫురిస్తే అది సమాసోక్తి అలంకారం.

లక్ష్యం: చంద్రుడు రక్తుడై ఐంద్రీముఖమును ముద్దిడుచున్నాడు. ప్రస్తుత వర్ణన వల్ల పరకాంతా చుంబనాభిలాషియైన కాముకుడు స్ఫురిస్తున్నందువల్ల ఇది సమాసోక్తి అలంకారం.

10. దీపకాలంకారం: ఉపమేయ ఉపమా నాలకు (ప్రకృత, అప్రకృతాలకు) సాధారణ ధర్మంతో ఒకే అన్వయాన్ని కలిగిస్తే అది దీపకాలంకారం.

లక్ష్యం: ''బ్రహ్మ రాత, విష్ణు చక్రం, ఇంద్రుడి వజ్రాయుధం, పండిత వాక్యం వ్యర్థం కాబోవు''
పండిత వాక్యం వ్యర్థం కాదు అనే ఉపమేయంతో బ్రహ్మ రాత, విష్ణు చక్రం, ఇంద్రుడి వజ్రాయుధం లాంటి ఉపమే యాలను అన్వయించి చెప్పారు. అందువల్ల ఇది దీపకాలంకారం.

మాదిరి ప్రశ్నలు

1. 'రక్షాదక్ష! విపక్ష శిక్షా' ఏ అలంకారం?
1) ఛేకానుప్రాసం 2) వృత్త్యనుప్రాసం
3) లాటానుప్రాసం 4) యమకం

2. 'మన సుభద్ర మనసుభద్రమయ్యె' ఇందులోని అలంకారం?
1) ముక్తపదగ్రస్థం 2) లాటానుప్రాసం
3) యమకం 4) అంత్యానుప్రాసం

3. 'శేషశాయికి మ్రొక్కు శిరముశిరము'లోని అలంకారం?
1) లాటానుప్రాసం 2) యమకం
3) ఛేకానుప్రాసం 4) వృత్త్యనుప్రాసం

4. 'కమనీయ శుభగాత్రు - కంజాత దళనేత్రు వసుధాకళత్రు - పావన చరిత్రు' లోని అలంకారం?
1) వృత్త్యనుప్రాసం 2) లాటానుప్రాసం
3) అంత్యానుప్రాసం 4) యమకం

5. యమకాలంకార లక్షణం?
1) అచ్చులు మారతాయి, హల్లులు మారవు
2) అచ్చులు మారవు, హల్లులు మారవు
3) అచ్చులు మారకూడదు, హల్లులు మారతాయి
4) అచ్చులు మారవచ్చు, హల్లులు మారవచ్చు

6. ఉభయాలంకారాలను మొదటగా పేర్కొన్న లాక్షణికుడు?
1) మమ్మటుడు 2) విశ్వనాథుడు
3) భోజుడు 4) విద్యానాథుడు

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 3;
5) 2; 6) 3.

విద్య, ఉద్యోగ సమాచారం

మేనేజ్, హైదరాబాద్‌లో పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఏఐసీటీఈ గుర్తింపు పొందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్) 2025-2027 సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- కోర్సులు: పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్).
- అర్హత: బ్యాచిలర్ డిగ్రీ(అగ్రికల్చర్ సైన్సెస్/అగ్రికల్చర్) ఉత్తీర్ణతతో పాటు క్యాట్-2024 స్కోరును కలిగి ఉండాలి.
- ఎంపిక విధానం: క్యాట్-2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఎస్సే రైటింగ్, వర్క్ ఎక్స్‌పీరియన్స్, అకడమిక్ రికార్డ్, డైవర్సిటీ ఫ్యాక్టర్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తులకు చివరితేది: 10.02.2025.
- వెబ్‌సైట్: www.manage.gov.in/

జవహర్ నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతిలో ప్రవేశాలు

దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతిలో ప్రవేశాలకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి లేటరల్ ఎంట్రీకి జేఎన్‌వీ ఎంపిక పరీక్షకు దరఖాస్తులు కోరుతోంది.

- అర్హత: విద్యార్థి తప్పనిసరిగా జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లాలో నివాసి అయి ఉండాలి. విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి చదువుతుండాలి.
- వయసు: 01.06.2008 నుంచి 31.07.2010 మధ్య జన్మించి ఉండాలి.
- ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష ద్వారా
- పరీక్ష విధానం: మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నాపత్రంలో మెంటల్ ఎబిలిటీ(20 ప్రశ్నలు-20 మార్కులు), ఇంగ్లిష్(20 ప్రశ్నలు-20 మార్కులు), సైన్స్(20 ప్రశ్నలు-20 మార్కులు), సోషల్ సైన్సెస్(20 ప్రశ్నలు-20 మార్కులు), మ్యాథమేటిక్స్(20 ప్రశ్నలు-20 మార్కులు) సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఉంటుంది. పరీక్ష సమయం 2.30 గంటలు.

ముఖ్య సమాచారం:

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 08.02.2024.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 30.10.2024.
- ప్రవేశ పరీక్ష తేది: 08.02.2024.
- వెబ్‌సైట్: www.navodaya.gov.in.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

గుండె సంకోచాన్ని ఏమంటారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

రక్తం, రక్త ప్రసరణ

మానవ శరీరంలో ముఖ్యమైన ద్రవం రక్తం. 70 కిలోల బరువున్న ఆరోగ్యవంతుడైన పురుషుడిలో 5-6 లీటర్ల రక్తం ఉంటుంది. రక్తం అధ్యయనం హెమటాలజీ. రక్తం ద్రవ రూపంలోని సంయోజక కణజాలం. ఆహార పదార్థాలు, శ్వాస వాయువులు, వ్యర్థాలు, హార్మోన్ల రవాణాను రక్తం నిర్వహిస్తుంది. తెల్ల రక్తకణాలు ఉండటం ద్వారా రక్తం శరీర నిరోధక శక్తిలో పాల్గొంటుంది.

రక్తంలో రెండు భాగాలు ఉంటాయి. అందులో ఒకటి ప్లాస్మా. ఇది రక్తంలోని ద్రవభాగం. రక్తంలో 55 శాతం ప్లాస్మా ఉంటుంది. మిగిలిన 45 శాతం రక్తకణాలు ఉంటాయి. ప్లాస్మాలో 92 శాతం నీరు, మిగిలిన 8 శాతం ఘనపదార్థాలు ఉంటాయి. ఈ ఘన పదార్థాల్లో ప్రొటీన్లు, పిండి పదార్థాలు, కొవ్వులు వంటివి కర్బన పదార్థాలు. ఖనిజాలన్నీ అకర్బన పదార్థాలు.

రక్తకణాలు

ఇవి మూడు రకాలు. అవి ఎర్రరక్తకణాలు, తెల్ల రక్తకణాలు, రక్తఫలికికలు. రక్త కణాలు ఎముక మజ్జ నుంచి ఏర్పడుతాయి. పిండాభివృద్ధిలో వీటిని కాలేయం ఏర్పరుస్తుంది. రక్తం, రక్తకణాలు ఏర్పడడాన్ని హీమోపాయిసస్ అంటారు. శరీరంలోని మరో ముఖ్యద్రవం శోషరసం. ఎర్రరక్తకణాలు లేని ద్రవం శోషరసం. శరీర కణజాలాల మధ్య ప్రత్యేకనాళాల్లో శోషరసం ప్రవహిస్తుం ది. దీనిలో తెల్ల రక్తకణాలు ఉంటాయి కాబట్టి ఇదికూడా రోగ నిరోధక శక్తిలో పాల్గొంటుంది.

ఎర్ర రక్తకణాలు

ప్రతి క్యూబిక్ మిల్లీ మీటరు రక్తంలో 4.5 నుంచి 5 మిలియన్ల ఎర్రరక్తకణాలు ఉంటాయి. శరీరంలో సుమారు 32 బిలియన్ల ఎర్ర రక్తకణాలు ఉంటాయి. ఎముక మజ్జలో ఇవి ఏర్పడడాన్ని ఎరిత్రోపాయిసిస్ అంటారు. ఇవి ద్విపుటా కారంలో ఉంటాయి. అభివృద్ధి చెందిన క్షీరదాల ఎర్ర రక్తకణాల్లో కేంద్రకం, ఇతర కణభాగాలు ఉండవు. కేవలం హీమోగ్లోబిన్ మాత్రమే ఉంటుంది. హీమోగ్లోబిన్‌లో రెండు భాగాలు ఉంటాయి. అవి.. హీం, గ్లోబిన్. ఇనుము ఫెర్రస్ రూపంలో కలిగి ఉన్న కర్బన పదార్థం హీం. గ్లోబిన్ ఒక ప్రొటీను. రక్తం ఎరుపు రంగులో ఉండటానికి కారణమైన వర్ణకం హీమోగ్లోబిన్. ఇది ఆక్సిజన్, కార్బన్ డై ఆక్సైడ్‌ల రవాణాను నిర్వహిస్తుంది. ప్రతి హీమోగ్లోబిన్ అణువు నాలుగు ఆక్సిజన్ అణువులను రవాణా చేస్తుంది. హీమోగ్లోబిన్ ఏర్పడడానికి, ఎర్రరక్తకణాలు అభివృద్ధి చెందడానికి ఇనుము, విటమిన్ బి12 (సైనకోబాలమిన్), విటమిన్ బి9 (ఫోలిక్ ఆమ్లం) అవసరమవుతాయి. ఆహారంలో ఇవి లోపిస్తే అనీమియా (రక్తహీనత) సంభవిస్తుంది. ఎర్ర రక్తకణాల జీవితకాలం 120 రోజులు. ఆ తర్వాత అవి ప్లీహంలో నశిస్తాయి.

తెల్ల రక్తకణాలు

వీటిని ల్యూకోసైట్లు అంటారు. శరీర రక్షక భటులుగా వ్యవహరిస్తాయి. వీటి జీవితకాలం కొన్ని రోజుల నుంచి కొన్ని వారాల వరకు ఉంటుంది. ఇవి ప్రధానంగా రెండు రకాలు. అవి.. గ్రాన్యులోసైట్లు, ఎగ్రాన్యులోసైట్లు. గ్రాన్యులోసైట్ల కణద్రవ్యంలో ప్రత్యేక కణికలు ఉంటాయి. ఇవి ప్రధానంగా మూడు రకాలు. అవి.. అసిడోఫిల్స్, బేసోఫిల్స్, న్యూట్రోఫిల్స్. ఎగ్రాన్యులోసైట్లు రెండు రకాలు. అవి.. మోనోసైట్‌లు, అసిడోఫిల్స్ లేదా ఇసినోఫిల్స్. అలర్జీ చర్యల్లో పాల్గొంటాయి. న్యూట్రోఫిల్స్, మోనోసైట్లు భక్షక కణాలుగా వ్యవహరిస్తాయి. శరీర రోగ నిరోధక శక్తిలో ప్రధానమైనవి లింఫోసైట్లు. ఇవి రెండు రకాలు. అవి T, B లింఫోసైట్లు. T లింఫోసైట్లు మళ్లీ రెండు రకాలు. అవి CD_4/T_4 కణాలు, CD_8 కణాలు. శరీరంలోకి ప్రవేశించిన వ్యాధి కారకాన్ని గుర్తించి దాన్ని నాశనం చేసే ప్రక్రియను T లింఫోసైట్‌లు ప్రారంభిస్తాయి. వీటి ద్వారా సెల్యులార్ ఇమ్యూనిటీ లభిస్తుంది. వ్యాధి కారకానికి విరుద్ధంగా ప్రతి దేహకాల (యాంటీ బాడీస్)ను విడుదల చేసి ఇమ్యూనిటీని అందించేవి B లింఫోసైట్లు. ఈ రకమైన ఇమ్యూనిటీ హ్యూమొరల్ ఇమ్యూనిటీ. తెల్ల రక్తకణాల సంఖ్య అసాధారణంగా పెరిగితే ల్యుకేమియా లేదా రక్త కేన్సర్ వస్తుంది. వీటి సంఖ్య అసాధారణంగా తగ్గడం ల్యూకోపినియా.

రక్త ఫలకికలు

ఇవి నిజమైన కణాలు కాదు. ఎముక మజ్జలో మెగా క్యారియోసైట్‌ల నుంచి ఏర్పడిన ఖండితాలు. వీటి జీవితకాలం 3-10 రోజులు. ప్రతి క్యూబిక్ మిల్లీ మీటరు రక్తంలో 2.5-5 లక్షలు ఉంటాయి. గాయమైనప్పుడు రక్త స్కందన ప్రక్రియను ప్రారంభిస్తాయి. గాయమైన ప్రాంతంలో ఇవి విచ్ఛిన్నం చెంది థ్రాంబోప్లాస్టిన్ పదార్థాన్ని విడుదలచేస్తాయి. ఇవి రక్తంలోని ప్రోథ్రాంబిన్‌ను థ్రాంబిన్‌గా మారుస్తాయి. ఆ తర్వాత థ్రాంబిన్ చర్య ద్వారా రక్తంలోని ఫైబ్రినోజన్‌ను ఫైబ్రిన్‌గా మారుస్తాయి. ఫైబ్రిన్ ప్రొటీన్ పోగులుగా మారి సంక్లిష్ట జాలకాన్ని ఏర్పర్చి రక్తం నష్టాన్ని నివారిస్తుంది. ఈ ప్రక్రియలో 13 ప్రధాన రక్తస్కందన కారకాలు, కొన్ని అనుబంధ కారకాలు పాల్గొంటాయి. శరీరంలో రక్తం గడ్డకట్టడాన్ని హిపారిన్ నివారిస్తుంది. రక్త సంకోచానికి కావాల్సిన ఖనిజం కాల్షియం. అనుబంధ కారకాల్లో ముఖ్యమైంది విటమిన్ -కె. ఏ చిన్న దెబ్బ తగిలినా రక్తస్కంధనం జరగని వ్యాధి హీమోఫీలియా. కృత్రిమ రక్తస్కందన కారకాలుగా ఉపయోగించేవి సిట్రేట్‌లు, ఆక్సలేట్‌లు, డైకొమరల్.

రక్త వర్గాలు

ఎర్రరక్తకణాల్లోని ప్రత్యేక ప్రతిజనకాల ఆధారంగా మానవ రక్తాన్ని వివిధ గ్రూపులుగా విభజించారు. A, B, O రక్తవ్యవస్థను తొలిసారిగా ల్యాండ్‌స్టీనర్ గుర్తించారు. మానవ ఎర్రరక్తకణాలపై A,B ప్రతిజనకాలు ఉండటం లేదా లేకపోవడం ఆధారంగా మనుషులు నాలుగు వర్గాలు. A గ్రూపు ఎర్రరక్తకణాల్లో A అనే ప్రతిజనకం ఉంటుంది. B గ్రూపు ఎర్ర రక్తకణాలపై B ప్రతిజనకం ఉంటుంది. ఎర్ర రక్తకణాలపై A, B ప్రతిజనకాలు రెండూ ఉన్నవారు AB గ్రూపునకు చెందుతారు. ఈ రెండు ప్రతిజనకాలూ లేనివారు O గ్రూపునకు చెందుతారు. A గ్రూపు రక్తాన్ని B గ్రూపు వారికి ఇస్తే A ప్రతిజనకానికి విరుద్ధంగా B వ్యక్తి శరీరంలో ప్రతిదేహకాలు విడుదలై రక్తం గడ్డకడుతుంది. ఇది ప్రాణాంతకం కూడా కావచ్చు. అదేవిధంగా B గ్రూపు రక్తాన్ని A గ్రూపు వారికి ఇస్తే ఇదే సమస్య వస్తుంది. కాబట్టి A గ్రూపు వారికి A గ్రూపు రక్తాన్ని, B గ్రూపు వారికి B గ్రూపు రక్తాన్ని ఇవ్వాలి. ఐతే వీరిద్దరికీ O గ్రూపు రక్తాన్ని ఇవ్వొచ్చు. అదేవిధంగా AB గ్రూపు వారికి A, B, O, గ్రూపు రక్తాన్ని ఇవ్వొచ్చు. కాబట్టి AB గ్రూపు వారు విశ్వ గ్రహీతలు. O గ్రూపు వారి రక్తాన్ని అందరికీ ఇవ్వొచ్చు. కాబట్టి వీరు విశ్వదాతలు. వీరికి మాత్రం O గ్రూపు రక్తాన్నే ఇవ్వాలి. AB ప్రతిజనకాలకు అదనంగా మనిషి ఎర్ర రక్తకణాలపై Rh ప్రతిజనకాన్ని కూడా ల్యాండ్ స్టీనర్, వీనర్ గుర్తించారు. ABO రక్త వ్యవస్థకు సంబంధం లేకుండా ఒక వ్యక్తి ఎర్ర రక్తకణాలపై Rh ప్రతిజనకం ఉండొచ్చు లేదా ఉండకపోవచ్చు. దీన్ని కలిగి ఉన్నవారిని Rh పాజిటివ్ అని, లేనివారిని Rh నెగిటివ్ అని సంబోధిస్తారు. అరుదుగా ఎవరిలో లేని ప్రతిజనకం కొందరి ఎర్రరక్తకణాల్లో ఉంటుంది. దీనికి మంచి ఉదాహరణ బాంబే ప్రతిజనకం.



బాంబే రక్త గ్రూపునకు చెందినవారిలో బాంబే ప్రతిజనకం (H) ఉంటుంది.

గుండె, రక్త ప్రసరణ

శరీరంలో రక్తాన్ని పంపు చేసే అవయవం గుండె. అకశేరుకాల్లో నాడీ జనిత, సకశేరుకాలలో కండర జనిత గుండె ఉంటుంది. మనిషిలో నాలుగు గదుల గుండె ఉంటుంది. ఊపిరితిత్తుల మధ్యలో మీడియా స్టీనియం అనే కుహరంలో గుండె అమరి ఉంటుంది. గుండెలోని పై గదులు కర్ణికలు. కింది గదులు జఠరికలు. గుండె లయ ఒక కండర కణుపులో మొదలవుతుంది. దీన్ని లయారంభకం అంటారు. మానవుడి గుండెలో రెండు లయారంభకాలు ఉంటాయి. సిరాకర్ణికా కణుపు గుండె కుడికర్ణిక కుడివైపు పై భాగంలో ఉంటుంది. రెండోది కర్ణికా జఠరికా కణుపు. ఇది కుడి కర్ణిక, కుడి జఠరిక మధ్య ఉంటుంది. సిరా కర్ణికా కణుపు వద్ద జనించిన సంకోచ తరంగాలు కర్ణికలకు మాత్రమే పరిమితమవుతాయి. దీని నుంచి సంకోచ తరంగాలను అందుకున్న కర్ణిక, జఠరిక కణుపు హిస్ కండరకట్ట ద్వారా జఠరికలకు చేరుతాయి. ఈ విధంగా మొత్తం గుండె సంకోచిస్తుంది. గుండె సంకోచం సిస్టోల్. గుండె సడలిక డయాస్టోల్. కర్ణికల సంకోచం ద్వారా రక్తం జఠరికల్లోకి చేరుతుంది. జఠరికల సంకోచం ద్వారా మళ్లీ రక్తం కర్ణికల్లోకి చేరకుండా ప్రత్యేక కవాటాలు అడ్డుకుంటాయి. ఎడమ కర్ణిక, జఠరికల మధ్య అగ్రద్వయ లేదా మిట్రల్ కవాటం; కుడి కర్ణిక, జఠరికల మధ్య అగ్రత్రయ కవాటం ఉంటాయి.

సిరలు

శరీరంలోని సిరలు వివిధ భాగాల నుంచి సేకరించిన మలిన/ ఆమ్లజని రహిత రక్తాన్ని ఊర్ధ్వ, నిమ్న మహా సిరల ద్వారా గుండె కుడి కర్ణికలోకి విడుదల చేస్తాయి. ఐతే ఒక్క పుపుస సిర మాత్రమే ఊపిరితిత్తుల నుంచి శుద్ధ/ ఆమ్లజని సహిత రక్తాన్ని ఎడమ కర్ణికలోకి విడుదల చేస్తుంది. కర్ణికలు సంకోచిస్తాయి. జఠరికల్లోకి రక్తం చేరుతుంది. ఎడమ జఠరికలోకి చేరిన శుద్ధ రక్తం మహాధమని ద్వారా శరీరంలోని ధమనుల్లోకి చేరుతుంది. కుడి కర్ణికలోకి చేరిన మలిన రక్తం ఒక పుపుస ధమని ద్వారా ఊపిరితిత్తులకు చేరుతుంది. ఈ విధంగా శరీరంలోని ధమనులన్నీ గుండె ఎడమ జఠరిక నుంచి శుద్ధ రక్తాన్ని అన్ని శరీర భాగాలకూ సరఫరా చేస్తాయి. ఒక పుపుస ధమని మాత్రమే గుండె కుడి జఠరిక నుంచి మలిన రక్తాన్ని ఊపిరితిత్తులకు సరఫరా చేస్తుంది. ఈ రకంగా గుండె కుడి భాగంలో మలిన రక్తం, ఎడమ భాగంలో శుద్ధ రక్తం స్వతంత్రంగా సరఫరా కావడం ద్విరక్త ప్రసరణ.


మాదిరి ప్రశ్నలు

1. ప్రతి 100 మి.లీ. రక్తంలో హీమోగ్లోబిన్ ఏ మోతాదులో ఉంటుంది?
ఎ) 15 గ్రాములు బి) 15 మిల్లీ గ్రాములు
సి) 25 గ్రాములు డి) 25 మిల్లీ గ్రాములు
2. ఎముక మజ్జ నుంచి రక్తం, రక్త కణాలు ఏర్పడని జన్యువ్యాధి?
ఎ) హీమోఫీలియా బి) థలసీమియా
సి) పాలిసైథామియా డి) అడిసిన్స్
3. విటమిన్ బి12 లోపం ద్వారా సంభవించే రక్తహీనత?
ఎ) మెగలోబ్లాస్టిక్ బి) మాక్రోసిస్టిక్
సి) పెర్నిసియస్ డి) న్యూట్రిషినల్
4. మానవుడిలో ఎర్ర, తెల్ల రక్తకణాల నిష్పత్తి?
ఎ) 1:600 బి) 600:1
సి) 6000:1 డి) 1:6000
5. రక్తం రసాయన గుణం?
ఎ) స్వల్పక్షారం బి) మోస్తరు క్షారం
సి) స్వల్ప ఆమ్లం డి) మోస్తరు ఆమ్లం
6. ప్రతి క్యూబిక్ మిల్లీ మీటరు రక్తంలో తెల్ల రక్తకణాలు సంఖ్య?
ఎ) 8000- 12,000 బి) 2- 2.5 లక్షలు
సి) 3.0- 3.5 మిలియన్‌లు
డి) 3,000- 5,000
7. తెల్ల రక్తకణాలలో ఎక్కువగా ఉండేవి?
ఎ) అసిడోఫిల్స్ బి) బేసోఫిల్స్
సి) న్యూట్రోఫిల్స్ డి) మోనోసైట్‌లు
8. దోమ లాలాజలంలో రక్తస్కందన నివారిణి?
ఎ) హీమోలైసిన్ బి) హిరుడిన్
సి) లైసోజైం డి) అల్బుమిన్
9. బాంబే ప్రతిజనకం?
ఎ) H బి) M సి) N డి) p
10. కింది ఏ జంటకు కలిగే రెండు వరుస Rh పాజిటివ్ శిశువు తల్లి గర్భంలోనే మరణించే అవకాశం ఉంది?
ఎ) Rh^+ పురుషుడు, Rh^- స్త్రీ
బి) Rh^- పురుషుడు, Rh^+ స్త్రీ
సి) Rh^+ పురుషుడు, Rh^+ స్త్రీ
డి) Rh^- పురుషుడు, Rh^+ స్త్రీ
11. వీటిలో ఏ అవయవం తొలగించినప్పటికీ ఏ సమస్యా ఉండదు?
ఎ) ప్లీహం బి) కాలేయం
సి) ఊపిరితిత్తులు డి) పీయూష గ్రంథి
12. రక్తనాళాల్లో రక్తప్రవాహ వేగాన్ని కొలిచే పరికరం?
ఎ) ఈసీజీ బి) స్ఫిగ్మామానోమీటరు
సి) స్ట్రోమరు డి) ఈఈజీ
13. కర్ణికల సంకోచం (సిస్టోల్)కు పట్టే సమయం?
ఎ) 0.1 సెకను బి) 0.3 సెకను
సి) 0.5 సెకను డి) 0.8 సెకను
14. రక్త నాళాల అధ్యయనం?
ఎ) కైనిసియాలజీ బి) సిన్‌డెస్మాలజీ
సి) ఆంజియాలజీ డి) ట్రైకాలజీ
15. గుండె వేగం అసాధారణంగా పెరగడం?
ఎ) టేకీకార్డియా బి) బ్రేడీ కార్డియా
సి) ఎరిథిమియా డి) ఏదీకాదు
16. గుండె లయలో లబ్ శబ్దానికి కారణం?
ఎ) కర్ణికల సంకోచం
బి) జఠరికల సంకోచం
సి) కర్ణిక-జఠరిక కవాటాలు మూసు కోవడం
డి) అర్ధ చంద్రాకార కవాటాలు మూసు కోవడం
17. హెచ్ఐవి ప్రత్యేకంగా దాడిచేసే తెల్ల రక్తకణాలు?
ఎ) బి - లింఫోసైట్‌లు బి) CD4 కణాలు
సి) CD8 కణాలు డి) మోనోసైట్‌లు
18. కృత్రిమంగా రూపొందిన గుండె?
ఎ) టెక్నోకోర్ బి) అబియోకోర్
సి) కార్డియోకోర్ డి) ఏదీకాదు
19. పురుషుడి గుండె బరువుతో పోలిస్తే స్త్రీ గుండె బరువు ఎంత శాతం తక్కువ ఉంటుంది?
ఎ) 50 బి) 25 సి) 10 డి) 2
20. శోషరసంలో లేనివి?
ఎ) తెల్ల రక్తకణాలు బి) ఎర్రరక్తకణాలు
సి) ప్లాస్మా డి) పైవన్నీ
21. రక్త పరిమాణాన్ని నియంత్రించే అవయవం?
ఎ) కాలేయం బి) మూత్రపిండం
సి) ప్లీహం డి) పైవన్నీ
22. సీరంలో లేనివి?
ఎ) ఎర్రరక్తకణాలు బి) తెల్ల రక్తకణాలు
సి) రక్త ఫలికలు డి) పైవన్నీ
23. భారత్‌లో ఎక్కువ మంది ప్రజలు ఏ రక్త గ్రూపునకు చెందినవారు?
ఎ) ఎ బి) బి సి) ఎబి డి) ఒ
24. రక్త స్కందన నివారిణిగా ఉపయోగప డేవి?
ఎ) పొటాషియం ఆక్సలేట్
బి) అమ్మోనియం ఆక్సలేట్
సి) డై కొమరల్ డి) పైవన్నీ
25. సిరలకు సంబంధించిన రుగ్మత?
ఎ) అథెరోస్క్లిరోసిస్
బి) స్కిజోఫ్రినియా సి) వారికోస్
డి) అల్జిమర్స్

సమాధానాలు

1) ఎ; 2) బి; 3) సి; 4) బి; 5) ఎ 6) ఎ; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) ఎ; 11) ఎ; 12) సి; 13) ఎ; 14) సి; 15) ఎ; 16) సి;17) బి; 18) బి; 19) బి; 20) బి; 21) సి; 22) డి; 23) బి; 24) డి; 25) సి

A common way of expanding the basic..



Friends here is the study material for bank probartionary officer's exam. Before going into the details let us take a look at the syllabus and preparation strategy. The English section of probartionary officer's exam has two categories objective and descriptive papers. For objective the questions are based on grammar, comprehension and vocabulary. For grammar the questions are based on subject-verb agreement, tenses, prepositions and articles. More than 65% questions are given from these areas. In sentence correction the first thing you have to check is concord i.e. subject-verb agreement. Apart from this the questions will also be given from tenses and prepositions. After getting enough knowledge on these areas move on to prepare on adverbs and pronouns.

One way to begin studying basic sentence structures is to consider the traditional parts of speech. To know for sure what part of speech a word is, we have to look not only at the word itself but also at its meaning, position, and use in a sentence. Assuming that many of you have undergone proper education for all these years elaborate explanation is not being given on this section.

The next thing which is important is the sentence structure. The basic parts of a sentence are the subject, the verb and the object. The subject is usually a noun--a word that nam es a person, place, or thing. The verb or predicate usually follows the subject and identifies an action or a state of being. An object receives the action and usually follows the verb.

A sentence expresses a relationship, conveys a command, voices a question, or describes someone or something. It begins with a capital letter and ends with a period, question mark, or exclamation mark.

See if you can identify the subject and the predicate in each of the following short sentences:

- The dog barks.
- My daughter is a dancer.
- The children are tired.

In each of these sentences, the subject is a noun: dog, daughter, and children. The verb in the first sentence-barks shows action and answers the question, "What does the subject do?" The verbs in the next two sentences--is, are--are called linking verbs because they link the subject with a word that renames it (dancer) or describes it (tired).

Look at the table below and understand the typical sentence structure.

Subject	Verb	Complement	Modifier of time
The pilot	completed	his training	last year.
All students	must submit	their assignments	by next week.
The boy	enjoys	fishing.	

The subject of a sentence may be a singular word noun, such as teacher or table or it may be a noun phrase. A noun phrase is a group of words ending with a noun but not beginning with a preposition.

Adjectives and Adverbs

A common way of expanding the basic sentence is with modifiers--words that add to the meanings of other words. The simplest modifiers are adjectives and adverbs. Adjectives modify nouns, while adverbs modify verbs, adjectives, and other adverbs.

Example:

Maggie cooked the chicken on the grill.
Noun verb complement modifier

Adjective Clauses

To show that one idea in a sentence is more important than another, we rely on subordination--that is, treating one word group as secondary (or subordinate) to another. One common form of subordination is the adjective clause--a word group that modifies a noun. The most common adjective clauses begin with one of these relative pronouns: who, which, and that.

Example:

Although the bear is able to sprint rapidly,
Clause
it tires easily due to its weight.

Appositives

An appositive is a word or group of words that identifies or renames another word in a sentence--most often a noun that immediately precedes it. Appositive constructions offer concise ways of describing or defining a person, place, or thing.

Example: Hyderabad, the capital of Telangana is famous for pearls.

Adverb Clauses

Like an adjective clause, an adverb clause is always dependent on (or subordinate to) an independent clause. Like an ordinary adverb, an adverb clause usually modifies a verb, though it can also modify an adjective, an adverb, or even the rest of the sentence in which it appears. An adverb clause begins with a subordinating conjunction--an adverb that connects the subordinate clause to the main clause.

Example: When Julie returned, she found Tom very ill.

Participle Phrases

A participle is a verb form used as an adjective to modify nouns and pronouns. All present participles end in -ing. The past participles of all regular verbs end in -ed. Irregular verbs, however, have various past participle endings. Participles and participial phrases can add vigour to our writing as they add information to our sentences.

Example: Is that John running for the bus?

Absolute Phrases

Among the various kinds of modifiers, the absolute phrase may be the least common but one of the most useful. An absolute phrase, which consists of a noun plus at least one other word, adds details to an entire sentence--details that often describe one aspect of someone or something mentioned elsewhere in the sentence.

Example: A linguistics student studies how languages are created.

Structures generally test one of the following items:

Sentence structure: This area questions test more than a word or two; they test the ability to make a sentence complete. Sentence structure questions also test one's understanding of subordinate clauses.

Word order: Word order questions are generally more detail-oriented than sentence structure questions. For example, it gives the knowledge pertaining to one's understanding whether an adjective should appear before the noun it modifies, not after it.

Word form: These questions test your ability to recognize which form of a word should be used in a given situation. Word form questions include recognizing which ending should be on a word. For example, you need to recognize if a plural ending on a noun should be singular, a singular designation on a verb should be plural and so on. It also requires you to determine that an adjective form of a word is being used when the noun form of the word is required.

Word choice: Word choice type of questions test your understanding of idiomatic expressions, words often confused, appropriate prepositional usage and so on.

Missing or extra words: Missing or extra word questions overlap with some other categories, but they are easy to recognize than some other question types.

PRACTICE TEST

The questions given below consists of incomplete sentences, with a blank line showing where information is to be filled in. Choose the word that most correctly completes the sentence.

1. The twinkling stars ____ shining brightly.
a) Are b) is
c) have d) had
2. Despite the polar bear's tremendous weight and height, ____ of sprinting at tremendous speed.
a) It is capable b) is capable
c) it is able d) ability
3. The twinkling stars, which shine so brightly, ____ very far away.
a) Are b) was
c) have d) had
4. The rain forest, ____ large trees that provide shade to the vegetation below, is home to unique flora and fauna.
a) Has b) with its
c) and d) although has
5. The leaders of the two countries ____ an agreement to avoid future conflicts.
a) Have recently reached
b) recently reach
c) have reached recently
d) have recently reach
6. Laura had hurt her leg and ____ not walk very well.
a) Should b) would
c) could d) had
7. They did not want to come with us at first but we ____ able to persuade them.
a) Was b) were c) are d) is
8. Chocolate cake with raspberry filling ____ my favourite.
a) Had b) is c) but d) yet
9. The giraffe's long neck ____ for reaching the tops of trees.
a) Is useful b) used
c) using d) being used
10. The giraffe's long neck and long, spindly legs ____ strange sight to see.
a) Are a b) were c) had d) have
11. A tray of mouth-watering cookies and frosted cupcakes ____ for you.
a) Wait b) is waiting
c) waited d) waiting
12. The pad of paper ____ a grocery list on it.
a) Have been b) has
c) will d) can
13. The phone is ringing. Who do you think it is? 'It ____ be Rahul.'
a) Would b) should
c) could d) can
14. Eating six eggs ____ breakfast might give you a stomach ache.
a) To b) for
c) have d) none
15. Reading a book __ very rewarding.
a) Can be b) is be
c) were d) had
16. The proper way to get there involves taking a left ____ the end of the street.
a) In b) at c) on d) up
17. Running through the woods, the red fox ____ crooked ear dashed through a pile of leaves.
a) With a b) for
c) upon d) but
18. A girl fell into the river but fortunately someone ____ rescue her.
a) was able to b) were able to
c) could able to d) able
19. I am really hungry, I ____ eat a horse.
a) Would b) could
c) can d) should
20. The weather is nice now but it ____change later.
a) May b) can
c) could d) might be

KEY

1. A; 2. A; 3. A; 4. B; 5. A; 6. C; 7. B; 8. B; 9. A; 10. A; 11. B; 12. B; 13. C; 14. B; 15. A; 16. B; 17. A; 18. A; 19. B; 20. A